

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15
సంచిక: 240

సోమవారం 15-5-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | VIJAYAWADA | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



బెంగుళూరు.. ఇంకా ఉంది

112 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై ఘనవిజయం -12లో



సొంతిల్లు.. వృద్ధాప్యంలో ఆసరా!

ఇంటిపై రివర్స్ మార్ట్‌గేజ్ రుణం.. నెలవారీగా 20 ఏళ్ల పాటు ఆదాయం -13లో



సీఎం ఎంపిక ఖర్గే చేతికి!

కర్ణాటక ముఖ్యమంత్రి అభ్యర్థిని నిర్ణయించే అధికారాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకే నూతన ఎమ్మెల్యేలు కట్టబెట్టారు.

వివరాలు 6లో ▸



సీబీఐ కొత్త డైరెక్టర్‌గా ప్రవీణ్ సూద్

సీబీఐ తదుపరి డైరెక్టర్‌గా కర్ణాటక డీజీపీ ప్రవీణ్ సూద్ నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.

వివరాలు 6లో ▸



బ్రహ్మోస్ క్షిపణిని పరీక్షించిన నేవీ

నేవీకి చెందిన ఐఎన్ఎస్ మర్ముగోవాపై నుంచి బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు.

వివరాలు 6లో ▸



ఆ 5 శాతమే రాత మార్చింది

కర్ణాటకలో జేడీ(ఎస్) కోల్పోయిన 7% ఓట్లలో 5శాతాన్ని బీజేపీ దక్కించుకోగా, బీజేపీకి పడిన గండిని కాంగ్రెస్ చేజిక్కించుకుంది.

వివరాలు 6లో ▸



ఇచ్చిపుచ్చుకున్నారు..

అమరావతి కేంద్రంగా చంద్రబాబు క్విడ్ ప్రో కో గుట్టురట్టు

- సుప్రీంకోర్టు అనుమతితో సిట్ దర్యాప్తునకు తొలగిన అడ్డంకులు
- చంద్రబాబు భూ దోపిడీపై కొరడా ఝుళిపించిన ప్రభుత్వం
- ఏ–1 చంద్రబాబు కరకట్ట నివాసం అటాచ్‌మెంట్‌కు అనుమతి
- ఏ–2 నారాయణ పొందిన 75,888 చ.గజాల స్థలాలు కూడా..
- అమరావతిని కొల్లగొట్టిన పచ్చ ముఠా.. లింగమనేని, హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ భూములకు వర్తించని ల్యాండ్ పూలింగ్
- ప్రతిగా కరకట్ట నివాసాన్ని చంద్రబాబుకు ఇచ్చిన లింగమనేని
- హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు కూడా బదలాయింపు
- నారాయణ బినామీల పేరిట 65.50 ఎకరాల కొనుగోలు
- ప్రతిగా సీఆర్‌డీయే నుంచి 75,888 చ.గజాల స్థలాలు
- ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఖరారులో అక్రమాలు
- సిట్ దర్యాప్తులో ఆధారాలతో సహా బట్టబయలు

సాక్షి, అమరావతి: కృష్ణా నది కరకట్టపై చంద్రబాబు నివాసం.. అమరావతిలో చంద్రబాబు క్విడ్ ప్రో కో కు ఓ మచ్చు తునకని నిగ్గు తేలింది. అమరావతిలోని సీడ్ క్యాపిటల్‌లో నారాయణ బినామీల పేరిట ఉన్న 75,888 చదరపు గజాల స్థలాలు టీడీపీ భూబాగోతానికి నిదర్శనమని నిర్ధారణ అయ్యింది. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో టీడీపీ పెద్దల అవినీతి బట్టబయలైంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే చంద్రబాబు, నారాయణ, లింగమనేని, వారి బంధువులు, బినామీలు భారీ భూ దోపిడీకి బరితెగించారని ఆధారాలతో సహా వెల్లడైంది. చంద్రబాబు అండ్ గ్యాంగ్ అమరావతిలోని అవినీతి సామ్రాజ్యాన్ని

మిగతా 2వ పేజీలో ▶

అమరావతి భూ కుంభకోణంపై నిష్పక్షపాతంగా సిట్ దర్యాప్తు

- తప్పు ఎవరు చేసినా వదిలి పెట్టే ప్రశ్నే లేదు
- మాజీ మంత్రి పేర్ని నాని స్పష్టీకరణ

2లో

పేదలకు ఇంకెన్నాళ్లీ 'ఇంటి'పోరు?

రాజధాని అందరిదీ అని స్పష్టంగా చెప్పిన న్యాయస్థానం

కోర్టు తీర్పుతో అంతా క్లియర్.. త్వరలోనే 50 వేల మందికి ఇళ్ల పట్టాలు

అయినా ఆగని చంద్రబాబు ముఠా... కొత్త వ్యూహాలతో మోకాలడ్డు

- శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఆందోళనలకూ ప్రయత్నాలు
- దాన్ని అడ్డుకోవటమే పోలీసుల తప్పన్నట్టుగా రెచ్చిపోయిన రామోజీ
- 'పాదయాత్రపై ఉక్కుపాదం' అంటూ 'ఈనాడు' దిగజారుడు రాతలు
- పేదలకు ఇళ్ల స్థలాలిస్తే 'సామాజిక తూకం' దెబ్బతింటుందనటమే దుర్మార్గం.. పేదలకు, బలహీన వర్గాలకు రాజధానిలో చోటు ఇవ్వకూడదనటమే దౌర్భాగ్యం
- సేకరించిన భూమిలో 5% పేదలకు ఇవ్వాలంటున్న సీఆర్‌డీఏ చట్టం
- దాన్ని కాలరాసి... కనీసం 120 గజాలుంటేనే నిర్మాణాలకు అనుమతిస్తామన్న బాబు
- ఆ '120 గజాల' నిబంధన లేకుండా ఆర్–5 జోన్‌ను తెచ్చిన జగన్ ప్రభుత్వం
- ఆర్–5 జోన్‌ను అడ్డుకునేందుకు అన్ని స్థాయిల్లో పోరాడి ఓడిపోయిన బాబు
- రాష్ట్రమంతా స్థలాల పంపిణీని అడ్డుకునేందుకు కేసులు వేసి చివరకు ఓటమి

4లో

ఏది నిజం ?

- గతంలో ప్రభుత్వ స్కూళ్ల పిల్లలకు ఇంగ్లిష్ మీడియం అందకుండా ఇదే రకం పోరాటం
- నిధుల కోసం భూములు వేలం వేయబోయినా... కేసులు వేసి అడ్డుకున్న టీడీపీ.. మరోవైపు అప్పులు పెరిగిపోతున్నాయంటూ క్రమం తప్పకుండా దుష్ప్రచారం
- పోర్టుల నుంచి ఎయిర్‌పోర్టుల వరకూ అన్నిటినీ అడ్డుకోవటానికి కేసులతో కుట్రలు
- చివరకు బల్క్‌డ్రగ్ పార్కు రాష్ట్రానికి ఇవ్వవద్దని కేంద్రానికి యనమల లేఖ
- అయినా సరే.. వివిధ రాష్ట్రాలతో పోటీపడి దక్కించుకున్న ఏపీ
- పాలన వికేంద్రీకరణ సహా ప్రతి విషయంలోనూ కోర్టుల ద్వారా అడ్డుపడుతున్న బాబు
- అయినా.. బాబును 'ప్రజాస్వామ్య వాది'గా చిత్రిస్తున్న ఎల్లో ముఠా

న్యూస్‌రీల్

బంగ్లా తీరాన్ని తాకిన మోకా



భీకర మోకా తుపాను ఆదివారం మధ్యాహ్నం బంగ్లాదేశ్, మయన్మార్ తీరాన్ని తాకింది. టెక్నాఫ్ తీర ప్రాంతంలో గంటకు 200 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గాలుల తాకిడికి పలు చోట్ల చెట్లు నేల కూలగా.. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి.

వివరాలు 6లో ▸

గెలిచి నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్



తప్పక గెలిస్తేనే ఐపీఎల్ ప్లే ఆఫ్ రేసులో నిలిచే మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ అదరగొట్టింది. చెన్నై సూపర్‌కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో గెలిచి ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది.

వివరాలు 12లో ▸

దూసుకొచ్చిన మృత్యువు



పుదుచ్చేరిలోని యానాంకు చెందిన మహిళా కూలీలతో వెళ్తున్న ఆటోను కాకినాడ జిల్లా కోరంగి వద్ద ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. దీంతో ఏడుగురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. ఆరుగురు గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు తరలించారు.

వివరాలు 5లో ▸

ఏపీలోనే మహిళా పోలీసులు అత్యధికం



రాష్ట్రంలో 21.76 శాతం మంది మహిళా పోలీసులు

- రెండు, మూడు, నాలుగు స్థానాల్లో బిహార్, తమిళనాడు, మహారాష్ట్ర
- జాతీయ స్థాయిలో కేవలం 11.75 శాతమే.. ప్రతి పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్లు, 10 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉండాలి
- రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ సూచన

సాక్షి, అమరావతి: దేశంలో మహిళా పోలీసులు అత్యధికంగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. దేశంలోని 28 రాష్ట్రాలతో పోల్చి చూస్తే ఏపీలో అత్యధికంగా 21.76 శాతం మంది మహిళా పోలీసులు ఉన్నారు. ఈ విషయాన్ని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ తర్వాత అత్యధికంగా బిహార్, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో ఉన్నారు. కాగా అఖిల భారత స్థాయిలో మహిళా పోలీసులు చాలా తక్కువగా ఉన్నారు. జాతీయ స్థాయిలో 11.75 శాతమే ఉన్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. పోలీసుల అంశం రాజ్యాంగంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉందని గుర్తు చేసింది. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుల భర్తీతోపాటు మహిళా కానిస్టేబుల్, సబ్ ఇన్‌స్పెక్టర్లకు సంబంధించి అదనపు పోస్టులను సృష్టించాలని సూచించింది. ప్రతి పోలీసు స్టేషన్‌లో కనీసం ముగ్గురు మహిళా సబ్ ఇన్‌స్పెక్టర్లు, 10 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించినట్లు పేర్కొంది. తద్వారా పోలీస్ స్టేషన్‌లో

మిగతా 3వ పేజీలో ▶

దివ్యాంగ విద్యార్థులకు జగనన్న కానుక

ఉన్నత విద్యా సంస్థల్లో ఐదు శాతం రిజర్వేషన్లు

ప్రవేశాలలో గరిష్ట వయో పరిమితి ఐదేళ్లు సడలింపు

ఉత్తర్వులు జారీచేసిన రాష్ట్ర ప్రభుత్వం



సాక్షి, అమరావతి: దివ్యాంగ విద్యార్థులకు మేలు చేసేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉన్నత విద్యా సంస్థలు, ప్రభుత్వ గ్రాంటు అందుకుంటున్న ఉన్నత విద్యా సంస్థలు దివ్యాంగ విద్యార్థులకు ఐదు శాతానికి తగ్గకుండా సీట్లు కేటాయించింది. వీటిల్లో ప్రవేశం నిమిత్తం వారికి వయో పరిమితిలో ఐదేళ్ల సడలింపు కూడా ఇచ్చింది. ఈ మేరకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మేర అంగవైకల్యం ఉన్న వారందరికీ

మిగతా 10వ పేజీలో ▶



రాష్ట్రం భగభగ

- అన్ని ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు
- అనేకచోట్ల 42 నుంచి 44 డిగ్రీలు నమోదు
- తుపాను ప్రభావంతో గాలిలో తగ్గిపోయిన తేమ శాతం
- అందుకే తీవ్ర ఉక్కపోత, ఎండలు..
- ఇంకా నాలుగైదు రోజులు ఇలాగే కొనసాగే అవకాశం

10లో

ఫ్యాక్ట్ చెక్



దిగజారుడు పాత్రికేయానికి మరో మచ్చుతునక

- 'మనవారు కాదా.. అనర్హత వేటు వేయండి' అంటూ 'ఈనాడు' తప్పుడు రాతలు
- నివేశన స్థలాల రద్దుకు రంగం సిద్ధమంటూ కథనం
- వలంటీర్లపైనా అబద్ధపు వ్యాఖ్యలు.. ఇళ్ల స్థలాల కేటాయింపులో రాష్ట్రమంతా ఒక్కలానే నిబంధనలు
- పూర్తి పారదర్శకంగా రెవెన్యూ సిబ్బందితో లబ్ధిదారుల ఎంపిక
- ప్రభుత్వ నిబంధనల మేరకే వలంటీర్ల సేవలు

2లో

ఎదురుదాడికి ఉక్రెయిన్ సన్నాహాలు!



రష్యా ఆక్రమించిన ప్రాంతాలకు తిరిగి విముక్తి కల్పించడానికి ఎదురుదాడికి దిగుతామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. ఇందుకోసం ప్రణాళికలు కూడా సిద్ధం చేస్తున్నట్టుగా వెల్లడించారు. రష్యా భూభాగంపై తాము ఎలాంటి దాడులకు పాల్పడబోమని స్పష్టం చేశారు.

6లో

ఇంటూజాత్



జోష్ ఓకే కానీ.. ష్! ఇక్కడేమో పది మంది సిద్ధరామయ్యలు, డీకేలున్నారు..!!

కొత్తకొత్తగా ఉన్నది.. పెళ్లి అక్కడే అన్నది

డెస్టినేషన్ వెడ్డింగ్‌కు పెరుగుతున్న క్రేజ్

- పెళ్లిపీటలు ఎక్కేందుకు కొత్త ప్రాంతాల్ని అన్వేషిస్తున్న భారతీయ జంటలు
- రాజస్థాన్ కేంద్రంగా 'డెస్టినేషన్ వెడ్డింగ్' సెంటర్
- థాయ్‌లాండ్‌లో జరిగే విదేశీ వివాహాల్లో 60శాతం భారతీయులవే
- పిలుపులు తక్కువ.. ఖర్చు మాత్రం ఎక్కువ
- దేశంలో వెడ్డింగ్ టూరిజం పాలసీ తీసుకొచ్చే దిశగా కేంద్రం అడుగులు



సాక్షి, అమరావతి: భారతీయ జంటలు వివాహ వేడుకలకు కొత్త ప్రాంతాలను అన్వేషిస్తున్నాయి. వివాహమనే మధుర ఘట్టాన్ని జీవితంలో మరుపురాని క్షణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రచిస్తున్నాయి. అందుకే చారిత్రక, సాంస్కృతిక, బీచ్, పర్యాటక ప్రాశస్త్యం కలిగిన కేంద్రాలను పెళ్లి వేదికలుగా మార్చుకుంటున్నాయి. ఫలితంగా దేశంలో సంప్రదాయ వివాహాలకు భిన్నంగా 'డెస్టినేషన్ వెడ్డింగ్స్'కు ప్రాధాన్యత పెరుగుతోంది. ఆర్థికంగా స్థిరపడినవారు విదేశాలకు వెళ్లి పెళ్లిళ్లు చేసుకుంటుంటే..మధ్యతరగతి ప్రజలు దేశంలోని సుదీర్ఘ, మూరుమూల ప్రాంతాల్లో పెళ్లిపీటలు ఎక్కుతున్నారు.

అతిథులు తక్కువ.. ఖర్చు ఎక్కువ!

కోవిడ్ సమయంలో తక్కువ మంది అతిథుల మధ్య వివాహాలు జరిగాయి. ఫలితంగా

మిగతా 10వ పేజీలో ▶

దేశంలో వెడ్డింగ్ టూరిజం పాలసీ

భారతదేశంలో కూడా డెస్టినేషన్ వెడ్డింగ్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే ముసాయిదాను కూడా సిద్ధం చేసింది. దేశవ్యాప్తంగా 50కిపైగా డెస్టినేషన్ల అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటివరకు పుణ్యక్షేత్రాలు డెస్టినేషన్ వెడ్డింగ్ కేంద్రాలుగా ఉన్నాయి. ఇకపై అరకు, కోనసీమ, విశాఖ సాగర తీరం, హార్సిలీ హిల్స్, ఇరుక్కం దీవి, పిచ్చుకల్లంక, హోప్ ఐలాండ్ ప్రాంతాలను విదేశీయులను సైతం ఆకర్షించేలా ఏపీటీడీసీ అభివృద్ధి చేయనుంది.

రాణి రుద్రమదేవి @ 1289!

రాణి రుద్రమదేవి జీవిత అంశాలను ఇటీవల బయటపడిన పలు శాసనాలు వెల్లడించాయి. క్రీ.శ 1289 డిసెంబర్ 15న వేసిన ఒక శాసనంలో రుద్రమదేవి మరణం తర్వాత, కొండపై గల ఆలయానికి భూమిని దానమిచ్చినట్లుగా ఉంది.

- వివరాలు 14లో

క్లుప్తంగా...

గ్రామీణ పేదలకు న్యాయంపై అవగాహన కల్పించాలి

- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా
- న్యాయవాదులకు శిక్షణ శిబిరం ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

తాడేపల్లిరూరల్ : గ్రామీణ ప్రాంత పేదలకు న్యాయం, కనీస అవసరాల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా చెప్పారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో ఉన్న కేఎల్ విశ్వవిద్యాలయంలో ఏపీ బార్ కౌన్సిల్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు నిర్వహిస్తున్న మూడురోజుల శిక్షణ శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ప్రజాస్వామ్యంలో ఎంతో కీలకమైందని చెప్పారు. ఈ వృత్తిలోకి నూతనంగా వచ్చిన వారికి చట్టంలోని కీలకమైన అంశాలతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ కూడా అవసరమన్నారు. ఇది కక్షిదారుల నుంచి సరైన సమయంలో సరైన సమాచారం రాబట్టుకుని పిటిషన్ తయారు చేయడానికి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి మాట్లాడుతూ న్యాయవాద వృత్తికి సమాజంలో ఎంతో గౌరవం ఉందన్నారు. వాద, ప్రతివాదులకు న్యాయం చేయడం కోసం న్యాయవాదులు ఎల్లవేళలా కృషిచేస్తారని చెప్పారు. యూనివర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ తమ విశ్వవిద్యాలయం తరఫున వీలైనంతవరకు గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవచేస్తామని తెలిపారు. ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ గంటా రామారావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత నిర్వహిస్తున్న ఓరియంటేషన్ ఆహ్లాదకరమైన వాతావరణంలో జరుగుతోందని చెప్పారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, స్కిల్ అభివృద్ధి విభాగం డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ సీహెచ్.హనుమంతరావు, హెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాలక్ష్మి అమ్మవారికి విశేషాభిషేకం

- మూడో రోజూ విజయవంతంగా కొనసాగిన రాజశ్యామల శ్రీమహాలక్ష్మీ యజ్ఞం
- సోమవారం రాత్రి శ్రీశైల భ్రమరాంబిక కల్యాణ మహోత్సవం

సాక్షి, అమరావతి : దేవదాయ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అష్టోత్తర శత కుండాత్మక చండీ, రుద్ర, రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీలక్ష్మీ మహా యజ్ఞంలో భాగంగా సోమవారం ఉదయం సప్త నదులు, మూడు సముద్రాలు, మానస సరోవరం నుంచి రప్పించిన జలాలతో శ్రీమహాలక్ష్మి అమ్మవారికి విశేష అభిషేకం నిర్వహిస్తున్నట్టు ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధితో పాటు ప్రజలంతా అష్టైశ్వర్య, ఆయురారోగ్య సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కాంక్షిస్తూ రాష్ట్ర చరిత్రలోనే ప్రభుత్వం మొదటిసారి విజయవాడ మునిసిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న మహాయజ్ఞ కార్యక్రమాల మూడో రోజైన ఆదివారం కూడా విజయవంతంగా కొనసాగాయి. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ.. పూర్వంలో రాజులు తమ రాజ్యంలో ప్రజలందరి బాగోగుల కోసం ఇలాంటి మహోత్తరమైన యజ్ఞాలు నిర్వహించే వారని గుర్తు చేశారు. అలాంటి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం దేవదాయ శాఖ ద్వారా వైభవంగా నిర్వహిస్తోందని చెప్పారు. యజ్ఞ కార్యక్రమాలను వీక్షించేందుకు వచ్చే సాధారణ భక్తులందరికీ యజ్ఞం సందర్భంగా అమ్మవారికి నిర్వహించిన కుంకుమ అర్చనకు వినియోగించిన కుంకుమ, పసుపు, గాజులను క్యూలైన్లలోనే పంచి పెడుతున్నట్టు వివరించారు. రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలకు సంబంధించిన ఉత్సవమూర్తులను యజ్ఞ కార్యక్రమాలు సాగే ప్రాంతంలో ఆయా ఆలయాల ప్రచార రథాలలో ఉంచి భక్తుల దర్శనాలకు కూడా అవకాశం కల్పిస్తున్నట్టు చెప్పారు.

వైఎస్సార్ సేవాదళ్ అధ్యక్షుడిగా మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి



సాక్షి, అమరావతి : వైఎస్సార్ సేవాదళ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డిని నియమిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఈ నియామకం చేసినట్లు పేర్కొంది. సుధీర్‌కుమార్‌రెడ్డి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన నాయకుడు.

దిగజారుడు పాత్రికేయానికి మరో మచ్చుతునక

'మనవారు కాదా.. అనర్హత వేటు వేయండి' అంటూ ఈనాడు తప్పుడు రాతలు

సాక్షి, అమరావతి: అబద్ధపు పాత్రికేయంలో చాలా డిగ్రీలు చేసిన రామోజీ దిగజారుడు కథనాలలో ఇది కూడా ఒకటి. పేదల పక్షాన నిలబడ్డ జగన్ ప్రభుత్వంపై అక్కసుతో ప్రజల్లో ఏదో అలజడి సృష్టించాలన్న తాపత్రయంలో అవాస్తవాలను ఏర్చికూర్చి అల్లిన ఓ చిల్లర కథనం. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అంతే పారదర్శకంగా ప్రజలకు అందిస్తున్న వారధులు వలంటీర్లు. అలాంటి వలంటీర్ల వ్యవస్థపై ఈనాడు పత్రికలో ''మనవారు కాదా? అనర్హత వేటు వేయండి..!'' శీర్షికన ఓ అబద్ధపు కథనాన్ని వండి వార్చారు. బాబు జమానాలో జన్మభూమి కమిటీలు చేసిన అక్రమాలను ఏనాడూ పట్టించుకోని ఈనాడు పత్రిక.. ప్రభుత్వ సంక్షేమ ఫలాలను పారదర్శకంగా ప్రజలకు నేరుగా అందించేందుకు ఉపయోగపడుతున్న వలంటీర్లపై మాత్రం తప్పుడు వార్తలను ప్రచురించడం ఏ స్థాయి పాత్రికేయమో వారికే తెలియాలి. విజయవాడ మున్సిపాలిటీ పరిధిలో 'నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు' పథకం కింద జరిగిన కేటాయింపులపై విషం చిమ్ముతూ వలంటీర్లపై కూడా ఈనాడు ఆరోపణలు చేసింది. ఇందులో వాస్తవాలేంటో చూద్దాం..

ఈనాడు: అమరావతిలో నివేశన స్థలాలు కేటాయిస్తూ.. మరోవైపు కొంతమందికి రద్దు చేసేందుకు రంగం సిద్ధమవుతోంది. మన వారు కాదా.. అయితే తొలగించండి అంటూ అధికార పార్టీ నేతలు జోక్యం చేసుకుని వలంటీర్లతో తొలగింపు ప్రక్రియను చేపట్టారు. అందుకోసం 300 యూనిట్ల విద్యుత్ వాడుతున్నారని, సొంతిల్లు ఉందని తేలిందనీ కొర్రీలు పెడుతున్నారు.

ఫ్యాక్ట్ చెక్

వాస్తవం: రాష్ట్రంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయింపునకు ప్రభుత్వం 2020లోనే 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పేరుతో కనీవినీ ఎరుగని రీతిలో పథకాన్ని రూపొందించింది. అసలైన నిరుపేదలకు ఇల్లు దక్కాలని రెవెన్యూ శాఖ ద్వారా 'ఆరు' ప్రమాణాలను నిర్దేశించింది.

- **భూమి:** మూడు ఎకరాల కంటే తక్కువ మాగాణి లేదా 10 ఎకరాల కంటే తక్కువ మెట్ట భూమి లేదా రెండూ కలిసి 10 ఎకరాల లోపు ఉండాలి
- **విద్యుత్ వినియోగం:** గడిచిన ఏడాదిలో నెలకు సగటున 300 యూనిట్లు కంటే తక్కువగా ఉండాలి
- **కుటుంబ ఆదాయం:** గ్రామీణ ప్రాంతంలో నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు ఉండాలి
- **పట్టణాల్లో ఆస్తులు:** 1000 చ.అడుగుల్లోపు ఉండాలి
- **జీఎస్టీ:** ఏడాదికి రూ.12 లక్షల కంటే ఎక్కువ టర్నోవర్ ఉండకూడదు..

వీటితో పాటు ప్రత్యక్ష లబ్ధిదారు ప్రభుత్వ ఉద్యోగి, ప్రభుత్వ పెన్షనర్ కాకూడదు, ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగి ఉండకూడదు అనే నిబంధనలను రాష్ట్రమంతా అమలు చేస్తోంది. అమరావతి పరిధిలోని లబ్ధిదారులను కూడా అదే తరహాలో ఎంపిక చేశారు.

ఈనాడు: అమరావతి పరిధిలోని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఇలా 5,500 మంది లబ్ధిదారుల తొలగింపునకు రంగం సిద్ధమైంది. వీరిలో అత్యధికులు విజయవాడ సెంట్రల్, తూర్పు నియోజకవర్గాలకు చెందిన వారే అధికం.



వాస్తవం: ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 'నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు' పథకం కింద విజయవాడ మునిసిపాలిటీ నుంచి సీఆర్డీఏ ప్రాంతంలో 24,630 మంది లబ్ధిదారులకు గతంలోనే ప్లాట్లు కేటాయించారు. అయితే..

మూడు నియోజకవర్గాల్లోను సొంతిల్లు ఉన్న వారు 1910 మంది, పూర్తిగా వలసపోయిన వారు 1123 మంది, స్థలం వద్దనుకున్నవారు 917 మంది, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగం ఉన్నవారు 362 మంది, ప్రభుత్వం నిర్దేశించిన 'ఆరు' ప్రమాణాలు లేనివారు 383 మంది, పేదరిక రేఖకు పైన ఆదాయం ఉన్నవారు 320 మంది, సొంత ఇంటి స్థలం ఉన్నవారు 126 మంది, రెగ్యులేషన్ జీవోల పరిధిలోకి వచ్చినవారు 124 మంది, చనిపోయినవారి కుటుంబంలో చట్టబద్ధమైన వారసులు లేనివారు 106 మంది, ఎంపికైన కుటుంబంలో ఒక్కరే ఉండి చనిపోయినవారు 17 మంది, వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఎంపికైనవారు ఒక్కరు.. మొత్తం 5,389 మంది అనర్హులను గుర్తించారు. మిగిలిన 19,241 మంది లబ్ధిదారుల్లో సెంట్రల్ నియోజకవర్గంలో 9,515 మంది, ఉత్తరంలో 3605, పశ్చిమలో 6121 మంది ఉన్నారు. సీఆర్డీఏ ప్రాంతంలో నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించరాదని టీడీపీ నేతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో పంపిణీ ఆలస్యమైంది. ఇప్పుడు 19,241 మందికి వారి పేరు, ఫొటో, షెడ్యూల్ ప్లాట్ నంబర్.. సరిహద్దులతో కేటాయింపు పట్టాలను ముఖ్యమంత్రి సందేశంతో సహా తయారు చేస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కలెక్టర్, కమిషనర్, జాయింట్ కలెక్టర్, సబ్ కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతోంది. ఇక ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 28వేల టిడ్కో ఇళ్లను నిర్మించాలని నిర్ణయించి పరిపాలనా పరమైన అనుమతులు కూడా తీసుకున్నారు. అందుకోసం 100 ఎకరాలు అవసరమని, కొనుగోలుకు ఎకరా ఒక కోటి చొప్పున 100 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. కానీ అంత డబ్బు లేదంటూ చంద్రబాబు చేతులెత్తేశారు. జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత విజయవాడ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ భూమిని కేటాయించి 6,576 టిడ్కో ఇళ్లను నిర్మిస్తోంది. ఇవిగాక, సీఆర్డీఏ పరిధిలో కేటాయించిన టిడ్కో ఇళ్లను వద్దనుకున్నవారిని వడపోసి మిగిలిన వారికి టిడ్కో ఇళ్లను సైతం కేటాయించింది.

అమరావతి భూ కుంభకోణంపై నిష్పక్షపాతంగా సిట్ దర్యాప్తు

- క్విడ్ ప్రో కో కింద కరకట్ట నివాసాన్ని చంద్రబాబుకు ఇచ్చిన లింగమనేని రమేష్
- అందుకు ఆధారాలు దొరకడం వల్లే వాటిని జప్తు చేసిన ప్రభుత్వం
- అక్రమాలతో రైతులను మోసం చేసిన నారాయణ భూములూ జప్తు
- తప్పు ఎవరు చేసినా వదిలి పెట్టే ప్రశ్నే లేదు
- మాజీ మంత్రి పేర్ని నాని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి : అమరావతి భూ కుంభకోణంపై సిట్ నిష్పక్షపాతంగా విచారణ చేస్తోందని, దోషులు ఎవరైనా వదిలిపెట్టే ప్రశ్నే లేదని మాజీ మంత్రి పేర్ని నాని (వెంకట్రామయ్య) అన్నారు. భూ సమీకరణ నుంచి లింగమనేని రమేష్ భూములు తప్పించినందుకుగాను క్విడ్ ప్రో కో కింద కృష్ణా నది కరకట్టలోని నివాసాన్ని చంద్రబాబుకు బహుమానంగా ఇచ్చారనడానికి ఆధారాలు ఉండటం వల్లే.. దాన్ని సిట్ జప్తు చేసిందని స్పష్టం చేశారు. సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్ ముసాయిదాను మంత్రివర్గం ఆమోదించిన తర్వాత రైతులను మోసం చేసి.. ఆనాటి మంత్రి నారాయణ భూములు కొన్నారనడానికి ఆధారాలు ఉండటం వల్లే వారి భూములను సిట్ జప్తు చేసిందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో మార్పులు చేయడం ద్వారా లింగమనేనితో పాటు చంద్రబాబు, నారాయణ భారీ ఎత్తున లబ్ధి పొందారని చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. తాను నివాసం ఉంటున్న కరకట్టలోని అక్రమకట్టడాన్ని లింగమనేని రమేష్ భూ సమీకరణ కింద ప్రభుత్వానికి ఇచ్చారని గతంలో చంద్రబాబు చెప్పారని గుర్తు చేశారు. కానీ.. భూ సమీకరణ కింద ఆ అక్రమ కట్టడాన్ని లింగమనేని రమేష్ ఇచ్చినట్లు ఆధారాలు లేవన్నారు. అలాంటప్పుడు ఆ ఇంటికి అద్దె కడుతున్నారో.. ఉచితంగా ఉంటున్నారో చంద్రబాబు చెప్పాలి కదా? అని ప్రశ్నించారు. ఒక్క లింగమనేని రమేష్ మాత్రమే కాదు.. చంద్రబాబు తప్పుడు విధానాల వల్ల చాలా మంది వ్యక్తులకు ఉద్దేశపూర్వకంగా లబ్ధి చేకూరిందని, వారి ఆస్తులను ప్రభుత్వం జప్తు చేస్తుందని స్పష్టం చేశారు.

తప్పులు లేకపోతే ధైర్యంగా విచారణ ఎదుర్కోండి

రాజధాని వ్యవహారంలో తప్పులు చేయకుంటే.. దమ్ముగా విచారణను ఎదుర్కోవాలని.. పెద్ద పెద్ద న్యాయవాదులను తెచ్చి.. కోర్టుల్లో స్టేలు తెచ్చుకుని.. దాక్కోవటం ఎందుకు? అని చంద్రబాబును పేర్ని నాని నిలదీశారు. లింగమనేని రమేష్‌ది రెండు దూడల ఆవు వ్యవహారమని.. అటు పవన్ కళ్యాణ్, ఇటు చంద్రబాబు దగ్గర ఉంటారని ఎద్దేవా చేశారు. లింగమనేని రమేష్ కోట్లాది రూపాయల విలువైన భూమిని పవన్ కళ్యాణ్‌కు రూ.లక్షలకే.. చంద్రబాబుకైతే ఉచితంగానే కరకట్ట నివాసాన్ని ఇచ్చేశాడని ఎత్తిచూపారు. పదేళ్లుగా అక్కడా.. ఇక్కడా పాలు ఇచ్చే ఆవు లింగమనేని రమేష్ అన్నారు.

తప్పు చేసిన తర్వాత తప్పించుకోలేరు

- న్యాయస్థానం ముందు నిలబెడతాం
- మంత్రి ఆదిమూలపు సురేష్



సాక్షి, అమరావతి: తప్పు చేసిన వారు ఎప్పటికీ తప్పించుకోలేరని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వం సీఆర్‌డీఏ మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు విషయాల్లో పలు అవకతవకలకు పాల్పడిందని చెప్పారు. అప్పటి సీఎంగా చంద్రబాబు, మంత్రిగా నారాయణ తమ పదవులను దుర్వినియోగం చేసి క్విడ్ ప్రో కోకు పాల్పడినందుకే రాష్ట్ర ప్రభుత్వం చట్ట ప్రకారం చర్యలకు ఉపక్రమిస్తోందని తెలిపారు. టీడీపీ హయాంలో కేంద్ర విజిలెన్స్ కమిషన్ మార్గదర్శకాలను, సాధారణ ఆర్థిక నియమాలను పూర్తిగా ఉల్లంఘించి.. బంధువులు, సన్నిహితులకు భూములు కట్టబెట్టడం ద్వారా, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించారన్నారు. తద్వారా రైతులకు, ప్రభుత్వానికి రూ.వేల కోట్ల నష్టం వాటిల్లిందని వివరించారు. అమరావతి క్యాపిటల్ పరిధిలో అక్రమాలకు పాల్పడిన ఏ ఒక్కరిని వదిలేది లేదని, తప్పు చేసిన వారందరినీ న్యాయస్థానం ముందు నిలబెడతామని స్పష్టం చేశారు.

అమరావతిలో యుద్ధ ప్రాతిపదికన లేఅవుట్ల అభివృద్ధి

సాక్షి, అమరావతి: అమరావతిలో 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా 50,004 మందికి కేటాయించిన ఇళ్ల స్థలాల లేఅవుట్లలో పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలిచ్చేందుకు నిడమర్రు, కృష్ణాయపాలెం, నవులూరు, ఐనవోలు, మందడం, కురగల్లు, యర్రబాలెం, పిచ్చుకలపాలెం, బోరుపాలెం, నెక్కల్లు, అనంతవరంలో సుమారు 1,402.58 ఎకరాల్లో 25 లేఅవుట్లను అభివృద్ధి చేస్తున్నారు. సీఆర్డీఏ అధికారులు షిఫ్టుల ప్రకారం పని చేస్తూ.. వేగంగా పనులను పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించారు. శని, ఆదివారాల్లోనూ ఉన్నతాధికారులు, ఉద్యోగులు పనులను పరిశీలిస్తున్నారు.

ఇచ్చి పుచ్చుకున్నారు..

▶ మొదటి పేజీ తరువాయి

సీఐడీకి చెందిన ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) బట్టబయలు చేసింది. దాంతో టీడీపీ ప్రభుత్వంలో అమరావతి కేంద్ర బిందువుగా ఏ–1 నారా చంద్రబాబు, ఏ–2 పొంగూరు నారాయణ యథేచ్ఛగా సాగించిన భారీ భూ దోపిడీపై ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. అమరావతిలో చంద్రబాబు ప్రభుత్వం పాల్పడిన అక్రమాలు, అవినీతిపై దర్యాప్తునకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను నియమించడం సరైనదేనని ఇటీవల సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దాంతో తన అవినీతి బట్టబయలు కాకుండా చంద్రబాబు కొన్నేళ్లుగా అడ్డుకుంటున్న కుట్రలకు తెరపడింది. ఈ నేపథ్యంలో రాజధాని ల్యాండ్ పూలింగ్, సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్, ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లలో వచ్చు ముతా అక్రమాలపై ప్రభుత్వం కఠిన చర్యలకు ఉపక్రమించింది.

బాబు, నారాయణవి అక్రమ ఆస్తులే

అక్రమ మార్గంలో సంపాదించిన ఆస్తులను అటాచ్ చేసేందుకు ప్రభుత్వానికి అధికారం కల్పిస్తున్న క్రిమినల్ లా ఆర్డినెన్స్ ప్రకారం అనుమతించాలని సీఐడీ కోరింది. ఈ మేరకు అవినీతి నిరోధక చట్టం –1988 ప్రకారం లింగమనేని కుటుంబం క్విడ్ ప్రో కో కింద చంద్రబాబుకు ఇచ్చిన కరకట్ట నివాసం.. సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో నారాయణ బినామీల పేరిట పొందిన 75,888 చదరపు గజాల స్థలాలను అటాచ్ చేసేందుకు సీఐడీకి అనుమతిస్తూ హోమ్ శాఖ రెండు వేర్వేరు జీవోలు జారీ చేసింది. దాంతో సీఐడీ ఆ విషయాన్ని ఏసీబీ న్యాయస్థానానికి నివేదించి, ఆ ఆస్తులను అటాచ్ చేసేందుకు ఉపక్రమించనుంది. మరిన్ని కఠిన చర్యలు చేపట్టేందుకు సన్నాహాలు వేగవంతం చేస్తోంది.

భారీ అవినీతికే 'మాస్టర్ ప్లాన్'

అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనలోనే ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీ అవినీతికి పునాది వేశారు. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే అప్పటి టీడీపీ ప్రభుత్వం, సింగపూర్‌కు చెందిన ఇంటర్నేషనల్ ఎంటర్‌ప్రైజెస్‌తో ఒప్పందం చేసుకుంది. అమరావతి మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కన్సల్టెన్సీ ఎంపిక కోసం

కనీసం టెండర్ల ప్రక్రియ కూడా చేపట్టకుండా సింగపూర్ కంపెనీకి నామినేషన్ పద్ధతిలో అడ్డగోలుగా అప్పగించేశారు. దాంతో చంద్రబాబు, నారాయణ కనుసన్నల్లోనే మాస్టర్ ప్లాన్‌ను సింగపూర్ కంపెనీ రూపొందించింది. లింగమనేని రమేశ్, లింగమనేని రాజశేఖర్, హెరిటేజ్ ఫుడ్స్, చంద్రబాబు బినామీలకు చెందిన భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా.. వారి భూముల వెలుపలి నుంచే ల్యాండ్ పూలింగ్ చేసేలా మాస్టర్ ప్లాన్‌ను ఖరారు చేశారు. అందుకు ప్రతిగా చంద్రబాబు కుటుంబానికి లింగమనేని కుటుంబం భారీగా ప్రతిఫలాన్ని ముట్టజెప్పింది.

క్విడ్ ప్రోకో కిందే కరకట్ట నివాసం

చంద్రబాబు, లింగమనేని క్విడ్ ప్రో కో కింద పరస్పరం భారీగా అవినీతికి పాల్పడినట్టు సిట్ నిర్ధారించింది. లింగమనేని కుటుంబ సభ్యుల భూములు ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా చేసినందుకు చంద్రబాబుకు భారీగా ముట్టజెప్పారు. ఇన్నర్‌రింగ్ రోడ్డుకు ఆనుకుని ఉన్న భూములను హెరిటేజ్ ఫుడ్స్‌కు 'అమ్మినట్టు' ఇవ్వడంతో సరిపెట్టలేదు. లింగమనేని కృష్ణానది కరకట్ట మీద ఉన్న నివాసాన్ని కూడా చంద్రబాబుకు ఇవ్వడం గమనార్హం. పక్కా క్విడ్ ప్రో కోలో భాగంగానే కరకట్ట నివాసం చంద్రబాబుకు ఉచితంగా ఇచ్చేశారని సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

కరకట్ట నివాసంపై బాబు కట్టుకథలు

కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని, ప్రజల్ని తప్పుదారి పట్టించేందుకు చంద్రబాబు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు జీతంతోపాటు హౌస్ రెంట్



కృష్ణా కరకట్టపై గల చంద్రబాబు నివాసం


అలవెన్స్ (ఇంటి అద్దె అలవెన్స్) కూడా తీసుకున్నారు. అంటే ప్రజాధనం నుంచి సీఎంగా ఇంటి అద్దె అలవెన్స్ తీసుకున్నారు. కానీ చంద్రబాబు 2017 నుంచి తాను ఉంటున్న కరకట్ట నివాసానికి అద్దెను లింగమనేని కుటుంబానికి చెల్లించినట్టు ఎక్కడా బ్యాంకు లావాదేవీలు లేవు. చంద్రబాబు నుంచి తీసుకున్న అద్దెకు లింగమనేని ఎక్కడా జీఎస్టీ చెల్లించనే లేదు. అంటే ఇంటి అద్దె అలవెన్స్‌ను ప్రజాధనం నుంచి తీసుకుంటున్న చంద్రబాబు.. తాను నివసిస్తున్న ఇంటికి మాత్రం అద్దె చెల్లించడమే లేదన్నది నిర్ధారణ అయ్యింది. క్విడ్ ప్రో కోలో భాగంగా ఆ నివాసం చంద్రబాబుకు లింగమనేని ఇచ్చారు కాబట్టే అద్దె చెల్లించలేదు.

దేశ భక్తితో ఇచ్చారట!

కరకట్ట నివాసంపై న్యాయస్థానాన్ని తప్పుదోవ పట్టించేందుకు లింగమనేని కూడా యత్నించారు. తాను దేశభక్తితోనే కరకట్ట నివాసాన్ని అప్పటి ప్రభుత్వం వాడుకునేందుకు ఉచితంగా ఇచ్చానని లింగమనేని రమేష్ న్యాయస్థానానికి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. మరి ఉచితంగా ఇచ్చిన ఇంటికి చంద్రబాబు ప్రజాధనం నుంచి ఇంటి అద్దె అలవెన్స్‌ను ఎలా తీసుకున్నారన్న ప్రశ్నకు సమాధానమే లేదు. దేశభక్తితో ఉచితంగా ఇస్తే రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలి గానీ చంద్రబాబుకు వ్యక్తిగతంగా ఇవ్వడం ఏమిటి? ప్రభుత్వానికే ఉచితంగా ఇచ్చి ఉంటే.. చంద్రబాబు సీఎం పదవి నుంచి దిగిపోగానే ఆ ఇంటిని ఖాళీ చేయాలి. ఆ ఇంటిని ప్రభుత్వానికి అప్పగించాలి. ముఖ్యమంత్రి పదవి నుంచి వైదొలగిన తర్వాత ప్రభుత్వ ఆధ్వర్యంలోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయాన్ని ఖాళీ చేయాలి. ఆ నివాసం ప్రభుత్వానికి చెందుతుంది. కానీ 2019లో సీఎం పదవి నుంచి దిగిపోయిన తర్వాత కూడా చంద్రబాబు అదే కరకట్ట నివాసంలో ఉంటున్నారు. అంటే లింగమనేని దేశ భక్తితో ప్రభుత్వానికి ఉచితంగా ఇచ్చారన్నది అవాస్తవం. క్విడ్ ప్రో కోలో భాగంగానే ఆయన చంద్రబాబుకు ఇచ్చారన్నది దీనినిబట్టి కూడా నిర్ధారణ అయ్యింది.

లింగమనేని నుంచి హెరిటేజ్ ఫుడ్స్‌కు భూమి

2014లో లింగమనేని కుటుంబ సభ్యుల నుంచి హెరిటేజ్ ఫుడ్స్ 4 ఎకరాలు 'కొనుగోలు చేసినట్టు' చూపడం గమనార్హం. ల్యాండ్ పూలింగ్ పరిధిలోకి రాకుండా ఇన్నర్ రింగ్ రోడ్డును ఆనుకుని ఉన్న భూమినే హెరిటేజ్ ఫుడ్స్ కొనింది. పేరుతో ఆ భూమిని హెరిటేజ్ ఫుడ్స్‌కు బదలాయించారు. ఆ మేరకు అప్పట్లోనే లోకేశ్ డైరెక్టర్‌గా ఉన్న హెరిటేజ్ ఫుడ్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో తీర్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్సీగా ఎన్నికై, మంత్రి కూడా అయిన లోకేశ్ అదే లింగమనేని కుటుంబం ఇచ్చిన కరకట్ట మీద నివాసంలోనే నివసించారు.



అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ లో అక్రమాలను నిరూపిస్తున్న మ్యాప్

వారి భూముల వద్దే ఇన్నర్ రింగ్ రోడ్డు

అమరావతిలో 75 మీటర్ల ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను రూపొందించడంలో చంద్రబాబు, నారాయణ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డారు. వారి భూములను ఆనుకునే ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను రూపొందించారు. లింగమనేని కుటుంబం, హెరిటేజ్ ఫుడ్స్, నారాయణ విద్యా సంస్థల సమీపం నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా చంద్రబాబు, నారాయణ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. తమ భూముల నుంచి కాకుండా సామాన్య రైతుల భూముల నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను ఖరారు చేయడం గమనార్హం. అందుకోసం ముందుగానే ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు కూడా అనుమతి ఇవ్వకుండా సీఆర్‌డీయే నిలుపుదల చేసింది. అంటే కన్సల్టెన్సీ సంస్థ అలైన్‌మెంట్‌ను రూపొందించకముందే చంద్రబాబు, నారాయణ ఇన్నర్ రింగ్ రోడ్డు ఎలా నిర్మించాలో నిర్ణయించేశారు. అప్పటికే నిర్ణయించిన అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకే ఓ కన్సల్టెన్సీని నియమించి కనికట్టు చేశారు. వాస్తవానికి విజయవాడలోని కామినేని ఆస్పత్రి వద్ద ఉన్న తాడిగడప– ఎనికేపాడు మీదుగా ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించాలని కన్సల్టెన్సీ సంస్థ ఎస్టీయూపీ అలైన్‌మెంట్‌ను రూపొందించింది. అలా నిర్మిస్తే నారాయణ విద్యా సంస్థలతోపాటు హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని భూముల మీదుగా రోడ్డును నిర్మించాల్సి వస్తుంది. దీనిపై అప్పటి సీఆర్‌డీయే వైస్ చైర్మన్‌గా ఉన్న నారాయణ సీఆర్‌డీయే సమావేశంలోనే అధికారులపై తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. తాడిగడపకు 3 కి.మీ. దూరంగా తూర్పు వైపు నుంచి పెనమలూరు– నిడమానూరు మీదుగా ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మించేలా అలైన్‌మెంట్‌ను మార్పించారు.

సీడ్ క్యాపిటల్‌లో వేళ్లూనుకున్న అవినీతి

- అమరావతిలో అత్యంత ప్రధానమైన సీడ్ క్యాపిటల్‌లో కూడా ఏ–1 చంద్రబాబు, ఏ–2 నారాయణ భారీగా భూ అక్రమాలకు పాల్పడ్డారు. ఎందుకంటే శాసనసభ, సచివాలయం మొదలైన ప్రధాన విభాగాలన్నీ సీడ్ క్యాపిటల్ పరిధిలోనే నిర్మించాలని నిర్ణయించారు.
- ఆ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరుగుతాయి కాబట్టి, సీడ్ క్యాపిటల్‌లో పూర్తిగా తమ వాటా భూములే ఉండేట్టుగా చంద్రబాబు, నారాయణ పన్నాగం పన్నారు. సింగపూర్ కంపెనీ సీడ్ క్యాపిటల్ మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వానికి 2015 జూలైలోనే సమర్పించింది. కానీ ఆ ప్లాన్‌ను బహిర్గతం చేయకుండా, ఆమోదించకుండా మూడు నెలలపాటు కాల యాపన చేశారు.
- ఆ సమయంలోనే నారాయణ తమ బినామీలు, బంధువులైన పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో 65.50 ఎకరాలు కొనుగోలు చేశారు. అందుకోసం నారాయణ భార్య రమాదేవి, అల్లుడు డైరెక్టర్లుగా ఏర్పాటు చేసిన ఎన్‌స్పైరా కంపెనీ నుంచి నిధులను తమ బంధువులు, బినామీల ఖాతాల్లోకి మళ్లించారు. వారి పేరున సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు.
- రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరును బినామీగా పెట్టుకుని కూడా నారాయణ సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో భూములు కొనుగోలు చేశారు. నారాయణ కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాల నుంచి రామకృష్ణ హౌసింగ్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యాంకు ఖాతాకు నిధులు బదిలీ చేశారు. ఆ నిధులతో ఆ కంపెనీ ఉద్యోగుల పేరున భూములు కొనుగోలు చేశారు.
- కేసు దర్యాప్తులో భాగంగా ఆ ఉద్యోగులను సిట్ అధికారులు ప్రశ్నించగా తాము నారాయణ బినామీలుగానే భూములు కొనుగోలు చేశామని వాంగ్మూలం ఇవ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా నారాయణ తమ బంధువులు, బినామీల పేరిట సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో కొనుగోలు చేసిన 65.50 ఎకరాలను ల్యాండ్ పూలింగ్ కింద సీఆర్డీఏకు ఇచ్చారు.
- అందుకు ప్రతిగా ల్యాండ్ పూలింగ్ ప్యాకేజీ కింద సీడ్ క్యాపిటల్ ప్రాంతంలో అత్యంత విలువైన 75,888 చదరపు గజాల స్థలాలు పొందారు. వాటిలో 7,620 చదరపు గజాలు, 8,880 చదరపు గజాలు, 6,550 చదరపు గజాలు, 25 వేల చదరపు గజాల స్థలాలూ ఉన్నాయి. అవి నేరుగా సీడ్ యాక్సెస్ రోడ్డుకు అనుసంధానించి ఉండటం గమనార్హం.
- భవిష్యత్‌లో స్టార్ హోటళ్లు, షాపింగ్ మాల్స్, ఇతర భారీ వాణిజ్య సముదాయాల నిర్మాణానికి అనుకూలమైన విలువైన స్థలాలను పొందారన్నది స్పష్టమవుతోంది. పూలింగ్ ప్యాకేజీ కింద ఏటా సీఆర్‌డీఏ ఇప్పటి వరకు చెల్లించిన రూ.1.92 కోట్ల కౌలు మొత్తం ఎన్‌స్పైరా ఖాతాల్లో జమ చేస్తున్నారు. అంటే ఆ భూములు కొనుగోలు చేసి సీఆర్‌డీఏకే ఇచ్చినట్టు పేర్కొన్న పొత్తూరి ప్రమీల, రాపూరి సాంబశివరావు, ఆవుల ముని శంకర్, వరుణ్ కుమార్ కొత్తప్ప పూర్తిగా నారాయణ బినామీలేనన్నది నిర్ధారణ అయ్యింది.

క్లుప్తంగా...

సముద్రశక్తి-2023 ప్రారంభం

- భారత్–ఇండోనేషియా ద్వైపాక్షిక విన్యాసాలు


ఐఎన్‌ఎస్ కవరత్తి

సాక్షి, విశాఖపట్నం: భారత్, ఇండోనేషియా దేశాల మధ్య ద్వైపాక్షిక విన్యాసాలు ప్రారంభమయ్యాయి. సముద్ర శక్తి-2023 పేరుతో నాలుగో ఎడిషన్ విన్యాసాలు ఇండోనేషియాలోని బాటమ్ తీరంలో మొదలయ్యాయి. ఈ విన్యాసాల్లో ఐఎన్ఎస్ కవరత్తి, డోర్నియర్ మారీటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, చేతక్ హెలికాప్టర్ భారత్ తరఫున ప్రాతినిధ్యం వహిస్తుండగా.. కేఆర్ఐ సుల్తాన్ ఇస్కందర్, సీఎన్ 235 మారీటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్, ఎఎస్565 పాంథర్ హెలికాప్టర్ ఇండోనేషియా తరఫున విన్యాసాల్లో పాల్గొంటున్నాయి. రెండు దేశాల మధ్య పరస్పర సహకారం పెంపొందించే లక్ష్యంతో సముద్రశక్తి నిర్వహిస్తున్నారు. హార్బర్ దశలో క్రాస్‌డెక్ విజిట్స్, ప్రొఫెషనల్ ఇంటరాక్షన్, క్రీడా పోటీలు జరగనుండగా, సీ ఫేజ్‌లో వెపన్ ఫైరింగ్, హెలికాప్టర్ ఆపరేషన్స్, యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్, ఎయిర్ డిఫెన్స్ విన్యాసాలు, బోర్డింగ్ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఈ నెల 19 వరకూ సముద్ర శక్తి-2023 విన్యాసాలు జరగనున్నాయని తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ బిస్వజిత్‌దాస్‌గుప్తా తెలిపారు.

సర్పంచ్ భర్తపై టీడీపీ కార్యకర్తల దాడి

ఎన్టీఆర్ జిల్లా బోడవాడలో ఘటన


గాయపడిన శీలం ఉదయభాస్కర్‌రెడ్డి

వీరులపాడు(నందిగామ): ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం బోడవాడ గ్రామ సర్పంచ్ శీలం సంధ్య భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు శీలం ఉదయభాస్కర్‌రెడ్డిపై శనివారం రాత్రి టీడీపీ కార్యకర్తలు మూకుమ్మడిగా దాడిచేసి గాయపరిచారు. గ్రామస్తులు, బాధితుల కథనం మేరకు.. బోడవాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సానుభూతిపరురాలు రాయల అనూరాధ కుమారుడు ఉదయ్‌కుమార్ శనివారం రాత్రి 8గంటల సమయంలో బజారుకు వెళ్లి వస్తుండగా, అదే గ్రామానికి చెందిన శివనాగసతీష్ అడ్డుకుని 'మీకు ఇటు దారి లేదు. ఇటు నడవటానికి వీల్లేదు' అని చెప్పాడు. ఈ విషయాన్ని ఉదయ్‌కుమార్ తన తల్లి అనూరాధకు చెప్పగా, ఆమె వెళ్లి దారి లేదని ఏ హక్కుతో చెప్పారంటూ శివనాగసతీష్‌ను ప్రశ్నించింది. దీంతో ఆమెపై గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు రాయల సత్యనారాయణ, రాయల చిన్నశ్రీను, రాయల లక్ష్మి, లక్ష్మీతిరుపతమ్మ, మరికొంత మంది మహిళలు దాడి చేశారు. అనూరాధకు ఉదయభాస్కర్‌రెడ్డి ధైర్యం చెప్పి ఫిర్యాదు చేసేందుకు వీరులపాడులోని పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. కొద్దిసేపటికే సర్పంచ్ సంధ్యను టీడీపీ వారు దూషిస్తున్నారని ఫోన్ రావడంతో ఉదయభాస్కర్‌రెడ్డి తిరిగి గ్రామానికి వచ్చారు. గ్రామస్తులతో ఆయన మాట్లాడుతుండగానే వెనుక నుంచి టీడీపీ కార్యకర్తలు రాయల శివనాగసతీష్, రాయల అనిల్, గంగినేని చిన్న మంగయ్య, పెద్ద మంగయ్య, సరిపూడి హరికృష్ణ, మరికొంతమంది కర్రలతో దాడి చేయటంతో ఉదయభాస్కర్‌రెడ్డి అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. ఆయన్ను కుటుంబ సభ్యులు నందిగామ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఉదయభాస్కర్‌రెడ్డి, అనూరాధను ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ అరుణ్‌కుమార్ ఆదివారం పరామర్శించారు. రాయల అనూరాధ, ఉదయభాస్కర్‌రెడ్డి వేర్వేరుగా ఫిర్యాదు చేశారని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నందిగామ రూరల్ సీఐ నాగేంద్రకుమార్ తెలిపారు.

70-80 సీట్లు తీసుకోవాలి

పవన్‌కు కాపు ఐక్య వేదిక లేఖ

సాక్షి, అమరావతి: నమ్ముకున్న వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చివరి వరకు పవన్ కళ్యాణ్ సీఎం అభ్యర్థిగా కొనసాగే రాజకీయాలు చేయాలని కాపు ఐక్య వేదిక సూచించింది. ఈ మేరకు ఆదివారం పవన్‌కు బహిరంగ లేఖ రాసింది. పొత్తు గౌరవప్రదంగా ఉండాలంటే 70 నుంచి 80 సీట్లు జనసేనకు దక్కేలా డిమాండ్ చేయాలని కాపు ఐక్యవేదిక చైర్మన్ ఆర్.శ్రీనివాస్, కన్వీనర్లు పి.మహేష్, బి.పెద బాబు, కో–కన్వీనర్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

ఏపీలోనే మహిళా పోలీసులు అత్యధికం

▶ మొదటి పేజీ తరువాయి

మహిళా హెల్ప్‌డెస్క్ 24 గంటలు పనిచేస్తుందని తెలిపింది.

వివిధ రాష్ట్రాల్లో మహిళా పోలీసుల శాతం

ఆంధ్రప్రదేశ్ 21.76	బిహార్ 21.21	తమిళనాడు 19.10
మహారాష్ట్ర 17.84	గుజరాత్ 16.34	హిమాచల్‌ప్రదేశ్ 14.03
ఉత్తరాఖండ్ 12.78	ఉత్తరప్రదేశ్ 10.75	గోవా 10.57
ఒడిశా 10.51	రాజస్థాన్ 10.41	పశ్చిమ బెంగాల్ 9.95
పంజాబ్ 9.86	◆ రాష్ట్రం	◆ మహిళా పోలీసుల శాతం

నీ నాయకుడు చంద్రబాబేనని ఒప్పుకుని
భజన చేసుకో

లేదా చిరంజీవి, వంగవీటి రంగాలా రాజకీయాలు చేయి

- జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌కు మాజీ మంత్రి పేర్ని నాని హితవు
- కాపులను మోసం, దగా చేసింది చంద్రబాబు, పవన్‌లే...
- ముద్రగడను చంద్రబాబు చిత్రహింసలు పెట్టినప్పుడు ఎక్కడ తొంగున్నావ్?
- బాబు ప్రయోజనాల కోసం కుల, మతాల వారీగా రెచ్చగొడతావా?
- 2024లో గెలిచేది వైఎస్సార్‌సీపీనే



సాక్షి, అమరావతి: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు ప్రయోజనాల కోసమే పవన్‌కళ్యాణ్ జనసేనను ప్రారంభించారని మాజీ మంత్రి పేర్ని నాని (వెంకట్రామయ్య) తెగేసి చెప్పారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా.. జగన్‌ను దూషించడం.. చంద్రబాబు భజన చేయడమే పవన్ కళ్యాణ్ లక్ష్యంగా పెట్టుకున్నారన్నది ఆయన రాజకీయ చరిత్రను తిరగేస్తే ఎవరికైనా అర్థమవుతుందని మండిపడ్డారు. 'మా నాయకుడు సీఎం జగన్ కాబట్టి, ఆయన చేసిందే చెబుతున్నాం.. నీకు నాయకుడు చంద్రబాబు అని ఒప్పుకో.. భజన చేసుకో.. ఆ మాట చెప్పకుండా ఈ భజన దేనికి?' అంటూ విరుచుకుపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఇప్పుడు చేస్తున్న తప్పుడు, ముసుగు రాజకీయాలు మానేసి.. చంద్రబాబు కోసమే రాజకీయంగా బతుకుతామని చెప్పు. మేం ఎలా కాపు బిడ్డలం అని చెప్పుకుంటున్నామో.. మాకు పోటీగా నిఖార్సయిన కాపు బిడ్డ దొరికాడనుకుంటాం' అంటూ వ్యంగ్యోక్తులు విసిరారు. రాజకీయాలు చేస్తే.. చిరంజీవిలా, వంగవీటి రంగాలా చేయాలి.. ఈ తోడేలు, నక్క రాజకీయాలు కట్టిపెట్టాలని హితవు పలికారు.

నువ్వేమైనా రోబోలో రజనీకాంత్‌వా?

➡ ప్రజల కోసం రాజకీయం చేయాలనుకుంటే జనం మధ్యే బతకాలి. వారి కష్టాలు వినాలి. ఎంతసేపూ నాదెండ్ల మనోహర్ మాటలు వినటం తప్పితే ప్రజల మాటలు విన్నావా? మీ ఇంకో అన్నయ్య (నాగబాబు), నాదెండ్ల మనోహర్ తప్పితే నీతో మాట్లాడినవారు ఎవరైనా ఉన్నారా? మాటెత్తితే రెండు లక్షల పుస్తకాలు చదివాను అంటావు. నువ్వేమైనా రోబోలో రజనీకాంత్‌వా?

➡ 2014 ఎన్నికల్లో కాపులను బీసీల్లో చేర్చుతామని మేనిఫెస్టో ద్వారా హామీ ఇచ్చి, మోసం చేసింది చంద్రబాబే. దీంతో ముద్రగడ ఉద్యమం చేస్తే.. ఆయన కుటుంబాన్ని వందలాది పోలీసులు తన్నుకుంటూ తీసుకెళ్లేలా చేసినప్పుడు ఏం చేశావు? నీ పార్ట్‌నర్‌ను ఎందుకు ప్రశ్నించలేదు?

10 రోజులైనా ప్రజల కోసం ఉన్నావా?

- రాష్ట్రంలో రైతులకు ఎప్పుడు ఏ విపత్తు వచ్చినా వైఎస్ జగన్ ప్రభుత్వం అండగా నిలబడింది. అలాంటి రైతు పక్షపాత ప్రభుత్వాన్ని దూషించటానికే చంద్రబాబు ఆదేశాల మేరకు ఇటీవల పవన్ రాష్ట్రంలో కాలు పెట్టారు. సీఎం వైఎస్ జగన్‌ను విమర్శిస్తూ, చంద్రబాబు భజన చేశారు.
- ఎవరో కొనిచ్చిన వ్యాన్‌కు వారాహి అని పేరు పెట్టి, గతేడాది అక్టోబర్‌లో దుర్గమ్మ గుడి వద్ద పూజలు చేయించి.. దసరా తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తానని చెప్పి.. వాయిదాలు వేస్తూ పోతున్నాడు. ఈ ఏడాది డిసెంబర్‌లో ఎన్నికలు వస్తే.. జూన్ నుంచి తిరుగుతానంటూ షరతులు పెడుతున్నాడు. రాజకీయాల్లో ఇంతటి పనోడు మనకు ఎవ్వరూ దొరకడు. పట్టుమని పదిరోజులు షూటింగ్‌కు వెళ్లకుండా జనం కోసం పవన్ పని చేసింది ఎక్కడ?.

పైగా కాపులు ఓటేయలేదని నిందిస్తావా?

➡ ఎదురుకాళ్ళుల పేరుతో ముద్రగడ పద్మనాభంను చంపేస్తారేమో అని చిరంజీవి, దాసరి నారాయణరావు భయపడి రాజమండ్రి వస్తే వారిద్దరినీ ఎయిర్‌పోర్టులోనే చంద్రబాబు అరెస్టు చేయించి హైదరాబాద్‌లో దింపారు.

కాపులకు న్యాయం చేస్తోంది వైఎస్ జగనే

➡ 2019 ఎన్నికలకు ఏడాది ముందే రిజర్వేషన్ల విషయంలో చంద్రబాబులా కాపులను మోసం చేయలేనని వైఎస్ జగన్ చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు దృష్ట్యా 50 శాతం మించి రిజర్వేషన్లు ఇచ్చే అధికారం ఏ ప్రభుత్వానికి లేదని, తన చేతుల్లో లేనిదాన్ని ఇవ్వలేనన్నారు. కాపుల సంక్షేమం కోసం ఏటా రూ.2,000 కోట్లు చొప్పున ఐదేళ్లు రూ.10వేల కోట్లు వెచ్చిస్తానని జగన్ చెప్పారు.

➡ దమ్మున్న నాయకుడు జగన్ నిజం మాట్లాడారు. అది కాపులకు నచ్చింది. కాబట్టే అత్యధిక మంది కాపులు వైఎస్ జగన్‌ను బలపరిచారు. అధికారంలోకి వచ్చాక చెప్పిన దాని కంటే అధికంగా కాపులకు సీఎం వైఎస్ జగన్ న్యాయం చేస్తున్నారు.

➡ పవన్, చంద్రబాబు కలిసి కాపులను దగా చేశారు. ఇవాళేమో సీఎం జగన్ కాపు రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తున్నారని నిందవేస్తావా పవన్? చంద్రబాబు కోసం అబద్ధాలు మాట్లాడతావా?

ఒక్క రోజైనా కుల ప్రస్తావన లేకుండా మాట్లాడావా?

➡ రాజకీయాల్లో కుల ప్రస్తావన తెచ్చిందే పవన్. కులప్రస్తావన లేకుండా ఒక్క రోజైనా మాట్లాడావా? 'చంద్రబాబుకు, నాకు మధ్య అక్రమ సంబంధాలు లేవు.. చంద్రబాబును తిడితే మానవతా వాదిగా స్పందించా' అని పవన్ అంటున్నారు. టీడీపీ ఆఫీసులో పట్టాభి అనే వ్యక్తి సీఎం జగన్‌ను అమానవీయంగా, పచ్చిగా అనకూడని మాట అంటే.. ఆరోజున పవన్ మానవత్వం చచ్చిపోయిందా?

➡ గతంలో కంటే జనసేనకు ఆదరణ పెరిగిందని.. కృష్ణా నుంచి శ్రీకాకుళం వరకు 25 శాతం, గోదావరి జిల్లాల్లో 35 శాతం.. వెరసి రాష్ట్ర వ్యాప్తంగా 18 శాతం ప్రజల మద్దతు ఉందని ఇటీవల పవన్ చెప్పారు. ఇది బాబు వద్ద బేరానికి మాత్రమే ఉపయోగపడుతుంది.

➡ పవన్.. త్రిముఖ పోటీలో బలి కావాలని ఎవరు చెప్పారు? 2014 నుంచి ఇప్పటి వరకు చంద్రబాబు, పవన్ ఒక్కటే. మేం ఇదే అంశాన్ని చెబుతూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం.

➡ గతంలో పవన్, బీజేపీ, టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తాడేపల్లిగూడెంలో ఒక రథాన్ని తగలబెడితే.. నిందితులను కూడా పట్టుకోలేదు. ఆ కేసు దర్యాప్తును ముందుకు తీసుకువెళ్లని మీ ప్రభుత్వం తరఫున హిందువులకు ఎప్పుడైనా సంజాయిషీ ఇచ్చావా? ఆ రథాన్ని పునర్ నిర్మించటానికి పవన్, బీజేపీ, చంద్రబాబు సాయం చేశారా? ఇవాళ మతాన్ని, కులాన్ని రెచ్చగొట్టి చంద్రబాబుకు మేలు చేద్దామని కుట్ర చేస్తే ప్రజలు చిత్తు చేస్తారు.

➡ పవన్.. నీకు నచ్చడానికి ప్రభుత్వం ఏమైనా సినిమా హీరోయినా? వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలూ అమలు చేస్తామని చంద్రబాబు, పవన్ చెప్పటం సీఎం జగన్ విజయం కాదా? ఇది మంచి ప్రభుత్వమని మీ నోటితో మీరు చెబుతున్నట్టే కదా.

➡ కర్ణాటకలో బీజేపీ ఓడిపోతే.. వైఎస్సార్‌సీపీకి వణుకు ఎందుకు? టీడీపీ, జనసేనతోపాటు బీజేపీని కలుపుకొస్తానని పవన్ అంటున్నారు. కలిసొచ్చినా.. వేర్వేరుగా వచ్చినా 2019 ఎన్నికల తరహాలోనే 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధించడం ఖాయం.

నీ సినిమా మార్కెట్ ఎంత?

- ప్రభుత్వం వల్ల భీమ్లానాయక్ సినిమాకు ఏపీలో రూ.30 కోట్ల నష్టం వచ్చిందని పవన్ కళ్యాణ్ అంటున్నారు. అసలు నీ సినిమా మార్కెట్ ఎంత? నీ సినిమాల్లో ఒక్కటైనా రూ.వంద కోట్లు వసూలు చేసిందా? రూ.100 కోట్ల మార్కెట్టే లేనప్పుడు రూ.30 కోట్ల నష్టం ఎలా వస్తుంది?
- ఎవరి భిక్షతో సినిమాల్లోకి నటుడిగా వచ్చావో.. ఆ పేరు మర్చిపోయి నేను ఒక కానిస్టేబుల్ కొడుకు అని చెప్పుకుంటున్నావు. నేను చిరంజీవి తమ్ముడిని అని చెప్పుకోవటానికి సిగ్గు పడిపోతున్నావా పవన్? 60 ఏళ్ల వయస్సులో చిరంజీవి 'వాల్తేరు వీరయ్య' సినిమా తీశారు. సినిమా బావుంది. బ్రహ్మాండమైన కలెక్షన్లు వచ్చాయి. నీ సినిమా బావుంటే జనాలు చూస్తారు. రీమేక్.. కాపీ కొట్టి.. చీప్‌గా సినిమా చుట్టేస్తే ఎవరు చూస్తారు? నీ సినిమా ఆడకపోతే సీఎం జగన్ ప్రజలకు డబ్బులు ఇచ్చి సినిమాకు పంపాలా?.

23మంది ఎమ్మెల్యేలను కొన్నది నిజం కాదా?

- ఎవరు అబద్ధాలు చెబుతున్నారో, ఎవరు చీటింగ్ చేస్తున్నారో ప్రమాణం చేద్దామా
- ఈ రోజు నుంచి నీ పేరు లోఫర్ లోకేశ్
- ఎమ్మెల్యే 'శిల్పా' ఘాటు వ్యాఖ్యలు



నంద్యాల: 'అధికారంలో ఉన్నప్పుడు 23 మంది వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలను సంతలో పశువుల్లాగా కొనలేదా? ప్రస్తుతం నీ వెంట తిరుగుతున్న శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డిని రూ.18 కోట్లు పెట్టి కొన్నది వాస్తవం కాదా..' అని శ్రీశైలం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి.. నారా లోకేశ్‌ను ప్రశ్నించారు. ఆదివారం నంద్యాలలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ 'శిల్పా చీటింగ్ రాజకీయాలు చేస్తారని చెబుతున్నావు. నా క్యారెక్టర్ ఏమిటో మీ నాయనను అడిగితే చెబుతాడు. నేను చీటింగ్ మనిషిని అయితే టీడీపీలో ఉన్నప్పుడు ఒకసారి జిల్లా అధ్యక్ష పదవి, రెండుసార్లు ఎమ్మెల్సీ పదవి ఎలా ఇచ్చారో చెప్పాలి..' అని డిమాండ్ చేశారు. లోకేశ్‌కు ఈ రోజు నుంచి లోఫర్ లోకేశ్ అని నామకరణం చేస్తున్నానని, రేపటి నుంచి అందరూ అలాగే పిలుస్తారని శిల్పా చెప్పారు. అలాగే, '1983 నుంచి మీ ఆస్తులు ఎలా పెరిగాయి లోఫర్ లోకేశ్. మీరు ఎలా డబ్బు సంపాదించారో ప్రజలకు సమాధానం చెప్పాలి' అని అన్నారు. వెధవల మాటలు నమ్మి తనపై అసత్య ఆరోపణలు చేస్తే నాలుక కోస్తానని లోకేశ్‌ను శిల్పా హెచ్చరించారు. ఎవరు అబద్ధం చెబుతున్నారో.. ఎవరు చీటింగ్, చేస్తున్నారో మహానంది కోనేరులో మునిగి ప్రమాణం చేద్దామా... అని సవాల్ విసిరారు.

భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర నష్టం

- అధికారంలోకి వస్తే ఇసుక ధరలు తగ్గిస్తాం
- టీడీపీ నేత నారా లోకేశ్


దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి నమస్కరిస్తున్న లోకేశ్

కర్నూలు(అర్బన్)/ఆత్మకూరు: ఇసుక, సిమెంట్, స్టీల్ ధరలు పెరిగిపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని టీడీపీ నేత నారా లోకేశ్ అన్నారు. అధికారంలోకి వస్తే వారిని ఆదుకుంటామని చెప్పారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆయన ఆదివారం శ్రీశైలం నియోజకవర్గం చెంచుకాలనీ సమీపంలో భవన నిర్మాణ కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ.. చంద్రబాబు పాలనలో భవన నిర్మాణ కార్మికులకు ప్రతి రోజు ఉపాధి లభించేదన్నారు. టీడీపీ 1996లో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేసిందన్నారు. 1 శాతం సెస్ సేకరించి కార్మికుల సంక్షేమం కోసం ఖర్చు చేశామని చెప్పారు. ప్రస్తుతం ఇసుక ధరలు పెరిగిపోయాయని, ట్రాక్టర్ ఇసుక రూ.5 వేల నుంచి రూ.7 వేల వరకు ఉందని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక ధరలను తగ్గించి.. మెరుగైన విధానాన్ని అమలు చేస్తామన్నారు. కాగా, పాదయాత్ర సమయంలో నల్లకాల్వ సమీపంలోని వైఎస్సార్ స్మృతివనం వద్ద రోడ్డు మీద నుంచే దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి లోకేశ్ రెండు చేతులెత్తి నమస్కరించారు.

ఏపీ జెన్‌కో సరికొత్త రికార్డు

- ఒకేరోజు 5,137 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి
- 105.620 మిలియన్ యూనిట్ల సరఫరా.. రాష్ట్ర చరిత్రలో ఇదే అత్యధికం

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) విద్యుత్ ఉత్పత్తిలో సరికొత్త రికార్డు సృష్టించింది. శనివారం ఒక్క రోజే 5,137 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిని నమోదు చేసింది. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల నుంచి శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకూ సుమారు 114 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయగా.. జెన్‌కో వినియోగానికి పోను 105.620 మిలియన్ యూనిట్లు గ్రిడ్‌కు సరఫరా చేసింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన తర్వాత ఇదే అత్యధిక ఉత్పత్తి కావడం విశేషం.

సీఎం సహకారంతోనే..

ఏపీ జెన్‌కో అత్యధిక విద్యుత్ ఉత్పత్తి చేయడానికి అన్నివిధాలా సహకారం అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఏపీ జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ కేవీఎన్ చక్రధర్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఇంధన శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కేంద్ర రైల్వే, కోల్ మంత్రిత్వ శాఖల అధికారులకు, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ ఆయన ఆదివారం ట్వీట్ చేశారు. రికార్డు స్థాయి ఉత్పత్తి సాధించినందుకు ఏపీ జెన్‌కో ఉద్యోగులను చక్రధర్‌బాబు అభినందించారు. వేసవి తీవ్రత వల్ల పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని గరిష్ట స్థాయిలో ఉత్పత్తి చేసి రాష్ట్ర అవసరాలను తీర్చడానికి మరింత అంకిత భావంతో పని చేయాలని ఉద్యోగులను ఆయన కోరారు.

పొత్తు ప్రకటనలకు ఇదా సమయం?

- కర్ణాటక ఎన్నికలు జరిగి, ఫలితాల కోసం ఎదురుచూసేటప్పుడు ఇలాంటివి ఏంటి?
- ఇందులో బెదిరింపు ధోరణులు ఏమన్నా ఉన్నాయా?
- పవన్‌కళ్యాణ్ పొత్తు ప్రకటనపై బీజేపీ అగ్రనాయకత్వం ఆరా
- పవన్ మాటల సారాంశాన్ని తర్జుమా చేసి ఢిల్లీ పెద్దలకు పంపిన రాష్ట్ర నేతలు

సాక్షి, అమరావతి: కర్ణాటక ఎన్నికల ఫలితాలకు సరిగ్గా ఒకట్రెండు రోజుల ముందు రాష్ట్రంలో టీడీపీ–బీజేపీ–జనసేన పొత్తు పెట్టుకోవడం ఖాయమంటూ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ప్రకటన చేయడంపై బీజేపీ అధిష్టానం తమ రాష్ట్ర పార్టీని నివేదిక కోరినట్లు తెలిసింది. ఇంతకుముందు.. బీజేపీ అగ్రనాయకులు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు పార్టీ రాష్ట్ర నేతలు చేసిన సూచనల ప్రకారం.. రాష్ట్రంలో టీడీపీతో పొత్తుకు బీజేపీ ఏ మాత్రం సుముఖంగా లేదు. ఈ అంశాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల సహ ఇన్‌చార్జి సునీల్ దేవ్‌ధర్ వంటి నేతలు ఈ అంశాన్ని బహిరంగంగానే వివిధ సందర్భాల్లో మీడియా సమక్షంలో కుండబద్దలు కొట్టారు. అయితే, కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలకు సరిగ్గా ఒకరోజు ముందు పవన్ పొత్తు ప్రకటన చేయడం పట్ల బీజేపీ అగ్రనేతల్లో ఆశ్చర్యంతో పాటు ఆగ్రహం వ్యక్తమైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మిత్రపక్షంగా ఉంటూ ఇలాంటి ప్రకటనలు ఏమిటని వారు పార్టీ రాష్ట్ర నేతల నుంచి వివరణ కోరినట్లు సమాచారం.

తమకు ఇష్టమున్నా లేకున్నా టీడీపీతో పొత్తుకు బీజేపీని ఒప్పించేందుకు ఒత్తిడి పెంచడం, లేదంటే బెదిరింపు ధోరణులు వంటి ఉద్దేశాలు ఏమైనా ఇందులో దాగి ఉన్నాయా అని బీజేపీ నేతల్లో జోరుగా చర్చ సాగుతోంది. పొత్తులకు సంబంధించి రాష్ట్రంలో ప్రస్తుతం ఎలాంటి వాతావరణం లేకపోయినా, పవన్ హడావుడిగా రాష్ట్రానికి వచ్చి టీడీపీ–బీజేపీ పొత్తులపై సంకేతాలిచ్చి, ఆ మర్నాడు నేరుగా మూడు పార్టీల పొత్తు ఖాయమంటూ స్వయంగా ప్రకటన చేయడం వెనుక ఆయన ఉద్దేశాలు ఏమై ఉండొచ్చన్న దానిపై బీజేపీ నేతలు లోతుగా అధ్యయనం చేస్తున్నారు. అలాగే, పవన్‌కళ్యాణ్ మాటల సారాంశాలను విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయ బాధ్యులు ఇంగ్లీషు, హిందీలో తర్జుమా చేసి ఢిల్లీలో జాతీయ పార్టీ కార్యాలయానికి చేరవేసినట్లు రాష్ట్ర పార్టీ నాయకులు వెల్లడించారు.

మూడు పార్టీల పొత్తుపై చర్చలే జరగలేదు

- పవన్ వ్యాఖ్యలను అధిష్టానం దృష్టికి తీసుకెళ్లాం
- బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు



సాక్షి, విశాఖపట్నం: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తాయని ఇటీవల పవన్ కళ్యాణ్ చేసిన ప్రకటన ఆయన వ్యక్తిగత అభిప్రాయమని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. పొత్తులపై ఆ స్థాయిలో అసలు చర్చలే జరగలేదని ఆయన స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ వ్యతిరేక ఓటు చీలకూడదన్న ఉద్దేశంతో పవన్ ఈ కొత్త ప్రతిపాదన చేసి ఉండొచ్చన్నారు. ఆదివారం జీవీఎల్ విశాఖపట్నంలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'పవన్ చేసిన వ్యాఖ్యలు స్వతహాగా మా అధిష్టానం దృష్టికి వస్తాయి. మా వంతు బాధ్యతగానూ ఆయన వ్యాఖ్యల గురించి తెలియజేశాం. పొత్తులపై అంతిమ నిర్ణయం అధిష్టానానిదే. స్థానికంగా ఏ నిర్ణయం ఉండదు. ఇప్పటికీ జనసేనతోనే పొత్తులో ఉన్నాం. వచ్చే ఎన్నికల్లోనూ కలిసే వెళ్తాం' అని జీవీఎల్ వెల్లడించారు. కర్ణాటకలో పార్టీ ఓటమిపై అంతర్గతంగా విశ్లేషణ చేసుకుంటున్నామని తెలిపారు. కర్ణాటక అసెంబ్లీ ఫలితాల ప్రభావం వచ్చే లోక్‌సభ ఎన్నికలపై ఉండబోదన్నారు. ఒక రాష్ట్ర ఎన్నికలు మరో రాష్ట్ర ఎన్నికలను ప్రభావితం చేయవని అభిప్రాయపడ్డారు. కర్ణాటకలో తమ పార్టీకి ద్వారాలు మూసుకుపోయినా తెలంగాణలో తెరుచుకుంటాయని విశ్వాసం వ్యక్తంచేశారు. ఆంధ్రప్రదేశ్‌లో అరాచక ప్రభుత్వం నడుస్తోందని.. రాష్ట్ర ప్రభుత్వంపై ఈ నెల 19న చార్జిషీటు దాఖలు చేస్తామన్నారు.

పొత్తులపై నిర్ణయం తీసుకోలేదు

- పవన్ వ్యాఖ్యలు ఆయన సొంత అభిప్రాయం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు



హనుమాన్ జంక్షన్ రూరల్: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ, జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తాయని పవన్ కళ్యాణ్ చేసిన ప్రకటన కేవలం ఆయన సొంత అభిప్రాయం మాత్రమేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు తెలిపారు. కృష్ణా జిల్లా బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌లో ఆదివారం జరిగిన హనుమజ్జయంతి వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన సోము వీర్రాజు మూడు పార్టీల మధ్య పొత్తులపై ఇంకా బీజేపీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తేల్చిచెప్పారు. పొత్తులపై పార్టీ అధిష్టానం నిర్ణయమే తమకు శిరోధార్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఓటు బ్యాంకు క్రమంగా పుంజుకుంటోందన్నారు. 1999 సార్వత్రిక ఎన్నికల నాటికి రాష్ట్రంలో బీజేపీకి కేవలం ఒక శాతం ఓట్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఇప్పుడు ఓటు బ్యాంక్ 16 శాతానికి పెరిగిందని చెప్పారు. 2021 తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికలో బీజేపీ అభ్యర్థికి ఐదు శాతం ఓట్లు వచ్చాయని తెలిపారు. ఆ తర్వాత బద్వేలు అసెంబ్లీ ఉప ఎన్నిక, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ 16 శాతం ఓట్లు సాధించిందని గుర్తు చేశారు.

జీవితాన కరెంట్ వెలుగులు

అనగనగా ఓ ఎలక్ట్రికల్ దుకాణం. అక్కడ జేబులో టెస్టర్, చేతిలో కటింగ్ ప్లేయర్, స్క్రూ డ్రైవర్తో కొందరుంటారు. ఎవరైనా వచ్చి తమ ఇల్లు లేదా షాపు ఇతర చోట్ల పని ఉందని పిలిస్తే వెళ్లడం.. రిపేర్లు చేసి డబ్బు సంపాదించడం. దశాబ్దం క్రితం వరకు కరెంట్ పని చేసేవాళ్లు ఇలాగే ఉండేవారు. కాలం మారింది. ఈ వృత్తిలో అనేక మార్పులొచ్చాయి. ఇప్పుడు ఎలక్ట్రికల్ దుకాణాల వద్ద కరెంటోళ్లు ఉండడం తగ్గిపోయింది.

మారిన పని పద్ధతులు.. ఒకప్పుడు స్విచ్ పాయింట్, నేడు అంకణం లెక్కన

రిపేర్లు చేసేవారికి డిమాండ్.. సేఫ్టీ పరికరాలంటే తెలియదు.. అయినా ధైర్యంగా పనిలోకి


స్టోన్‌హౌస్‌పేటలోని ఎలక్ట్రికల్ దుకాణంలో ఉన్న కరెంట్ పనోళ్లు

సాక్షి, నెల్లూరు డెస్క్: 'ఆ వైరు అక్కడి వరకు లాగు.. ఈ స్విచ్‌కి లైట్ కనెక్షన్ ఇవ్వు. ఇక్కడ ఇంకో ట్యూబ్లైట్ వేస్తే బాగుంటుంది. ఏసీ కోసం ఎంసీబీ ఉంటే బెటర్. ఎర్త్ లేకపోతే చాలా ఇబ్బంది. హాల్లో ఫ్యాన్ పాయింట్లు రెండు పెడదాం..' కరెంట్ పనిచేసే వారు నిత్యం చెప్పే మాటలివి. నేడు విద్యుత్ వినియోగించని వారు ఉండరు. ఎలక్ట్రీషియన్లకు మార్కెట్లో చాలా డిమాండ్ ఉంది. వైరింగ్, స్విచ్ బోర్డులు, లైటింగ్ అంటూ ఈ వృత్తిలో టెక్నాలజీ పరంగా చాలా లెక్కలుంటాయి. అయితే ఇదంతా చేసేది సాధారణ వ్యక్తులే. ఈ పనిచేసే వారిలో చాలామంది పెద్దగా చదువుకుని ఉండరు. కుటుంబ పరిస్థితుల దృష్ట్యా కరెంట్ పని నేర్చుకుని పొట్ట పోసుకుంటున్న వారే అధికం. సీనియర్ల అంచనా ప్రకారం నెల్లూరు నగరంలోనే 300 మంది పైనే ఎలక్ట్రీషియన్లు ఉన్నారు. జిల్లాలో రెండువేలకు పైగా ఉండొచ్చు.

ఒకప్పుడిలా..

పని పద్ధతులు చాలావరకు మారిపోయాయి. గతంలో ఎలక్ట్రికల్ దుకాణాల వద్ద కరెంట్ పనోళ్లు ఉండేవారు. ఈ సంప్రదాయం నెల్లూరులోని స్టోన్‌హౌస్‌పేట నుంచి మొదలైందని చెబుతుంటారు. ఈ ప్రాంతంలో అప్పట్లో పదుల సంఖ్యలో ఉండి పని దొరికితే వెళ్లి చేసేవారు. నేడు ఫోన్ల వినియోగం పెరిగింది. ఎలక్ట్రీషియన్లు ఇళ్లు లేదా వ్యాపార సంస్థల వారికి ఫోన్ నంబర్ ఇస్తున్నారు. వారు పిలిచినప్పుడు వెళ్లి పని చేస్తున్నారు. దుకాణాల వద్ద ఎదురుచూసే పరిస్థితులు ఇప్పుడు తగ్గిపోయాయి. కొందరు విజిటింగ్ కార్డులు కొట్టించి ఇస్తున్నారు.

కూలి ఇలా..

గృహాలు, వ్యాపార సముదాయాలైతే గతంలో స్విచ్ పాయింట్ లెక్కన నగదు తీసుకునేవారు. ఒక్కో పాయింట్‌కు రూ.20 నుంచి రూ.30 వరకు ఉండేది. నేడు అంకణం లెక్కన తీసుకుంటున్నారు. ఒక్కో అంకణానికి రూ.1,500 నుంచి రూ.3,000 వరకు ఉంది. కూలికి వచ్చేవారికి రోజుకు రూ.800 నుంచి రూ.900 వరకు ఇస్తున్నారు. అదే మేస్త్రీ అయితే రూ.1,000కి అటు ఇటుగా తీసుకుంటున్నారు. రిపేర్లయితే పనిని బట్టి వసూలు చేస్తున్నారు. మెటీరియల్ కాంట్రాక్ట్ చేసేవారు కొందరున్నారు. అలాగే పెద్ద తాపీ మేస్త్రీలు, బిల్డర్లు, ఇంజినీర్ల వద్ద ఉంటూ పనులు చేసే ఎలక్ట్రీషియన్లు నేడు అధికం. దీని వల్ల ఉపాధికి భరోసా ఉంటుంది.

చాలా ధైర్యంగా..

విద్యుత్ వల్ల ప్రమాదమని తెలిసినా ఎలక్ట్రీషియన్లు చాలా ధైర్యంతో పనులు చేస్తుంటారు. వర్షాకాలంలో సమస్యలు ఎదురవుతాయని తెలిసినా లెక్క చేయరు. నిచ్చెనలు, ఎత్తైన స్టూళ్లు ఎక్కేసి పని చేస్తుంటారు. సేఫ్టీ పరికరాలు దాదాపుగా ఎవరూ వాడరు. గ్లౌజులు, కళ్లద్దాలు, హార్డ్ హ్యాట్, బూట్లు వేసుకుని పనిచేసే వారు ఈ ప్రాంతంలో ఎవరూ లేరు. చాలామందికి బీమా కూడా లేదు.

మరికొన్ని..

- ప్రస్తుతం చాలా పనుల్లో ఇతర రాష్ట్రాల వారు అధికంగా ఉంటున్నారు. మార్బుల్స్ వేయడం, సీలింగ్ తదితరాల్లో ఏ ఊరిలో అయినా వారి హవానే ఎక్కువ. కానీ కరెంట్ పనిలో ఆ పరిస్థితి లేదు. స్థానికంగా ఉన్న వారే చేస్తున్నారు.
- కొందరు కరెంట్ పనితోపాటు ప్లంబింగ్ కూడా చేస్తుంటారు. వీరి సంపాదన బాగుంటుంది. అయితే ప్లంబింగ్ చేస్తూ ఎలక్ట్రికల్ పనులు చేసేవారు ఉండరు.
- ఎలక్ట్రీషియన్లను ప్రసన్నం చేసుకునేందుకు ఎలక్ట్రికల్ ఉత్పత్తులు విక్రయించే సంస్థలు సమావేశాలు పెడుతుంటాయి.
- నెల్లూరులో ఎలక్ట్రీషియన్లకు యూనియన్ ఉంది. అయితే కాలక్రమేణా అది కనుమరుగైంది.

చాలా మారింది



పని విధానం చాలా మారిపోయింది. ఒకప్పుడు మా ప్రాంతంలో సుమారు వంద మంది వరకు ఎలక్ట్రీషియన్లు ఉండేవారు. రిపేర్ అంటే వెంటనే వెళ్లేవారు. నేడు పదిమంది కూడా లేరు. ఫోన్లు వచ్చాక సిస్టమ్ మారింది. కరెంట్ పనోళ్లు కావాలంటూ ఎవరైనా మా దగ్గరకు వస్తే వెతుక్కునే పరిస్థితి ఉంది. ఫోన్ నంబర్ ఇచ్చి మీరే మాట్లాడుకోమని చెబుతున్నాం. చాలామంది కాంట్రాక్టర్ల వద్ద ఉంటున్నారు. నెల్లూరులోని ఎలక్ట్రికల్ షాపులు సుమారు వంద వరకు ఉంటాయి. అన్ని చోట్ల ఇలాగే ఉంది.

– గాదంశెట్టి ప్రకాశరావు, ఫ్యాన్సీ ఎలక్ట్రికల్స్, నెల్లూరు

32 ఏళ్ల నుంచి చేస్తున్నా



నేను 32 సంవత్సరాల నుంచి కరెంట్ పనిచేస్తున్నా. రిపేర్లు చేస్తా. కొత్త ఇళ్లకు వైరింగ్ చేస్తా. మూడు దశాబ్దాల్లో చాలా మార్పులు చూశా. మార్కెట్లోకి కొత్త వస్తువులు వస్తుంటాయి. వాటి గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుండాలి. లేకపోతే వెనుకబడిపోతాం. – కంచి రవి, ఎలక్ట్రీషియన్, స్టోన్‌హౌస్‌పేట



ప్రజా వ్యవహారాలను పట్టించుకోనందువల్ల మంచివాళ్లు చెల్లించాల్సిన మూల్యం ఏమిటంటే, చెడ్డవాళ్ల పాలనలో ఉండాల్సి రావడం!

– ప్లేటో

సాక్షి

సోమవారం, 15 మే 2023

జయాపజయాలు

మానవ జీవితం ద్వంద్వాలమయం. కష్టసుఖాలు, కలిమిలేములు, జయాపజయాలు జీవన గమనంలో సహజ పరిణామాలు. జయాపజయాల గురించి మన సమాజంలో పట్టింపు మోతాదు కంటే ఎక్కువే! విజేతలకు వీరపూజలు చేయడం, పరాజితులను విస్మృతిలోకి తోసిపారేయడం సర్వ సాధారణం. అయితే, జయాపజయాలు దైవాధీనాలని ఆధ్యాత్మికవాదుల విశ్వాసం. ఎవరెన్ని సూక్తులు చెప్పినా, ఎవరూ గెలుపు కోసం ప్రయత్నాలను మానుకోరు. ఎట్టి పరిస్థితుల్లోనూ తమకు గెలుపు దక్కాలనుకునే పట్టుదలతో పగ్గాలు విడిచిన గుర్రాల్లా దూసుకుపోయేవారు కొందరు ఉంటారు. గెలుపు కోసం ఎలాంటి అడ్డదారులు తొక్కడానికైనా, ఎంతటి నీచానికి దిగజారడానికైనా తెగబడేవారు ఇంకొందరు ఉంటారు.

శక్తికి మించిన విజిగీషతో రగిలిపోయేవారు చరిత్రను రక్తసిక్తం చేస్తారు. అడ్డదారుల్లో పడి అడ్డదిడ్డంగా పరుగులు తీసి, అడ్డు వచ్చినవాళ్లను నిర్దాక్షిణ్యంగా తొక్కిపడేసి అందలాలెక్కుతారు. విజయోన్మత్తతను తలకెక్కించుకుని విర్రవీగుతారు. కాలం ఎప్పుడూ ఒక్కలాగానే ఉండదు. మార్పు దాని సహజ స్వభావం. కాలం మారి, పరిస్థితులు వికటించినప్పుడు విజేతలమనుకుని అంతవరకు విర్రవీగిన వారు పెనుతుపాను తాకిడికి కుప్పకూలిన తాటిచెట్లలా నేలకూలిపోతారు. మన పురాణాల్లో దుర్యోధనుడు, మన సమీప చరిత్రలో హిట్లర్ వంటి వారు అలాంటి శాల్తీలే!

'అజ్ఞానపు టంధయుగంలో/ తెలియని ఏ తీవ్రశక్తులో/ నడిపిస్తే నడిచి మనుష్యులు/ అంతా తమ ప్రయోజకత్వం/ తామే భువి కధినాథులమని/ స్థాపించిన సామ్రాజ్యాలూ/ నిర్మించిన కృత్రిమ చట్టాల్/ ఇతరేతర శక్తులు లేస్తే/ పడిపోయెను పేకమేడలై' అన్నాడు మహాకవి శ్రీశ్రీ. అజ్ఞానపుటంధ యుగంలోనే కాదు, వర్తమాన అత్యాధునిక యుగంలోనూ పరిస్థితుల్లో పెద్ద మార్పు కనిపించడం లేదు. మొరటు బలం, మూర్ఖత్వం, మోసం, కుట్రలతో సాధించిన అడ్డగోలు విజయాలను తలకెక్కించుకుని, అదంతా తమ ప్రయోజకత్వంగా తలచి విర్రవీగే విజయోన్మత్తులలో దేశాధినేతల మొదలుకొని చిల్లరమల్లర మనుషుల వరకు నేటికీ ఉన్నారు. ఇలాంటి వాళ్లలోనే దుర్యోధనుడికి గుడి కట్టి పూజించేవాళ్లు, హిట్లర్‌ను ఆరాధించే వాళ్లు, లేని సుగుణాలను కీర్తిస్తూ నిరంకుశులకు బాకాలూదే వాళ్లు కనిపిస్తారు. గోబెల్స్‌కు బాబుల్లాంటి దుష్ప్రచార నిపుణులు నిర్విరామంగా ఊదరగొడుతూ, జీవితానికి గెలుపే పరమార్థమనే భావనకు ఆజ్యం పోస్తున్నారు. వీళ్ల ప్రభావం కారణంగానే ఓటమిని జీర్ణించుకోలేని తరం తయారవుతోంది.

మనుషుల స్థితిగతులను గెలుపు ఓటములతోనే అంచనా వేయడం మన సమాజానికి అలవాటైపోయింది. గెలవాలనే ఒత్తిడి ఒకవైపు, ఓటమి భయం మరోవైపు బతుకుల్లో ప్రశాంతతను ఆవిరి చేస్తున్నాయి. పరీక్షలను ఎదుర్కొనే విద్యార్థుల నుంచి ఎన్నికలను ఎదుర్కొనే రాజకీయ నాయకుల వరకు ప్రతి ఒక్కరికీ ఈ ఒత్తిడి తప్పడం లేదు. గెలుపు ఒత్తిడి కొందరిని మానసికంగా కుంగదీస్తుంది. ఇంకొందరిని అడ్డదారులు తొక్కిస్తుంది. సమాజంలో ప్రబలుతున్న ఈ ధోరణిని సొమ్ముచేసుకోవడానికి కొందరు మేధావి రచయితలు విజయ సోపానమార్గాలను పుస్తకాలుగా అచ్చోసి జనాల మీదకు వదులుతారు. నానావిధ ప్రసార, సామాజిక మాధ్యమాల్లో వ్యక్తిత్వ వికాస ప్రవచనాలతో ఊదరగొడతారు.

'విజయానికి కావలసినది పదిశాతం ప్రేరణ, తొంభైశాతం కఠోర శ్రమ' అన్నాడు థామస్ ఆల్వా ఎడిసన్. విద్యుత్తు బల్బును కనుక్కొనే ప్రయత్నంలో ఆయన వెయ్యి వైఫల్యాలను చవిచూశాడు. 'విద్యుత్ బల్బును కనుక్కోవడంలో వెయ్యిసార్లు విఫలమై, ఇప్పుడు సాధించారు కదా! ఇప్పుడు మీకేమనిపిస్తోంది?' అని ఒక పాత్రికేయుడు ఆయనను ప్రశ్నించాడు. 'వెయ్యిసార్లు నేను విఫలమవలేదు. వెయ్యి అంచెల తర్వాత విద్యుత్ దీపాన్ని కనుక్కోగలిగాను' అని బదులిచ్చాడాయన. వైఫల్యాలే విజయానికి సోపానాలని గ్రహించడానికి ఎడిసన్ అనుభవమే మంచి ఉదాహరణ. గెలుపు కోసం ప్రయత్నించే వాళ్లు ఓటమికి కూడా మానసిక సంసిద్ధతతో ఉండాలి. ఓటమి ఎదురైనప్పుడు రెట్టించిన పట్టుదలతో పునఃప్రయత్నం చేయడానికి తగిన శక్తియుక్తులను సమకూర్చుకోవడానికి తగిన ఓరిమితో ఉండాలి. ఈ రెండూ లోపించడం వల్లనే పరీక్షల్లో వైఫల్యం ఎదురైనప్పుడు అర్ధంతరంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్న వారెందరో!

స్వేచ్ఛగా జీవితాన్ని జీవించడమే ఒక సాఫల్యం. ఈ ఎరుక లేకనే చాలామంది జీవితాలను వ్యర్థం చేసుకుంటారు. చిల్లర గెలుపుల కోసం, పదవుల కోసం, పదవులను పదిలపరచుకోవడం కోసం అధికార బలసంపన్నుల ముందు సాగిలబడతారు. 'వాని జన్మంబు సఫల మెవ్వాడు పీల్చు/ ప్రాణవాయువు స్వాతంత్ర్య భరభరితమొ/ పరుల మోచేతి గంజికై ప్రాకులాడు/ వాని కంటెను మృతుడను వాడెవండు?' అన్నాడో చాటు కవి. 'విజయమే అంతిమం కాదు. వైఫల్యమేమీ ప్రాణాంతకం కాదు' అని తేల్చేశాడు బ్రిటన్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్. కాబట్టి వైఫల్యం ఎదురైనంత మాత్రాన ముంచుకొచ్చే ముప్పేమీ ఉండదు. విజయం సాధించినంత మాత్రాన అమాంతంగా ఒరిగిపడే ఆకాశమూ ఉండదు. 'వైఫల్యాల నుంచి ఏమీ నేర్చుకోకపోవడమే మన అసలు పొరపాటు' అంటాడు అమెరికన్ పారిశ్రామికవేత్త హెన్రీ ఫోర్డ్. వైఫల్యాలే మనకు గుణపాఠాలు నేర్పే గురువులు. గురువులను గౌరవించడం మన సంప్రదాయం. వైఫల్యాలను గౌరవించడం, విజయాలను వినయంగా శిరసావహించడమే మన కర్తవ్యం!

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: బ.ఏకాదశి రా.1.32 వరకు
తదుపరి ద్వాదశి, నక్షత్రం: పూర్వాభాద్ర ఉ.9.57 వరకు
తదుపరి ఉత్తరాభాద్ర, వర్జ్యం: రా.7.05 నుండి 8.36 వరకు,
దుర్ముహూర్తం: ప.12.22 నుండి 1.11 వరకు
తిరిగి ప.2.55 నుండి 3.44 వరకు, సర్వ ఏకాదశి.

సూర్యోదయం : 5.48
సూర్యాస్తమయం: 6.36
రాహుకాలం : ఉ.7.30 నుండి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుండి 12.00 వరకు



పేదలకు ఇంకెన్నాళ్లీ ఇంటిపోరు?

'మేం ఉండే చోట పేదలుండటానికి వీల్లేదు!. వాళ్లకు ఇక్కడ స్థలాలిస్తే 'సామాజిక తూకం' దెబ్బతింటుంది'' అంటూ న్యాయస్థానాలకు వెళ్లి ఓడిపోయిన వారికి ఇంకా కొమ్ముకాస్తున్నారు చంద్రబాబు నాయుడు!

కోర్టు తీర్పును అమలు చేయొద్దంటూ ఆందోళనలు చేసి... శాంతిభద్రతల సమస్యలు సృష్టించబోయిన వారిని పోరాట యోధులుగా పతాక శీర్షికలకెక్కిస్తున్నారు బాబు రాజకీయ గురువు రామోజీరావు!!.

పేదలకు వ్యతిరేకంగా న్యాయస్థానాల్లో కోట్ల రూపాయలు ఖర్చు చేసి... ఓడిపోయాక కూడా వారి సొంతింటి కలను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారంటే ఏమనుకోవాలి వీళ్లని? చేతిలో నాలుగు టీవీ ఛానెళ్లు, మూడు పత్రికలు ఉన్నాయి కదా అని ఎంతకైనా తెగిస్తారా? తమకు ఏమనిపిస్తే అది రాస్తూ... యావత్తు రాష్ట్రాన్ని తప్పుదోవ పట్టిస్తూనే ఉంటారా? ముసుగులేసుకుని మద్దతిచ్చే పార్టీలు, నాయకులు ఉన్నారు కదా అని ఎలాంటి ప్రచారమైనా చేస్తారా?

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకూడదన్నది చంద్రబాబు నాయుడి విధానం. అందుకే... ఎక్కడికక్కడ ఆయా స్థలాలు కేటాయించవద్దంటూ కోర్టుల్లో కేసులు వేయించారు. చివరికి ఇళ్ల స్థలాలన్నీ మహిళల పేరిట ఇవ్వటం కూడా తప్పని న్యాయ పోరాటం చేశాడు. అలా చేసి... తనకు అనుకూలంగా తీర్పు రప్పించుకుని... కొన్నాళ్ల పాటు పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపులను, నిర్మాణాలను ఆపగలిగారు కూడా!. చివరకు అవ్వాతాతల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేస్తున్న వలంటీర్ల వ్యవస్థపై కూడా విషం చిమ్మారు.

పేదలు ఇంగ్లిష్ మీడియంలో చదవటాన్ని కూడా వ్యతిరేకించారు చంద్రబాబు. దీన్ని వ్యతిరేకిస్తూ కోట్లాది రూపాయలు ఖర్చుచేసి కార్పొరేట్ మాఫియా తరపున సుప్రీంకోర్టు వరకూ పోరాటం సాగించారు. చివరికి ఓడిపోయినా... కొన్నాళ్లపాటు మాత్రం ఆపగలిగారు.

రాష్ట్ర ప్రభుత్వం తెగ అప్పులు చేస్తోందని పదేపదే తన అనుకూల మీడియాతో దుష్ప్రచారం చేయిస్తూనే... రాష్ట్ర ప్రభుత్వం నిధుల సమీకరణకు చేసిన ప్రతి ప్రయత్నానికీ అడ్డు తగిలారు చంద్రబాబు. విశాఖపట్నంలో ప్రభుత్వ భూముల వేలం నుంచి మొదలుపెడితే ప్రతిచోటా న్యాయపరమైన అడ్డంకులే!. న్యాయ ప్రక్రియపై తనకున్న 'పట్టు'తో చాలా కేసుల్లో అనుకూల తీర్పులూ రాబట్టుకోగలిగారు!.

దేశవ్యాప్తంగా మూడు బల్క్‌డ్రగ్ పార్కులకు కేంద్రం అనుమతివ్వగా... తెలంగాణ సహా అందరితోనూ పోటీ పడి మరీ... ఒకదాన్ని రాష్ట్రం దక్కించుకుంది. కానీ ఈ పార్కు రాష్ట్రానికి కేటాయించవద్దంటూ తెలుగుదేశం నేత యనమల రామకృష్ణుడి చేత నేరుగా కేంద్రానికే లేఖ రాయించారు చంద్రబాబు!!. ఇక్కడేమో రాష్ట్రానికి ప్రాజెక్టులు రావటం లేదని తన మీడియాతో ప్రచారం చేయిస్తూనే ఉన్నారు!!.

మూలపేట పోర్టు (గతంలో భావనపాడు) నుంచి భోగాపురం ఎయిర్‌పోర్టు వరకూ ప్రతి ప్రాజెక్టు విషయంలోనూ ఎవరో ఒకరితో భూములకు సంబంధించో, పర్యావరణానికి సంబంధించో కేసులు వేయిస్తూనే వచ్చారు చంద్రబాబు. ఆయన లక్ష్యమల్లా ఒక్కటే. ఈ ప్రభుత్వ హయాంలో ఏ పనీ కాకూడదు. రాష్ట్రానికి గానీ, రాష్ట్ర ప్రజలకు గానీ మంచి జరక్కూడదు.

అంతెందుకు!!. పరిపాలన వికేంద్రీకరణ విషయంలోనూ అదే కథ!. అమరావతిలోనే అన్నీ ఉండాలి తప్ప... వేరెక్కడా ఎలాంటి అభివృద్ధీ జరగకూడదనే దారుణమైన కుతంత్రంతో... రైతుల పేరిట అమరావతిలో ఉద్యమాలు, యాత్రలు, న్యాయపోరాటాలు... ఒకటా రెండా!!. చివరకు రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్లు కేటాయిస్తే సామాజిక తూకం దెబ్బతింటుందంటూ కోర్టులకెక్కారు చంద్రబాబు మనుషులు. అసలు అన్ని వర్గాల ప్రజలూ ఉంటేనే కదా రాజధాని? కొందరికే పరిమితమైతే అదో గేటెడ్ కమ్యూనిటీ అవుతుంది తప్ప రాష్ట్ర రాజధాని ఎలా అవుతుంది?

వాస్తవానికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుకు కోట్లు ఇస్తూ దొరికిపోయి... ఏపీలో అందరినీ డైవర్ట్ చెయ్యడానికి చంద్రబాబు ఆరంభించిన మహా రియల్ ఎస్టేట్ వెంచర్ అది!. బలహీన సామాజికవర్గాలు, ఆర్థికంగా వెనుకబడ్డవారు ప్రవేశించడానికి వీల్లేని ఓ గేటెడ్ కమ్యూనిటీ ప్రాజెక్టులా దాన్ని తీర్చిదిద్దాలనుకున్నారు బాబు. పేద సామాజిక వర్గాలు, కులాల వారు అక్కడకు పనివాళ్లుగా ఉదయం వచ్చి, సాయంత్రం వెళ్లిపోవాలే తప్ప, హక్కుదారులుగా, వాటాదారులుగా నివాసం ఉండే అవకాశం వాళ్లకి ఇవ్వకూడదనుకున్నారు.

ఏది నిజం?

కానీ ఇక్కడే 50వేల మందికి ఇళ్ల స్థలాలు, వాటిలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్న డిజైన్‌తో చంద్రబాబు కట్టాలని భావించిన సామాజిక కోటను బద్దలుకొట్టేశారు ముఖ్యమంత్రి జగన్. దాన్ని అందరి రాజధానిగా మార్చాలని భావించారు. కోర్టు ద్వారా చంద్రబాబు కొన్నాళ్లు అడ్డుకున్నా... అంతిమంగా న్యాయమే గెలిచింది. రాజధాని అందరిదీ అని న్యాయస్థానం చెప్పకనే చెప్పింది. అక్కడితో ఆగిపోవాల్సి ఉన్నా... చంద్రబాబు ఆగటం లేదు. తన అనుకూల వర్గాల చేత అక్కడ ధర్నాలు, ఆందోళనలు చేయిస్తూ శాంతిభద్రతల సమస్యలు సృష్టించాలని ప్రయత్నిస్తున్నారు. పోలీసులు అడ్డుకుంటే... తన అనుకూల మీడియాతో దుర్మార్గపు వార్తలు రాయిస్తున్నారు. అయినా పేదలకు ఇళ్లు వద్దంటూ ఆందోళనలు చేసేవారిని పతాక శీర్షికల్లోకి ఎక్కించి మరీ రెచ్చగొడుతున్న 'ఈనాడు' పత్రికను ఏమనుకోవాలి? రామోజీరావుకు అసలు బుద్ధుందా? పేదలకు భూములివ్వాలని గతంలో పోరాటాలు చేసిన పార్టీలు కూడా ఇపుడు చంద్రబాబు నాయుడితో చేతులు కలిపి, పేదలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నాయంటే... వీళ్లందరికీ పిచ్చి ఏ స్థాయిలో ముదిరిపోయిందో అర్థం కావటం లేదా?

అసలైన వికేంద్రీకరణ అంటే ఇదీ...

తాను నిర్మించే రాజధానిలో పేదలకు నివసించే హక్కు లేకుండా చేశారు చంద్రబాబు. కానీ పాలనను, అభివృద్ధిని వికేంద్రీకరిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రం... అమరావతితో పాటు అటు విశాఖలోను, ఇటు కర్నూలులో కూడా భారీ ఎత్తున పేదలకు ఇళ్ల స్థలాలిచ్చారు. విశాఖ, కర్నూలుల్లో ఇళ్ల నిర్మాణాలు కూడా చాలావరకూ వివిధ దశల్లో ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేద వర్గాలకు ఆలయ బోర్డులు, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీల్లో... మొత్తంగా రాజకీయ నియామకాల్లో యాభై శాతం వాటా ఇచ్చిన తొలి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని... రాజధాని ప్రాంతాన్ని తన వర్గీయుల గేటెడ్ కమ్యూనిటీగా మార్చేయాలనుకున్న చంద్రబాబుతో పోల్చగలమా? అసలు రాష్ట్రంలో ఒకేసారి 30 లక్షల మందికి ఇళ్ల పట్టాలివ్వటం ... వారికి ఇళ్లు నిర్మించుకోవటంలో సహకరించటం చేస్తున్న ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడైనా చూశామా? స్వాతంత్ర్యంవచ్చి 75 ఏళ్లగడిచినా.. పేదలకు ఇళ్లు లేని పరిస్థితి ఉందంటే సిగ్గు పడాల్సిన అవసరం లేదా? అలాంటి పరిస్థితిని చక్కదిద్దడానికి పాటుపడుతున్న ప్రభుత్వానికి సహకరించాల్సింది పోయి అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్న పార్టీని ఏమనాలి? మీడియా ముసుగులో ఆ పార్టీకి కొమ్ము కాస్తూ... పేదల సొంతింటి కలకు అడ్డుపడుతున్న రామోజీరావును, ఆయన తోక మీడియాను ఏమనాలి? ఫిలిం సిటీ పేరిట కోటల్లాంటి సౌధాలు కట్టుకుని కూడా పేదల ఇళ్లకు అడ్డుపడుతున్న ఈ దుష్ట చతుష్టయాన్ని ఏం చేయాలి? రాజధాని ప్రాంతంలో పేదలకు స్థలాలిస్తే ముంబైలోని ధారవి లాంటి మురికివాడలు తయారవుతాయని వాదించటం దుర్మార్గం కాదా? పేదలకు అమరావతిలో ఇళ్ల స్థలాలిస్తే డెమొగ్రఫిక్ ఇన్‌బ్యాలెన్స్ వస్తుందని వాదించటం ఒకరకమైన అంటరానితనం కాదా? కులవివక్షకు పరాకాష్ట కాదా? ఎన్ని మొట్టికాయలు పడినా ఇంకా వారు ఢిల్లీ స్థాయిలో పోరాటం చేస్తున్నారంటే... ఇంత కన్నా దారుణం ఏముంది?



అసలెందుకు ఈ ఆర్5 జోన్?

చంద్రబాబు ఏర్పాటు చేసిన రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (సీఆర్‌డీఏ)లో పేదలు ఉండే అవకాశం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు చంద్రబాబు. వాస్తవానికి పూలింగ్ నిమిత్తం సేకరించిన భూమిలో 5 శాతాన్ని పేదలకు ఇవ్వాలని సీఆర్‌డీఏ చట్టం స్పష్టంగా చెబుతున్నా... చంద్రబాబు దాన్ని పట్టించుకోలేదు. పైపెచ్చు దీనికి గండికొట్టడానికి... సీఆర్‌డీఏ పరిధిలో ఏ ప్లాటుకైనా కనీసం 120 చదరపు గజాలు తప్పనిసరి అని, ఆ మాత్రం లేకుంటే ఎలాంటి నిర్మాణాలకూ ప్రభుత్వం అనుమతివ్వకూడదనే నిబంధనను తెచ్చారు.

అయితే రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలిచ్చి, ఇళ్లు నిర్మిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం... గుంటూరు, ఎన్టీయార్ జిల్లాల్లోని పేదలకు సైతం ఇళ్ల స్థలాలివ్వాలని సంకల్పించి... ఈ 120 గజాల నిబంధనను సవరించింది. దీనికోసం సదరు నిబంధన వర్తించని విధంగా ఆర్-5 జోన్‌ను ఏర్పాటు చేసి.. దానికి అనుగుణంగా సీఆర్‌డీఏ పరిధిలో 1402.58 ఎకరాలు కేటాయించి 50,004 మందికి ఇంటి స్థలాలిచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. న్యాయపోరాటాల వల్ల ప్రక్రియ ఆగిపోగా... తాజాగా అడ్డంకులన్నీ తొలగటంతో... పట్టాలిచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. దీన్ని కూడా అడ్డుకునేందుకు మళ్లీ రైతుల ముసుగులో ఆందోళన మొదలుపెట్టించారు చంద్రబాబు. అక్కడితో ఆగలేదు కూడా. గతంలో వారికి స్థలాలివ్వవద్దని చెప్పిన వీరంతా.... ఇపుడు వీళ్లకు వేరేచోట ఇవ్వండంటూ మళ్లీ న్యాయస్థానాలకు వెళ్లే దుస్సాహసానికి దిగుతున్నారంటే చంద్రబాబు కుయుక్తులు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

క్రమం తప్పకుండా కౌలు చెల్లిస్తున్నా...



అమరావతికి భూములిచ్చిన రైతులకు ప్రభుత్వం క్రమం తప్పకుండా కౌలు చెల్లిస్తున్నా తెలుగుదేశం మాత్రం అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తోంది. దాదాపు 22 వేల మంది రైతులకు గత తొమ్మిదేళ్లుగా ప్రభుత్వం కౌలు చెల్లిస్తోంది. గతేడాది కూడా జూన్ నెలలో రూ.194 కోట్లను కౌలుగా చెల్లించింది. ప్రభుత్వ భూముల ఆక్రమణ పరిధిలో ఉన్న భూములకు మాత్రం (కేటగిరీ 4,5,6) కౌలు చెల్లించడం లేదు. సీఆర్డీఏకు ఇచ్చిన భూముల్లో సుమారు 2900 ఎకరాలపై యాజమాన్య హక్కుల విషయంలో కేసులు నమోదవడంతో సీఐడీ దర్యాప్తు చేస్తోంది. వీటిలో కేసులు తేలినవాటికి ఎప్పటికప్పుడు కౌలు చెల్లిస్తున్నారు. ప్రతి ఏటా మే, జూన్ నెలల్లో కౌలు చెల్లింపు చేస్తున్నారు. అయినా రైతుల ముసుగులో టీడీపీ ఆందోళనలకు దిగటం... 'ఈనాడు', దాని తోకలు ఈ ఆందోళనను చిలవలు పలవలు చేసి దుష్ప్రచారం చేయటం... ఇదంతా ఈ రాష్ట్రం చేసుకున్న దౌర్భాగ్యమే.

స్పందన

నెహ్రూ హిందువేనంటారా?

సాక్షి దినపత్రికలో సుధీంద్ర కులకర్ణి 'నెహ్రూ హిందువు కాదంటారా?' అన్న వ్యాసం ప్రచురితమైంది (మే 9, మంగళవారం నాటి సంచిక). నెహ్రూ హిందువు అవునా? కాదా? అన్న చర్చ ఆయన జీవించి ఉన్నప్పటి నుంచే కొనసాగుతూ వచ్చింది. ఇప్పటికీ జరుగుతున్నది. నెహ్రూ హిందువు ఎలా అవుతారో... ఆయన రచనల్లో హిందూ తాత్త్విక భావనలు ఎలా ప్రస్ఫుటంగా కనిపిస్తాయో సుధీంద్ర కులకర్ణి సాధారణీకరణం చేసి అద్భుతంగా పేర్కొన్నారు. ఇవన్నీ మాట్లాడుకోవడానికీ, ఇలా పత్రికల్లో వ్యాసాలు రాసుకోవడానికీ చాలా బాగానేఉంటాయి. కానీ... చేతల చేత నెహ్రూ ఏమిటన్నది సుధీంద్ర ఒక్కటంటే ఒక్క ముక్క కూడా రాయలేదు.

1947 జూలై 22న దేశానికి స్వతంత్రం రావడానికి మూడు వారాల సమయం ఉన్నదనగా త్రివర్ణ పతాకంలోని గాంధీ చర్ఖా మాయమైపోయింది. ఆ స్థానంలోకి అశోకుడి విజయ చక్రం (దాన్ని మనవాళ్లు ధర్మ చక్రం అన్నారు) వచ్చి చేరింది. గాంధీ ఫిలాసఫీకి క్రమంగా కనుమరుగు చేయడంతోపాటు.. హిందూ ఐకాన్లను తెరమరుగు చేయడమే లక్ష్యంగా ఈ నిర్ణయం జరిగింది. ఈ విషయంలో నెహ్రూ చాలా తెలివిగా వ్యవహరించారు. బౌద్ధాన్ని ప్రమోట్ చేయడం వల్ల హిందువులకు వ్యతిరేకమనే ఇమేజి రాదు. ఎందుకంటే బుద్ధుడిని హిందువులు అప్పటికే దశావతారాల్లో ఒకడిగా అబ్సార్బ్ చేసుకున్నారు కాబట్టి!

జాతీయ జెండాలోకి ధర్మచక్రం వచ్చిన సరిగ్గా ఏడాదికి అశోకుడి నాలుగు సింహాలు రాజముద్రగా వచ్చి చేరింది. నిజానికి అప్పటివరకూ స్వాతంత్ర్యోద్యమంలో కూడా గాంధీ రాముడి గురించే ప్రబోధించారు. 'రఘుపతి రాఘవ రాజారాం' అనే అన్నారు. హఠాత్తుగా అశోకుడు భారతదేశ యవనికపై పుట్టుకొచ్చాడు. ఇంకేం రాముడు వెనక్కి వెళ్లాడు. రామరాజ్యమూ లేకుండా పోయింది. జీవితాంతం నరమేధం చేసి... రక్తపు కూడు తిన్న అశోకుడు ధర్మస్వరూపుడు, శాంతి స్వరూపుడయ్యాడు.

ఒకవైపు భారతీయ సమాజాన్ని ఆధునికీకరిస్తున్నామని చెప్తూనే.. మరోవైపు హిందూ సమాజాన్ని ఆధునికీకరించదానికంటూ.. 1948లోనే ఆదరాబాదరాగా 'హిందూ కోడ్ బిల్లు' తీసుకొని వస్తున్నట్టు నెహ్రూ ప్రకటించారు. బాబూ రాజేంద్ర ప్రసాద్ బిల్లును తిరస్కరిస్తూ.. దీన్ని అన్ని మతాలకూ వర్తింపజేస్తే చేయాలనీ, లేకపోతే చెత్త బుట్టలో పారేయాలనీ నెహ్రూకు లేఖ కూడా రాశారు. దీంతో బిల్లు ఆమోదం పొందలేదు. ఆ తరువాత నెహ్రూ పట్టుబట్టి బిల్లును నాలుగు ముక్కలు చేసి విడివిడిగా ఆమోదింపజేసుకొన్నారు. తత్ఫలితం ఏమిటో ఇప్పుడు మనం చూస్తున్నాం కూడా! చరిత్ర చరిత్ర కాకుండా పోయింది. మన విద్య విద్య కాకుండా పోయింది. మన సంస్కృతి సంస్కృతి కాకుండా పోయింది.

ఒక తరాన్ని 'అభారతీయులు'గా చేయాలంటే.. వారి మూలాలకు వారిని దూరం చేయాలి. అందుకు చేయాల్సిన మొదటి పని... ఈ దేశాన్ని ఏకం చేసిన మహాపురుషులనూ, వారి చరిత్రనూ కనుమరుగు చేయాలి. అందుకోసం వాటిపై బురద చల్లాలి. వారి జీవన విధానాన్ని ఛిన్నాభిన్నం చేయాలి. ఈ దేశంలో నాడు జరిగిందీ... నేడు జరుగుతున్నదీ అదే.

– కోవెల సంతోష్ కుమార్ ‌। 90521 16463

అంతరిస్తున్న మన బలగం

అభిప్రాయం



పున్నా కృష్ణమూర్తి

యూఆర్ అనంత మూర్తి 'సంస్కార' నవల కన్నడంలో వచ్చినప్పుడు పెద్దగా ఎవరూ పట్టించుకోలేదు. సంకుచిత సంప్రదాయ కుటుంబానికి చెందిన ఒక వ్యక్తి చనిపోయిన తరువాత అంత్యక్రియల సందర్భంగా స్వీయ సమూహపు వివక్ష అందులోని ఇతివృత్తం. ఈ నవల ఇంగ్లీషులో వచ్చినపుడు రామ్ మనోహర్ లోహియా చదివి, పఠాభి చేత చదివింపచేశారు. తదుపరి ఆయన దర్శకత్వంలో వచ్చిన 'సంస్కార' సినిమా అనేక ప్రకంపనలను పుట్టించింది. నిషేధించబడింది. ఆ మరుసటి ఏడాది 1970లో ఉత్తమ చిత్రంగా జాతీయ అవార్డు సాధించింది. భారతీయ ప్రత్యామ్నాయ సినిమాలకు మార్గదర్శి అయింది. అక్షరం అంకురం అయితే ... సినిమా వెయ్యి కొమ్మల వృక్షం.

ఇందుకు తాజా ఉదాహరణ నటుడు, రచయిత, దర్శకుడు అయిన వేణు యెల్దండి దర్శకత్వం వహించిన 'బలగం' చిత్రం. 'గుండు కరుగగా పాడె హనుమంతుడు' అన్న వాక్యం ప్రేక్షకులందరి అనుభవంలోకి తెచ్చింది క్లైమాక్స్ పాట పాడిన కొమురమ్మ. 'ఇయ్యాలా మాయందు గలిగి, మాతో ఈ పదాలు పలికిస్తున్నాడో ఏమో' అన్నపుడు నాభి నుంచి దుఃఖం పొరలని మనిషి ఉండరు.

ఒక వ్యక్తి చనిపోయినపుడు ఆ వ్యక్తి గుణగణాలను, బంధుమిత్రులతో సంబంధాలను తలచుకుని పాటపాడడం మనోభారాన్ని తగ్గించుకోవడం ప్రపంచమంతా ఉంది. ఉదాహరణకు 'ద వీపింగ్ కేమెల్' చిత్రం. మంగోలియా సంచార జాతులకు చెందిన సమూహాలు గోబి ఎడారిలో ఒంటెలపై ఆధారపడి జీవిస్తాయి. అక్కడి వేసవిలోనూ మంచు కరగదు. శీతకాలం భయంకరం. శీతకాలంలో ఒంటె ప్రసవించడం అంటే శరీరానికి రంపపు కోతే. తల్లి ఒంటె శిశువును దగ్గరకు రానివ్వని సందర్భాలు ఉంటాయి. అప్పుడేం చేస్తారు? సంచార వాద్యకారుని వెతికి రప్పిస్తారు. రెండు తంత్రుల పురాతన పరికరంపై అతడు వినిపించే సంగీతం తల్లి ఒంటెను బిడ్డ దగ్గరకు చేరుస్తుంది. ఈ చిత్రం ఉత్తమ డాక్యుమెంటరీగా ఆస్కార్ (2003) అవార్డు, ఉత్తమ ఫీచర్ ఫిల్మ్‌తో సహా అసంఖ్యాక అవార్డులను గెలుచుకుంది. వీటన్నిటి కన్నా ముఖ్యమైన అంశం మంగోలియా కళాకారుల సంప్రదాయ సంగీతాన్ని ప్రపంచం సంరక్షించుకోవాల్సిన 'ఇందిర గ్రాహ్యం కాని సాంస్కృతిక వారసత్వం (ఇంటాన్జిబుల్ కల్చరల్ హెరిటేజ్)'గా యునెస్కో గుర్తించింది. సంరక్షించుకోవాల్సిన ఇటువంటి వారసత్వ కళలు దాదాపు 500 యునెస్కో జాబితాలో ఉన్నాయి.



'బలగం' విషయానికి వస్తే బుడగ (బేడీ) జంగాల సామాజిక వర్గానికి చెందిన వారు ఈ కళకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో వేణు యెల్దండి ఎంపిక చేసిన వరంగల్ జిల్లా దుగ్గొండి అటవీ గ్రామానికి చెందిన మొగిలయ్య, కొమురమ్మలు ఈ ప్రక్రియలో దాదాపు చివరి ప్రతిభావంతులైన కళాకారులు. బుడగ జంగాలు పాటను అప్పటికప్పుడే పుట్టిస్తారు, బంధుమిత్రుల నుంచి రాబట్టిన గుణగణాలతో! అలాంటి కళాకారులను ఈ యాంత్రిక సమాజం మరచింది. ఇప్పుడు భర్త మొగిలయ్య తీవ్ర అనారోగ్యంలో 'ప్రాణ నాధా...' పాడుతూ రోదిస్తోంది కొమురమ్మ.

పల్నాడు, భువనగిరి జిల్లా కొండ్రపోలు, రాయలసీమలో బుడగ జంగాలు పాడగా వ్యాస రచయిత విన్నాడు. లాభం కాబట్టి ఇవే పెంచాలి అనుకున్న వాణిజ్య మొక్కలు తప్ప ఇతర వృక్ష జాతులను, పురుగూ పుట్రా అన్నిటినీ పొలంలో నుంచి సమూలంగా పెళ్లగించే యాంత్రిక వ్యవసాయ ధోరణి సాంస్కృతిక రంగంలోకీ వచ్చింది. అందుకే వృత్తికారులను, గాత్ర, వాద్య ప్రదర్శన కళాకారులను దూరం చేసుకుంది.

ఈ నేపథ్యంలో బుడగ జంగాల కళా సంపద అంతరించి పోకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంపై ఉంది. ఈ కళను యునెస్కో గుర్తింపునకు రిజిస్టర్ చేయాలి. యునెస్కో గుర్తింపు వస్తే ప్రయోజనం ఏమిటి? మొగిలయ్య, కొమురమ్మలకు, వారి తదుపరి తరాలకు సమున్నత గౌరవం లభిస్తుంది. సామాజిక ఆర్థిక ఉన్నతి ఏర్పడుతుంది. వివిధ దేశాలలో అంతర్జాతీయ వేదికలపై తమ ప్రతిభను ప్రదర్శించే అవకాశం ఏర్పడుతుంది.

వ్యాసకర్త ఇండిపెండెంట్ జర్నలిస్ట్
మొబైల్: 76809 50863

క్లుప్తంగా...

ఘనంగా మోదకొండమ్మ జాతర ప్రారంభం


ఘటాలు ఊరేగింపులో భక్తులు

సాక్షి,పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): మన్యం ప్రజల ఆరాధ్య దైవం పాడేరు మోదకొండమ్మ తల్లి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఉత్సవ విగ్రహం, పాదాలు, ఘటాలను ఊరేగింపుగా స్థానిక మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపం వద్దకు తీసుకువచ్చి కొలువు దీర్చారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి దంపతులు, ఆలయ, ఉత్సవ కమిటీల ప్రతినిధులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభుత్వం తరఫున కలెక్టర్ సుమిత్‌కుమార్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి మూలవిరాట్, ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపారు. ఊరేగింపులో ఉత్సవ విగ్రహాన్ని ఎస్పీ తుహిన్‌సిన్హా, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ మోశారు. ఐటీడీఏ పీవో అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు థింసా నృత్యాలు చేసి ఉత్సాహపరిచారు. ఐటీడీఏ కార్యాలయ ఆవరణలో పీవో అభిషేక్ కళా ప్రదర్శనలను ప్రారంభించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ గిరిజనుల సంప్రదాయ కొమ్మును, ఐటీడీఏ పీవో కొమ్ము తలపాగాను ధరించి గిరిజనుల డప్పు వాయిద్యాలతో సందడి చేశారు. భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మంగళవారం వరకు ఉత్సవాలు జరుగనున్నాయి.

‘ఆరోగ్యశ్రీ’ సేవలు ప్రశంసనీయం

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ ఫణిధర్



గుంటూరుమెడికల్: పేద, మధ్య తరగతి ప్రజలకు అన్ని రకాల జబ్బులకు ఉచితంగా అత్యున్నత స్థాయి వైద్యసేవలు అందించేలా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తృతం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఫణిధర్ చెప్పారు. ఏపీతోపాటు ఇతర రాష్ట్రాల్లో కూడా ఆరోగ్యశ్రీని అమలుచేయడం, శస్త్రచికిత్సల అనంతరం రోగి కోలుకునే సమయంలో ఆర్థిక సాయం అందించడం ప్రశంసనీయమని అన్నారు. గుంటూరులోని ఐఎంఏ హాలులో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ గత వారం కేరళలో యువ వైద్యురాలు వందనాదాస్ హత్యకు గురైన నేపథ్యంలో వైద్యులు, ఆస్పత్రులపై దాడులను నివారించి స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో రోగులకు చికిత్స అందించేలా దేశవ్యాప్తంగా కఠిన చట్టాలు తీసుకురావాలని కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న చట్టంలో కొన్ని సవరణలు చేసి మరింత కఠినంగా రూపొందించాలని విజ్ఞప్తిచేశారు. డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఐఎంఏ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ రవీంద్రనాథ్, డాక్టర్ నందకిషోర్, డాక్టర్ ఎస్.కిషోర్, డాక్టర్ తాతా సేవకుమార్ పాల్గొన్నారు.

వాసుదేవ్ కామత్‌కు చిత్రకళా తపస్వీ బిరుదు


వాసుదేవ్ కామత్‌ను బిరుదుతో సత్కరిస్తున్న విజయవాడ ఆర్ట్ సొసైటీ సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ప్రముఖ చిత్రకారుడు వాసుదేవ్ కామత్‌కు విజయవాడ ఆర్ట్ సొసైటీ నిర్వాహకులు చిత్రకళా తపస్వీ బిరుదు ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ (స్పా) కళాశాల ఆవరణలో విజయవాడ ఆర్ట్ సొసైటీ ఎనిమిదో వార్షికోత్సవం సందర్భంగా జాతీయ స్థాయిలో వాటర్ కలర్ పెయింటింగ్ పోటీలు, చిత్రకళా ప్రదర్శన ఆదివారం నిర్వహించారు. వాసుదేవ్ కామత్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు వాటర్ కలర్స్ పెయింటింగ్ పోటీల్లో తమ ప్రతిభ చూపారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేశారు. వాటర్ కలర్స్ పెయింటింగ్ పోటీల్లో మహారాష్ట్రకు చెందిన చిత్రకారుడు దేవానంద్ రామ్ టేకే మొదటి బహుమతిగా రూ.20 వేలు, ముంబైకి చెందిన అక్షయ్ బాహూషిండే ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, మహారాష్ట్రకు చెందిన కిరణ్‌పరాటే మూడో బహుమతిగా రూ.10 వేల నగదు అందుకున్నారు. విజయవాడ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు అల్లు రాంబాబు, ఉపాధ్యక్షుడు కళాసాగర్, ప్రధాన కార్యదర్శి యు.వేణుగోపాలరావు పాల్గొన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు

కాకినాడ జిల్లాలో ఆటోను ఢీకొన్న ప్రైవేటు బస్సు

ఏడుగురి దుర్మరణం, మరో ఆరుగురికి గాయాలు

మృతులు యానాం ప్రాంతానికి చెందిన మహిళా కూలీలు | రొయ్యల కంపెనీలో పనిముగించుకుని ఇళ్లకు వెళుతుండగా ఘటన


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో.. సహాయక చర్యల్లో పోలీసులు


బి. సత్యవతి (ఫైల్)


ఎస్. వెంకటలక్ష్మి (ఫైల్)


శేశెట్టి వెంకటలక్ష్మి (ఫైల్)


చింతపల్లి జ్యోతి (ఫైల్)


కర్రి పద్మ (ఫైల్)


కర్రి పార్వతి (ఫైల్)

అప్పటివరకు ఉత్సాహంగా పనులు చేసుకున్న వారంతా ఇళ్లకు బయలుదేరారు. కబుర్లు చెప్పుకొంటూ ఆటోలో వెళుతున్న వారిపైకి మృత్యువు దూసుకొచ్చింది. ఏడుగురి ఉసురు తీసింది. వేగంగా వచ్చిన బస్సు ఢీకొనడంతో ఆటో ముక్కలైంది. పలువురి శరీరాలు గుర్తుపట్టలేనంతగా మారిపోయాయి. అక్కడి పరిస్థితి భీతావహంగా మారింది.


బి. వెంకటలక్ష్మి (ఫైల్)

తాళ్లరేవు: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మహిళలు దుర్మరణం పాలయ్యారు. మరో ఆరుగురు గాయపడ్డారు. వీరిలో తీవ్రంగా గాయపడిన నలుగురు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కోరంగి పోలీసులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పరిధిలోని యానాం పరిసర ప్రాంతాలకు చెందిన 13 మంది మహిళలు తాళ్లరేవు మండలం కోరంగి పంచాయతీ పరిధిలోని ఎపెక్స్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్‌లో పనిచేసేందుకు ఉదయం ఆటోలో వెళ్లారు. ఉదయం షిఫ్ట్ పని పూర్తిచేసుకుని మధ్యాహ్నం రెండుగంటల సమయంలో తిరిగి అదే ఆటోలో ఇళ్లకు బయలుదేరారు. ఆటో బయలుదేరిన పది నిమిషాల్లోనే.. మరో 20 నిమిషాల్లో ఇళ్లకు చేరుకుంటారనగా ప్రమాదానికి గురయ్యారు. ఎపెక్స్ కంపెనీ నుంచి సుమారు 200 మీటర్ల దూరంలో ఉన్న సుబ్బారాయుని దిబ్బ వద్ద వీరు ప్రయాణిస్తున్న ఆటోను ఎదురుగా వస్తున్న మోజో ట్రావెల్స్ బస్సు బలంగా ఢీకొంది. అత్యంత వేగంగా ఆటోను ఢీకొన్న బస్సు పక్కనున్న రైలింగ్‌ను ఢీకొని ఆటోను సుమారు 20 మీటర్ల మేర ఈడ్చుకుపోయింది. బస్సు ఢీకొన్న తాకిడికి ఆటో నుజ్జునుజ్జయింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు మహిళలు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. వీరిలో యానాం కొత్త బస్టాండ్‌కు చెందిన కర్రి పద్మ (39), ఫ్రాన్స్‌తిప్పకు చెందిన బొక్కా వెంకట లక్ష్మి (47), కురసాంపేటకు చెందిన నిమ్మకాయల వెంకటలక్ష్మి (54), వెంకట్‌నగర్‌కు చెందిన చింతపల్లి జ్యోతి (38), మెట్టకుర్రుకు చెందిన శేశెట్టి వెంకటలక్ష్మి (41), కర్రి పార్వతి (42) ఉన్నారు. కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఫ్రాన్స్‌తిప్పకు చెందిన బూడపనీటి సత్యవతి (35) మృతి చెందింది. ఫ్రాన్స్‌తిప్పకు చెందిన రక్ష వెంకటేశ్వరమ్మ, మల్లాడి గంగాభవాని, కురసాంపేటకు చెందిన ఓలేటి లక్ష్మి, యానాంకు చెందిన నోట్ల సత్యవతి తీవ్రంగా గాయపడ్డారు. వీరు కాకినాడలో చికిత్స పొందుతున్నారు. మరో ఇద్దరు స్వల్పగాయాలతో బయటపడ్డారు. యానాం ఫరంపేటకు చెందిన ఆటోడ్రైవర్ గిడ్డి వెంకటేశ్వరరావు ప్రమాదాన్ని ముందే గుర్తించి ఆటోలో నుంచి దూకేసి ప్రాణాలు దక్కించుకున్నాడు.

తాళ్లరేవు రోడ్డు ప్రమాదంపై గవర్నర్ విచారం

సాక్షి, అమరావతి: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు మహిళలు ప్రాణాలు కోల్పోవడంపై గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇది చాలా దురదృష్టకరమైన సంఘటన అని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారికి అవసరమైన వైద్యం అందించాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

రక్తసిక్తమైన జాతీయ రహదారి

ప్రమాదస్థలంలో మహిళల శరీర భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. మృతదేహాలు గుర్తించలేని స్థితిలో కనిపించాయి. వస్తువులు, క్యారేజీల ఆధారంగా కొందరి మృతదేహాలను మహిళలను గుర్తించగలిగారు. జాతీయ రహదారి రక్తసిక్తమైంది. కాకినాడ డీఎస్పీ మురళీకృష్ణారెడ్డి, కాకినాడ రూరల్ సీఐ పి.శ్రీనివాసరావు, కోరంగి ఎస్‌ఐ పి.శ్రీనివాసకుమార్ గాయపడినవారిని తాళ్లరేవు సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కి తరలించారు. మృతదేహాలను కూడా కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, వైఎస్సార్‌సీపీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ హుటాహుటిన చేరుకున్నారు. బాధితులను ఆస్పత్రికి తరలించడంతోపాటు వారి బంధువులకు సమాచారం అందించి అప్రమత్తం చేశారు. మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు.

మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున పుదుచ్చేరి సీఎం సాయం

మృతుల కుటుంబాలకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి రూ.లక్ష చొప్పున తక్షణ సహాయం ప్రకటించారని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ తెలిపారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని చెప్పారు. ప్రమాదానికి ట్రావెల్స్ సంస్థను బాధ్యులను చేస్తామని, వారి నుంచి బాధిత కుటుంబాలకు పరిహారం రాబడతామని చెప్పారు.

రాజధానిలో పేదల ఇళ్ల స్థలాలను అడ్డుకునేందుకు అడ్డదారులు

959వ రోజు రిలే దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నేతలు



తాడికొండ : రాజధాని ప్రాంతంలో నిరుపేదలకు ఇళ్ల పట్టాలిచ్చేందుకు ప్రభుత్వం పనులు కొనసాగిస్తుంటే.. ఓ సామాజికవర్గానికి చెందిన కొందరు నాయకులు అడ్డదారులు తొక్కుతూ రైతుల ముసుగులో ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమని బహుజన పరిరక్షణ సమితి నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 959వ రోజుకు చేరాయి. దీక్షల శిబిరాన్ని పలువురు నేతలు సందర్శించి ప్రసంగించారు. బాబు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి గండి పడుతుందన్న భయంతో బాబు కనుసన్నల్లో రైతుల పేరుతో డ్రామాలాడుతున్నారనేది బహిరంగ సత్యమన్నారు. సీఆర్డీఏ నిబంధనల ప్రకారం రైతులకు కౌలు పరిహారం తొమ్మిదేళ్లు చెల్లించినప్పుడు ఇంకా వారికి ఆ భూములపై హక్కు ఎలా ఉంటుందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓ వైపు ప్యాకేజీలు అందుకుని.. పదింతల లాభాలకు భూములు అమ్ముకున్న కులవాదులు.. రాజధాని కోసం త్యాగాలు చేశామని గొప్పలు చెప్పుకోవడం దుర్మార్గమన్నారు.

వైభవంగా ‘గంగమ్మ’ భక్తి చైతన్య యాత్ర


గంగమ్మకు సారె సమర్పిస్తున్న మంత్రి ఆర్కే రోజా దంపతులు, పక్కన ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి

సాక్షి, తిరుపతి/తిరుపతి కల్చరల్: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తల్లి జాతరలో ఐదో రోజైన ఆదివారం భక్తి చైతన్య యాత్ర అంగరంగ వైభవంగా సాగింది. డప్పు దరువుల నడుమ గంధం, కుంకుమ బొట్లు ధరించి, వేపాకు చేతపట్టిన జనం భక్తి పారవశ్యంతో చిందులేస్తూ గంగమ్మ తల్లి నామస్మరణ చేశారు. అమ్మవారు, దేవతామూర్తులతోపాటు వివిధ వేషధారణల్లో తమ భక్తిని చాటుకున్నారు. తొలుత ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌రెడ్డి, ముద్రనారాయణ, కార్పొరేటర్లు తదితరులు అనంతవీధికి చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తి చైతన్య యాత్రను ప్రారంభించారు. అక్కడి నుంచి అనంతవీధి, పరసాలవీధి, రామచంద్ర పుష్కరిణి, మహతి ఆడిటోరియం, ఎస్పీ కార్యాలయం, గాంధీరోడ్డు, కృష్ణాపురం ఠాణా, గాంధీ రోడ్డు, బండ్ల వీధి మీదుగా భక్తి చైతన్య యాత్ర గంగమ్మ తల్లి గుడికి చేరుకుంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 30 విగ్రహాలతో.. వేలాది మంది భక్తులు ఈ యాత్రలో పాల్గొన్నారు. యాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి స్వయంగా పలువురికి గంధం పూసి, కుంకుమ బొట్లు పెట్టారు. మాతంగి వేషధారణలో ఉన్న ఎంపీ గురుమూర్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. డప్పు దరువులు, కోలాటాలు, జానపద నృత్యాలతో నగరమంతా సందడిగా మారింది.

సారె సమర్పించిన మంత్రి రోజా

తాతయ్యగుంట గంగమ్మ తల్లికి మంత్రి ఆర్కే రోజా ఆదివారం సారె సమర్పించారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం మంత్రి రోజా అమ్మవారికి సారె సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. రోజా మాట్లాడుతూ.. గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గంగమ్మతల్లి ఆలయానికి సీఎం జగన్‌ను తీసుకువచ్చి, ఆలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈఓ మునికృష్ణయ్య పాల్గొన్నారు.

మోసగాడి ఆగడాలకు దిశ యాప్‌తో అడ్డుకట్ట

- నగ్న పూజల కేసులో 12 మంది అరెస్ట్
- పూజలో కూర్చుంటే రూ.50 వేలు ఇస్తామని మోసం
- ఇద్దరు యువతులపై అఘాయిత్యం
- దిశ యాప్‌ను ఆశ్రయించిన బాధితులు.. వారిని రక్షించిన పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న సౌత్ జోన్ డీఎస్పీ మహబూబ్ బాషా

గుంటూరు రూరల్: డబ్బు ఆశ చూపి యువతుల్ని మోసగించేందుకు ప్రయత్నించిన ఘరానా మోసగాడి ఆగడాలకు దిశ యాప్ సాయంతో అడ్డుకట్ట పడింది. బాధిత యువతులు తమ మొబైల్ ఫోన్‌లోని దిశ యాప్ ఎస్‌వోఎస్ బటన్ నొక్కడంతో నిమిషాల వ్యవధిలోనే పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని యువతులను రక్షించారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా అఘాయిత్యాలకు పాల్పడిన 12 మందిని నల్లపాడు పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. డీఎస్పీ మహబూబ్‌బాషా కథనం ప్రకారం.. తాడికొండ మండలం పొన్నెకల్లుకు చెందిన పూజారి నాగేశ్వరరావు అనే వ్యక్తి బోర్లు వేసే సమయంలో కొబ్బరి కాయలతో నీరు పడుతుందో లేదో చెప్పే పనులు చేస్తుంటాడు. ఈ క్రమంలోనే గుప్త నిధులను వెతికేందుకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో తనకు పరిచయమైన వి.నాగేంద్రబాబుకు నగ్నంగా పూజలు చేస్తే ఆర్థికంగా కలిసి వస్తుందని ఆశ చూపాడు. దీంతో నాగేంద్రబాబు తన క్లాస్‌మేట్ అయిన కర్నూలు జిల్లా ఆత్మకూరు, నంద్యాల ప్రాంతాలకు చెందిన సురేష్, ఖాశిం, పెద్దరెడ్డిలకు ఒకసారి నగ్నంగా పూజలో కూర్చునే మహిళలు ఉంటే వారికి లక్ష రూపాయలు ఇస్తారని చెప్పాడు. దీంతో సురేష్, ఖాశిం, పెద్దరెడ్డి ఇద్దరు యువతులతో గత మంగళవారం గుంటూరు వచ్చి నాగేంద్రబాబును కలిశారు. ఈ విషయాన్ని నాగేంద్రబాబు పూజారి నాగేశ్వరరావుకు ఫోన్‌లో చెప్పాడు. దీంతో నాగేశ్వరరావు అనుచరులు, అతడి కారు డ్రైవర్ సునిల్, చిలకలూరిపేటకు చెందిన ఉమెన్ ట్రాఫికింగ్‌కు పాల్పడే అరవిందచౌదరి, సుబ్బు, శివ, రాధ గుంటూరు బస్టాండ్‌కు వెళ్లి నంద్యాల నుంచి వచ్చిన సురేష్, ఖాశిం, పెద్దరెడ్డిలను కలిసి.. డబ్బుల విషయమై మాట్లాడుకుని ఒప్పందానికి వచ్చారు.

కదిలితే ప్రాణాలు పోతాయని బెదిరించి..

మంగళవారం రాత్రి పూజలు ప్రారంభించాలని నాగేశ్వరరావు చెప్పగా.. వారంతా తాడికొండ మండలం పొన్నెకల్లులోని నాగేశ్వరరావు ఇంటికి చేరుకున్నారు. ఆ తరువాత నాగేశ్వరరావు యువతులను ఓ గదిలో నగ్నంగా కూర్చోబెట్టి పూజలు ప్రారంభించాడు. మధ్యలో యువతుల పట్ల అసభ్యంగా ప్రవర్తించగా.. వారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పూజ చేస్తున్న సమయంలో కదిలితే ప్రాణాలు పోతాయని బెదిరించడంతో యువతులు ఏమీ చేయలేకపోయారు. పూజలు ముగిసిన అనంతరం నాగేశ్వరరావు, అతని అనుచరులు యువతులపై అఘాయిత్యానికి పాల్పడ్డారు. బుధవారం నాడు పొన్నెకల్లులో పూజలు కుదరటం లేదని చిలకలూరిపేటలోని పండరీపురంలో అరవిందచౌదరి ఇంట్లో పూజలు చేయాలని నిర్ణయించాడు నాగేశ్వరరావు. బుధవారం రాత్రి అందరూ కలిసి చిలకలూరిపేట వెళ్లారు. శుక్రవారం వరకూ పూజలు చేసే క్రమంలో యువతులపై లైంగిక దాడికి పాల్పడ్డారు. నాలుగు రోజులుగా పూజలు చేస్తున్నా ఫలితం లేకపోవటంతో నాగేశ్వరరావు అక్కడినుంచి జారుకున్నాడు.

దిశ యాప్‌ను ఆశ్రయించడంతో..

ఈ క్రమంలో సదరు యువతులు ఒప్పందం ప్రకారం తమకు డబ్బు ఇస్తే ఇంటికిపోతామని నాగేశ్వరరావు అనుచరులను అడిగారు. దీంతో నాగేశ్వరరావు అనుచరులకు, యువతులకు వివాదం తలెత్తింది. ఈ విషయాన్ని అరవిందచౌదరి నాగేశ్వరరావుకు ఫోన్ చేసి చెప్పగా.. తన ఇంటికి వస్తే సెటిల్‌మెంట్ చేసుకుందామని నాగేశ్వరరావు సూచించాడు. అందరూ కారులో పొన్నెకల్లు బయలుదేరారు. మధ్యలో నాగేశ్వరరావు అనుచరులు యువతులను బెదిరించడంతో గోరంట్ల సమీపంలో బాధిత యువతులు తమ వద్దనున్న సెల్‌ఫోన్‌లో దిశ యాప్‌లో ఎస్‌వోఎస్ బటన్ నొక్కడంతో వెంటనే స్పందించిన ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్ నేతృత్వంలో నల్లపాడు పోలీసులు అప్రమత్తమయ్యారు. తక్షణమే నగర శివార్లలోని గోరంట్ల వద్ద ఉన్న యువతుల చెంతకు చేరుకుని ఆమెతోపాటున్న అరవింద చౌదరి, నాగేంద్రబాబు, సునిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితులు జరిగిన విషయాన్ని ఒప్పుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు ప్రధాన నిందితుడు నాగేశ్వరరావు, నాగేంద్రబాబు, అరవింద చౌదరి, రాధ, భాస్కర్, పెద్దరెడ్డి, సాగర్, వెంకటసురేష్, శివ, సునీల్, పవన్, సుబ్బులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనలో మరికొందరు ఉన్నారని, త్వరలో వారిని అరెస్ట్ చేస్తామని డీఎస్పీ మహబూబ్‌బాషా చెప్పారు. ఎవరైనా డబ్బు ఆశచూపి యువతులు, మహిళలకు ఎరవేస్తే నమ్మి మోసపోవద్దని డీఎస్పీ కోరారు.

బోటు బోల్తా.. ఇద్దరు కన్నుమూత

- ఓ యువతి గల్లంతు.. ఆస్పత్రి పాలైన ఇద్దరు చిన్నారులు
- చిన్నారుల్లో ఒకరి పరిస్థితి విషమం
- అవుకు రిజర్వాయర్‌లో దుర్ఘటన
- గల్లంతైన యువతి కోసం రిజర్వాయర్‌లో కొనసాగుతున్న గాలింపు చర్యలు


కుడివైపున గల్లంతైన యువతి సాజిదా, ఎడమవైపున మృతి చెందిన హాసియా (ఫైల్)


నూర్జహాన్ మృతదేహం

అవుకు/నంద్యాల: నంద్యాల జిల్లా అవుకు గ్రామంలోని జలాశయంలో ఆదివారం బోటు బోల్తా కొట్టిన ఘటనలో ఓ యువతి సహా ఇద్దరు మహిళలు మృతి చెందగా.. మరో యువతి గల్లంతైంది. ప్రమాదంలో చిక్కుకుని ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు చిన్నారులకు ఆస్పత్రిలో వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ ప్రమాదంలో కోవెలకుంట్లకు చెందిన హసియా (23), నూర్జహాన్ (37) మృతి చెందగా.. సాజిదా (20) గల్లంతైంది. ప్రమాదం నుంచి బయటపడిన చశ్విక్ (3), హనీ (1) అనే చిన్నారులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో హనీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. వివరాల్లోకి వెళితే.. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల పట్టణానికి చెందిన డి.రసూల్ పోలీస్ స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. అవుకు మండలం చెన్నంపల్లె గ్రామంలో తన సమీప బంధువు ఇంటిలో జరిగిన వివాహ వేడుకకు రసూల్, అతని భార్య మహేశ్వరి, కుమార్తెలు సైదా, సాజిదా (20), రసూల్ అన్న దస్తగిరి, అతని భార్య కాశింబి, కూతుళ్లు హసీనాభాను, హసియా (23), మనవడు చశ్విక్, మనవరాలు హనీ, తమ్ముడి కుటుంబం మహబూబ్ బాషా, అతడి భార్య హుసేబీ, మరో తమ్ముడి కుటుంబం బషీర్ బాషా, అతని భార్య నూర్జహాన్(37) హాజరయ్యారు.

బోటులో జలవిహారానికి వెళ్లగా..

అన్నదమ్ముల కుటుంబాలకు చెందిన వీరంతా ఆదివారం ఉదయం జలాశయం వద్దకు చేరుకున్నారు. ఇద్దరు చిన్నారులు సహా 14 మంది కలిసి బోటులో జల విహారానికి బయల్దేరారు. రిజర్వాయర్ మధ్యకు వెళ్లగానే బోటులోకి నీళ్లు రావటం చూసి బోట్‌ను నడుపుతున్న వ్యక్తి వెంటనే నీళ్లలోకి దూకేశాడు. బోటు తిరగబడటంతో అందులోని వారంతా ఒక్కసారిగా నీటిలోకి పడిపోయారు. స్థానికుల సాయంతో నీటిలో చిక్కుకున్న వారిని బయటకు తీయగా.. బోటుకింద చిక్కుకున్న హసియా (23) అప్పటికే మృతి చెందింది. మరో మహిళ నూర్జహాన్ (37), చిన్నారులు చశ్విక్, హనీ పరిస్థితి విషమంగా ఉండటంతో బనగానపల్లె ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ నూర్జహాన్ మృతి చెందింది. ఎస్పీ రఘువీర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, ఆర్డీవో వెంకటరెడ్డి, ఆరోగ్య శాఖ, టూరిజం, అగ్నిమాపక శాఖల అధికారులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుల్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. కాగా, ప్రమాదానికి గురైన బోటు పర్యాటక శాఖది కాదని జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బోటు నిర్వాహకులు లైసెన్స్ రెన్యువల్ చేయించుకోలేదని తమ దృష్టికి వచ్చిందన్నారు.

ఈతకు దిగిన ఇద్దరు యువకులు మృతి

- కృష్ణానది శివలింగాల ఘాట్‌లో ఘటన
- గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాల వెలికితీత


పతివాడ బాలాజీ (ఫైల్)


సాయితేజ (ఫైల్)

పెనమలూరు: కృష్ణాజిల్లా, పెనమలూరు మండలం యనమలకుదురు వద్ద కృష్ణానది శివలింగాల ఘాట్‌లో ఈతకు దిగిన ఇద్దరు యువకులు మృతి చెందారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరంలోని పటమట ఫన్‌టైమ్ రోడ్డుకు చెందిన పతివాడ బాలాజీ (19), స్క్యూ బ్రిడ్జి ప్రాంతానికి చెందిన ఫొటోగ్రాఫర్ పాసర్లంక సాయితేజ (19), ఆదే ప్రాంతానికి చెందిన గాంధిరెడ్డి రాజు (19), రామలింగేశ్వర్‌నగర్ గంగానమ్మగుడి ప్రాంతానికి చెందిన బీటెక్ విద్యార్థి మద్ది రాజేష్ (19), యనమలకుదురు శివపార్వతీనగర్ రెండో లైన్‌కు చెందిన ఉమ్మడిశెట్టి రోహిత్ (21), పటమటకు చెందిన జి.దుర్గాప్రసాద్ (16), రామలింగేశ్వరనగర్ పుట్టరోడ్డుకు చెందిన డిగ్రీ విద్యార్థి బొప్పన గౌతమ్ (20) ఆదివారం మధ్యాహ్నం యనమలకుదురు శివలింగాల కృష్ణానది ఘాట్ వద్దకు ఈతకు వెళ్లారు. పాసర్లంక సాయితేజ, పతివాడ బాలాజీ నదిలో దిగి ఈత కొట్టసాగారు. మిగితా ఐదుగురు నది ఒడ్డునే ఉండి ఫొటోలు దిగుతున్నారు. నదిలో ఈత కొడుతున్న సాయితేజ, బాలాజీ ఒక్కసారిగా నదిలోని ఊబిలో చిక్కుకుని నీటిలో మునిగి గల్లంతయ్యారు. నదిలో మునిగిపోయిన వారిని చూసిన మిగతా ఐదుగురు స్నేహితులు బిగ్గరగా కేకలు వేసినా ఫలితం లేదు. ఘటన జరిగిన ప్రాంతం గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోనిది. ఈ సమాచారం అందుకున్న తాడేపల్లి పోలీసులు గజ ఈతగాళ్లను తీసుకొచ్చి నదిలో గాలింపు చేపట్టారు. మొదట సాయితేజ మృతదేహం దొరికింది. ఆ తర్వాత బాలాజీ మృతదేహాన్ని కూడా వెలికి తీశారు. మృతుల తల్లిదండ్రులు ఘటనా స్థలానికి చేరుకుని భోరున విలపించారు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వారం రోజుల కిందట ఇక్కడ ఈతకు దిగిన నలుగురు యువకుల్లో ఇద్దరు చనిపోయిన సంగతి తెలిసిందే.

తిరుమలలో ఘనంగా హనుమజ్జయంతి వేడుకలు

తిరుమల : తిరుమలలోని అంజనాద్రి కొండపై ఆంజనేయస్వామి వారు జన్మించిన ఆకాశ గంగ తీర్థం వద్ద హనుమజ్జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. అంజనాదేవి, బాల ఆంజనేయస్వామివారికి అభిషేకం, తమలపాకులతో అర్చన, మల్లె పూలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా, జాపాలి శ్రీఆంజనేయ స్వామివారికి జేఈవో వీరబ్రహ్మం పట్టు వస్త్రాలు సమర్పించారు. జేఈవోకు హథీరాంజీ మఠం మహంతు అర్జున్ దాస్‌జీ మహంతు స్వాగతం పలికారు. జాపాలి తీర్థంలోని శ్రీఆంజనేయస్వామి వారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. కాగా, శ్రీవారి ఆలయానికి ఎదురుగానున్న శ్రీ బేడి ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మొదటి ఘాట్‌రోడ్డులోని ఏడవ మైలు వద్ద ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి నిలువెత్తు విగ్రహానికి ప్రత్యేక పూజలు జరిపారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 87,007 మంది స్వామివారిని దర్శించుకున్నారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.08 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో శ్రీవారి దర్శనం లభిస్తోంది.

క్లుప్తంగా

బంగ్లా తీరాన్ని తాకిన మోకా

బంగ్లాదేశ్, మయన్మార్‌ల్లో తీవ్ర నష్టం

సాక్షి, విశాఖపట్నం: భీకర మోకా తుపాను ఆదివారం మధ్యాహ్నం బంగ్లాదేశ్, మయన్మార్ తీరాన్ని తాకి తీవ్ర నష్టం కలగజేసింది. గంటకు 200 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. సముద్రంలో 8–12 అడుగుల ఎత్తున ఎగిసి పడిన అలలు లోతట్టు ప్రాంతాలను ముంచి వేశాయి. సెంట్ మార్టిన్ దీవిలో బలమైన గాలులు, భారీగా వానలు కురిశాయి. గత రెండు దశాబ్దాల్లో ఇదే అత్యంత శక్తివంతమైన తుపాను అని అధికారులు తెలిపారు. ఈ తుపాను ఆంధ్రప్రదేశ్‌పై ప్రభావం చూపితే హుద్‌హుద్ తరహా పెను విపత్తుకు కారణమయ్యేదని నిపుణులు చెబుతున్నారు.

జగదీశ్ శెట్టార్ ఓటమి

బెంగళూరు: కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం జగదీశ్ షెట్టార్ ఘోర పరాజయం మూటగట్టుకున్నారు. బీజేపీ టికెట్ నిరాకరణతో ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరిన ఆయన హుబ్బళ్లి–ధార్వాడ్(సెంట్రల్) నియోజకవర్గంలో బీజేపీకి చెందిన మహేశ్ తెంగినకాయ్ చేతిలో 34,289 ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు.

బ్రహ్మోస్ క్షిపణిని పరీక్షించిన నేవీ

న్యూఢిల్లీ: బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్లు అధికారులు తెలిపారు. నేవీకి చెందిన గైడెడ్ మిస్సైల్ డిస్ట్రాయర్ ఐఎన్ఎస్ మర్ముగోవాపై నుంచి ప్రయోగించినట్లు ఆదివారం వెల్లడించారు. ఐఎన్ఎస్ మర్ముగోవాతోపాటు బ్రహ్మోస్ క్షిపణి కూడా దేశీయంగా తయారైనవేనని చెప్పారు. సముద్రజలాలపై మన నావికాదళ శక్తిని, దేశ ఆత్మనిర్భరతకు చాటిచెప్పే పరిణామమని వివరించారు. ధ్వని వేగం కంటే మూడు రెట్లు వేగంతో ఇది దూసుకెళ్లిందన్నారు. భారత్–రష్యా ఉమ్మడిగా ఏర్పాటు చేసిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ జలాంతర్గాములు, యుద్ధ నౌకలు, యుద్ధ విమానాలతోపాటు భూమిపై నుంచి సైతం ప్రయోగించేందుకు వీలున్న బ్రహ్మోస్ క్షిపణులను తయారు చేస్తోంది.

'జనశక్తి' ఎగ్జిబిషన్‌లో మోదీ

న్యూఢిల్లీ: మన్‌కీ బాత్ 100వ ఎపిసోడ్ పూర్తయిన సందర్భంగా నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్(ఎన్‌జీఎంఏ)లో ఏర్పాటైన ఎగ్జిబిషన్‌ను ప్రధాని మోదీ ఆదివారం సందర్శించారు. 'జన శక్తి: ఒక సమ్మిళిత శక్తి'ఇతివృత్తంతో ఏర్పాటైన ఈ ఎగ్జిబిషన్‌లో ప్రముఖులైన 13 మంది కళాకారుల కళా ఖండాలున్నాయి. ఎగ్జిబిషన్‌లో ఆయన కలియదిరిగారని సాంస్కృతిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మన్‌కీ బాత్‌లో తమకు ప్రేరణనిచ్చిన అంశాల గురించి కళాకారులు ప్రధానికి వివరించారని పేర్కొంది.

ఆ ఐదు శాతమే! రాత మార్చింది

బీజేపీ ఓట్లలో 5% కాంగ్రెస్‌కు బదిలీ ● దాంతో హస్తానికి 43% ఓట్లు, 135 సీట్లు

జేడీ(ఎస్) ఓట్లకు 7% కోత వాటిలో 5% బీజేపీకి | **బీజేపీకి ఈసారి 36% ఓట్లు 2018లో 36.2% ఓట్లు** | **తగ్గింది 0.2 శాతమే కానీ 38 సీట్లకు కోత** | **లింగాయత్ ప్రాబల్యమున్న 69 సీట్లలో 45 కాంగ్రెస్‌కే**


కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ సాధించిన విజయం విలక్షణమైనదనే చెప్పాలి. రాష్ట్రంలో దశాబ్దాలుగా పాతుకుపోయిన పార్టీలవారీ ప్రాంతీయ సరిహద్దులను చెరిపేసి ట్రెండునే మార్చేసిన గెలుపది. చారిత్రకంగా బీజేపీ, జేడీ(ఎస్)ల కంచుకోటలైన కీలక ప్రాంతాల్లో ఈసారి కాంగ్రెస్ ఆధిపత్యం ప్రదర్శించింది. అది కూడా రెండు పార్టీలనూ ఒకే ఎన్నికల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో దెబ్బ తీయడం విశేషం. బీజేపీ ఓడినా మొత్తమ్మీద ఆ పార్టీ ఓటు బ్యాంకు మాత్రం పదిలంగానే ఉండటం మరో విశేషం. బీజేపీకి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 36.2 శాతం ఓట్లు రాగా ఈసారి 36 శాతం దక్కాయి. కాకపోతే ఈసారి జేడీ(ఎస్) రాష్ట్రవ్యాప్తంగా కోల్పోయిన 7 శాతం ఓట్లలో 5 శాతం ఓట్లను బీజేపీ దక్కించుకుంది. అదే సమయంలో అంతిమ ఫలితాన్ని తేల్చడంలో కీలకంగా మారిన పలు అసెంబ్లీ స్థానాల్లో కలిపి మొత్తమ్మీద 5 శాతం ఓట్లను కాంగ్రెస్‌కు కోల్పోయింది. దాంతో మెజారిటీకి బీజేపీ సుదూరంలో ఆగిపోగా ఆ ఓట్ల ఊపుతో కాంగ్రెస్ గెలుపు బావుటా ఎగరేసింది. 2018లో 38 శాతం ఓట్లు సాధించిన ఆ పార్టీ, ఈసారి 43 శాతం ఓట్లతో 135 సీట్లు గెలుచుకుంది. బీజేపీ 66 సీట్లకు పరిమితమైంది. బీజేపీకి గట్టి పట్టున్న ముంబై కర్ణాటక, జేడీ(ఎస్) దుర్గమైన పాత మైసూరు ప్రాంతాలు ఈసారి కాంగ్రెస్‌కు జై కొట్టాయి. కర్ణాటక ఫలితాల ప్రాంతాలవారీ విశ్లేషణలో ఇలాంటి పలు ఆసక్తికరమైన విశేషాలు తెరపైకి వస్తున్నాయి...

కోస్తా కర్ణాటక

బీజేపీ కంచుకోటల్లో ఈ ప్రాంతమూ ఒకటి. కొన్ని దశాబ్దాలుగా లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ ఎప్పుడూ బీజేపీదే పై చేయి. ఈసారి కూడా కాంగ్రెస్ కంటే బీజేపీ రెట్టింపు సీట్లు నెగ్గిన, ఆ పార్టీకి ఊరటగా నిలిచిన ఏకైక ప్రాంతం కోస్తానే. ఇక్కడి 19 స్థానాల్లో బీజేపీ 13, కాంగ్రెస్ 6 నెగ్గాయి. అయినా 2018తో పోలిస్తే బీజేపీకి 3 సీట్లు తగ్గగా ఆ మేరకు కాంగ్రెస్‌కు పెరిగాయి. బీజేపీకి దాదాపుగా 3 శాతం ఓట్లు తగ్గి ఆ మేరకు కాంగ్రెస్‌కు పెరగడమే ఇందుకు కారణం.

బెంగళూరు సిటీ

రాజధాని కావడంతో పూర్తిగా నగర ఓటర్లతో కూడిన వైవిధ్యమైన ప్రాంతమిది. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ మధ్య ప్రతి ఎన్నికల్లోనూ నువ్వా నేనా అన్నట్టుగా పోరు సాగుతుంది. గత నాలుగు ఎన్నికల్లోనూ రెండు పార్టీలకూ దాదాపుగా చెరో 40 శాతం ఓట్లొచ్చాయి. ఈసారి కూడా బీజేపీ 46 శాతం, కాంగ్రెస్‌కు 41 శాతం ఓట్లు సాధించాయి. అయితే బీజేపీ 2018 కంటే 4 సీట్లు ఎక్కువగా గెలుచుకోగా కాంగ్రెస్ 2 స్థానాలు కోల్పోయింది. ఇక జేడీ(ఎస్) ఇక్కడ 2018లో గెలిచిన 2 సీట్లనూ కోల్పోయింది.



సెంట్రల్ కర్ణాటక

ఇది స్వింగ్ ప్రాంతంగా పేరుబడింది. ఒక్కోసారి ఒక్కో పార్టీని ఆదరిస్తూ వస్తోంది. 2008లో బీజేపీని, 2013లో కాంగ్రెస్‌ను అక్కున చేర్చుకుంది. మళ్లీ 2018లో ఇక్కడి 23 సీట్లలో బీజేపీ 16 గెలవగా ఈసారి కాంగ్రెస్ 15 నెగ్గింది!

హైదరాబాద్ కర్ణాటక

తన కంచుకోటైన ఈ ప్రాంతాన్ని కాంగ్రెస్ ఈసారి స్వీప్ చేసేసింది. ఎస్సీల ఆదరణకు తోడు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సొంత ప్రాంతం కావడం ఈసారి ఆ పార్టీకి మరింత కలిసొచ్చింది. దాంతో 46 శాతం ఓట్లతో మొత్తం 40 సీట్లకు గాను ఏకంగా 26 స్థానాలను ఒడిసిపట్టింది. బీజేపీ 10 సీట్లకు పరిమితమైంది.


ముంబై కర్ణాటక

లింగాయత్‌ల ప్రాబల్యమున్న ఈ ప్రాంతం బీజేపీ కంచుకోట. 1990లో రాజీవ్‌గాంధీ చేతిలో తమ సామాజిక వర్గానికి చెందిన నాటి సీఎం వీరేంద్ర పాటిల్‌కు జరిగిన ఘోర అవమానం నేపథ్యంలో దశాబ్దాలుగా కాంగ్రెస్‌ను దూరం పెట్టిన లింగాయత్‌లు ఈసారి ఆ పార్టీని అక్కున చేర్చుకున్నారు. దాంతో దాదాపు 45 శాతం ఓట్లతో మొత్తం 50 స్థానాల్లో ఏకంగా 33 సీట్లు కాంగ్రెస్ హస్తగతమయ్యాయి. గత 3 దశాబ్దాల్లో ఇక్కడ కాంగ్రెస్ ఓట్ల శాతం 40 శాతం దాటడం ఇదే తొలిసారి! ఇక బీజేపీ ఈసారి దాదాపు 3 శాతం ఓట్లను కాంగ్రెస్‌కు కోల్పోయింది. దాంతో 2018తో పోలిస్తే ఏకంగా 14 సీట్లు కోల్పోయి 16 సీట్లకు పరిమితమైంది. లింగాయత్‌ల జనాభా 20 శాతానికి పైగా ఉండి వారి ఓట్లు నిర్ణాయకంగా మారే మొత్తం 69 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీకి ఈసారి కోలుకోలేని దెబ్బ తగిలింది. వీటిలో కాంగ్రెస్ ఏకంగా 45 సీట్లు కొల్లగట్టగా బీజేపీకి కేవలం 20 స్థానాలు దక్కాయి.

పాత మైసూరు

64 అసెంబ్లీ స్థానాలతో రాష్ట్రంలో అతి పెద్ద ప్రాంతమిది. జేడీ(ఎస్)కు ఆవిర్భావం నుంచీ పెట్టని కోటగా ఉంటూ వస్తోంది. ఈసారి కాంగ్రెస్ ఇక్కడ ఏకంగా 42 శాతం ఓట్లు సాధించింది. 2018 కంటే ఇది ఏకంగా 7 శాతం ఎక్కువ! దాంతో కాంగ్రెస్ తన చరిత్రలోనే అత్యధికంగా ఇక్కడ 43 సీట్లు కొల్లగొట్టింది. మరోవైపు జేడీ(ఎస్) 2018తో పోలిస్తే ఏకంగా 9 శాతం ఓట్లు కోల్పోయింది. అప్పుడు 26 సీట్లు నెగ్గగా ఈసారి 14కు పరిమితమైంది. ఇక బీజేపీకి ఓట్లు 2.8 శాతం పెరిగినా ఏకంగా 11 సీట్లు తగ్గాయి!

- సాక్షి, నేషనల్ డెస్క్





సీఎం ఎంపిక ఖర్గే చేతికి!

కర్ణాటక సీఎల్పీ ఏకవాక్య తీర్మానం | **సోనియా కోర్టులో బంతి** | **నేడు ఢిల్లీకి సిద్దూ, డీకే?** | **ఇద్దరి మధ్య పోటీ తీవ్రం**

బెంగళూరు: కర్ణాటక ముఖ్యమంత్రి ఎంపిక అంత తేలికగా ముగిసేలా కనిపించడంలేదు. సీఎం అభ్యర్థిని నిర్ణయించే అధికారాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకే నూతన ఎమ్మెల్యేలు కట్టబెట్టారు. ఆదివారం సాయంత్రం బెంగళూరులోని ఓ హోటల్లో కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం జరిగింది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘన విజయానికి కారకులైన నాయకులు, కార్యకర్తలు, కర్ణాటక ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ తొలుత పీసీసీ చీఫ్ డీకే శివకుమార్ ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సమావేశం ఆమోదించింది. అనంతరం సీఎం ఎంపిక అధికాన్ని ఖర్గేకు అప్పగిస్తూ మాజీ సీఎం సిద్దరామయ్య ప్రవేశపెట్టిన ఏక వాక్య తీర్మానాన్ని కూడా ఎమ్మెల్యేలు ఆమోదించినట్లు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. అధిష్టానం తరఫున ఖర్గే నియమించిన ముగ్గురు పరిశీలకులు సీఎం అభ్యర్థిపై ఎమ్మెల్యేల అభిప్రాయాలను తీసుకుంటారని చెప్పారు. ఆదివారం ఈ తతంగం పూర్తి చేసి సోమవారానికల్లా ఖర్గేకు వారు నివేదిక అందజేస్తారన్నారు. ఖర్గే నియమించిన పరిశీలకుల కమిటీలో మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్‌కుమార్ షిండే, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జితేంద్ర సింగ్, ఏఐసీసీ మాజీ కార్యదర్శి దీపక్ బబారియా ఉన్నారు. వీరు, వేణుగోపాల్ అంతకుముందు సీఎం రేసులో ఉన్న సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లతో వేర్వేరుగా భేటీ అయ్యారు.

కార్యకర్తల హడావుడి

సీఎల్పీ భేటీ జరిగిన హోటల్ బయట కాంగ్రెస్ కార్యకర్తల హడావుడి కనిపించింది. సిద్దరామయ్య, శివకుమార్ వర్గీయులు బ్యానర్లు, జెండాలు చేతబూని తమ నేతే సీఎం అంటూ నినాదాలు చేశారు. అంతకుముందు ఇద్దరు నేతలు తమకు మద్దతు తెలిపే ఎమ్మెల్యేలతో వేర్వేరుగా భేటీలు జరిపారు. రెండు వర్గాలు పోటాపోటీగా పోస్టర్లు వేశాయి. ఇద్దరు నేతల నివాసాల వద్ద కూడా పోస్టర్లు కనిపించాయి. ఎన్నికలకు ముందు పార్టీ నేతలను ఒకే తాటిపైకి తేవడంలో సఫలీకృతమైన కాంగ్రెస్ పార్టీ ఫలితాల తర్వాత అదే ఐక్యతను కొనసాగించడానికి ఇబ్బందులు పడుతోంది. కర్ణాటక అసెంబ్లీ గడువు ఈ నెల 24తో ముగియనుంది. తాజా ఎన్నికల్లో పూర్తిస్థాయి మెజారిటీ సాధించిన కాంగ్రెస్ ఆలోపు ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి ఉంది.

నేడూ సీఎల్పీ భేటీ?

బనశంకరి: ఆదివారం నాటి సీఎల్పీ సమావేశానికి చాలామంది ఎమ్మెల్యేలు హాజరుకాలేదు. దాంతో నూతన సభ్యులందరి అభిప్రాయాలు తెలుసుకునేందుకు భేటీ సోమవారం కూడా కొనసాగుతుందని భావిస్తున్నారు. సిద్దరామయ్యకు 75 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉండగా 40 మంది డీకే శివకుమార్ వెంట ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో వారిద్దరూ సీఎం పదవిని చెరో రెండున్నరేళ్లు పంచుకునేలా సూత్రంపైనా ఆదివారం భేటీలో చర్చించారు. సిద్ధరామయ్య, డీకే సోమవారం ఢిల్లీ వెళతారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో సోనియాగాంధీ, రాహుల్ సమక్షంలో సీఎం అంశం కొలిక్కి వస్తుందని భావిస్తున్నారు.

ఓవర్ టు రాజస్తాన్



ఎస్.రాజమహేంద్రారెడ్డి

మల్లికార్జున ఖర్గే ఇంట గెలిచారు. ఇక రచ్చ గెలవడానికి సన్నద్ధమవుతున్నారు. గ్రాండ్ ఓల్డ్ పార్టీ కాంగ్రెస్ బాస్‌గా 80 ఏళ్ల వయసులో నియమితుడైనప్పుడు, పార్టీని గాడిలో పెట్టడం ఖర్గేకు తలకు మించి భారమే అవుతుందని విశ్లేషకులు అంచనా వేశారు. దశాబ్ద కాలంగా వరుస పరాజయాలతో, పరాభవాలతో నానాటికీ తీసికట్టుగా తయారవుతున్న కాంగ్రెస్‌కు యువరక్తం ఎక్కిస్తే ఆ జోష్ వేరేగా ఉండేదని కూడా వ్యాఖ్యానించారు. గాంధీల (సోనియా, రాహుల్)కే చేతకానిది ఈయన వల్ల అవుతుందా అంటూ పెదవి విరిచిన వాళ్లూ ఉన్నారు. శనివారం ఖర్గే సొంత రాష్ట్రం కర్ణాటక అసెంబ్లీ ఫలితాలు చూశాక చాలామందికి ఆయన నాయకత్వ పటిమపై అనుమానాలు పటాపంచలైపోయాయి. నిజానికి కాంగ్రెస్ సాధించిన ఈ విజయం మామూలుదా! ఇంకోపార్టీ దయాదాక్షిణ్యాల మీద ఆధారపడాల్సిన అవసరం లేకుండా సొంత కాళ్లమీద మరో ఐదేళ్లు మందగమనంతోనో, వాయువేగంతోనో పరుగెత్తగల ఆత్మవిశ్వాసాన్ని, సత్తాను కాంగ్రెస్‌కు అందించింది. కర్ణాటక కాంగ్రెస్‌కు రెండు కళ్లలాంటి మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ మధ్య రగులుతున్న చిరకాల వైరాన్ని చల్లార్చడం ఎవరి తరమూ కాదన్న సమయంలో ఖర్గే జాతీయ అధ్యక్షుని హోదాలో రంగంలోకి దిగి చాకచక్యంగా ఆ అగ్నిని చల్లార్చారు. అదిగో అక్కడే, ఎన్నికల నోటిఫికేషన్ కూడా వెలువడటానికి ముందే, యుద్ధ భూమిలోకి దిగకముందే కాంగ్రెస్‌కు సగం విజయాన్ని చేకూర్చారు. అభ్యర్థుల ఎంపిక దగ్గర నుంచి ప్రచారం మొదలై ఓటేసే తేదీ వచ్చేదాకా సిద్దరామయ్య, శివకుమార్ పల్లెత్తు మాట అనుకోకుండా ఆప్త మిత్రుల్లా కనిపించడం కర్ణాటక ఓటర్లలోకాంగ్రెస్‌పై నమ్మకాన్ని పెంచింది. రాహుల్ భారత్ జోడో యాత్ర ఎన్నికలకు ముందే కర్ణాటక మీదుగా వెళ్లేట్టు వ్యూహరచన చేయడం కూడా కాంగ్రెస్‌కు లాభించింది. ఈ రెండు అంశాల్లోనూ ఖర్గే వ్యూహాత్మకంగా వ్యవహరించి కన్నడిగుల మనసు కొల్లగొట్టారు. దాని ఫలితమే ఈ సానుకూల ఫలితాలు.

రాజస్తాన్ పరీక్షకు రెడీ

తన మొదటి లక్ష్యాన్ని జనం జేజేల మధ్య దిగ్విజయంగా చేరుకున్న ఖర్గే తదుపరి లక్ష్యంవైపు దృష్టి సారించారు. బెంగళూరులో మోగిన విజయదుందుభి 1,921 కిలోమీటర్ల దూరంలో ఉన్న జైపూర్‌లో ప్రతిధ్వనించింది. ఒకరకంగా ఇది రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు ఖర్గే మోగించిన నగారా! అంతర్గత పోరుతో సతమతమవుతున్న అక్కడి పార్టీ వ్యవహారాలను కొలిక్కి తేవడం ఖర్గే ముందున్న తక్షణ కర్తవ్యం. సీఎం గహ్లోత్, యువ నేత సచిన్ పైలట్ మధ్య సయోధ్య కుదర్చాల్సి ఉంది. సీన్ రాజస్తాన్‌కు మారుతుంది. అదే సీన్, అదే దర్శకుడు. పాత్రలే మారతాయి. అంతే. చేయి తిరిగిన దర్శకుడు గనుక అక్కడా లక్ష్యాన్ని చేరతారంటున్నారు.

ఇక రాజస్తాన్ 'రచ్చ'పై దృష్టి

2018లో జరిగిన రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను విజయపథంలో నడిపించిన పైలట్‌ను కాదని గహ్లోత్‌కు పట్టం కట్టడంతో వారి మధ్య అగ్గి రాజుకుంది. ఐదేళ్లు గడిచి మళ్లీ ఎన్నికల ముంగిట్లోకి వచ్చేసరికి అది కాస్తా కార్చిచ్చులా వ్యాపించింది. సొంత పార్టీ మీద, ముఖ్యమంత్రి మీదా అలిగి ధర్నా చేసేందుకూ పైలట్ వెనకాడలేదంటే ఆయనలో అసంతృప్తి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. మరోవైపు గతేడాది సెప్టెంబర్లో తనను వరించి వచ్చిన కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవిని గహ్లోత్ తృణీకరించారు. సీఎం పదవే ముద్దంటూ బింకానికి పోయారు. అప్పటికే ఆయన పేరిట 12 సెట్ల నామినేషన్ పత్రాలు కూడా సిద్ధమయ్యాయి. అధిష్టానం కోరికను, లేదా ఆదేశాన్ని మన్నించకుండా రాష్ట్రానికే పరిమితమైన గహ్లోత్‌కు, తన స్థానంలో అధ్యక్షుడైన ఖర్గే ముందు చేతులు జోడించి నిల్చోవాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. విభేదాలు పక్కన పెడతారా, అధిష్టానం ముందు హాజరవుతారా అంటూ ఖర్గే ఇప్పటికే ఆ ఇద్దరికీ తాఖీదు పంపించారు. గాంధీల ఆశీర్వాదంతో అధ్యక్షుడైన ఖర్గే కర్ణాటక విజయంతో మరో మెట్టు పైకి చేరుకున్నారు. పార్టీలో ఇప్పుడు ఆయన మాటలకు తిరుగులేదు. త్వరలోనే గహ్లోత్, పైలట్‌లను పిలిచి బుజ్జగించడమో, తప్పదనుకుంటే హెచ్చరించడమో తప్పని పరిస్థితిలో ఖర్గే ఉన్నారు. ఈ ఏడాది డిసెంబరులో

కాంగ్రెస్ బాస్‌గా భేషైన పనితీరు

జరగనున్న రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలను ఎదురీదడం కాంగ్రెస్‌కు కష్టమేనన్నది అంతర్గత నివేదికల సారాంశం. ఈ నివేదికల నేపథ్యంలో ఖర్గే మరింత వ్యూహాత్మకంగా వ్యవహరించేందుకు అవసరమైన పథకాలను సిద్ధం చేసుకుంటున్నారు. పక్షం రోజుల ముందే సీనియర్ నేతలు కమల్‌నాథ్, వేణుగోపాల్ ద్వారా సచిన్‌కు రాయబారం పంపారు. విభేదాలు పక్కన పెడితే ఏఐసీసీ జనరల్ సెక్రటరీ పదవితో పాటు వర్కింగ్ కమిటీలోనూ చోటు కల్పిస్తానని ఆశ చూపారు. పైలట్ ఈ ప్రతిపాదనను తోసిపుచ్చారని అభిజ్ఞ వర్గాల భోగట్టా. ఈ నేపథ్యంలో పైలట్‌ను రాజస్తాన్ పీసీసీ అధ్యక్షునిగా నియమించాలన్నది ఖర్గే మరో ఆలోచనగా ఉంది. పార్టీ టికెట్ల విషయంలో, మంత్రివర్గంలో కొన్ని స్థానాల విషయంలో తనమాట చెల్లితే అభ్యంతరం లేదని పైలట్ భావిస్తున్నట్టు వినికిడి. అయితే ఈ ప్రతిపాదనకు సమ్మతించేది లేదని గహ్లోత్ బాహాటంగానే స్పష్టం చేశారు. దీనికి విరుగుడుగా పైలట్ ఈ నెల చివరి వారంలోనో, వచ్చే నెల మొదటి వారంలోనో పార్టీని చీల్చడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. తన తండ్రి రాజేశ్ పైలట్ వర్ధంతి (జూన్ 11) నాటికి పైలట్ చీలిక వర్గాన్ని తయారు చేసి తీరతారంటున్నారు. అదే జరిగితే వీరి వ్యవహారాన్ని అధిష్టానం మరింత సీరియస్‌గా తీసుకునే అవకాశముంది.

గహ్లోత్–పైలట్ విభేదాలు తారస్థాయికి

గహ్లోత్, పైలట్ తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కనపెట్టి పార్టీ నిర్ణయానికి బద్ధులుగా ఉండాలన్నది అధిష్టానం మాటగా ఖర్గే హితవు చెబుతున్నారు. గాంధీలు కూడా ఖర్గే మాటే ఫైనల్ అన్న సంకేతాన్ని పరోక్షంగా ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో గహ్లోత్, పైలట్ మధ్య రాజీ కుదిర్చి రాజస్తాన్‌లోనూ పార్టీని ఎన్నికల యుద్ధక్షేత్రంలో సమర్థంగా ముందుకు నడపడం ఖర్గేకు పెద్ద కష్టమేమీ కాదు.

సీబీఐ కొత్త డైరెక్టర్‌గా సూద్

ప్రస్తుతం కర్ణాటక డీజీపీగా ఉన్న సూద్ | **రెండేళ్లు పదవిలో కొనసాగనున్న సూద్**



న్యూఢిల్లీ: సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) తదుపరి డైరెక్టర్‌గా కర్ణాటక డీజీపీ ప్రవీణ్ సూద్ నియమితులయ్యారు. ప్రస్తుత డైరెక్టర్ సుబోధ్ కుమార్ జైస్వాల్ పదవీ కాలం ఈ నెల 25న ముగిసిపోనుంది. అదే రోజు ప్రవీణ్ సూద్ బాధ్యతలు స్వీకరిస్తారని ఆదివారం విడుదల చేసిన ఒక అధికారిక ప్రకటన వెల్లడించింది. 59 ఏళ్ల వయసున్న ప్రవీణ్ సూద్ రెండేళ్ల పాటు సీబీఐ డైరెక్టర్ పదవిలో కొనసాగుతారు. 1986 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి అయిన ప్రవీణ్ సూద్ కర్ణాటక్ కేడర్‌కు చెందినవారు. జైస్వాల్ తర్వాత దేశంలో అత్యంత సీనియర్ అధికారి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీ.వై. చంద్రచూడ్, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అధిర్ రంజన్ చౌధరి సభ్యులుగా ఉన్న హైపవర్డ్ కమిటీ శనివారం నాటి సమావేశంలో ప్రవీణ్ సూద్ పేరుకి ఆమోద ముద్ర వేసింది. కేంద్ర సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రవీణ్ సూద్ నియామకాన్ని రంజన్ చౌధరి వ్యతిరేకించినట్టుగా తెలుస్తోంది. ప్రవీణ్ ఐఐటీ ఢిల్లీ, ఐఐఎం బెంగళూరు, న్యూయార్క్‌లోని సిర్కాజ్ వర్సిటీ నుంచి డిగ్రీలు పొందారు.

సీబీఐ డైరెక్టర్‌గా నియమి తులైన ప్రవీణ్ సూద్ చుట్టూ ఎన్నో వివాదాలు ఉన్నాయి. కర్ణాటకలో కాంగ్రెస్ నేతలకి, ఆయనకి మధ్య విభేదాలు తరచూ బట్టబయలయ్యాయి. అందుకే సూద్ నియామకాన్ని హై పవర్డ్ కమిటీ సభ్యుడైన కాంగ్రెస్ నేత రంజన్ చౌధరి తీవ్రంగా వ్యతిరేకించినట్టు

సూద్ వర్సెస్ శివకుమార్

తెలుస్తోంది. బెంగళూరు కమిషనర్‌గా 2017లో నియమితులైన సూద్‌ని ఆరు నెలల్లోనే నాటి సీఎం సిద్ధరామయ్య బదిలీ చేశారు. బీజేపీ అధికారంలోకి రాగానే సూద్ తిరిగొచ్చి డీజీపీగా ఎదిగారు. సూద్ బీజేపీ ఏజెంట్ అంటూ గత మార్చిలో పీసీసీ అధ్యక్షుడు శివకుమార్ తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఆయనపై కేసు పెట్టి అరెస్ట్ చేస్తామని శివకుమార్ బహిరంగంగానే హెచ్చరించారు!

కర్ణాటకలో 66కు పెరిగిన బీజేపీ సీట్లు

బెంగళూరు: కర్ణాటకలో జయనగర అసెంబ్లీ స్థానం ఫలితం ఆదివారం అర్ధరాత్రి దాటాక తేలింది. పోస్టల్ ఓట్లను కూడా కలపగా కాంగ్రెస్ అభ్యర్థి చెందిన సౌమ్యా రెడ్డిని బీజేపీ అభ్యర్థి రామమూర్తి 16 ఓట్ల తేడాతో ఓడించినట్టు అధికారులు ప్రకటించారు. దాంతో కాంగ్రెస్ మొత్తం 135 సీట్లు సాధించగా బీజేపీ 66 చోట్ల నెగ్గింది. అయితే స్వతంత్ర ఎమ్మెల్యే లతా మల్లికార్జున్ కాంగ్రెస్‌కు మద్దతు తెలపడంతో ఆ పార్టీ బలం 136కు చేరుకుంది.

రష్యాపై ఎదురుదాడికి ఉక్రెయిన్ సన్నాహాలు!

బెర్లిన్: రష్యా ఆక్రమించిన ప్రాంతాలకు తిరిగి విముక్తి కల్పించడానికి ఎదురుదాడికి దిగుతామని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ చెప్పారు. అయితే రష్యా భూభాగంపై దాడులకు పాల్పడబోమని స్పష్టం చేశారు. జర్మనీ పర్యటనకు వెళ్లిన జెలెన్‌స్కీ ఆదివారం జర్మనీ ఛాన్సలర్ ఒలఫ్ స్కోల్జ్‌తో సమావేశమయ్యారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన సరిహద్దు ప్రాంతాలకు విముక్తి కల్పించడమే తమ మీడియాకు లక్ష్యమని తెలిపారు. తమ ప్రాంతాలను రష్యాపై నుంచి తీసుకుంటామన్నారు. రష్యాపై దాడికి దిగేటంత ఆయుధ సంపత్తి తమ దగ్గర లేదన్నారు. రష్యా అక్రమంగా స్వాధీనం చేసుకున్న ప్రాంతాలను తిరిగి తీసుకుంటామని చెప్పారు. తమకు అండదండగా ఉంటూ 300 కోట్ల డాలర్ల విలువైన మిలటరీ సాయం చేసిన జర్మనీ ఛాన్సలర్ ఒలఫ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

సోమవారం । 15 । మే । 2023



చలో పొలానికి

ఇప్పటివరకు ఎన్నికల సందడిలో మునిగితేలిన గ్రామీణులు పొలం బాట పట్టారు. ఆదివారం బెళగావి వద్ద కనిపించిన దృశ్యం

న్యూస్‌రీల్

గవర్నర్‌కు విజేతల జాబితా



అందజేస్తున్న ఎన్నికల సంఘం అధికారులు

బనశంకరి: శాసనసభ ఎన్నికల ఓట్ల లెక్కింపు పూర్తయి ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఏ పార్టీకి ఎన్ని సీట్లు అనేది స్పష్టమైంది. ఆదివారం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు మొత్తం 224 నియోజకవర్గాల్లో గెలుపొందిన అభ్యర్థుల జాబితాను రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు రాజ్‌భవన్‌లో కలిసి అందజేశారు. ఎన్నికలు నిర్వహణ, ఇతర అంశాల గురించి గవర్నర్‌కు వివరించారు.

దొడ్డ కాంగ్రెస్‌లో విచారం

- ఎమ్మెల్యే ఓటమితో దిగులు

దొడ్డబళ్లాపురం: దొడ్డ కాంగ్రెస్‌లో విషాద ఛాయలు అలముకొన్నాయి. వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వెంకటరమణయ్య ఓడిపోవడం ఏమిటని కార్యకర్తలు దిగులు చెందారు. గెలుపు కచ్చితమని మెజారిటీనే తేలాల్సి ఉందని, ఆయన మంత్రి కావడమే ఆలస్యమని కార్యకర్తలు, అభిమానులు ప్రచారం చేసుకుంటే తీరా ఫలితాల్లో ఓడిపోయారు. మొదటిసారి పోటీచేసిన బీజేపీ అభ్యర్థి ధీరజ్ మునిరాజు రాష్ట్రంలో ఆ పార్టీకి వ్యతిరేకత ఉన్నా 31 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించడంతో కాంగ్రెస్ కంగుతింది. రాష్ట్రంలో కాంగ్రెస్ స్పష్టమైన మెజారిటీతో అధికారం చేపట్టబోతున్నా విజయోత్సవం చేసుకోలేని పరిస్థితిలో దొడ్డ కాంగ్రెస్ కార్యకర్తలు ఉన్నారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలో నెలమంగల, దేవనహళ్లి, హొసకోట తాలూకాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికై సత్తా చాటారు. ఒక్క దొడ్డలో మాత్రమే కాంగ్రెస్ అభ్యర్థి ఓడిపోవడంతో ఆ పార్టీ ఆఫీసు వెలవెలబోతోంది. కాంగ్రెస్ హవా ఉన్నా ఓడిపోవడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది.

సిటీ బస్‌కు బ్రేక్ ఫెయిల్

బనశంకరి: బీఎంటీసీ బస్సు బ్రేక్ ఫెయిల్ కావడంతో నగరంలో కార్పొరేషన్ సర్కిల్ సిగ్నల్ వద్ద ఆదివారం పలు వాహనాల మీదకు దూసుకెళ్లింది. శివాజీనగర నుంచి వస్తున్న బీఎంటీసీ బస్ సర్కిల్ వద్ద కు రాగానే బ్రేక్ పడకపోవడంతో నిలబడి ఉన్న కారును ఢీకొట్టింది. ఆ కారు వెళ్లి మరో కారును, ఆటోను ఢీకొంది. మూడు వాహనాలూ దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తు ఎవరికీ గాయాలు కాలేదు. హలసూరు గేట్ ట్రాఫిక్ పోలీసులు చేరుకుని కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యేలతో సిద్దు రహస్య భేటీ?

శివాజీనగర: ముఖ్యమంత్రి పదవి తనకే దక్కేలా సీఎల్పీ నేత సిద్దరామయ్య రహస్య సమావేశాలకు నాంది పలికారు. బెంగళూరులోని ఓ భవనంలో తన మద్దతుదారులైన ఎమ్మెల్యేలతో భేటీ నిర్వహించనున్నారని సమాచారం. ఎం.బీ.పాటిల్, జమీర్ అహమ్మద్‌ఖాన్, ఉత్తర కర్ణాటకకు ఎమ్మెల్యేలు పాల్గొనే అవకాశముంది. మరోవైపు కొత్త సీఎంకు శుభాభినందనలు అని సిద్దు ఇంటి ముందు కొందరు అభిమానులు పోస్టర్లు కట్టారు.

సిద్దును కలిసిన లత

హరపనహళ్లి నుంచి స్వతంత్ర ఎమ్మెల్యేగా గెలుపొందిన లతా మల్లికార్జున, సిద్దరామయ్యను భేటీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఫోటోను ట్వీట్ చేసిన సిద్దరామయ్య, విజయం సాధించిన ఆమెకు శుభాకాంక్షలు తెలిపానని చెప్పారు.

హైటెన్షన్ @ జయనగర

30 వేలు, 40 వేల ఓట్లతో ఓడిపోవడం వేరు. రాష్ట్రమంతటా ఎదురుగాలి వీచినప్పుడు అందరితో పాటు ఓటమి పాలైతే పెద్ద బాధ ఉండదు. కానీ అప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యే, రాష్ట్రమంతా హస్తం పవనాలు వీచాయి. ఈ సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి 160 ఓట్లతో గెలిచి హమ్మయ్య అనుకున్నారు. కానీ బీజేపీ డిమాండ్‌తో పదే పదే రీకౌంటింగ్ జరిపి చివరకు 16 ఓట్లతో ప్రత్యర్థిని గెలుపు వరించింది. బెంగళూరు జయనగర నియోజకవర్గంలో అతి స్వల్ప ఓట్లు అభ్యర్థుల రాతను తారుమారు చేశాయి.

- గెలిచి, మళ్లీ ఓడిన కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి
- అర్ధరాత్రి వరకూ మూడుసార్లు రీ కౌంటింగ్
- 16 ఓట్లతో బీజేపీ గెలిచినట్లు ప్రకటన
- అగ్రనేతల రాకతో ఉద్రిక్తత



విజయం దక్కినట్లే దక్కి చేజారడంతో సౌమ్యారెడ్డి ఆవేదన



కన్నీటి సంద్రమైన సౌమ్యారెడ్డి

బనశంకరి: ఐటీ సిటీలో జయనగర నియోజకవర్గంలో నాటకీయ పరిణామాల మధ్య విజేత మారిపోయారు. తొలుత ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యారెడ్డి స్వల్ప మెజారిటీతో గెలిచినట్లు ప్రకటించడంతో సంబరాలు మిన్నంటాయి. అంతలోనే బీజేపీ నాయకులు పట్టుబట్టి రీకౌంటింగ్ చేయించారు. ఇందులో బీజేపీ అభ్యర్థి సీకే.రామమూర్తి 16 ఓట్లతో గెలిచినట్లు అధికారులు తెలిపారు. దీంతో క్షణాల్లో పరిస్థితి మారిపోయింది. శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి దాటేవరకూ ఏకధాటిగా హైడ్రామా టెన్షన్ పుట్టించింది.

పోటాపోటీగా రౌండ్లు

జయనగర ఎస్ఎస్ఎంఆర్‌వీ కాలేజీ కౌంటింగ్ కేంద్రంలో లెక్కింపు ఆరంభమైంది. ప్రతి రౌండ్‌లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటాపోటీగా తలపడ్డారు. మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే సౌమ్యారెడ్డి 160 ఓట్ల మెజారిటీతో గెలుపొందారని ప్రకటించగానే ఆమెతో పాటు కార్యకర్తల సంతోషానికి హద్దుల్లేవు. కానీ ఓట్ల తేడా చాలా తక్కువగా ఉండటంతో రీకౌంటింగ్ చేయాలని బీజేపీ అభ్యర్థి రామూర్తి డిమాండ్ చేయడంతో మళ్లీ రీకౌంటింగ్ ప్రారంభించారు.

గెలుపు ప్రకటన

జిల్లా ఎన్నికల అధికారి తుషార్ గిరినాథ్ రీకౌంటింగ్ చేసిన విధానం గురించి నేతలకు వివరించి, సీకే రామమూర్తి 16 ఓట్లతో గెలిచినట్లు ప్రకటించారు. బీజేపీకి 57,797 ఓట్లు, కాంగ్రెస్‌కు 57,781 ఓట్లు వచ్చాయని తెలిపారు.

కార్యకర్తల ధర్నా

దీంతో కాంగ్రెస్ నేతలు గత్యంతరం లేక ఇంటి ముఖం పట్టారు. గెలుపు దక్కి మళ్లీ ఓటమి పాలు కావడంతో సౌమ్యారెడ్డి విలపించారు. 16 ఓట్ల మెజారిటీతో సీకే రామూర్తి గెలుపు సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కౌంటింగ్‌లో గోల్‌మాల్ జరిగిందంటూ అర్ధగంటకు పైగా ధర్నాకు దిగారు. కాగా, ఫలితాలపై కోర్టును ఆశ్రయించాలని సౌమ్యారెడ్డి నిర్ణయించారు.

పదేపదే ఓట్ల లెక్కింపు

మొదటిసారి నిర్వహించిన రీకౌంటింగ్‌ను ఇద్దరు అభ్యర్థులు ఒప్పుకోలేదు. దీంతో వరుసగా మూడుసార్లు రీకౌంటింగ్ చేశారు. ఈ సమయంలో ఓట్ల లెక్కింపు సమయంలో గోల్‌మాల్ జరిగిందని కాంగ్రెస్ కార్యకర్తలు గొడవకు దిగడంతో కేపీసీసీ అధ్యక్షుడు డీకే.శివకుమార్ కౌంటింగ్ కేంద్రానికి వచ్చి పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద సౌమ్యారెడ్డి తండ్రి రామలింగారెడ్డి, ఎంపీ డీకే.సురేశ్, కేపీసీసీ చీఫ్ డీకే.శివకుమార్, ఇక బీజేపీ నేతలు ఆర్.అశోక్, ఎంపీ తేజస్విసూర్య మకాం పెట్టడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.



అనూహ్య విజయం.. బీజేపీ అభ్యర్థి రామమూర్తి



కౌంటింగ్ కేంద్రం వద్ద కాంగ్రెస్ నేతల మకాం

సిద్దగంగ మఠం సందర్శన



సిద్దలింగ స్వామితో రాజన్న

తుమకూరు: మధుగిరి నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి రాజన్న ఆదివారం తుమకూరు నగరంలోని సిద్దగంగ మఠానికి వచ్చారు. శివకుమారస్వామిజీ సమాధిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మఠాధ్యక్షుడు సిద్దలింగ స్వామీజీ ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ... సిద్దగంగ మఠంతో తనకు ఎంతో అనుబంధం ఉందని, 1964 నుంచి 1967 వరకు తాను ఇక్కడ చదువుకున్నట్లు గుర్తు చేసుకున్నారు.

టీబీ జయచంద్ర విజయోత్సవ ర్యాలీ

తుమకూరు: తుమకూరు జిల్లా శిరా నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన టీబీ జయచంద్ర ఆదివారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు.

ఈ ఓటమి గుణపాఠం

మండ్య: శాసనసభ ఎన్నికల్లో తాను మొదటిసారిగా పోటీ చేశానని, కొన్ని కారణాల వల్ల ఓటమి చెందానని, దీన్ని గుణపాఠంగా తీసుకుంటానని మండ్య జేడీఎస్ అభ్యర్థి, మన్‌ముల్ అధ్యక్షుడు బీఆర్ రామచంద్ర అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ... ఈ ఓటమితో తాను కుంగిపోలేదని, భవిష్యత్‌పై దృష్టి సారిస్తానన్నారు. ప్రజలతో మమేకమై పనిచేస్తానని, తనకోసం కష్టపడిన కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

అలరించిన అనన్య భరతనాట్య అరంగేట్రం



అనన్య భరతనాట్య పాటవం

బనశంకరి: కుమారి అనన్య భరతనాట్య అరంగేట్రం ఆహుతులను కనువిందు చేసింది. శనివారం రాత్రి జయనగర జేఎస్ఎస్ సభాంగణంలో ఏర్పాటు చేసిన కావ్యశ్రీ ఆర్ట్ ఫౌండేషన్ విద్యార్థిని శ్రీమాలారావ్ వెంకటసుబ్రమణియన్ కుమార్తె అనన్య సుబ్రమణియన్ భరతనాట్యం సభికులను అలరించింది. 40 నిమిషాల పాటు ప్రదర్శించిన రామాయణ దర్శనం ఎంతగానో ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కావ్యశ్రీ నాగరాజు, డాక్టర్ ఎం.సూర్యప్రసాద్, పూర్ణసురేశ్, నందినా గరాజు, మానస తదితరులు పాల్గొన్నారు.

సోమణ్ణకు బీజేపీ నేతల పరామర్శ

యశవంతపుర: విధానసభ ఎన్నికల్లో వరుణ, చామరాజనగర రెండు స్థానాలలో పోటీ చేసి ఘోరంగా ఓడిపోయిన బీజేపీ నాయకుడు వీ సోమణ్ణతో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ సంఘటన ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్‌లు ఫోన్ చేసి మాట్లాడారు. ఎన్నికల ఫలితాలు ఇలా వస్తాయనే విషయం తెలియదు. మా లెక్కలు తప్పాయి. మీకు పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ధైర్యం నింపినట్లు తెలిసింది. రెండు చోట్ల ఓడిన సోమణ్ణ హైకమాండ్‌పై ఆక్రోశంతో ఉన్నారు. అమిత్‌షా ఫోన్‌లో మాట్లాడి శాంత పరిచినట్లు సమాచారం. ఎన్నికల ముందు సోమణ్ణ కాంగ్రెస్‌లో చేరాలనుకోవడం తెలిసిందే.

హనుమజ్జయంతి ఉత్సవాలు



చెందకచెర్లులో అలంకరించిన దృశ్యం

మడకశిర రూరల్: మండలంలోని గ్రామాల్లోని ఆంజనేయస్వామి దేవాలయాల్లో ఆదివారం హనుమజ్జయంతి సందర్భంగా భక్తులు వేడుకలు నిర్వహించారు. సింగేపల్లి, జిల్లేడుగుంట ఆంజనేయస్వామి, చెందకచెర్లు ఆంజనేయస్వామి, బుళ్లసముద్రం,రేకులకుంట, గోవిందాపురం, నీలకంఠాపురం గ్రామాల్లో భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెందకచెర్లులో భక్తుల కోలాహలం మధ్య బ్రహ్మ రథోత్సవం సాగింది.

పదవి కోసం పరమేశ్వర్ ఆరాటం

యశవంతపుర: కాంగ్రెస్ విజయంతో ఆ పార్టీ సీనియర్లు ముఖ్యమంత్రి పదవిపై కన్నేశారు. డీకే శివకుమార్, సిద్దరామయ్య మధ్య హోరాహోరీ పోరాటం సాగుతుండగా, మధ్యలో కొరటగెరె ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం పరమేశ్వర్ ప్రయత్నాలు ప్రారంభించారు. దళిత నాయకులతో ఆయన సమావేశమయ్యారు. తనకు సీఎం పదవిని ఇవ్వని పక్షంలో కనీసం డిప్యూటీ సీఎం పదవైనా ఇవ్వాలని ఆయన చెప్పారు.

18న నూతన సీఎం ప్రమాణం?

బనశంకరి: రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 18వ తేదీ గురువారం నూతన సీఎం ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమానికి ఏఐసీసీ పెద్దలు తరలివస్తారు. హాజరు కావాలని అన్ని పార్టీల నేతలకు, ఇతర రాష్ట్రాల ముఖ్య నేతలకు కాంగ్రెస్ ఆహ్వానం పంపింది.

రాజధానిపై కాషాయం, హస్తం పట్టు

- బీజేపీకి 16, కాంగ్రెస్‌కి 12 స్థానాలు
- సున్నాకు చేరిన జేడీఎస్

బనశంకరి: రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వ్యతిరేకతతో ఓటమిపాలైన బీజేపీ రాజధానిలో ఒక సీటును అదనంగా గెలుచుకోగా, కాంగ్రెస్ ఉన్న సీట్లను కాపాడుకుంది. బెంగళూరులో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లెక్కకు మిక్కిలి నిర్వహించిన రోడ్‌షోలు, అమిత్‌షా, జేపీ నడ్డా, ఇతర ముఖ్య నేతలు జరిపిన ప్రచారం వల్ల ఆ మాత్రం లబ్ధి పొందింది. కాంగ్రెస్‌కు 13 సీట్లు ఉండగా ఎన్నికల్లో ఒకటి కోల్పోయింది. జేడీయస్ పార్టీ దాసరహళ్లి సీటును నష్టపోయి బెంగళూరులో జీరో అయ్యింది. ఇప్పుడు నగరంలో బీజేపీకి 16, హస్తానికి 12 స్థానాలు ఉన్నాయి.

బీజేపీకి గోవిందరాజనగర లాస్

గత ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ అభ్యర్థులు అందరూ ఈ సారి తమ సీట్లను కాపాడుకున్నారు. మహదేవపురలో అరవింద లింబావళికి బదులు ఆయన భార్య మంజుళ పోటీ చేసి గెలిచారు. కొత్తగా జయనగర బీజేపీ ఖాతాలో చేరింది. గత పదేళ్లుగా గోవిందరాజనగర ఎమ్మెల్యేగా ఉన్న మంత్రి వీ సోమణ్ణ ఈసారి పార్టీ ఆదేశంతో చామరాజనగర, వరుణలో పోటీ చేయగా రెండుచోట్లా ఓడిపోయారు. ఇక్కడ బీజేపీ అభ్యర్థి ఉమేశ్‌శెట్టి, కాంగ్రెస్ అభ్యర్థి ప్రియాకృష్ణ చేతిలో 10 వేల తేడాతో ఓటమి పాలయ్యారు.



కాంగ్రెస్ హోరుగాలిలోనూ బెంగళూరులో బీజేపీ బలం చాటుకుంది

పులకేశినగరలో మొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసిన ఏసీ శ్రీనివాస్ గెలుపొందగా, కాంగ్రెస్ టికెట్ రాక బీఎస్పీ నుంచి బరిలోకి దిగిన సిట్టింగ్.. అఖండ శ్రీనివాసమూర్తి ఓటమి పాలయ్యారు. చిన్న పార్టీలు పత్తా లేవు.



ఎవరికో తాయిలం.. ఆదివారం విధానసౌధ వద్ద పీచు మిఠాయిలు

ఆమ్ ఆద్మీ పార్టీ తుస్

చామరాజపేటే నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన రిటైర్డు ఐపీఎస్ అధికారి భాస్కర్‌రావ్, మరో మాజీ కేఏఎస్ అధికారి మదాయి, కాంగ్రెస్‌ని వీడి ఆమ్ ఆద్మీ నుంచి పోటీచేసిన బ్రిజేశ్ కాళప్ప ఓటమి పాలయ్యారు. బెంగళూరులో ఎన్నికల తేదీని ప్రకటించక ముందే అభ్యర్థులను ప్రకటించి ప్రచారం ప్రారంభించిన ఆప్ పార్టీ పెద్దగా ప్రభావం చూపలేదు. వివిధ నియోజకవర్గాల్లో జేడీఎస్ పార్టీకి ఉన్న ఓట్లను బీజేపీ, కాంగ్రెస్ లాగేసుకున్నాయి. దీంతో రెండు జాతీయ పార్టీల ఓట్లు సంఖ్య గణనీయంగా పెరిగాయి.

ఘనంగా ఆంజనేయ రథోత్సవం



భక్తుల మధ్య సాగుతున్న బ్రహ్మ రథోత్సవం

పావగడ: హనుమాన్ జయంతి సందర్భంగా తాలూకా లోని నలిగానహళ్ళి గ్రామ సమీపంలోని సంకాపుర సువర్చలాంజనేయ స్వామి బ్రహ్మ రథోత్సం ఆదివారం కన్నులపండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాద్యాల మధ్య తేరులో ఉంచి మధ్యాహ్నం 1 గంట సమయంలో రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు జై హనుమాన్ అని స్వామివారికి జేజేలు పలికారు. భక్తులు తేరుకు టెంకాయలు కొట్టి పూజలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తజనం తరలివచ్చారు.

ఓటమి కారణాలపై సమీక్షలు


- ఢిల్లీ పెద్దలు ధైర్యం చెప్పారు: బొమ్మై

శివాజీనగర: విధానసభ ఎన్నికల్లో బీజేపీలో విజేతలు, ఓడినవారితో నియోజకవర్గాల వారీగా రెండు విడతల్లో ఆత్మపరిశీలన సభలు జరపనున్నట్లు తాత్కాలిక సీఎం బసవరాజ బొమ్మై తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్రాధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్యేలతో కలసి ఆదివారం ఆయన సమావేశం జరిపారు. తరువాత విలేకరులతో మాట్లాడారు. తమ పార్టీ కార్యక్రమాలకు విశ్రాంతి ఉండదు, ఎన్నికల తరువాత కూడా ప్రజల వద్దకు వెళతాం. ఓటమిని చాలా వినయంతో స్వీకరించామని చెప్పారు. ఓడిపోవడానికి కారణాలపై సమీక్షలు నిర్వహిస్తామన్నారు. పార్టీ రాష్ట్రాధ్యక్షుని రాజీనామా అంశం, అలాగే బీజేపీ పక్ష నేత అంశం చర్చలో లేదన్నారు. ఢిల్లీ నుంచి పార్టీ పెద్దలు ఫోన్ చేసి ధైర్యం చెప్పారని తెలిపారు.

అడ్వొకేట్ జనరల్ రాజీనామా

శివాజీనగర: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మెజారిటీ రావడంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రక్రియలో ఉంది. ఈ నేపథ్యంలోనే ఆదివారం కర్ణాటక అడ్వొకేట్ జనరల్ స్థానానికి ప్రభులింగ నావదగి రాజీనామా చేశారు. ఆదివారం గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్‌ను రాజభవన్‌లో భేటీ అయిన ప్రభులింగ నావదగి రాజీనామా పత్రాన్ని అందించారు.

తళుకు లేని నిఖిల్



రామనగర వద్ద ప్రకృతి సౌందర్యం

- రెండుసార్లు ఓటమితో మూడోతరానికి బ్రేక్
- రామనగరలో జేడీఎస్‌కు గట్టి ఎదురుదెబ్బ

దొడ్డబళ్లాపురం: మాజీ ప్రధాని మనవనిగా, మాజీ సీఎం కుమారునిగా, సినీ హీరోగా ఉన్న నిఖిల్ కుమారస్వామి వరుసగా అపజయాలు చవిచూస్తున్నాడు. గత ఎంపీ ఎన్నికల్లో మండ్య నుంచి తొలిసారి ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయాడు. ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో రామనగర నియోజకవర్గం నుంచి నిలబడి మరోసారి మట్టి కరిచాడు. దీంతో దేవెగౌడ కుటుంబం మూడోతరం రాజకీయ అరంగేట్రానికి కాలం కలిసిరావడం లేదనే ప్రచారం మొదలైంది.

తనయుని కోసం త్యాగం

తాత, తండ్రి, తల్లిని గెలిపించిన రామనగర ప్రజలు నిఖిల్‌ను అసెంబ్లీకి పంపించలేకపోయారు. తల్లి అనిత కుమారస్వామి తన నియోజకవర్గాన్ని కుమారుని కోసం త్యాగం చేస్తున్నానని బహిరంగంగా ప్రకటించి అతన్ని గెలిపించాలని కోరినా ఓటర్లు పట్టించుకోలేదు. 10,715ఓట్ల మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థి ఇక్బాల్ గెలవడంతో జేడీఎస్ పెద్దలు నిశ్చేష్టులయ్యారు. ఇక్కడ సునాయాస విజయం సాధ్యమని వారు అనుకున్నారు.



తాతా మనవడు.. దేవెగౌడ, నిఖిల్

రామనగరను పట్టించుకోలేదనా?

నిఖిల్ ఓటమికి కారణాలు చాలానే ఉన్నాయి. కుమారస్వామి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రామనగర తాలూకాను ప్రజలు ఆశించినంతగా అభివృద్ధి చేయలేకపోయారు. ఇక్కడి నుంచి దేవెగౌడ కుటుంబం నుంచి ఎవరు గెలిచినా, ప్రజల చేతికి అందరని, సమస్యలు చెప్పుకోవాలంటే స్థానిక జేడీఎస్ నేతల కాళ్లు పట్టుకోవాలనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. స్థానిక జేడీఎస్ నేతలను గుర్తించకపోవడం, అధికారంలో ఉన్న సమయంలో ఎవరికీ అందుబాటులో ఉండకపోవడం వల్ల ప్రజల్లో నిరసన భావం ఏర్పడింది. కోవిడ్ సమయంలో అనితాకుమారస్వామి నియోజకవర్గంలో పర్యటించింది లేదు. టీపీ, జీపీ, జడ్పీ తదితర ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు పోటీచేస్తే కనీసం వారిని పెద్దలెవరూ పట్టించుకుని సాయం చేసింది లేదని, అందుకే ఈ పరాజయం అని స్థానికులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రఘుమూర్తి హ్యాట్రిక్



విజయోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే రఘుమూర్తి

చెళ్లకెరె రూరల్: చెళ్లకెరెలో కాంగ్రెస్ అభ్యర్థి టి.రఘుమూర్తి వరుసగా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ నమోదు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి రఘుమూర్తికి 67,363 ఓట్లు రాగా జేడీఎస్ అభ్యర్థి ఎం.రవీష్‌కుమార్‌కు 51,236 ఓట్లు వచ్చాయి. ఇండిపెండెంట్ అభ్యర్థి కె టి కుమారస్వామికి 28,928 ఓట్లు, బీజేపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌కు 22,732 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి టి.రఘుమూర్తి 16,127 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. గెలుపు అనంతరం నగరంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

పెండింగ్ పనులను పూర్తి చేస్తాం

రాయచూరు రూరల్: నగరంలో పెండింగ్ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ వెల్లడించారు. శనివారం లెక్కింపు కేంద్రం వద్ద మూడోసారి గెలుపొందిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. నగరంలో బైపాస్ రోడ్డు నిర్మాణం, విమానాశ్రయం, జౌళి పార్కు ఏర్పాటు, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుడతామన్నారు, తాగునీరు, రోడ్ల మరమ్మతు, మురుగు కాలువల నిర్మాణం, స్వచ్ఛతకు ప్రాధాన్యతనిస్తామన్నారు.

రైతు సంఘం గెలుపుపై సంబరం



స్వీట్లు పంచుకుంటున్న నాయకులు, కార్యకర్తలు

రాయచూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో మండ్య జిల్లా మేలుకోటెలో రైతు సంఘం అభ్యర్థి విజయం సాధించడంతో ఆదివారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద జిల్లా రైతు సంఘం కార్యకర్తలు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. సంఘం జిల్లాధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాట్లాడుతూ మేలుకోటెలో సర్వోదయ పార్టీ అభ్యర్థి దర్శన్ పుట్టణయ్య గెలుపొందడంపై హర్షం వ్యక్తం చేశారు.

మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత

రాయచూరు రూరల్: గ్రామీణ నియోజకవర్గంలో మౌలిక సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ వెల్లడించారు. శనివారం లెక్కింపు కేంద్రంలో రెండోసారి విజయం సాధించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తుంగ భద్ర ఎడమ కాలువ కింద సాగునీటి పథకం ద్వారా ఆయకట్టు చివరి భూములకు నీరందిస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడంతో రైతులకిచ్చిన హామీని నెరవేరుస్తామన్నారు. చిక్కమంచాలి వంతెన నిర్మాణం, ఆత్కూరు, బూడిదపాడు, నారదగడ్డ దత్తాత్రేయ ఆలయం కోసం అర్ధంతరంగా నిలిచిన వంతెన పనులను పూర్తి చేస్తామన్నారు.

ప్రజా తీర్పును శిరసావహిస్తా



మాట్లాడుతున్న పరణ్ణ మునవళ్లి

గంగావతి: ప్రజా వ్యతిరేకతే ఎన్నికల్లో తమ పార్టీ ఓటమికి కారణమని మాజీ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి పేర్కొన్నారు. ఆయన ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. గెలుపు ఓటమి అనేవి సహజమేనని, తాము కొద్దో గొప్పో చేసిన తప్పిదాలతోనే ప్రజలు ఈ ఎన్నికల్లో తమను ఆశీర్వదించలేదని, ప్రజా తీర్పును శిరసావహిస్తానన్నారు. ఓటమి పాలైనా పార్టీ కోసం తాను గతంలో లానే మరింత చురుగ్గా పని చేస్తానన్నారు. కార్యకర్తలు అధైర్య పడక పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనాలన్నారు. పార్టీ నాయకులు సింగనాళ విరుపాక్షప్ప, నెక్కంటి సూరిబాబు, చెన్నప్ప మళిగి తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు రైతు మృతి



మార్చురీలో రైతు మృతదేహాన్ని పరిశీలిస్తున్న కానిస్టేబుల్

హొసపేటె: విజయనగర జిల్లా హూవిన హడగలి తాలూకా మైలార గ్రామంలో పిడుగు పాటుకు రైతు మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. హిరేహడగలి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మైలార గ్రామంలో నివాసముంటున్న రైతు శివప్ప చందాపుర(59)ఉదయం పొలానికి వెళ్లారు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఆ సమయంలో పిడుగుపాటుకు రైతు శివప్ప చందాపుర మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నాడు వికాసం.. నేడు విషాదం

- బళ్లారి జిల్లాలో వాడిన కమలం
- ప్రముఖ నేతలు దూరంతో దుస్థితి
- ఘోర పరాజయంతో పార్టీలో నిర్వేదం





బళ్లారి రూరల్: రాష్ట్రంలో బీజేపీ బలోపేతానికి మాజీ ముఖ్యమంత్రులు యడియూరప్ప, జగదీష్ శెట్టర్, సదానందగౌడ, దివంగత కేంద్రమంత్రి అనంతకుమార్ తదితరులతో పాటు ఉత్తర కర్ణాటకలో మాత్రం గాలి జనార్ధనరెడ్డి, ఆయన మిత్రులు మాజీమంత్రి శ్రీరాములే కారణమని అందరికీ తెలిసిన విషయమే. కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఉత్తర కర్ణాటకలో 2008 ఎన్నికల్లో బీజేపీ ప్రభంజనానికి మూల కారణం శ్రీరాములు, గాలిసోదరులన్నది జగమెరిగిన సత్యం. గాలి జనార్ధనరెడ్డి రాజకీయ చతురత, శ్రీరాములు అంగబలంతోనే బీజేపీని ఆ స్థాయిలో నిలబెట్టారు. ఈ సమయంలో సురేష్‌బాబు, బి.నాగేంద్రలాంటి అనేక మంది కొత్తవారినీ రాజకీయ అరంగేట్రం చేయించారు. అయితే అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో గాలి జనార్ధనరెడ్డిని బీజేపీ హైకమాండ్ దూరం పెట్టింది. తిరిగి పార్టీలోకి చేర్చుకొనేందుకు ఢిల్లీ పెద్దలు ఆసక్తి చూపలేదు.

సొంత పార్టీతో గండి?

బీజేపీలో చోటివ్వక పోవడంతో గాలి జనార్ధనరెడ్డి సొంతకుంపటిగా కేఆర్‌పీపీని స్థాపించుకొన్నారు. బళ్లారి, కొప్పళ, విజయనగర, రాయచూరు జిల్లాల్లో 2023 అసెంబ్లీ ఎన్నికల బరిలో పార్టీ తరపున అభ్యర్థులను బరిలో దించారు. బళ్లారి సిటీ క్షేత్రంలో సొంతపార్టీ తరపున తన సతీమణి గాలి లక్ష్మీఅరుణను బరిలో దింపారు. జిల్లాలోని బళ్లారి సిటీలో లక్ష్మీఅరుణ 48,577 ఓట్లతోను, సండూరులో కే.ఎస్.దివాకర్ 31,375 ఓట్లతోను, సిరుగుప్పలో టీ.ధరప్పనాయక 66,213 ఓట్లతో అపజయం పొందారు. గాలి జనార్ధనరెడ్డి గంగావతిలో విజయాన్ని నమోదు చేశారు. లక్ష్మీఅరుణ తన బావ గాలి సోమశేఖరరెడ్డి కంటే అధికంగా ఓట్లు సాధించగలిగారు. మిగిలిన క్షేత్రాల్లో ఓటర్లను ఆకట్టుకొని ప్రత్యర్థి పార్టీలకు దీటుగా నిలిచినా గెలుపొందలేకపోయారు.

ఓటమికి కేఆర్‌పీపీనే కారణమా?

బళ్లారి జిల్లాలో బీజేపీ పరాజయానికి పరోక్షంగా కేఆర్‌పీపీ కారణమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రధానంగా బీజేపీ ఓట్లే చీలాయని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అనేక మంది ప్రముఖులు బీజేపీని వీడి కేఆర్‌పీపీలో చేరారు. కేఆర్‌పీపీలో నాయకుల పలుకుబడి, అనుచరుల బలాబలాలు ఆ పార్టీకి జతయ్యాయని భావిస్తున్నారు. ఏదేమైనా కాషాయపార్టీ వికసించలేకపోయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కదం తొక్కిన కాంగ్రెస్..కుదేలైన బీజేపీ

- జిల్లాలో అభ్యర్థులు, సాధించిన ఓట్ల వివరాలివే

బళ్లారిఅర్బన్: అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో జిల్లాలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు కదం తొక్కి విజయదుందుభి మోగించారు. ప్రధాన బీజేపీ, జేడీఎస్ పార్టీలు కుదేలు కాగా కొన్ని స్థానాల్లో బీజేపీ, కేఆర్‌పీపీ, జేడీఎస్ అభ్యర్థులు ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాలతో సరిపెట్టుకున్నారు. ఆయా స్థానాల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు సాధించిన ఓట్ల వివరాలిలా ఉన్నాయి.

- బళ్లారి నగరంలో కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డికి 86,440 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి కేఆర్‌పీపీ అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణకు 48,577 ఓట్లు లభించడంతో 38,077 ఓట్ల మెజార్టీతో భరత్‌రెడ్డి ఘన విజయం సాధించారు. బీజేపీ అభ్యర్థి జీ.సోమశేఖర్‌రెడ్డి 37,155 ఓట్లు, ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి వీ.దొడ్డకేశవ రెడ్డికి 716 ఓట్లు, జేడీఎస్ అభ్యర్థి అనిల్‌లాడ్‌కు 610 ఓట్లు లభించాయి. మొత్తం 25 మంది అభ్యర్థులు బరిలో దిగగా వారంతా 500 లోపు ఓట్లు సాధించారు. నోటాకు 1533 ఓట్లు పడ్డాయి.
- బళ్లారి గ్రామీణలో కాంగ్రెస్ అభ్యర్థి బీ.నాగేంద్రకు 1,03,836 ఓట్లు రాగా, తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి బీ.శ్రీరాములుకు 74536 ఓట్లు లభించడంతో 29,300 ఓట్లు ఆధిక్యతతో నాగేంద్ర గెలుపొందారు. ఆమ్ ఆద్మీ పార్టీ జాలిహాళ్ రుద్రప్ప 767, బీఎస్‌పీ అభ్యర్థి నాయకర కృష్ణప్ప 949 ఓట్లు సాధించారు. నోటాకు 1463 ఓట్లు పోల్ అయ్యాయి.
- కంప్లిలో కాంగ్రెస్ అభ్యర్థి జేఎన్.గణేష్‌కు 1,00,424 ఓట్లు రాగా, తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి టీహెచ్ సురేష్‌బాబుకు 76,333 ఓట్లు లభించడంతో 24,091 ఓట్ల మెజార్టీతో గణేష్ గెలిచారు. జేడీఎస్ అభ్యర్థి రాజునాయక్‌కు 1374 ఓట్లు, ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి ప్రహ్లాద్‌నాయక్‌కు 1001 ఓట్లు, నోటాకు 1054 ఓట్లు పోల్ అయ్యాయి.
- సండూరులో కాంగ్రెస్ అభ్యర్థి ఈ.తుకారాంకు 85,223 ఓట్లు రాగా, తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థిని శిల్పా రాఘవేంద్రకు 49701 ఓట్లు లభించడంతో 35,522 ఓట్ల ఆధిక్యతతో తుకారాం విజయం సాధించారు. కేఆర్‌పీపీ అభ్యర్థి కే.ఎస్.దివాకర్ 31,375 ఓట్లు, జేడీఎస్ అభ్యర్థి సోమప్ప 2,617 ఓట్లు, ఆమ్ ఆద్మీ అభ్యర్థి కుమారస్వామి 764 ఓట్లు సాధించారు. నోటాకు 946 ఓట్లు పోలయ్యాయి.
- సిరుగుప్పలో కాంగ్రెస్ అభ్యర్థి బీఎం నాగరాజ్‌కు 90,862 ఓట్లు రాగా, తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి సోమలింగప్పకు 53,830 ఓట్లు లభించడంతో 37,032 ఓట్ల ఆధిక్యతతో నాగరాజ్ గెలుపొందారు. కేఆర్‌పీపీ అభ్యర్థి ధరప్ప నాయక్‌కు 18,652 ఓట్లు, జేడీఎస్ అభ్యర్థి పరమేశ్వర్ నాయక్‌కు 992 ఓట్లు, ఆమ్‌ఆద్మీ పార్టీ అభ్యర్థి లోకేష్‌నాయక్‌కు 491 ఓట్లు, నోటాకు 1173 ఓట్లు పోలయ్యాయి

తుకారాంకు మంత్రిగిరి దక్కేనా?



ఎమ్మెల్యే తుకారాం

బళ్లారి రూరల్: జిల్లాలోనే గాక రాష్ట్రంలోను కాంగ్రెస్‌కు కంచుకోట సండూరు అని పేరుంది. ఈ నియోజకవర్గంలో ఎం.వై.ఘోర్పడే హయాం నుంచే కాంగ్రెస్ విజయ పరంపర కొనసాగుతోంది. 2008లో ఎస్టీ రిజర్వ్‌డు క్షేత్రంగా ఏర్పడినప్పటి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా వరుసగా నాలుగోసారి ఈ.తుకారాం గెలుపొందారు. ఈ 15 ఏళ్ల కాలంలో కేవలం కొద్ది నెలల పాటు మాత్రమే రాష్ట్ర వైద్య విద్యా శాఖా మంత్రిగా తుకారాం పని చేశారు. ఆ సమయంలో ఆపరేషన్ కమలతో బీజేపీ అధికారం చేపట్టింది. దీంతో తుకారాం మంత్రి పదవి నుంచి వైదొలగాల్సి వచ్చింది. 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పూర్తి మెజారిటీ దక్కించుకొంది. ఈసారి కూడా తుకారాం కాంగ్రెస్‌లోనే వరుసగా నాలుగోసారి గెలుపొందారు. ఉన్నత విద్య, సౌమ్యత, ఎటువంటి వివాదాలు, కేసులు లేకపోవడంతో మంత్రి పదవి ఖచ్చితంగా దక్కుతుందని ఊహాగానాలు వినపడుతున్నాయి. మరో పక్క బళ్లారి రూరల్ అభ్యర్థి బీ.నాగేంద్ర, కంప్లి అభ్యర్థి జే.ఎన్.గణేష్, సిరుగుప్ప అభ్యర్థి బీ.ఎం. నాగరాజు రెండోసారి గెలుపొందగా బళ్లారి సిటీ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి మొదటిసారి గెలుపొందారు. జిల్లా కాంగ్రెస్ 5 మంది అభ్యర్థుల్లోను ఈ.తుకారాం సీనియర్ కావడంతో ఆయనకే మంత్రి పదవి దక్కనుందని విశ్వసనీయ సమాచారం. మరి కొద్దిరోజుల్లో జిల్లాలో మంత్రి పదవి ఎవరికి దక్కుతుందో అన్న ఊహాగానాలకు తెరపడనుంది.

జిల్లాలో అభ్యర్థులు సాధించిన ఓట్లు

రాయచూరు రూరల్: జిల్లాలో శనివారం చేపట్టిన ఓట్ల లెక్కింపులో విజేతలు, ఇతర అభ్యర్థులు సాధించిన ఓట్ల వివరాలిలా ఉన్నాయి. దేవదుర్గలో జేడీఎస్ అభ్యర్థిని కరియమ్మ నాయక్‌కు 99,544 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి శివనగౌడ నాయక్‌కు 65,288 ఓట్లు లభించడంతో 34,256 ఓట్ల మెజార్టీతో కరియమ్మ గెలుపొందారు. లింగసూగూరులో బీజేపీ అభ్యర్థి వజ్జల్ మానప్పకు 58,331 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి హూలిగేరికి 55,573 ఓట్లు లభించడంతో 2,758 ఓట్ల మెజార్టీతో మానప్ప విజయం సాధించారు. రాయచూరు గ్రామీణ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి బసనగౌడ దద్దల్‌కు 88,694 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి తిప్పరాజ్ హవల్దార్‌కు 74,893 ఓట్లు లభించడంతో బసనగౌడ 13,801 ఓట్ల మెజార్టీతో గెలిచారు. సింధనూరులో కాంగ్రెస్ అభ్యర్థి హంపనగౌడ బాదర్లికి 73,645 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి కరియప్పకు 51,703 ఓట్లు లభించడంతో హంపనగౌడ 21,942 ఓట్ల మెజార్టీతో గెలిచారు. మాన్విలో కాంగ్రెస్ అభ్యర్థి హంపయ్య నాయక్‌కు 66,922 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి బి.వి.నాయక్‌కు 59,203 ఓట్లు లభించడంతో హంపయ్య నాయక్ 7,719 ఓట్ల మెజార్టీతో గెలిచారు. మస్కిలో కాంగ్రెస్ అభ్యర్థి బసనగౌడ తుర్విహాళకు 79,566 ఓట్లు రాగా సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి ప్రతాప్ గౌడ పాటిల్‌కు 66,513 ఓట్లు లభించడంతో బసనగౌడ 13,053 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాయచూరు నగర బీజేపీ అభ్యర్థి శివరాజ్ పాటిల్‌కు 69,655 ఓట్లు రాగా, సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి మహ్మద్ శాలంకు 65,923 ఓట్లు లభించడంతో శివరాజ్ పాటిల్ 3,732 ఓట్లతో విజయం సాధించారు.

ప్రజలకు రుణపడి ఉంటా



ఎమ్మెల్యే గణేష్

కంప్లి: ప్రజలతో నిత్యం మమేకమై ఉండటమే తన గెలుపునకు దోహదపడిందని, తన విజయానికి కారకులైన క్షేత్ర ప్రజలు, అభిమానులకు జీవితాంతం రుణపడి ఉంటానని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. గత ఎన్నికల్లో క్షేత్ర ఎమ్మెల్యేగా గెలుపొందిన అనంతరం అనతికాలంలోనే గణేష్ పట్టణంలో గృహప్రవేశం చేశారు. అర్ధరాత్రి క్షేత్ర ప్రజలకు ఏ కష్టం వచ్చినా ఫోన్ చేయగానే వెంటనే వెళ్లి సమస్య పరిష్కరించడం, సాయం చేయడంతో ప్రజల హృదయాల్లో నిలిచారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉంటూనే కురుగోడు, కంప్లిల్లో మినీ విధానసౌధలు, వందపడకల ఆస్పత్రుల నిర్మాణంతో పాటు ఎన్నో కార్యక్రమాలతో ప్రజలకు, రైతు బిడ్డ కావడంతో రైతుల ప్రతి సమస్యను పరిష్కరిస్తూ రైతులకు చేరువయ్యారు. మాజీ ఎమ్మెల్యే సురేష్‌బాబు పదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్నా ఇంతటి ప్రజాభిమానం పొందలేకపోగా చివరి క్షణంలో క్షేత్రంలోని ప్రతి గ్రామం నుంచి బీజేపీలో చేర్పించుకున్నా ఫలితం శూన్యం. సోమప్ప చెరువు అభివృద్ధి, క్షేత్రంలోని ప్రతి గ్రామానికి రోడ్డు నిర్మించి ప్రజల సమస్యలకు తెరవేశారు. ధనబలంతో గెలుపొందాలని ప్రయత్నించిన సురేష్‌బాబుకు ఘోర ఓటమి ఎదురైంది. గతంలో కేవలం 5 వేల ఓట్ల తేడాతో ఓటమి పాలైన సురేష్‌బాబు ఈసారి ఎన్నికల్లో ఏకంగా 24,091 ఓట్ల తేడాతో దారుణంగా ఓటమి పాలయ్యారు. ఇరువురు అభ్యర్థులు సతీసమేతంగా ప్రచారం చేసినా అభివృద్ధికి, వ్యక్తిత్వానికి క్షేత్ర ఓటర్లు ప్రాధాన్యత ఇచ్చి గణేష్‌కు పట్టం కట్టారు. క్షేత్రంలో ప్రతి క్లిష్ట సమస్యపై గణేష్ సమావేశాల్లో గళమెత్తడం కూడా అందరినీ ఆకట్టుకుంది.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

హొసపేటె: తాలూకాలోని కమలాపురం చెరువు వద్ద ఉన్న వెల్‌కమ్ బోర్డు పక్కన భానుప్రకాశ్ పొలంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కమలాపురం పోలీసులు ఆదివారం స్వాధీనపరచుకున్నారు. మృతుడు సుమారు 25–30 ఏళ్ల వయస్సు కలిగి, కాషాయ రంగు ఫుల్ షర్ట్, నీలి రంగు చెక్స్ ఉన్న లుంగీని ధరించినట్లు తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసినవారు కమలాపురం పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.



మార్చురీలోని గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

జిల్లా ఓటరు స్పందన విభిన్నం

హుబ్లీ: ధార్వాడ జిల్లా ఓటరు తన విజ్ఞతను ప్రదర్శించి అసెంబ్లీ ఎన్నికల్లో తమ ఎమ్మెల్యేలను వినూత్నంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని 7 స్థానాల్లో మెజార్టీ మాత్రం ఎవరికీ తక్కువ లేక పోవడం ఓటరు పరిణతికి నిదర్శనం, రాష్ట్రమంతటా కాంగ్రెస్ హవాలో మంత్రులే మట్టికరచిన జిల్లాలో మూడు స్థానాలు బీజేపీకి, మిగిలిన నాలుగు కాంగ్రెస్‌కు దక్కాయి. ముఖ్యంగా దేశ, రాష్ట్ర రాజకీయాలను ఆకర్షించిన హుబ్లీ– ధార్వాడ సెంట్రల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్ శెట్టర్ ఆ పార్టీ అభ్యర్థిగా 60,775 ఓట్లు సాధించగా, ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి మహేష్ టెంగినకాయి 95,064 ఓట్లను దక్కించుకొని సుమారు 34,289 ఓట్ల మెజార్టీతో తన గురువుపై విజయం సాధించారు. హుబ్లీ ధార్వాడ పశ్చిమలో హ్యాట్రిక్ విజేత, బీజేపీ అభ్యర్థి అరవింద బెల్లద 90,904 ఓట్లు పొందగా, కాంగ్రెస్ అభ్యర్థి దీపక్ చించరికి 52,863 ఓట్లు దక్కించుకొని సుమారు 38 వేల ఆధిక్యతతో బెల్లద మూడోసారి విజేతగా నిలిచారు. కుందగోళలో కొత్త అభ్యర్థి, బీజేపీ తరపున నిలిచిన ఎంఆర్.పాటిల్ 76,105 ఓట్లు దక్కించుకోగా కాంగ్రెస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కుసుమావతి శివళ్లి 40,764 ఓట్లు పొందగా ఎంఆర్ పాటిల్ 35,341 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. హుబ్లీ ధార్వాడ తూర్పులో కాంగ్రెస్ సిట్టింగ్ ఎమ్మెల్యే ప్రసాద్ అబ్బయ్య హ్యాట్రిక్ సాధించారు. ఆయన 85,426 ఓట్లు సాధించగా, బీజేపీ అభ్యర్థి డాక్టర్ క్రాంతికిరణ్ 53,056 ఓట్లు దక్కించుకోగా సుమారు 32,370 ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ అభ్యర్థి గెలిచారు. ధార్వాడ గ్రామీణ ఎన్నికల్లో జిల్లాలోకి రాకుండానే కాంగ్రెస్ అభ్యర్థి వినయ్ కులకర్ణి 89,333 ఓట్లు దక్కించుకొని 18,037 ఓట్ల మెజార్టీతో గెలిచారు. బీజేపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అమృత దేశాయికి ఇక్కడ 71,296 ఓట్లు లభించాయి.

నీటిపారుదల రంగానికి పెద్దపీట



మాట్లాడుతున్న బోసురాజు

రాయచూరు రూరల్: అనుకున్న ప్రకారమే రాష్ట్రంలో 135 స్థానాల్లో కాంగ్రెస్‌కు మెజార్టీ వచ్చిందని, జిల్లాలో నీటిపారుదల రంగానికి పెద్ద పీట వేస్తామని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ఎన్ఎస్ బోసురాజు వెల్లడించారు. ఆయన ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నడ్డా పర్యటించినా బీజేపీ ఓటమి చవిచూసిందన్నారు. జిల్లాలో ఏడింటిలో నాలుగు చోట్ల పార్టీ అభ్యర్థుల గెలుపు శుభపరిణామమన్నారు. ఐదేళ్ల బీజేపీ పాలనలో జరిగిన కమీషన్ దందా, అక్రమాలు, అవినీతిపై విచారణ జరుపుతామన్నారు. తుంగభద్ర ఎడమ కాలువ చివరి ఆయకట్టు భూములకు నీరందిస్తామన్నారు. నారాయణపుర కుడి కాలువలో జరిగిన అవినీతిపై విచారణ చేయిస్తామన్నారు. తుంగభద్ర డ్యాంలో పేరుకుపోయిన పూడికతీతపై ఆంధ్ర, తెలంగాణ ఉన్నతాధికారులు, సీఎంలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. రాయచూరులో ఎయిమ్స్ ఏర్పాటుకు కాంగ్రెస్ సర్కార్ సానుకూలంగా ఉందన్నారు.

కాంగ్రెస్ హవాలో మట్టికరిచిన ఉద్ధండులు

బళ్లారి అర్బన్: రాష్ట్రంలో ఉధృతంగా వీచిన కాంగ్రెస్ హవాలో జిల్లాలో పలువురు రాజకీయ ఉద్ధండులు మట్టికరిచారు. ముఖ్యంగా ప్రజాదరణ కలిగిన నేతగా. నాలుగు సార్లు మంత్రిగా, ఓసారి ఎంపీగా పని చేసిన బీ.శ్రీరాములు కూడా తన ప్రత్యర్థి నాగేంద్ర చేతిలో ఓటమికి గురయ్యారు. బళ్లారి నగర క్షేత్రానికి వస్తే తొలిసారి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి నారా భరత్‌రెడ్డి విజయ పతాకం ఎగరవేశారు. కొత్తగా పుట్టుకొచ్చిన కేఆర్‌పీపీ అభ్యర్థిని గాలి లక్ష్మీ అరుణ రెండో స్థానం సాధించి రాజకీయ పరిశీలకులకు ఆశ్చర్యం కలిగించింది. ఇక్కడి నుంచి మూడోసారి హ్యాట్రిక్ కోసం తపించిన బీజేపీ అభ్యర్థి గాలి సోమశేఖర్‌రెడ్డికి ఫలితం దక్కలేదు. సిరుగుప్పలో బీజేపీ అభ్యర్థి సోమలింగప్ప మూడో సారి గెలుపు కోసం తపించినా నిరాశ ఎదురైంది. ఇక్కడ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి బీఎం.నాగరాజ్ భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఇక నాలుగు సార్లు కాంగ్రెస్ కంచుకోటగా నిలిచిన సండూరు నుంచి లాడ్ శిష్యుడు ఈ.తుకారాం నాలుగో సారి అఖండ విజయం సాధించారు. చివరిగా కంప్లి నియోజక వర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే గణేష్ ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి సురేష్‌బాబుపై భారీ ఆధిక్యతతో గెలుపొందారు. మొత్తానికి కాంగ్రెస్ హవా వల్ల, మేనిఫెస్టోలో ప్రకటించిన 5 గ్యారెంటీ పథకాలతో అధికార బీజేపీ కంగుతినక తప్పలేదు. గత కొన్నేళ్లుగా బీజేపీ చక్రం తిప్పడంతో భద్రకోటగా మారి తిరిగి హవాతో కాంగ్రెస్ పూర్వవైభవం సాధించింది.

కోలారు వార్తలు...

ఓడినా ప్రజలతోనే మమేకం

శ్రీనివాసపురం: అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా తాను ఎప్పుడూ ప్రజలకు చేరువగానే ఉంటానని ముళబాగిలు కాంగ్రెస్ అభ్యర్థి వి.ఆదినారాయణ తెలిపారు. ఆదివారం తాలూకాలోని ప్రైవేటు హోటల్‌లో తనను కలిసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. తాను అత్యల్ప సమయంలో ఎన్నికల బరిలోకి దిగి నియోజకవర్గమంతా కలియ తిరిగి ప్రచారం చేశానన్నారు. అయినా ఓటమి చెందాల్సి వచ్చిందన్నారు, రెండు మూడు రోజుల్లో పార్టీ కార్యకర్తలు, నాయకులతో సమావేశమై తాలూకాలో ఏ విధంగా పార్టీని పటిష్టం చేయాలో చర్చిస్తానన్నారు. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిలో ఇచ్చిన హామీలను ప్రజలకు అందించడానికి శాయశక్తులా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆవణి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నీలకంఠేగౌడ, టౌన్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అమానుల్లా, రాజేంద్రగౌడ, సిద్దనహళ్లి శేఖర్, ఉత్తనూరు అరవింద్, కగ్గనహళ్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ప్రపంచ మాతృ దినోత్సవం

కోలారు: నగరంలోని దేవరాజ్ అరస్ మెడికల్ కళాశాలలో ఆదివారం ప్రపంచ మాతృ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభాకర్ కేక్ కత్తిరించి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో మాతృస్థానం ఎంతో గొప్పదన్నారు. ప్రతి ఒక్కరూ తల్లిని గౌరవించాలన్నారు. అమ్మ అనే పదం బాంధవ్యానికి సంకేతం అన్నారు. కళాశాల ఐఏసీ సెంట్రల్ ఈబీ మెంబర్ డాక్టర్ సుమతా నాయక్, ఐఏపీ సౌత్ జోన్ కో–ఆర్డినేటర్ డాక్టర్ గీతా పాటిల్, డాక్టర్ కిశోర్ బైందూర్, డాక్టర్ ప్రియా శివళ్లి పాల్గొన్నారు.

మునియప్పకు సన్మానం



కేహెచ్ మునియప్పను సన్మానించిన దృశ్యం

కోలారు: దేవనహళ్లి నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందిన కేహెచ్ మునియప్పను కేజీఎఫ్ ఏపీఎంసీ మాజీ అధ్యక్షుడు విజయరాఘవరెడ్డి ఆదివారం బెంగళూరులోని ఆయన నివాసంలో సన్మానించారు. మునియప్పకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటివ్వాలని, రాష్ట్ర రాజకీయాల్లో కూడా ఆయన రాణించాలని ఆకాంక్షించారు. మునియప్ప మాట్లాడుతూ జిల్లా నుంచి నలుగురు కాంగ్రెస్ అభ్యర్థులు ఎన్నికవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏపీఎంసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, న్యాయవాది పద్మనాభరెడ్డి తదితరులున్నారు.

ప్రజల రుణం తీర్చుకుంటా

- ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్



కోలారు: ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. ఆయన ఆదివారం తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మొదటిసారి పోటీ చేసిన తనను 32 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించడంపై హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఎంపికను పార్టీ హైకమాండ్ చూసుకుంటుందని, తనకు మంత్రిగిరిపై ఆశ లేదని, అయితే మంత్రి పదవిని అప్పగిస్తే సమర్థవంతంగా నిభాయిస్తానని తెలిపారు.

నా విజయం ప్రజలకే అంకితం

- ఎమ్మెల్యే రూపకలా శశిధర్



కేజీఎఫ్: తనను జిల్లాలో భారీ మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకే తన విజయాన్ని అంకితం చేస్తున్నట్లు కాంగ్రెస్ అభ్యర్థిని రూపకలా శశిధర్ తెలిపారు. ఆదివారం నగరంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. 50 వేలకు పైగా మెజారిటీతో గెలిపించిన ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకు కృషి చేస్తానన్నారు. కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్, సీఎల్పీ నాయకుడు సిద్దరామయ్య తనపై ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకున్నానన్నారు. డీసీసీ బ్యాంకు అధ్యక్షుడు గోవిందగౌడ తన గెలుపు కోసం శక్తికి మించి కృషి చేశారన్నారు.

కామాంధుని బెదిరింపులతో ఆత్మహత్య

యశవంతపుర: వేధింపుల ఘటనలో దుండగుని బెదిరింపులతో బ్యాడగి తాలూకా గుమ్మనహళ్లి గ్రామానికి చెందిన వ్యక్తి చెరువులో పడి ఆత్మహత్య చేసుకున్నారు. కుబేరప్ప దురగప్ప కంబళి (39) మృతుడు. ముదకనగౌడ పాటిల్ అనే వ్యక్తి రెండు నెలల క్రితం కంబళి అన్న సుభాష్ భార్యతో అసభ్యంగా ప్రవర్తించాడు. పెద్దలు పంచాయతీ చేసి బుద్ధిమాటలు చెప్పారు. ఈ నెల 4న సుభాష్ అదృశ్యమయ్యాడు. అదే సమయంలో కంబళి వెళ్లగా పాటిల్ బెదిరించాడు. దీంతో ఆందోళనకు గురై కంబళి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, ఫైర్ సిబ్బంది గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. ఒక మిస్సింగ్, మరో ఆత్మహత్య ఘటనలతో గ్రామంలో ఆందోళన నెలకొంది.

సొమ్మసిల్లిన అభ్యర్థి పీఏ



చికిత్స పొందుతున్న పీఏ గెద్దప్ప పూజారి

రాయచూరు రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి పరాజయంతో ఆప్త సహాయకుడు ఆస్పత్రి పాలైన ఘటన యాదగిరి జిల్లాలో చోటు చేసుకుంది. ఆ జిల్లా బీజేపీ తరపున పోటీ చేసిన మాజీ మంత్రి రాజుగౌడ(నరసింహ నాయక్) ఓటమిని చూడలేక ఆప్త సహాయకుడు గెద్దప్ప పూజారి సొమ్మసిల్లి పడిపోయారు. బాగల్‌కోటె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గెద్దప్ప పూజారిని ఆదివారం రాజుగౌడ పరామర్శించారు. హైటల్టోజీ నియోజకవర్గం సురపురలో 15 ఏళ్లుగా రాజుగౌడ మంత్రివర్గంతో పాటు ఎమ్మెల్యేగా విధులు నిర్వహించారు. అయితే ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాజా వెంకటప్ప నాయక్ చేతిలో పరాజయం పాలయ్యారు.

దూషించారని కత్తితో దాడి

- ఒకరికి గాయాలు

కంప్లి: పట్టణంలోని మెయిన్ రోడ్డులోని రాజశ్రీ నావెల్టీ షాప్‌లో శనివారం సాయంత్రం ఫిరోజ్ రావ్ అనే వ్యక్తి అవాచ్య పదజాలంతో దూషించారని కత్తితో దాడి చేయడంతో సురేష్‌రాజ్ అనే వ్యక్తి గాయపడ్డాడు. ఎడమ భుజం కింద గాయమై రక్తస్రావం కావడంతో అతనిని వెంటనే బళ్లారి విమ్స్‌కు తరలించి ఫిరోజ్‌రావ్‌పై కేసు నమోదు చేసినట్లు కంప్లి పోలీసులు తెలిపారు.

టెన్త్‌లో మొరార్జీ విద్యార్థినుల సత్తా



బీ.చందన



కే.వరలక్ష్మీ

కంప్లి: తాలూకాలోని రామసాగర పంపా విద్యా పీఠ మొరార్జీ దేశాయి వసతి పాఠశాల విద్యార్థినులు ఎస్ఎస్ఎల్‌సీ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించారని ప్రిన్సిపాల్ మరియప్ప తళవార్ తెలిపారు. మొత్తం 47 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 24 మంది డిస్టింక్షన్‌లో, 23 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థిని బీ.చందన 613 మార్కులతో 98.08 శాతం ఉత్తీర్ణత సాధించగా, కే.వరలక్ష్మీ 601 మార్కులతో 96.06 శాతం ఉత్తీర్ణతతో పాఠశాల టాపర్లుగా నిలిచినట్లు తెలిపారు.

5ఏ ఉప కాలువ నిర్మాణానికి కృషి

రాయచూరు రూరల్: మస్కి నియోజకవర్గంలో సాగునీటి వంచనకు గురైన 15 గ్రామాలకు నారాయణపుర కుడి కాలువ కింద 5ఏ ఉప కాలువ నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బసనగౌడ తుర్విహాళ వెల్లడించారు. శనివారం ఓట్ల లెక్కింపు కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్‌ని గెలిపిస్తే సాగునీటి పథకానికి శ్రీకారం చుడతామని ఇచ్చిన హామీ మేరకు ప్రజలు తనను గెలిపించారన్నారు. మస్కినాలా పథకానికి నిధులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామన్నారు.

క్లుప్తంగా

సుబ్బారెడ్డి విజయోత్సవ ర్యాలీ



బాగేపల్లి: బాగేపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా మరోసారి రెపరెపలాడింది. స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.ఎన్. సుబ్బారెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి, బీజేపీ అభ్యర్థి మునిరాజుపై 19,158 ఓట్ల తేడాతో గెలిచారు. సుబ్బారెడ్డికి 81,383 ఓట్లు రాగా మునిరాజుకు 62,225 ఓట్లు, సీపీఎం అభ్యర్థి అనిల్‌కు 19,403 ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

ఆనేకల్‌లో శివణ్ణ హ్యాట్రిక్



బొమ్మనహళ్లి: బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి శివణ్ణ హ్యాట్రిక్ సాధించారు. శివణ్ణకు 1,34,787 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి హుల్లహళ్లి శ్రీనివాస్‌కు 1,03,472 ఓట్లు వచ్చాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తలు ఆనేకల్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

ఇది కార్యకర్తల విజయం



విజయోత్సవ ర్యాలీలో సతీశ్‌రెడ్డి

బొమ్మనహళ్లి: విధానసభ ఎన్నికల్లో తాను 4వ సారి విజయం సాధించడం వెనుక బొమ్మనహళ్లి బీజేపీ నాయకులు, కార్యకర్తల శ్రమ ఎంతో ఉందని ఎమ్మెల్యే సతీశ్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి ఆయన విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. మంగమ్మపాళ్య వార్డులోని సామసంద్రపాళ్యకు చేరుకున్న సతీశ్‌రెడ్డికి అక్కడి యువకులు మురళీధర్ రెడ్డి, వెంకటేశ్, సంతోశ్ నవీన్‌లు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అభిమానులు, కార్యకర్తలు భారీ ఆపిల్ పండ్ల హారంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...బొమ్మనహళ్లి ప్రజ లు తాను చేసిన అభివృద్ధిని మరిచిపోలేదని, తన విజయానికి కృషి చేసిన కార్యకర్తలను ఎన్నటికి మరచిపోనన్నారు. ఈ సందర్భంగా శ్రీసాయిరామ్ విద్యాసంస్థల అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, చైర్మన్ నితిన్‌రెడ్డి సతీశ్‌రెడ్డిని సన్మానించారు.

మైసూరు జిల్లాలో పట్టు కోల్పోయిన జేడీఎస్

- బీజేపీ, జేడీఎస్ కంచుకోటకు కాంగ్రెస్ పార్టీ బీటలు



మైసూరు: మైసూరు జిల్లాలో బీజేపీ, జేడీఎస్ పార్టీలకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. కంచుకోటగా భావిస్తున్న ఇక్కడ 11 స్థానాల్లో కాంగ్రెస్ ఏకంగా 8 కైవసం చేసుకుంది. జేడీఎస్, బీజేపీ కంచుకోటను బద్ధలు కొట్టి అక్కడ ఎమ్మెల్యేగా ఉన్న వారిని ఓడించి మైసూరు జిల్లాలో పట్టు సాధించారు. గత ఎన్నికల్లో జేడీఎస్ ఐదు స్థానాలు కైవసం చేసుకున్న విషయం తెల్సిందే.

ఆసక్తిరేపిన వరుణ నియోజకవర్గం ఎన్నిక : మైసూరు జిల్లాలోనే అత్యంత ఆసక్తి రేపిన నియోజకవర్గం వరుణ. ఇక్కడ మాజీ మంత్రి సోమణ్ణపై సీఎల్‌పీ నేత సిద్దరామయ్య భారీ విజయం అందుకున్నారు. టీ నరసిపురలో మహాదేవప్ప, చాముండేశ్వరీలో జీటీ దేవెగౌడ, హుణసూరులో జీటీ హరీశ్ గౌడ, నంజనగూడులో కాంగ్రెస్ అభ్యర్థి దర్శన్ విజయం సాధించారు. మైసూరుకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే నాగేంద్ర, నంజనగూడులో హర్షవర్ధన్ ఓటమి చెందారు. మైసూరు కేఆర్ నియోజకవర్గం నుంచి బీజేపీ నగరాధ్యక్షుడు టీఎస్ శ్రీవత్స విజయం సాధించగా ఇదే నియోజకవర్గం నుంచి జేడీఎస్ ఎమ్మెల్యే సారా మహేశ్ ఓడిపోయారు. మైసూరు ఎన్ఆర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి తన్వీర్ సేఠ్ విజయం సాధించారు.

రామ్మూర్తిని వరించిన అదృష్టం



రామ్మూర్తిని అభినందిస్తున్న దృశ్యం

బనశంకరి: గత మూడేళ్లుగా బీబీఎంపీ ఎన్నికలు నిర్వహించని నేపథ్యంలో శాసనసభ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి రంగంలోకి దిగిన 9 మంది కార్పొరేటర్లలో ఒకరు మాత్రమే విధానసౌధలో అడుగుపెట్టే అదృష్టం వరించింది. మొదటిసారిగా జయనగర నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన పట్టాభిరామనగర వార్డు బీబీఎంపీ మాజీ సభ్యుడు సీకే.రామమూర్తి, కాంగ్రెస్ ఎమ్మెల్యే సౌమ్యారెడ్డికి తీవ్ర పోటీ ఇచ్చి కేవలం 16 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. తన మొదటి ప్రయత్నంలోనే ఎమ్మెల్యేగా గెలుపొందారు. జయనగర నుంచి బీజేపీ అభ్యర్థిగా అవకాశం లభించింది. శాసనసభ ఎన్నికల్లో బరిలోకి దిగిన మాజీ కార్పొరేటర్లు, సర్వజ్ఞనగర నుంచి పోటీ చేసిన పద్మనాభరెడ్డి, గోవిందరాజనగర నుంచి ఉమేశ్‌శెట్టి, ఆర్.ప్రకాష్, విజయనగర నుంచి హెచ్.రవీంద్ర, శాంతినగర నుంచి శివకుమార్, శివాజీనగర చంద్రు, సీవీ.రామన్‌నగర నుంచి ఆనంద్‌కుమార్, హెబ్బాళ నుంచి కట్టా జగదీశ్‌నాయుడు పోటీ చేశారు. జయనగర నుంచి పోటీ చేసిన సీకే.రామ్మూర్తికి మాత్రమే ఎమ్మెల్యేగా అదృష్టం వరించింది.

ప్రజల రుణం తీర్చుకుంటా



రిజ్వాన్ హర్షద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అభిమానులు

శివాజీనగర: శివాజీనగర నియోజకవర్గంలో కాంగ్రెస్ నుంచి రెండోసారి ఎమ్మెల్యేగా గెలుపొందిన రిజ్వాన్ హర్షద్‌ను స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలమాలతో ముంచెత్తారు. బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎస్.చంద్రుపై సుమారు 30 వేలు మెజారిటీని సాధించిన రిజ్వాన్ హర్షద్‌ను అభినందించేందుకు ఆదివారం వసంతనగరలోని ఆయన కార్యాలయానికి నాయకులు, అభిమానులు తరలివచ్చారు. ఈ సందర్భంగా రిజ్వాన్ మీడియాతో మాట్లాడుతూ తన గెలుపునకు శ్రమించిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించిన ఓటర్లకు రుణపడి ఉంటానని, సదా వారి సేవలో ఉంటానన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పొరేటర్ నేత్రావతి క్రిష్ణేగౌడ, నాయకులు సీ.క్రిష్ణేగౌడ, ఎం.సీ.శ్రీనివాస్, వీ.పీ.ఆనందరాజ్, ఓబుళేస్, అబ్రహం, సత్యనారాయణ, సీ.దాస్, విష్ణు, శివ, డేవిడ్, బాలకృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూగబోయిన ఇళ్లు, కార్యాలయాలు

యశవంతపుర: విధానసభ ఎన్నికల ఫలితాలు బీజేపీకి వ్యతిరేకంగా రావడంతో ఆ పార్టీలో తీవ్ర నిరుత్సాహం నెలకొంది. శనివారం మల్లేశ్వరం బీజేపీ కార్యాలయంలో సిబ్బంది మినహా నాయకులు ఎవరు రాలేదు. పార్టీ నాయకులు, ఎమ్మెల్యేగా గెలిచిన అభ్యర్థుల ఇళ్ల వద్ద కూడా బీజేపీ కార్యకర్తల సందడి కనిపించలేదు. ఎన్నికల ప్రచారం కోసం ఏర్పాటు చేసిన కార్యాలయాలకు తాళాలు వేశారు. సీఎం బసవరాజ బొమ్మై ఆర్‌టీ నగర, డాలర్స్ కాలనీలోని మాజీ సీఎం యడియూరప్ప ఇంటి వద్ద రోజు సందడి ఉండేది. ఫలితాలు వచ్చిన తరువాత కార్యకర్తల సందడి అక్కడా కనిపించలేదు. భద్రత కోసం ఉన్న పోలీసులు మాత్రమే కనిపించారు. పద్మనాభనగరలోని మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ నివాసం వద్ద కూడా కార్యకర్తలు కనిపించలేదు.

బాధ్యత మరింత పెరిగింది

మైసూరు: మైసూరు నగరంలోని కృష్ణరాజ నియోజకవర్గం ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించడంతో తన బాధ్యత మరింత పెరిగిందని టీఎస్ శ్రీవత్స అన్నారు. మైసూరు నగర బీజేపీ అధ్యక్షుడిగా పార్టీ కోసం ఎంతో కష్టపడ్డామని, ఈ ఎన్నికల్లో తనను ఓడించడానికి అనేక కుట్రలు జరిగాయన్నారు. తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. ఈ సందర్భంగా నూతన ఎమ్మెల్యే శ్రీవత్సను నగర, జిల్లా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు.

అభిమాని ఆత్మహత్యాయత్నం



పురుగుల మందు డబ్బాతో అభిమాని

యశవంతపుర: విధానసభ ఎన్నికలలో ఓటమి చెందిన మాజీ మంత్రి ఎంపీ రేణుకాచార్య రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న అభిమాని ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన దావణగెరె జిల్లా హొన్నాళిలో జరిగింది. శనివారం ఓట్ల ఫలితాలలో బీజేపీ అభ్యర్థి రేణుకాచార్య ఓడిపోవడంతో ఇక రాజకీయాలకు దూరంగా ఉంటానని ఆయన ప్రకటించారు. దీంతో అనేక మంది అభిమానులు ఆయన ఇంటి ముందుకు చేరుకుని ధర్నా చేశారు. మీరు వెళ్లిపోతే మా పరిస్థితి ఏమిటని రేణుకాచార్యతో చర్చిస్తుండగా అభిమాని పురుగుల మందు తాగడానికి యత్నించగా ఇతరులు అడ్డుకున్నారు.

సిద్ధగంగ మఠంలో డీకే

తుమకూరు: కేపీసీసీ అధ్యక్షుడు డి.కే.శివకుమార్ ఆదివారం తుమకూరు నగరంలోని సిద్ధగంగ మఠాన్ని సందర్శించి స్వర్గీయ శివకుమార స్వామి సమాధికి పూజలుచేశారు. అక్కడే కొంత సమయంలో ధ్యానం చేశారు. తరువాత సిద్ధలింగస్వామిని కలిసి ఆశీర్వాదం పొందారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

ప్రజల తీర్పును స్వాగతిస్తాం

మైసూరు: రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల ఫలితాల తీర్పును తాము స్వాగతిస్తామని మాజీ ఎమ్మెల్యే రామదాసు అన్నారు. ఆదివారం మైసూరు నగరంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...మండ్య, మైసూరు, చామరాజనగర, మడికేరి, రామనగర చుట్టుపక్కల అనేక జిల్లాల్లో బీజేపీ ఓడిపోయిందని, కన్నడిగులు బీజేపీని వ్యతిరేకించలేదని, కాంగ్రెస్ పార్టీ ఉచిత పథకాలు అమలు కోసం ఆ పార్టీని గెలిపించారని అన్నారు. ఏదీ ఏమైనా ప్రజా తీర్పును గౌరవిస్తామన్నారు.

ప్రజాశీర్వాదంతోనే గెలిచా

తుమకూరు: తన గెలుపు కొరటిగెరె నియోజకవర్గం ప్రజల ఆశీర్వాదమని, ఇందుకు నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే జీ. పరమేశ్వర్ అన్నారు. ఆదివారం కొరటిగెరె పట్టణంలో ఉన్న రాజీవ భవనంలో కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని సన్మానం స్వీకరించారు. కొరటిగెరె నియోజకవర్గంలో ఉన్న ప్రతి పల్లెలో ప్రజలు మార్పును కోరుకున్నారని, దాంతో నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించారని అన్నారు. తుమకూరుతో పాటు అనేక జిల్లాల్లో బీజేపీ అడ్రసు లేకుండా పోయిందని, ప్రజలకు ఆ పార్టీపైన ఉన్న కోపంతో పాటు తమపై ఉన్న నమ్మకం ఇందుకు కారణమని అన్నారు.

ఫుట్‌పాత్‌పై బైక్ రైడింగ్, పాదచారి వాగ్వాదం

బనశంకరి: ఫుట్‌పాత్‌పై వాహనాలు నడపరాదనే నిబంధన ఉన్నప్పటికీ ఓ వాహనదారుడు బైక్‌తో ఫుట్‌పాత్‌పైకి రావడంతో అక్కడే ఉన్న ఓ పాదచారి తీవ్రంగా ఆక్షేపించాడు. ఇద్దరి మధ్య వాగ్వాదం దాడి చేసుకునే వరకు వెళ్లింది. ఇద్దరు గొడవపడుతుండగా ఇద్దరు పోలీసులు వచ్చి క్షణాల్లోనే మాయమయ్యారు. ఈ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. పోలీసులు గెస్ట్‌రోల్‌లో వచ్చి వెళ్లడంపై నెటిజన్లు మండిపడుతున్నారు.

గెలుపోటముల కంటే పార్టీ ముఖ్యం

శివాజీనగర: ఎన్నికల్లో ఓటమిపాలైన తక్షణమే అంతా అయిపోయిందని కాదని, రాజకీయ రిటైర్మెంట్ అనేది లేదని మాజీ మంత్రి వీ.సోమణ్ణ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆయన, పార్టీ ఆదేశాల మేరకు బంగారం లాంటి నియోజకవర్గాన్ని వదలుకోవాల్సి వచ్చింది. ఓటమి, గెలుపు, నియోజకవర్గం కంటే పార్టీ ముఖ్యం. హైకమాండ్ సూచనలను పాటించాను. ప్రధాని నరేంద్ర మోదీ పథకాలు అమోఘం, ఈ ఎన్నికల్లో యడ్యూరప్ప ఫ్యాక్టర్ వర్క్ అయినది తెలియదు, కాంగ్రెస్ గ్యారెంటీలే ఓటమికి కారణం అని అన్నారు.

అజ్జయ్యస్వామితో డీకే భేటీ



స్వామీజీతో డీకే

తుమకూరు: కేపీసీసీ అధ్యక్షుడు డి.కే.శివకుమార్ ఆదివారం ఉదయం తుమకూరు జిల్లా తిపటూరులోని నోణవినకెరె దగ్గర సామకట్టెలో ఉన్న కాడ సిద్దేశ్వర మఠాన్ని కుటుంబంతో సహా సందర్శించారు. మఠాధిపతి అజ్జయ్య స్వామిని కలిసి ఆశీస్సులు పొందారు. ఆశ్రమంలో పూజలు చేసిన అనంతరం కొంత సమయం స్వామీజీతో ఆయన చర్చలు జరిపారు. భార్య ఉషా, కుమారుడు ఆకాశ్, కుమార్తె ఐశ్వర్య, అల్లుడు ఆమార్య సిద్దార్థ, కుమార్తె ఆభరణతో కలిసి వచ్చారు.

ధైర్యంగా ఉండండి సారూ !



సీటీ రవితో మాట్లాడుతున్న బాలుడు

యశవంతపుర: విధానసభ ఎన్నికల్లో ఓడిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవిలో ఓ బాలుడు ధైర్యం నింపారు. చిక్కమగళూరులోని సీటీ రవి నివాసానికి వచ్చిన బాలుడు సార్, ఎప్పటికి మీ వెంటే ఉంటాం, ధైర్యంగా ఉండండి అంటూ చెబుతున్న వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన సీటీ రవిపై కాంగ్రెస్ అభ్యర్థి తమ్మయ్య విజయం సాధించారు. చిక్కమగళూరు జిల్లాలోని ఐదు స్థానాలలో ఈసారి బీజేపీ ఘోరంగా ఓడిపోయింది.

మహిళకు వేధింపులు

యశవంతపుర: పని ఇప్పిస్తానంటూ నమ్మించి మహిళను వేధిస్తున్న ఘటన దక్షిణ కన్నడ జిల్లా బెళ్తంగడి తాలూకా ఉజిరిలో జరిగింది. టెక్స్‌టైల్ వ్యాపారం చేస్తున్న ప్రభాకర హెగ్డే ఓ మహిళను కారులో తీసుకెళ్లి వేధిస్తుండగా బైక్‌పై వెళ్తున్న యువకులు మహిళను రక్షించారు. ప్రభాకర్ అక్కడ నుంచి పరారైయ్యాడు.

హోసూరు వార్తలు..

పాముకాటుతో రైతు మృతి

క్రిష్ణగిరి: పాముకాటుకు గురైన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కురుబరపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు క్రిష్ణగిరి సమీపంలోని బిల్లనకుప్పం గ్రామానికి చెందిన రైతు దురైస్వామి (60) రెండు రోజుల క్రితం పొలం పనులు చేస్తుండగా పాము కాటేసింది. విషయం గమనించిన స్థానికులు క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఫలితంలేక శనివారం రాత్రి మృతి చెందాడు. కురుబరపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

చెరువులో పడి రైతు...

కెలమంగలం: చెరువులో జారి పడిన రైతు మృతి చెందిన ఘటన తళి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని ఆలేమరదొడ్డి గ్రామానికి చెందిన రైతు కెంపయ్య (60). శనివారం సాయంత్రం నెల్లుమారు చెరువులో చేపలు పడుతూ అదుపుతప్పి చెరువులో పడి మృతి చెందాడు. తళి పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

ఉసురు తీసిన క్రికెట్ బెట్టింగ్

కెలమంగలం: ఐపీఎల్ బెట్టింగ్ ఆడి లక్షల్లో నష్టపోయిన భవన నిర్మాణ కార్మికుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన కెలమంగలం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... డెంకణీకోట తాలూకా కెలమంగలం సమీపంలోని దొడ్డేగానపల్లి గ్రామానికి చెందిన కార్మికుడు మంజునాథ్ (35) ఐపిఎల్ బెట్టింగులు ఆడేవాడు. కొద్ది రోజులుగా దాదాపు రూ. 5 లక్షలు కోల్పోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. కెలమంగలం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని స్వాధీనపరుచుకొని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

మల్లికార్జున దుర్గం సందర్శన



కొండపై కలెక్టర్ తదితరులు

కెలమంగలం: క్రిష్ణగిరి జిల్లాలో ప్రసిద్ధి పొందిన చారిత్రక ఆధారాలు, శిలాశాసనాలు, శిలా ఫలకాలు, పర్యాటక ప్రాంతాలను రక్షించుకునే ఉద్దేశంతో ప్రతివారం జిల్లా కలెక్టర్, అధికారులు చారిత్రక ప్రదేశాల సందర్శన చేపట్టారు. ఆదివారం ఉదయం అంచెట్టి తాలూకాలోని మల్లికార్జున దుర్గం కొండపై పర్యటించారు. కొండపై వెలసిన పురాతన మల్లికార్జున స్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దీపక్‌జేకబ్ మాట్లాడుతూ క్రిష్ణగిరి జిల్లాలో చారిత్రక ప్రసిద్ధి పొందిన ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సబ్‌కలెక్టర్ శరణ్య, జిల్లా అటవీ శాఖాధికారిణి కార్తికేయిని, పర్యాటక శాఖాధికారి గజేంద్రకుమార్, పురావస్తు శాఖాధికారి గోవిందరాజ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

హోసూరు: క్రిష్ణగిరి జిల్లా స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలు ఆదివారం హోసూరులోని ఎంజీఆర్ కళాశాలలో జరిగాయి అమెచ్యూర్ కిక్‌బాక్సింగ్ అసోషియేషన్ ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో పిల్లలు, సబ్‌జూనియర్, జూనియర్, సీనియర్ నాలుగు విభాగాలుగా పోటీలు జరిగాయి. వంద మందికి పైగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన వారికి బహుమతులందజేసే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జాతీయ శిక్షకులు చంద్రు, అబ్దుల్ రహమాన్, హోసూరు మక్కల్ సంఘ అధ్యక్షులు శరవణన్, సంస్థ అధ్యక్షులు ప్రశాంత్, అమెచ్యూర్ కిక్‌బాక్సింగ్ అసోషియేషన్ అధ్యక్షులు నాగరాజ్, మంజునాథ్ తదితరులు పాల్గొని విజేతలకు బహుమతులందజేశారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను ఈనెల 26, 27, 28వ తేదీల్లో చెన్నైలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

లారీని వెనుక నుంచి ఢీకొన్న బైక్

- యువకుడు మృతి



ఘటనా స్థలంలో సహాయక చర్యలు

క్రిష్ణగిరి: హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిపై వెళుతున్న లారీని వెనుక నుంచి బైక్ ఢీకొట్టగా ఒకరు అక్కడికక్కడే మరణించారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం సూళగిరి సమీపంలో చోటు చేసుకొంది. సూళగిరి నుంచి హోసూరు వైపు గ్రానైట్ రాళ్లతో వస్తున్న లారీని తిరుపత్తూరుకు చెందిన జయశంకర్ (22), మిత్రుడు బైక్‌పై వెనుక నుంచి వేగంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో జయశంకర్ తీవ్ర గాయాలతో ఘటనా స్థలంలోనే మృతి చెందగా మరో యువకుడు కూడా గాయపడ్డాడు. స్థానికులు సూళగిరి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు చేరుకొని ప్రాణాపాయ స్థితిలో ఉన్న యువకున్ని చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. జయశంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కాంగ్రెస్ గెలుపుపై సంబరాలు

హోసూరు: కర్ణాటకలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై హోసూరు తాలూకా బాగలూరులో కాంగ్రెస్ కూటమి పార్టీలైన డీఎంకే, తదితర పార్టీల నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకొన్నారు. హోసూరు యూనియన్ డీఎంకే కార్యదర్శి గజేంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సంబరాల్లో ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో 223 సీట్లలో కాంగ్రెస్ పార్టీ 136 స్థానాలను కైవసం చేసుకొని బీజేపీ పార్టీకి గుణపాఠం నేర్పిందన్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ పార్టీని ఇంటికి పంపడం ఖాయమన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

హోసూరు: క్రిష్ణగిరి ప్రాంతం నుంచి కర్ణాటకకు అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న కారు డ్రైవర్‌ను అధికారులు అరెస్ట్ చేశారు. క్రిష్ణగిరి ఫ్లయింగ్ స్క్వాడ్ తహసీల్దార్ ఇళంగోవన్, అధికార్లు ఆదివారం వేకువజామున వేపనపల్లి సమీపంలోని గిరిపల్లి గ్రామం వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. వ్యాన్‌లో తరలిస్తున్న 1200 కిలోల రేషన్ బియ్యం పట్టుబడింది. క్రిష్ణగిరికి చెందిన రాజశేఖర్ (24)ను అరెస్టు చేసి వాహనం బియ్యాన్ని సీజ్ చేశారు.

పెదనాన్నను చాకుతో పొడిచి హత్య

- ఓట్లు వేపించ లేదని తమ్ముడి కుమారుడి దారుణం





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

కృష్ణరాజపురం: శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఓట్లు వేయించలేదని అన్నదమ్ముల మధ్య జరిగిన గొడవలో తమ్ముడి కుమారుడు పెదనాన్నను చాకుతో పొడిచి హత్య చేయడంతో పాటు మరికొందరిపై దాడి చేసిన ఘటన బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధిలోని హొసకోటె తాలూకా డిశెట్టిహళ్లిలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కృష్ణప్ప, గణేశప్ప అన్నదమ్ములు. ఓట్లు సరిగా వేయించలేదని సోదరులు ఇద్దరు గొడవపడుతున్నారు. ఈ సమయంలో తీవ్ర ఆగ్రహానికి గురైన గణేశప్ప కుమారుడు ఆదిత్య తన పెదనాన్న కృష్ణప్పను కత్తితో పొడిచి హత్య చేశాడు. ఆ సమయంలో అడ్డు వచ్చిన వారిపై కూడా దాడి చేసి పారిపోయాడు. నందగుడి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

త్వరలోనే నూతన ముఖ్యమంత్రి

- నాటి కేసీ రెడ్డి నుంచి బొమ్మై వరకూ..

శివాజీనగర: రాష్ట్రంలో త్వరలో నూతన ముఖ్యమంత్రిగా అధికారం స్వీకరించనున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పరాజయంతో సీఎం బసవరాజ బొమ్మై పదవికి రాజీనామా చేయగా కొత్త సీఎం పదవి తీసుకునేవరకూ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా ఉండాలని గవర్నర్ గెహ్లాట్ సూచించారు. 1947 నుండి 2023 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రులుగా ఎవరెవరు పదవి నిర్వర్తించారు, వారి పదవి ఎంత కాలం ఉండేది అనే వివరాలు...



గత ముఖ్యమంత్రుల్లో కొందరు

పేరు	పార్టీ	కాలావధి
1.కే.చెంగల్‌రాయరెడ్డి	కాంగ్రెస్	25 అక్టోబరు 1947 నుండి 30 మార్చి 1952 వరకు
2.కెంగల్ హనుమంతయ్య	కాంగ్రెస్	30 మార్చి 1952 నుండి 19 ఆగష్టు 1956 వరకు
3. కడిదాళ్ మంజప్ప	కాంగ్రెస్	19 ఆగష్టు 1956 నుండి 31 అక్టోబరు 1956 వరకు
4. ఎస్.నిజలింగప్ప	కాంగ్రెస్	1 నవంబర్ 1956 నుండి 16 మే 1958 వరకు
5. బీ.డీ.జత్తి	కాంగ్రెస్	16 మే 1958 నుండి 9 మార్చి 1962 వరకు
6. ఎస్.ఆర్.కంటి	కాంగ్రెస్	14 మార్చి 1962 నుండి 20 జూన్ 1962 వరకు
7. ఎస్.నిజలింగప్ప	కాంగ్రెస్	21 జూన్ 1962 నుండి 28 మే 1968 వరకు
8. వీరేంద్ర పాటిల్	కాంగ్రెస్	29 మే 1968 నుండి 18 మార్చి 1971 వరకు
9. రాష్ట్రపతి పాలన		19 మార్చి 1971 నుండి 20 మార్చి 1972 వరకు
10. డీ.దేవరాజ అరసు	కాంగ్రెస్	20 మార్చి 1972 నుండి 31 డిశెంబర్ 1977 వరకు
11. రాష్ట్రపతి పాలన		31 డిశెంబర్ 1977 నుండి 28 ఫిబ్రవరి 1978 వరకు
12. డీ దేవరాజ అరసు	కాంగ్రెస్	28 ఫిబ్రవరి 1978 నుండి 7 జనవరి 1980 వరకు
13. ఆర్.గుండూరావు	కాంగ్రెస్	12 జనవరి 1980 నుండి 6 జనవరి 1983 వరకు
14. రామకృష్ణ హెగ్డే	జనతా పార్టీ	10 జనవరి 1983 నుండి 10 ఆగష్టు 1988 వరకు
15. ఎస్.ఆర్.బొమ్మై	జనతా పార్టీ	10 ఆగష్టు 1988 నుండి 21 ఏప్రిల్ 1989 వరకు
16. రాష్ట్రపతి పాలన		21 ఏప్రిల్ 1989 నుండి 30 నబంబర్ 1989 వరకు
17. వీరేంద్ర పాటిల్	కాంగ్రెస్	30 నవంబర్ 1989 నుండి 10 అక్టోబరు 1990 వరకు
18. రాష్ట్రపతి పాలన		10 అక్టోబరు 1990 నుండి 17 అక్టోబరు 1990 వరకు
19. ఎస్.బంగారప్ప	కాంగ్రెస్	17 అక్టోబరు 1990 నుండి 19 నవంబర్ 1992 వరకు
20. ఎం.వీరప్ప మొయిలీ	కాంగ్రెస్	19 నవంబర్ 1992 నుండి 11 డిశెంబర్ 1994 వరకు
21. హెచ్.డీ.దేవెగౌడ	జనతా దళ	11 డిశెంబర్ 1994 నుండి 31 మే 1996 వరకు
22. జే.హెచ్.పాటిల్	జనతా పార్టీ	31 మే 1996 నుండి 7 అక్టోబరు 1999 వరకు
23. ఎస్.ఎం.కృష్ణ	కాంగ్రెస్	11 అక్టోబరు 1999 నుండి 28 మే 2004 వరకు
24. ధరంసింగ్	కాంగ్రెస్	28 మే 2004 నుండి 2 ఫిబ్రవరి 2006 వరకు
25. హెచ్.డీ.కుమారస్వామి	జేడీఎస్	3 ఫిబ్రవరి 2006 నుండి 8 అక్టోబరు 2007 వరకు
26. రాష్ట్రపతి పాలన		8 అక్టోబరు 2007 నుండి 12 నవంబర్ 2007 వరకు
27. బీ.ఎస్.యడియూరప్ప	బీజేపీ	12 నవంబర్ 2007 నుండి 19 నవంబర్ 2007 వరకు
28. రాష్ట్రపతి పాలన		20 నవంబర్ 2007 నుండి 29 మే 2008 వరకు
29. బీ.ఎస్.యడియూరప్ప	బీజేపీ	30 మే 2008 నుండి 4 ఆగష్టు 2011 వరకు
30. డీ.వీ.సదానందగౌడ	బీజేపీ	5 ఆగష్టు 2011 నుండి 11 జులై 2012 వరకు
31. జగదీశ్ శెట్టర్	బీజేపీ	12 జులై 2012 నుండి 8 మే 2013 వరకు
32. సిద్దరామయ్య	కాంగ్రెస్	13 మే 2013 నుండి 15 మే 2018 వరకు
33. బీ.ఎస్.యడ్యూరప్ప	బీజేపీ	17 మే 2018 నుండి 23 మే 2018 వరకు
34. హెచ్.డీ.కుమారస్వామి	జేడీఎస్	23 మే 2018 నుండి 23 జులై 2019 వరకు
35. బీ.ఎస్.యడియూరప్ప	బీజేపీ	26 జులై 2019 నుండి 26 జులై 2021 వరకు
36. బసవరాజ బొమ్మై	బీజేపీ	28 జులై 2021 నుండి 13 మే 2023 వరకు

క్లుప్తంగా...

జర్నలిస్టుల ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

- 1,200 మందికి పైగా జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు
- సమాచార శాఖ కమిషనర్ విజయ్‌కుమార్‌రెడ్డి వెల్లడి

సాక్షి, అమరావతి: జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యుల ఆరోగ్య సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ, సమాచార, పౌర సంబంధాల శాఖ సంయుక్తంగా విజయవాడలోని ఆంధ్రా లయోలా ఇంజినీరింగ్ కాలేజీలో శని, ఆదివారాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించాయి. దీనికి 1,200 మందికి పైగా జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులు హాజరై ఉచితంగా వైద్య సేవలు పొందారని తెలిపారు. తొలిరోజు 17 రకాల వైద్య పరీక్షలు, రెండో రోజు వైద్యులతో కన్సల్టేషన్లు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కొత్తగా అక్రిడిటేషన్ కార్డులు పొందిన వారు వీలైనంత త్వరగా జర్నలిస్టు హెల్త్‌కార్డులు తీసుకోవాలని కోరారు. త్వరలో విశాఖపట్నం, రాజమహేంద్రవరం, తిరుపతిలో కూడా జర్నలిస్టులు, వారి కుటుంబసభ్యులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. కాగా, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ శిబిరంలో సేవలందించిన 22 ఆస్పత్రుల యాజమాన్యాలకు డా.వైఎస్సార్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో హరీంద్ర ప్రసాద్ మొమెంటోలు అందజేశారు.

క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా వాసు బాధ్యతల స్వీకారం



బాధ్యతలు స్వీకరిస్తున్న వాసు

సాక్షి, అమరావతి/పటమట(విజయవాడ తూర్పు) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పాతపాటి వెంకట శ్రీనివాసరాజు(వాసు) బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని టీచర్స్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ముదునూరి ప్రసాదరాజు ఆదివారం కొత్త చైర్మన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఇప్పటి వరకు క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేసిన మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు ఇటీవల మృతి చెందారు. దీంతో ఆయన తనయుడు వాసుకు ఆ పదవిని అప్పగిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరాజు మాట్లాడుతూ క్షత్రియ సామాజిక వర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందేలా కృషి చేస్తానన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే సాధ్యమైందని వివరించారు. శ్రీనివాసరాజుకు శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద్ రాజు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పి.వి.ఎల్.నరసింహారాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గాదిరాజు సుబ్బరాజు, రాష్ట్ర ఎంబీసీ సంచారజాతుల చైర్మన్ పెంట్ర వీరన్న తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

'వేగ' జ్యువెలర్స్‌లో ఘనంగా మాతృ దినోత్సవం

విజయవాడ: మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడలోని వేగ జ్యువెలర్స్ ఖాతాదారులైన ముగ్గురు మాతృమూర్తులను సంస్థ ఆదివారం ఘనంగా సన్మానించింది. సంస్థ యజమానులైన వనమా నవీన్‌కుమార్, వనమా సుధాకర్ మాట్లాడుతూ..తమ షోరూంను మాతృ దినోత్సవాన ప్రారంభించామని గుర్తు చేశారు. పిల్లలకు తొలి గురువు తల్లేనని, వారి బంగారు భవిష్యత్తుకు తొలి మార్గదర్శిగా ఆమె వేసే బాటలు, పిల్లలు పట్ల చూపే ప్రేమాభిమానాలు వెలకట్టలేనివన్నారు. మాతృ దినోత్సవం సందర్భంగా తమ షోరూంలో రూ.2 లక్షల విలువైన బంగారం, వజ్రాలు కొనుగోలు చేసిన వారికి ఒక గ్రాము గోల్డ్ కాయిన్‌ను ఉచితంగా ఇస్తున్నట్లు ప్రకటించారు. పోల్కీ ఆభరణాల కొనుగోలుపై తరుగు, మజూరీ చార్జీలు ఉండవని తెలిపారు. కార్యక్రమంలో నగర ప్రముఖులు, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు జడ్జి

యాదగిరిగుట్ట రూరల్ : యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ ఏవీ.రవీంద్రబాబు ఆదివారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. స్వయంభూలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండపంలోని ఉత్సవమూర్తుల వద్ద నిర్వహించిన సువర్ణ పుష్పార్చనలో పాల్గొన్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం చేసి లడ్డూ ప్రసాదం అందజేశారు.

రాష్ట్రం భగభగ

అన్ని ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు

అనేకచోట్ల 42 నుంచి 44 డిగ్రీలు నమోదు

- తుపాను ప్రభావంతో గాలిలో తగ్గిపోయిన తేమ శాతం
- అందుకే తీవ్ర ఉక్కపోత, ఎండలు..
- ఇంకా నాలుగైదు రోజులు ఇలాగే కొనసాగే అవకాశం



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం : రాష్ట్రంలో ఎండలు తీవ్ర ప్రతాపం చూపుతున్నాయి. ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా ఎండలు భగభగమండగా కోస్తా జిల్లాల్లో వాటి ప్రభావం ఇంకా ఎక్కువ కనిపించింది. అనేక ప్రాంతాల్లో 42 నుంచి 44 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉ.11 గంటలకే చాలా ప్రాంతాల్లో 40–41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవడంతో ప్రజలు బయటకురావడానికే బెంబేలెత్తిపోయారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, తూర్పు గోదావరి, గుంటూరు, పల్నాడు, కాకినాడ, ప్రకాశం జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా కనిపించింది. ఈ జిల్లాల్లో దాదాపు అన్నిచోట్లా 40–44 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు నమో దయ్యాయి. అనకాపల్లి, విశాఖ జిల్లాలు మినహా మిగిలిన అన్ని జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైనే నమోదయ్యాయి. ఎన్టీఆర్ జిల్లా చిల్లకల్లులో అత్యధికంగా 44.8 డిగ్రీలు నమోదైంది. ఏలూరు జిల్లా వంగిడిగూడెంలో 44.7, కామవరపుకోటలో 44.5, ఎన్టీఆర్ జిల్లా చందర్లపాడులో 44.4, ఏలూరు జిల్లా రాజుపోతేపల్లిలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మోకా తుపాను ప్రభావమే

మోకా తుపాను ప్రభావంవల్లే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరిగినట్లు వాతావరణ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. బంగాళాఖాతం నుంచి ఏపీకి వీచే గాలులను తుపాను లాగేసుకున్నట్లు అంచనా వేస్తున్నారు. దీంతో మన ప్రాంతంలో గాలిలో తేమ శాతం తగ్గిపోయింది. కేవలం తేమలేని పొడిగాలులు వీస్తుండడంతో తీవ్రమైన ఉక్కపోత, ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. రాజస్థాన్, మహారాష్ట్ర వైపు నుంచి వచ్చే గాలుల్లో తేమ శాతం లేకపోవడంతో ఉక్కపోత, ఎండ తీవ్రత ఇంకా పెరిగింది. తుపాను ప్రభావం తగ్గేవరకు అంటే నాలుగైదు రోజుల వరకు ఇదే పరిస్థితి ఉంటుందని.. ఎండల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖాధికారులు తెలిపారు.

జిల్లాల వారీగా నమోదైన అత్యధిక ఉష్ణోగ్రతలు..

జిల్లా	మండలం	ప్రదేశం	ఉష్ణోగ్రత
ఎన్టీఆర్	జగ్గయ్యపేట	చిల్లకల్లు	44.8
ఏలూరు	ద్వారకా తిరుమల	వంగిడిగూడెం	44.7
పల్నాడు	నరసరావుపేట	కాకాని	44.1
కృష్ణా	గుడ్లవల్లేరు	కవుతరం	43.8
బాపట్ల	పర్చూరు	పర్చూరు	43.7
తూర్పుగోదావరి	గోకవరం	గోకవరం	43.3
ప్రకాశం	కురిచేడు	కురిచేడు	43.3
అల్లూరి	కూనవరం	కొండాయిగూడెం	43.2
గుంటూరు	దుగ్గిరాల	దుగ్గిరాల	43
పశ్చిమ గోదావరి	పోడూరు	పోడూరు	42.8
నంద్యాల	దోర్నిపాడు	దోర్నిపాడు	42.4
అంబేద్కర్ కోనసీమ	కే గంగవరం	శివాల	42.3
తిరుపతి	సత్యవేడు	సత్యవేడు	42.1
వైఎస్సార్	కడప	కడప టౌన్	41.9
నెల్లూరు	వెంకటాచలం	కసుమూరు	41.9
పార్వతీపురం మన్యం	సాలూరు	సాలూరు	41.7
కర్నూలు	మంత్రాలయం	మంత్రాలయం	41.4
విజయనగరం	వంజర	వంజర	41.1
అనంతపురం	శింగనమల	తరిమెల	40.6
కాకినాడ	గండేపల్లి	గండేపల్లి	40.5
చిత్తూరు	నింద్ర	నింద్ర	40.4
శ్రీకాకుళం	జి.సిగడం	జి.సిగడం	40.3
అన్నమయ్య	నందలూరు	చిన్నయాగరపల్లి	40.1
శ్రీసత్యసాయి	ధర్మవరం	ధర్మవరం	40.0
అనకాపల్లి	దేవరపల్లి	దేవరపల్లి	39.1
విశాఖ	పద్మనాభం	పద్మనాభం	38.8

వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నీ ప్రారంభం

- చంద్రగిరిలో వెయ్యి టీమ్‌లు, 15 వేల మంది క్రికెటర్లతో టోర్నీ నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ చెవిరెడ్డి
- ప్రారంభించిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- క్రీడా యజ్ఞం నిర్వహిస్తున్నారంటూ చెవిరెడ్డికి అభినందన




ట్రోఫీలను పరిశీలిస్తున్న వైవీ సుబ్బారెడ్డి, చెవిరెడ్డి, వెంకటరమణారెడ్డి, పరమేశ్వరరెడ్డి తదితరులు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో ప్రభుత్వ విప్, తుడా చైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి క్రీడా మహాయజ్ఞం నిర్వహిస్తున్నారని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి అభినందించారు. ఆదివారం ఆయన తిరుపతి జిల్లా చంద్రగిరిలో వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నీని ప్రారంభించారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సరదాగా కొద్దిసేపు క్రికెట్ ఆడారు. టోర్నమెంట్‌లో పాల్గొనే టీమ్‌లకు రూ.25 వేల చొప్పున విలువ చేసే క్రికెట్ కిట్, టీషర్టులను అందించారు. క్రీడాకారులకు బహూకరించనున్న వేలాది మొమెంటోలు, ట్రోఫీలను పరిశీలించారు. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా సంక్షేమం కోసం తపించే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. చంద్రగిరి నియోజకవర్గంలోనే 15 వేల మంది యువతను ఒక్కచోటకు చేర్చి వారి మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడం గొప్ప విషయమన్నారు. తండ్రి బాటలో పయనిస్తూ.. ఈ ఏడాది రికార్డు స్థాయిలో వెయ్యి టీమ్‌లను భాగస్వాములను చేశారంటూ టోర్నమెంట్ కార్యనిర్వాహకుడు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని అభినందించారు. ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం జగన్ స్ఫూర్తితో యువతలో క్రీడా నైపుణ్యాలను వెలికి తీసి, గ్రామాల మధ్య స్నేహపూర్వక వాతావరణం కల్పించే లక్ష్యంతో ఏటా వైఎస్సార్ గ్రామీణ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ చూపిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లోనూ పాల్గొనేలా తమ వంతు ప్రోత్సాహం అందిస్తామన్నారు.

● తెలంగాణ

విద్యుత్ సంస్కరణలకు నేనే మార్గదర్శిని

- టెలికాంలోనూ సంస్కరణలు తేవాలని వాజ్‌పేయ్‌కు చెప్పా
- పీ–3 పాలసీతోనే హైటెక్ సిటీ నిర్మించా
- బయో టెక్నాలజీ గురించి అప్పట్లో బిల్‌గేట్స్ నాతో మాట్లాడారు
- నా విజన్ వల్లే హైదరాబాద్ అభివృద్ధి
- నాడు విజన్ 2020 అంటే.. నన్ను 420 అన్నారు
- 'గీతం'వర్సిటీ వేడుకలోనూ మాజీ సీఎం చంద్రబాబు అదే పాత పాట



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: అప్పట్లో తాను విజన్ 2020 రూపకల్పన చేస్తే తనను అందరూ 420 అంటూ ఎద్దేవా చేశారని మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు ఎన్. చంద్రబాబునాయుడు వ్యాఖ్యానించారు. తన విజన్ 2020 వల్లే హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. సంగారెడ్డి జిల్లా రుద్రారంలోని గీతం యూనివర్సిటీలో జరిగిన స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ తొలి గ్రాడ్యుయేషన్ వేడుకకి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశంలో వచ్చిన పలు ఆర్థిక సంస్కరణలకు తానే కారణమని చెప్పుకొచ్చారు. ముఖ్యంగా విద్యుత్ సంస్కరణకు తానే మార్గదర్శినన్నారు. తాను తెచ్చిన సంస్కరణల వల్ల ఇప్పుడు దేశంలో విద్యుత్ రంగం అభివృద్ధి చెందిందన్నారు. అదేవిధంగా టెలికాంలోనూ సంస్కరణలు తేవాలని నాటి ప్రధాని వాజ్‌పేయ్‌కు చెప్పానని చెప్పుకున్నారు. ఇక తాను రూపకల్పన చేసిన పాలసీల కారణంగానే హైటెక్ సిటీ, ఔటర్ రింగ్ రోడ్డు, జినోమ్ వ్యాలీ, గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టులు వచ్చాయని చెప్పారు. జినోమ్ వ్యాలీలోనే ఇప్పుడు కరోనాకు వ్యాక్సిన్ ఉత్పత్తి జరుగుతోందన్నారు.

డిజిటల్ కరెన్సీతో ఎన్నికల్లో డబ్బు ప్రవాహానికి చెక్

రూ.500, రూ.2 వేల పెద్ద నోట్లను రద్దు చేయడం ద్వారా దేశంలో నల్లధనం ప్రవాహం, అవినీతిని రూపుమాపవచ్చని చంద్రబాబు అన్నారు. డిజిటల్ కరెన్సీతో ఎన్నికల్లో ఓటర్లకు డబ్బులు పంపిణీ వంటి అవినీతికి అడ్డుకట్ట పడుతుందని చెప్పారు. పబ్లిక్, ప్రభుత్వం, ప్రైవేట్, పార్టనర్ షిప్ (పీ–4)తో వేగంగా ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తాను అప్పట్లో ప్రైవేట్, పబ్లిక్, పార్ట్‌నర్‌షిప్ (పీ–3) పాలసీతోనే తాను హైటెక్ సిటీని నిర్మించానన్నారు. బయోటెక్నాలజీకి సంబంధించి అప్పట్లో బిల్‌గేట్స్ తనకు చెప్పారని గుర్తు చేశారు. కార్యక్రమంలో గీతం యూనివర్సిటీ చాన్స్‌లర్ వీరేందర్‌సింగ్ చౌహాన్, ప్రెసిడెంట్ ఎం.శ్రీభరత్, వీసీ ప్రొఫెసర్ దయానంద సిద్దవటం, ప్రొఫెసర్ జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి తాతామనవళ్లు మృతి

తిరుపతి జిల్లాలో విషాదం

భాకరాపేట (తిరుపతి జిల్లా): ఎంతో అన్యోన్యంగా ఉండే ముగ్గురు తాతామనవళ్లు సరదాగా చేపల వేటకు వెళ్లి మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో తాత మునిగిపోతుండడం చూసి మనవళ్లు ఇద్దరూ నీటిలోకి దిగారు. కానీ, అక్కడ లోతు ఎక్కువగా ఉండడంతో ముగ్గురూ మరణించారు. ఈ సంఘటన ఎర్రావారిపాళెం మండలం తంబిరెడ్డిగారిపల్లెలో తీవ్ర విషాదాన్ని నింపింది. యల్లమంద పంచాయతీ తంబిరెడ్డిగారిపల్లెకు చెందిన నాగముని (66)కు ఇద్దరు కుమార్తెలు. వీరికి పెళ్లిళ్లు అయి అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో ఉంటున్నారు. ఇద్దరి కుమార్తెల కొడుకులు మణికంఠ (12), జగదీష్ (14) సెలవుల నిమిత్తం తాతగారి ఇల్లు తంబిరెడ్డిగారిపల్లెకు వచ్చారు. ఆదివారం తాత నాగమునితో కలిసి గ్రామ సమీపంలోని గాజులేరు డ్యామ్‌లో చేపలు పట్టేందుకు వెళ్లారు. తాత గాజులేరులోకి దిగి వల వేస్తూ వలలో చిక్కుకున్నాడు. దీంతో తాతను కాపాడడానికి డ్యాంలోకి ఇద్దరు మనవళ్లు దిగారు. అది లోతు ఎక్కువున్న ప్రదేశం కావడంతో ముగ్గురూ నీట మునిగిపోయారు. పక్కనే పొలాల్లో ఉన్న స్థానికులు ఇది గమనించి అక్కడికి చేరుకున్నారు. నాగముని, మణికంఠ, జగదీష్ మృతదేహాలను వెలికితీశారు.



తాత, మనవళ్ల మృతదేహాలు

బీమా అని చెప్పి పేపర్లో వేశారు

అంతా బాగుంటే అలా రాయడమేంటి? ● ఈనాడు రాతలపై రైతుల మండిపాటు



గోటేరులో వ్యవసాయ అధికారులతో మాట్లాడుతున్న రైతులు

ఇరగవరం : ఎవరో ఇద్దరు వచ్చి ఇన్సూరెన్సు కోసం అని చెప్పి ఫొటోలు తీసుకుని పత్రికల్లో వేశారని పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం గోటేరు గ్రామానికి చెందిన తోట రామలింగేశ్వరరావు అనే రైతు వాపోయాడు. గోటేరులో రైతులు మొలకెత్తిన ధాన్యం చూపించారని, రైతులు నష్టపోయారని ఆదివారం 'ఈనాడు'లో పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో వచ్చిన కథనంపై గోటేరు రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, అధికారులు అన్నీ బాగా చేస్తున్నా ఇటువంటి రాతలు రాయడం ఏమిటని వారు మండిపడ్డారు. ఇద్దరు వ్యక్తులు శనివారం గ్రామంలోని పొలాల దగ్గర ఉన్న తమ వద్దకి వచ్చి ఇన్సూరెన్స్ కోసమని ఫొటోలు తీసుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో.. ఆదివారం వ్యవసాయ శాఖాధికారులు, వైఎస్సార్‌సీపీ నేతలు రైతులను కలిసి మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్ల విషయంలో అంతా బాగుందని.. సీఎం జగన్ ప్రభుత్వం అంతా బాగానే చేస్తోందని రామకృష్ణ అనే రైతు చెప్పాడు. నిజానికి.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా సమస్యలు ఉన్నాయని రాశారని, కావాలంటే తామంతా ఎలాంటి సమస్యల్లేవని రాసి సంతకం చేస్తామని గోటేరు రైతులు తెలిపారు. చంద్రబాబు మీద ఉన్న ప్రేమతో రైతుల జీవితాలతో పచ్చ మీడియా ఆడుకోవడం మంచిది కాదన్నారు. చరిత్రలో ఎన్నడు లేనివిధంగా రైతులకు ఐదు రోజుల్లో ధాన్యం డబ్బులు జమచేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని వారన్నారు.

కార్పొరేట్ కొలువు.. మనశ్శాంతి కరువు



దేశంలోని 48 శాతం మంది కార్పొరేట్ ఉద్యోగుల్లో క్షీణిస్తున్న మానసిక ఆరోగ్యం

- ఇందులో ఎక్కువ మంది బాధితులు మహిళలే
- 'ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్' సర్వేలో వెల్లడి
- ముంబై, హైదరాబాద్ సహా 8 నగరాల్లో సర్వే

సాక్షి, అమరావతి: 'ఐదంకెల జీతం.. ఆఫీస్ కారు.. దేశ, విదేశాల్లో క్యాంప్‌లు.. నీకేంట్రా లైఫ్ మొత్తం దిల్‌కుష్‌గా ఎంజాయ్ చేస్తున్నావ్' అని స్నేహితులెవరైనా అంటే.. 'చూసేవాళ్లకు బాగానే కనిపిస్తుంది. జీవితంలో బొత్తిగా మానసిక ప్రశాంతత లేకుండా పోతోంది. రోజు రోజుకూ యాజమాన్యం నుంచి ఒత్తిళ్లు పెరిగిపోతున్నాయి. రాత్రిళ్లు కంటినిండా నిద్ర ఉండటం లేదు. ముద్ద మింగుడు పడటం లేదు' అని నిట్టూరుస్తున్నారు కార్పొరేట్ ఉద్యోగులు. దేశంలో కార్పొరేట్ కంపెనీల్లో పనిచేసే సగం మంది ఉద్యోగులు తమ మానసిక ఆరోగ్యం క్షీణిస్తోందని ఆందోళన చెందుతున్నారు.

సైలెంట్ స్ట్రగుల్ సర్వే ఏం తేల్చిందంటే..

కార్పొరేట్ ఉద్యోగుల మానసిక పరిస్థితులపై 'ది సైలెంట్ స్ట్రగుల్' పేరిట ఆదిత్య బిర్లా ఎడ్యుకేషన్ ట్రస్ట్ ఎంపవర్ చేపట్టిన సర్వేలో ఉద్యోగులు మానసిక ఆరోగ్యం క్షీణిస్తోందని రూఢీ అయ్యింది. కార్పొరేట్ ఉద్యోగుల మానసిక ఆరోగ్యాన్ని అంచనా చేయడంతోపాటు మెరుగైన మానసిక ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణకు అవసరమైన అంతరాలను గుర్తించడం కోసం ఈ అధ్యయనం చేశారు. ఇందులో భాగంగా దేశంలోని ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు, అహ్మదాబాద్, పుణె నగరాల్లో 3,000 మంది ఉద్యోగులపై అధ్యయనం చేశారు. అధ్యయనానికి ఎంపిక చేసిన వారిలో 1,627 మంది పురుషులు, 1,373 మంది మహిళలు ఉన్నారు. వీరిలో 2,640 మంది 30–45 ఏళ్లు, 291 మంది 46–60 ఏళ్లు, 69 మంది 60 ఏళ్లు పైబడిన వారున్నారు.

రిస్క్‌లో 48 శాతం మంది ఉద్యోగులు

అధ్యయనంలో భాగంగా 48 శాతం మంది ఉద్యోగుల మానసిక ఆరోగ్యం రిస్క్‌లో ఉన్నట్టు తేలింది. సమూహాల వారీగా మెంటల్ హెల్త్ రిస్క్ ప్రొఫైల్‌ను పరిశీలించగా.. 56 శాతం మంది మహిళలు, 41 శాతం మంది పురుషులు రిస్క్‌లో ఉన్నారు. అత్యధికంగా 60 ఏళ్లు పైబడిన వారిలో అత్యధికంగా 71 శాతం మంది రిస్క్‌లో ఉండగా.. 46–60 ఏళ్ల వారిలో 48 శాతం, 30–45 ఏళ్ల వారిలో 47 శాతం మంది రిస్క్‌ను ఎదుర్కొంటున్నారు

మానసిక ఆరోగ్య సమస్యలతో సెలవులు

ఇదిలా ఉండగా గడచిన ఏడాది కాలంలో తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన ఇతర మానసిక ఆరోగ్య సమస్యల కారణంగా రెండు వారాల పాటు సెలవులు తీసుకున్నట్టు 80 శాతం మంది ఉద్యోగులు పేర్కొన్నారు. అదేవిధంగా వర్క్‌లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకోలేకపోతున్నామని ప్రతి 10 మంది ఉద్యోగుల్లో 9 మంది అభిప్రాయపడ్డారు.

కొత్తకొత్తగా ఉన్నది.. పెళ్లి అక్కడే అన్నది

▶ మొదటి పేజీ తరువాయి

పెళ్లిళ్ల బడ్జెట్ కూడా తగ్గింది. కానీ, 2022లో వివాహ పరిశ్రమ కోవిడ్ మునుపటి స్థితికి చేరుకుంది. అయితే కోవిడ్‌కి ముందు పెళ్లికి హాజరయ్యే సగటు అతిథుల సంఖ్య 350–400గా ఉండేది. కానీ.. ప్రస్తుతం ఇది 150నుంచి 250 వరకు వచ్చింది. అయినప్పటికీ పెళ్లిళ్ల బడ్జెట్లు మాత్రం భారీగా ఉంటున్నాయి. అతిథుల జాబితాలు తగ్గిపోయినప్పటికీ.. వివాహాలను వైభవంగా చేసుకోవడానికి ఎక్కడా రాజీ పడట్లేదు. చాలామంది డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు/వెడ్‌టెక్ సంస్థలను సంప్రదిస్తూ రిసార్ట్స్, డెస్టినేషన్ వెడ్డింగ్‌లను ఎంచుకోవడమే ఇందుకు కారణం.

25 శాతం వివాహాలు భారతదేశంలోనే..

ప్రపంచవ్యాప్తంగా ఏటా జరిగే వివాహాల్లో 25 శాతం భారత్‌లోనే ఉంటున్నాయి. అంటే భూమ్మీద జరిగే ప్రతి నాలుగు పెళ్లిళ్లలో ఒకటి భారతీయులదే. ప్రపంచ వివాహ పరిశ్రమలో భారత్, చైనాల వాటాయే అత్యధికం. ఇక దేశీయంగా ఢిల్లీ, ముంబై, బెంగళూరు, గోవా, లక్షద్వీప్, కేరళ, హేవ్‌లాక్ ఐలాండ్, మహారాష్ట్రలోని ఆలీబాగ్ డెస్టినేషన్ వెడ్డింగ్‌లకు కేంద్రాలుగా మారాయి. రాజస్థాన్ దేశంలోనే గొప్ప వెడ్డింగ్ డెస్టినేషన్‌గా కొనసాగుతోంది. అక్కడి పురాతన కోటలు, రాజప్రాసాదాల మధ్య వివాహాలకు యువత ఆసక్తి చూపుతోంది. జైపూర్, ఉదయ్‌పూర్, జోధ్‌పూర్, జైసల్మేర్, రణతంబోర్, బికనీర్ వెడ్డింగ్ ప్లానర్లకు ప్రధాన కేంద్రాలుగా మారాయి. దేశంలో డెస్టినేషన్ వెడ్డింగ్‌కు సగటున రూ.15 లక్షల నుంచి రూ.4 కోట్ల వరకు ఖర్చవుతోంది. ఉన్నత వర్గాల్లో అయితే ఒక్కో అతిథికి రూ.60 వేల వరకు ఖర్చు చేస్తున్నారు. ఇక్కడ సముద్ర తీర ప్రాంతాల్లో పెళ్లిళ్లు చేసుకునేందుకు యువత ఎక్కువ ఆసక్తి చూపడం విశేషం.

థాయ్‌లాండ్‌లో అత్యధికం

భారతీయులు విదేశీ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా థాయ్‌లాండ్‌ను ఇష్టపడుతున్నారు. గత ఏడాది అక్కడ జరిగిన విదేశీ పెళ్లిళ్లలో 60 శాతం భారతీయులవే కావడం విశేషం. మునుపెన్నడూ లేనంతగా భారతీయ జంటలు బ్యాంకాక్, కోస్యామ్యూయ్, పుకెట్, హువా హిన్, చయాంగ్ మాయ్ వివాహ వేడుకలకు కేరాఫ్‌గా మారాయి. థాయ్ టూరిజం అథారిటీ సైతం భారతదేశంలోని వెడ్డింగ్ ప్లానర్‌లతో భాగస్వామ్యం కలిగి ఉండటంతో సగటు ఏటా 400 జంటలు బంధుమిత్ర సమేతంగా అక్కడకు వెళ్లి వివాహాలు చేసుకుంటున్నాయి. ఇక దుబాయ్, బహ్రెయిన్, ఖతార్, ఒమన్, రస్ అల్ ఖైమా, మాల్దీవులు, టర్కీ, ఇటలీలోని టస్కానీ కూడా వెడ్డింగ్ డెస్టినేషన్‌గా భారతీయులను ఆకర్షిస్తున్నాయి. అక్కడ కుటుంబ సభ్యుల మధ్యనే వివాహాలు జరుగుతున్నాయి.

దివ్యాంగ విద్యార్థులకు జగనన్న కానుక

▶ మొదటి పేజీ తరువాయి

ఈ నిబంధనలు వర్తిస్తాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 44 శాతానికి తక్కువ కాకుండా అంగవైకల్యం ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి ఈ నిబంధనలు వర్తిస్తాయని స్పష్టంచేసింది.

'సుప్రీం' మార్గదర్శకాల మేరకు..

దివ్యాంగులకు మేలు చేసేలా ఈ సంవత్సరం ఏప్రిల్ 20న దివ్యాంగుల హక్కులకు సంబంధించిన కొత్త నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. సుప్రీంకోర్టు కూడా దివ్యాంగులకు ఉన్నత విద్యావకాశాలు కల్పించే విషయంలో కచ్చితంగా నిబంధనలు పాటించాలని గతంలోనే స్పష్టంచేసింది. ఈ నేపథ్యంలో.. సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం తాజాగా దివ్యాంగుల కోసం రూపొందించిన నిబంధనల మేరకు ఉన్నత విద్యా సంస్థల్లో వారికి ఐదు శాతం సీట్లు కేటాయించడంతోపాటు వయో పరిమితిలో ఐదేళ్ల సడలింపు సైతం ఇచ్చింది. ఇకపై ప్రతి సంవత్సరం ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలు జరిపే సమయంలో దివ్యాంగులకు ఆ మేరకు సీట్లు కేటాయించి వయో పరిమితి సడలింపు కూడా ఇవ్వాల్సి వుంటుంది. అన్ని శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, ఆయా శాఖల విభాగాధిపతులు, జిల్లా కలెక్టర్లు ఇందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని రవిచంద్ర ఆదేశించారు.

దివ్యాంగుల సాధికారతకు కట్టుబడి ఉన్నాం

రాష్ట్రంలో దివ్యాంగుల సాధికారతకు జగనన్న ప్రభుత్వం కట్టుబడి ఉంది. అందుకు అనుగుణంగానే ఇటీవలే వారి హక్కుల పరిరక్షణకు నిబంధనలు జారీచేశాం. రాష్ట్రస్థాయిలో దివ్యాంగులకు సలహా మండలి, జిల్లాల్లో కలెక్టర్ల అధ్యక్షతన జిల్లా కమిటీలను ఏర్పాటుచేశాం. దివ్యాంగులు ఆత్మగౌరవంతో స్వతంత్రంగా జీవించడానికి, సమాజంలో వారికి పూర్తి భాగస్వామ్యం కల్పించడానికి విద్యావకాశాలు మెరుగుపరచాలని సీఎం జగనన్న నమ్మారు. అందుకోసం ఇతరులతో సమానంగా అవకాశాలు కల్పించాలని భావించి అన్ని ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రభుత్వ ఎయిడ్ పొందుతున్న ఉన్నత విద్యా సంస్థల్లో వారికి ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించారు. దివ్యాంగులు విద్యను పొందడంలో ఆలస్య మయ్యే అవకాశమున్న నేపథ్యంలో ప్రవేశాల్లో గరిష్ట వయో పరిమితిని ఐదేళ్ల సడలించింది.

– కేవీ ఉష శ్రీచరణ్,
మహిళ, శిశు, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖల మంత్రి

● తెలంగాణ

నేడు ఈడీ విచారణకు చీకోటి ప్రవీణ్

సాక్షి, హైదరాబాద్: థాయ్‌లాండ్ క్యాసినో కేసులో అక్కడి పోలీసులకు పట్టుబడిన చీకోటి ప్రవీణ్‌కుమార్ సోమవారం ఈడీ అధికారుల విచారణకు హాజరుకానున్నారు. థాయ్‌లాండ్‌లో క్యాసినో ఆడేందుకు భారత్ నుంచి వెళ్లిన వారిని ఆ దేశ పోలీసులు ఇటీవల అరెస్టు చేయడం తెలిసిందే. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో హవాలాకు ఆస్కారం ఉందన్న ఆరోపణల నేపథ్యంలో చీకోటి ప్రవీణ్‌ను ఈడీ అధికారులు ప్రశ్నించనున్నట్టు తెలిసింది.

రెసిడెన్షియల్ రియాల్టీలోకి కాసా గ్రాండ్

సాక్షి, హైదరాబాద్: దాదాపు పద్దెనిమిదేళ్లుగా రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారుల నమ్మకాన్ని చూరగొన్న రియల్ ఎస్టేట్ సంస్థ కాసా గ్రాండ్ తాజాగా రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లోకి కూడా ప్రవేశించింది. వినియోగదారుల ఆకాంక్షలకు ప్రతిరూపంగా ఇప్పటివరకు చెన్నై, బెంగళూరు కోయంబత్తూర్‌లో అనేక నివాసప్రాంతాలను అభివృద్ధి చేసిన కాసాగ్రాండ్ ఇప్పుడు రెసిడెన్షియల్ రియాల్టీకి బ్రాండ్‌గా మారింది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో తన తొలి ప్రాజెక్టుగా కాసా గ్రాండ్ హాస్‌ఫోర్డ్‌ను ప్రారంభించనుంది. ఇందుకుగాను నగరంలో 10.1ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. దీన్ని రూ.320 కోట్లతో అభివృద్ధి చేయనుంది. బ్రిటిష్ స్టైల్ విల్లా రూపంలో కనిపించేలా నగరంలో దక్షిణ హైదరాబాద్‌లోని ఔటర్ రింగ్‌రోడ్డులో హాస్ ఫోర్డ్‌ను ప్రారంభించింది. విశాలమైన 4 బీహెచ్‌కే విల్లాలకు ప్రత్యేక హోం థియేటర్‌తో క్లాసిక్ లుక్‌తో కాసా గ్రాండ్ వినియోగదారుల ముందుకువచ్చింది. 2024 చివరినాటికి రూ.3000 కోట్ల టర్నోవర్‌తో ఐదు మిలియన్ చదరపు అడుగుల ప్రైమ్ రియల్ ఎస్టేట్‌ను అభివృద్ధి చేయాలని కాసా గ్రాండ్ లక్ష్యంగా పెట్టుకుంది.

సన్నిధి

మంచిమాట

చీకటీ... వెలుగూ...

వెలుగుకు చీకటికి తేడా ఉంది. ఆ తేడా తెలియక పోతే అది గుడ్డితనం అవుతుంది. వెలుగు వెలుగే; చీకటి చీకటే. వెలుగును చూడలేక పోవడం దోషం; చీకటిని వెలుగు అని అనుకోవడం నేరం. వెలుగు చీకట్లు ఉండేది పక్కపక్కనే; మనం ఉండాల్సింది వెలుగు పక్కనే. వెలుగుకు మాలిమి అవ్వాలి మనం; చీకటికి లొంగకుండా ఎదగాలి మనం. వెలుగులో సాగడమే జీవనం; చీకటిమయం కాకూడదు జీవితం.



వెలుగుకు చీకటికి తేడా తెలియక పోవడం అజ్ఞానం. అంతేకాదు, అజ్ఞానం వెలుగును చీకటి అని, చీకటిని వెలుగు అని అనుకునేట్టు కాదు భ్రమపడేట్టు చేస్తుంది. అసలు అజ్ఞానం అన్నదే చీకటి. అందుకే అజ్ఞానాంధ కారం అన్న మాట ఉంది. వెలుగు అన్నది జ్ఞానం. అదే మనకు కావాలి. వెలుగులా జ్ఞానం కావాలి; జ్ఞానం వెలుగై మనకు కావాలి. చీకటి నుంచి వెలుగులోకి వెళ్లాల్సిన ఆవశ్యకత ఉంది కాబట్టే చీకటి నుంచి వెలుగులోకి తీసుకు వెళ్లమని ప్రార్థనగా బృహదారణ్యకోపనిషత్‌లో 'తమసోమా జ్యోతిర్గమయ' అని అనడం జరిగింది.

చీకటి నుంచి మనం వీలు అయినంత త్వరగా బయటపడాలి; అందుకు మనం మనలోంచి పైకి లేవాలి. రోజు అన్నాక పగలే కాదు రాత్రీ వస్తుంది. ఆ రాత్రిని మనం సేద తీరడానికి అంటే నిద్రపోవడానికి మాత్రమే తీసుకోవాలి. రాత్రి చీకటిలో నిద్రపోతూనే ఉండడమో, నిద్రపోతూ చీకట్లోనే ఉండిపోవడం మనకు ఎంత మాత్రమూ తగదు; అది సరికాదు.

పిచ్చిరాతలకు, కవిత్వానికి ఉన్న తేడాలాగా చచ్చు పడిపోయిన జీవనానికి, ప్రయోజనకరమైన జీవనానికి తేడా ఉంది, ఉంటుంది అన్న నిజాన్ని మనసులోనూ, మస్తిష్కంలోనూ నిలుపుకుని మనం మనుగడ చెయ్యాల్సి ఉంటుంది. చీకటి నుంచి వెలుగులోకి చేరుకోవాలి మనం; అజ్ఞానం నుంచి కదిలి, లేచి జ్ఞానంలోకి వెళ్లాలి మనం. మన అజ్ఞానమే లేదా మనకు ఉండాల్సిన జ్ఞానం లేకపోవడమే మన కష్టాలకు, నష్టాలకు, దుఃఖాలకు కారణం అవుతూ ఉంటుంది. గట్టిగా చెప్పాలంటే ప్రపంచంలోని గందరగోళానికి కారణం అజ్ఞానమే. మనకు విశ్రాంతిని ఇవ్వడం కోసం రాత్రి చీకటిని తీసుకు వచ్చిన ప్రకృతి మన జీవనం సాగడం కోసం పగలును, వెలుగును తీసుకువస్తోంది. వెలుగు ఉంటేనే మనకు వస్తువు తెలిసి వస్తుంది; జ్ఞానం ఉంటేనే మనుగడ కలిసి వస్తుంది.

చీకటిలాంటి అజ్ఞానం అసత్ అవుతుంది. మేలు లేదా మంచి కాకపోవడమే అసత్. ఆ అసత్ మనకు అక్కర్లేంది. ఆ అసత్ నుంచి సత్‌లోకి వెళ్లాల్సిన ఆవశ్యకత ఉంది కాబట్టే అసత్ నుంచి సత్‌లోకి తీసుకు వెళ్లమని ప్రార్థనగా 'అసతోమా సద్గమయ' అనీ అనడం జరిగింది.

అంధకారంలోనూ, అసత్‌లోనూ ఉండడం మృత్యువు లేదా మరణంలో ఉండడమే అవుతుంది. మనం మృత్యువులోంచి జీవంలోకి వెళ్లాల్సిన ఆవశ్యకత ఉంది కాబట్టే మృత్యువు నుంచి అమృతంలోకి అంటే జీవంలోకి తీసుకు వెళ్లమని ప్రార్థనగా 'మృత్యోర్మా అమృతం గమయ' అనీ అనడం జరిగింది.

మనం వెలుగులో సాగాలి; మనం సత్‌లో సాగాలి; మనం జీవంలో సాగాలి. ఈ జ్ఞానంతో మనం జీవించాలి.

– రోచిష్మాన్

రోజులో చీకటి ఉన్నట్టే మనిషి అన్నాక, మనుగడ అన్నాక ఎవరికైనా ఒక దశలో అజ్ఞానం ఉంటుంది. మనిషి అన్నాక అతడికి అజ్ఞానదశ ఉంటుంది. అయితే మనిషి తన అజ్ఞానదశను ప్రయత్నించి అధిగమించగలగాలి; అధిగమించి తీరాలి. అజ్ఞానం నుంచి ఒక మనిషి తనను ఎలాగైనా విడిపించుకోవాలి. అజ్ఞానం నుంచి విడివడని మనిషి అర్ధరాత్రిలో ఆవ గింజలా అయిపోతాడు.

అమృత బిందువులు

- విజయం ఒక ప్రయాణం మాత్రమే... గమ్యం కాదు
జీవితంలో కొన్నిసార్లు విఫలమైనా
సఫలం కావడానికి అవకాశం ఉంటుంది
సమయం కోసం సహనంతో వేచి ఉండాలి అంతే.

- అవకాశం ఆకాశం నుండి రాదు...
అరచేతి గీతల్లోనూ ఉండదు
అలసిపోని గుండెల్లో ఉంటుంది...
అంతులేని పట్టుదలలో ఉంటుంది.

- మనిషికి ప్రశాంతత ఇచ్చేది
ప్రకృతే కావొచ్చు
కానీ మనసుకు ప్రశాంతత
ఇచ్చేది మాత్రం
ఇష్టమైన వారి నుండి వచ్చే
ఆత్మీయమైన
పలకరింపు.

బౌద్ధవాణి

ఉభయ శుద్ధి

బుద్ధుని మార్గాన్ని విశుద్ధి మార్గం అంటారు. బాహ్యశుద్ధి, ఆంతరంగిక శుద్ధి– ఈ రెండూ ఉన్నదే విశుద్ధి. మనసులో ఎన్నో కల్మషాల్ని పెట్టుకుని పైకి శుద్ధిగా కనిపిస్తారు కొందరు. ఇలాంటి వారు కపట కల్మషాలు కడుపులో ఉంచుకుంటారు కూడా. బుద్ధుని కాలంలో ఇలాంటి దొంగ సాధువులు, సన్యాసులు అనేకమంది ఉండేవారు.

అలాగే.. కఠోర తాపసులూ ఉండేవారు. వీరు ఆంతరంగిక శుద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చే వారు. స్నానం చేయకపోవడం, వంటికి మట్టి, బురదలు పూసుకోవడం, మాసిన వస్త్రాలు ధరించడం, శ్మశానంలో నిద్రించడం లాంటి పనులు చేసే వారు. బాహ్య శుభ్రతని అస్సలు పట్టించుకునే వారే కాదు.

బుద్ధుడు ఈ రెండు రకాల తపస్సుల్నీ అంగీకరించలేదు. శారీరక శుద్ధి కంటే మనో శుద్ధికే అధిక ప్రాధాన్యతనిచ్చినప్పటికీ, బాహ్య శుభ్రతకీ తగినంత ప్రాధాన్యతనిచ్చాడు.



ఒకనాడు నిగంఠనాథ పుత్రుడైన సచ్చకుడు బుద్ధుని దగ్గరకు వచ్చాడు. అప్పుడు బుద్ధుడు వైశాలి నగర సమీపంలోని మహావనంలో కూటగారశాలలో ఉంటున్నాడు. సచ్చకుడు వచ్చి–

''గౌతమా! కొందరు శ్రమణులు, బ్రాహ్మణులు శారీరక నిగ్రహానికే ప్రాధాన్యతనిస్తున్నారు. కానీ చిత్త నిగ్రహానికి ప్రాధాన్యతనివ్వడం లేదు. ఈ రెండింటిలో ఏది సరైనది?'' అని అడిగాడు.

దానికి బుద్ధుడు–

''సచ్చకా! ఒక ఎండిన కట్టెపుల్ల ఉంది. అది ఎలాంటి పచ్చి లేకుండా పూర్తిగా ఎండిపోయింది. ఆ కట్టెను ఒకడు నీటిలో తడిపాడు. నానబెట్టాడు. తెచ్చి పొయ్యి కింద పెట్టాడు. ఆ ఎండు కట్టె మండుతుందా?''

''గౌతమా! మండదు''

''అలాగే సచ్చకా! మరొకని దగ్గర ఒక పచ్చి కట్టె ఉంది. దీనినీ వాడు నీటిలో తడిపాడు. నానబెట్టాడు. తెచ్చి పొయ్యిలో పెట్టాడు. అది మండుతుందా? దాని వల్ల ఫలితం ఉంటుందా?''

''గౌతమా! అస్సలు ఉండదు.''

''మరి ఇంకొకని దగ్గర పచ్చి కట్టె ఉంది. కాని అతడు దానిని నీటిలో ముంచలేదు. తడప లేదు. తెచ్చి పొయ్యిలో ఉంచాడు. అదైనా మండుతుందా?''

సచ్చకుడు నవ్వి ''గౌతమా! అది పచ్చి కట్టె. ఎలా మండుతుంది'' అన్నాడు.

''సరే సచ్చకా, వేరొకడు ఉన్నాడు. అతని దగ్గర బాగా ఎండిన కట్టె ఉంది. దాన్ని తడపకుండా, నీటి చెమ్మ తగలకుండా తెచ్చి పొయ్యిలో పెట్టాడు...'' అని బుద్ధుడు చెప్తూనే ఉన్నాడు. సచ్చకుడు మధ్యలోనే కల్పించుకుని ''ఇది తప్పక మండుతుంది. ఆరకుండా రగిలి ఉపయోగపడుతుంది. దానివల్ల ఫలితం వస్తుంది'' అన్నాడు.

బుద్ధుని పెదవుల మీద కనిపించీ కనిపించని చిరునవ్వు ఉదయించింది.

''సచ్చకా! అలాగే మనిషికి బాహ్య శుద్ధి, ఆంతరంగిక శుద్ధి రెండూ కావాలి. బాహ్యంలో అకుశల కర్మలకు, కామాలకి దూరంగా ఉన్నా మనసుల్లో కామ కోరికల్ని, కామ స్నేహాన్ని, కామ మోహాన్ని, కామ పిపాసను, కామ జ్వరాన్ని వదలని శ్రమణులు యోగ్యులు కారు. వారు నీటిలో తడిసిన, నానబెట్టిన ఎండు కట్టె లాంటివారే! ఉభయ శుద్ధులూ ఉన్నవారే ఉత్తమ యోగులు'' అన్నాడు.

సచ్చకునికి సత్యం బోధపడింది. ''భగవాన్! మీరు చెప్పిందే సత్యం'' అంటూ ప్రణమిల్లాడు.

– డా. బొర్రా గోవర్ధన్

గురువాణి

బంగారం లోంచి సువాసనలు..!



కొంత మంది యోగ్యత కలిగినవారు ఉన్నత పదవులలోకి వెళ్లిన కారణం చేత ఆ పదవి శోభిస్తుంది. వాళ్ళకీ కీర్తి వస్తుంది. పదవి, వ్యక్తి గుణాలు రెండూ సమున్నతంగా ఉంటే... బంగారానికి తావి అబ్బినట్లుంటుంది. ఎలా అంటే...

అమెరికా సంయుక్త రాష్ట్రాలకు అధ్యక్షుడిగా చేసిన హెర్బర్ట్ హూవర్ బాగా పేదరికం అనుభవించాడు. తల్లీతండ్రీ లేరు. మేనమామ చదివిస్తున్నాడు. 18వ ఏట స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో ఉండగా..కళాశాల ఫీజు కట్టేంత డబ్బుసమకూరక చిక్కుల్లోపడ్డాడు. దీనినుంచి బయటపడడానికి ... స్నేహితుడితో కలిసి ఒక ఆలోచన చేసాడు. అప్పట్లో పోలండ్‌లో పియానో విద్వాంసుడిగా ఖ్యాతి వహించిన ఈగ్నాసీ యాన్ పద్రెస్కీ కచేరీ పెట్టి వచ్చిన వసూళ్ళలో ఖర్చులు పోగా మిగిలిన డబ్బును ఫీజుల కింద చెల్లించాలనుకున్నారు. ఆయనను సంప్రదించి రెండువేల డాలర్లకు ఒప్పందం చేసుకున్నారు. కానీ వసూళ్లు కేవలం 1600 డాలర్లే వచ్చాయి. పైగా కచేరీ నిర్వహణ ఖర్చులు కూడా చెల్లించాలి. ఏం చేయాలో తోచక నేరుగా పద్రెస్కీనే కలిసి వచ్చిన మొత్తం డబ్బు ఆయన చేతిలో పెట్టి మిగిలిన దానికి చెక్ ఇచ్చారు... మీరు కాలేజీ ఫీజులకోసం ఇది చేస్తున్నామని ముందుగా ఎందుకు చెప్పలేదంటూ పద్రెస్కీ ఆ చెక్ చించేసి డబ్బు తిరిగి వారి చేతులో పెట్టి... మీ ఫీజు, కచేరీ నిర్వహణ ఖర్చులు పోగా మిగిలితే ఇవ్వండి, లేకపోయినా ఫరవాలేదన్నారు.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

పద్రెస్కీ తదనంతర కాలంలో పోలండ్‌కు ప్రధానమంత్రి అయ్యారు. అది మొదటి ప్రపంచ యుద్ధకాలం. పోలండ్‌లో కరువు పరిస్థితి. తినడానికి కొన్ని లక్షల మందికి అన్నంలేని స్థితి. ప్రధానమంత్రిగా ఆయన అమెరికాలోఉన్న అంతర్జాతీయ ఆహార, సహాయ సంస్థకు ఒక విజ్ఞాపన పంపారు. ఆ సంస్థకు అధ్యక్షుడు హెర్బర్ట్ హోవర్. ఆ ఉత్తరాన్ని పరిశీలించి టన్నులకొద్దీ బట్టలు, ప్రతిరోజూ 2 లక్షలమందికి భోజనానికి సరిపడా సామాగ్రి పంపారు. ఈ ఉపకారానికి వ్యక్తిగతంగా కృతజ్ఞతలు చెప్పుకోవడానికి పద్రెస్కీ అమెరికా వెళ్ళి హోవర్‌ను కలిసాడు. ''మీరు కాదు కృతజ్ఞత లు.. నేను చెప్పాలి'' అన్నాడు హోవర్. అదేమిటి అని పద్రెస్కీ ఆశ్చర్యపోతుండగా... గతంలో ఫీజుకట్టలేక మీ కచేరీ పెట్టి మిమ్మల్ని ఇద్దరు విద్యార్థులు కలిసారు, గుర్తుందా... అని అడిగాడు హోవర్. ఎప్పుడో జరిగిన వృత్తాంతం. అప్పటికి కొన్ని దశాబ్దాలు గడిచాయి. మీరు తీసుకోకుండా ఇచ్చిన డబ్బుతో కాలేజి ఫీజు చెల్లించి చదువు పూర్తి చేసుకోవడానికి మీరు సహకరించింది నాకే. మీరు చేసిన సాయంతోనే నేను ఈ రోజు ఈ స్థితిలో ఉన్నాను... అన్నాడు.

ఆ తరువాత కాలంలో...అంటే అమెరికా అధ్యక్షపదవి స్వీకరించడానికి ముందు కూడా హోవర్ పోలండ్ వెళ్లాడు. మళ్ళీ అక్కడ పేద పిల్లల స్థితిగతులను చూసి చలించిపోయి భారీ ఎత్తున సహాయం పంపే ఏర్పాట్లు చేసాడు... మంచి గుణగణాలు.. వారికే కాదు, వారి పదవులకు కూడా గౌరవం తెచ్చిపెడతాయి.

సినిమా

రామ్-పూరి డబుల్ ఇస్మార్ట్


రామ్

హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో రూపొందిన 'ఇస్మార్ట్ శంకర్' (2019) సినిమా బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. ఈ ఇద్దరి కాంబినేషన్‌లోనే ఈ సినిమాకు సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం రానుంది. పూరి కనెక్ట్స్ పతాకంపై పూరి జగన్నాథ్, చార్మీ కౌర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. నేడు (మే 15) రామ్ బర్త్ డే. ఈ సందర్భంగా ఆదివారం 'డబుల్ ఇస్మార్ట్'ని ప్రకటించి, ఈ సినిమాను వచ్చే ఏడాది మార్చి 8న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ వెల్లడించింది. ''అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో, హై బడ్జెట్‌తో 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం తెరకెక్కనుంది. ఈసారి రెట్టింపు మాస్, రెట్టింపు వినోదాన్ని ఆడియన్స్ ఎక్స్‌పీరియన్స్ చేస్తారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమాను రిలీజ్ చేస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.


పూరి జగన్నాథ్

డాన్ 3 ఉంది

షారుక్ ఖాన్ కెరీర్‌లో చెప్పుకోదగ్గ చిత్రాల్లో 'డాన్' (2006) ఒకటి. ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలో రూపొందిన ఈ యాక్షన్ థ్రిల్లర్ బంపర్ హిట్ సాధించిన విషయం తెలిసిందే. ఈ చిత్రానికి సీక్వెల్‌గా ఫర్హాన్ అక్తర్ దర్శకత్వంలోనే షారుక్ హీరోగా వచ్చిన 'డాన్ 2' (2011) కూడా ఘనవిజయం సాధించింది. ఇప్పుడు పుష్కర కాలం తర్వాత 'డాన్ 3'కి సన్నాహాలు జరుగుతున్నాయి. గడచిన పన్నెండేళ్లల్లో 'డాన్ 3' గురించి అడపా దడపా చర్చలు వస్తూనే ఉన్నాయి. తాజాగా 'డాన్ 3' గురించి చిత్రనిర్మాత రితేష్ అద్వానీ అప్‌డేట్ ఇచ్చారు. ప్రస్తుతం ఫర్హాన్ అక్తర్ కథ సిద్ధం చేస్తున్నారని, స్క్రిప్ట్ వర్క్ పూర్తయ్యాక షూటింగ్ ప్లాన్ చెబుతామనీ పేర్కొన్నారు రితేష్.


షారుక్ ఖాన్

తురుమ్ ఖాన్‌ల కథ


అవినాష్, శ్రీరామ్, దేవరాజ్

నిమ్మల శ్రీరామ్, దేవరాజ్ పాలమూర్, అవినాష్ చౌదరి హీరోలుగా, పులి సీత, విజయ, శ్రీయాంక హీరోయిన్లుగా నటించిన పల్లెటూరి రివెంజ్ కామెడీ డ్రామా ఫిల్మ్ 'తురుమ్ ఖాన్‌లు'. శివకల్యాణ్ దర్శకత్వంలో ఆసిఫ్ జానీ నిర్మించిన చిత్రం ఇది. త్వరలోనే ఈ సినిమాను రిలీజ్ చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు శివకల్యాణ్ మాట్లాడుతూ– ''ఈ ఆధునిక యుగంలో బ్రహ్మ, విష్ణు, ఈశ్వర్ అనే ముగ్గురు యువకులు ఒకే ఊరిలో పుట్టి, పెరిగి సరదాగా ఒకరినొకరు ఎలా ఆటపట్టించుకుంటారు? ఒకర్ని ఒకరు ఎలా ఏడిపించుకుంటారు? అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమాను తెరకెక్కించాం'' అన్నారు. ''తురుమ్ ఖాన్‌లు' చిత్రం చిన్న సినిమాగా విడుదలైనా రిలీజ్ తర్వాత పెద్ద సినిమా అవుతుంది'' అన్నారు నిర్మాత ఆసిఫ్. ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, అఖిలేష్ గోగు, సహనిర్మాత: కె. కల్యాణ్ రావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దేవరాజ్ పాలమూర్.

ప్రేక్షకులకు ఇది స్పెషల్ ఫిల్మ్ – నాని

''అన్నీ మంచి శకునములే..' ట్రైలర్, టీజర్‌లో పాజిటివ్ ఎనర్జీ కనిపించింది. ఈ సినిమాకు 'అన్నీ మంచి శకునములే..'. ఈ చిత్రం బ్లాక్‌బస్టర్ అవుతుందని నమ్ముతున్నా'' అని అన్నారు నాని. సంతోష్ శోభన్, మాళవికా నాయర్ జంటగా నందినీరెడ్డి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'అన్నీ మంచి శకునములే'. మిత్రవిందా మూవీస్, స్వప్నా సినిమాస్‌పై ప్రియాంకా దత్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం జరిగిన ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరోలు నాని, దుల్కర్ సల్మాన్ అతిథులుగా హాజరయ్యారు. ఈ వేడుకలో నాని ఇంకా మాట్లాడుతూ– ''మంచి ఈజ్, బ్రహ్మాండమైన కామెడీ టైమింగ్ ఉన్న యాక్టర్ సంతోష్. అతన్ని చూస్తుంటే నన్ను నేను చూసుకున్నట్లుగా అనిపిస్తోంది. నందినీకి మరో నాని దొరికాడనిపిస్తోంది. 'అన్నీ మంచి శకునములే'కి విజువల్స్, సాంగ్స్, ఎడిటింగ్, సినిమాటోగ్రఫీ బాగా కుదిరినట్లు అనిపిస్తోంది. ప్రేక్షకులందరికీ గుర్తుండిపోయే ఓ స్పెషల్ చిత్రంగా నిలుస్తుందని నమ్ముతున్నాను'' అన్నారు నాని. దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ– ''వైజయంతీ మూవీస్ నాకు ఓ ఫ్యామిలీలాంటిది. రాజేంద్రప్రసాద్‌గారికి నేను అభిమానిని. 'మహానటి'కి ఆయనతో కలిసి వర్క్ చేశాను. 'సీతారామం' తర్వాత నాకు తొలి ఫోన్‌కాల్ నందినీ రెడ్డిగారి నుంచి వచ్చింది. 'అన్నీ మంచి శకునములే' సినిమా విజయం సాధించాలి'' అన్నారు. ''నా లైఫ్‌లో నేను చేసిన పెద్ద సినిమా ఇది. వీకే నరేశ్, రాజేంద్రప్రసాద్, గౌతమీ, వాసుకి, 'షావుకారు' జానకి, అంజు.. ఇలా వీరందరూ కలిసి నేను రాసుకున్న కథను పది రెట్లు పెంచారు. ఈ సినిమాకు లైఫ్ లైన్ సంగీత దర్శకులు మిక్కీ జే మేయర్. ఫ్యామిలీ ప్రొడ్యూసర్స్‌తో కలిసి వర్క్ చేసిన ఫీలింగ్ ప్రియాంక, స్వప్నాల వల్ల కలిగింది'' అన్నారు నందినీ రెడ్డి. ''సమ్మర్‌కు మన అమ్మమ్మగారి ఇంటికి వెళ్లొచ్చిన జ్ఞాపకంలా 'అన్నీ మంచి శకునములే' ఉంటుంది'' అన్నారు స్వప్నా దత్, ప్రియాంకా దత్. ''చాలాకాలం ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోయే చిత్రమిది'' అన్నారు సంతోష్ శోభన్. ''వైజయంతీ మూవీస్ సంస్థను మా పిల్లలు (స్వప్నా, ప్రియాంక) సక్సెస్‌ఫుల్‌గా రన్ చేస్తున్నారు. వీరి ఆలోచనలు అప్పట్లో నాకు రాలేదని ఈర్ష్యగా ఉంది'' అన్నారు నిర్మాత అశ్వినీదత్. ''అసలు మనం ఎందుకు పుట్టాం? హిందూ ధర్మంలో మనం సెంటిమెంట్‌కు ఎంత వేల్యూ ఇస్తాం. ఆ సెంటిమెంట్ వల్ల మనం ఎలా ఉన్నాం? వంటి అంశాలు 'అన్నీ మంచి శకునములే..'లో ఉన్నాయి. ఒక అద్భుత సినిమాను చూసిన అనుభూతిని ప్రేక్షకులకు ఇస్తుందని గ్యారంటీ ఇస్తున్నాను'' అన్నారు రాజేంద్రప్రసాద్. ''పద హారు కూరల రుచుల సమ్మేళనం ఈ చిత్రం'' అన్నారు వీకే నరేశ్. ఈ వేడుకలో దర్శకులు నాగ్ అశ్విన్, హను రాఘవపూడి, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.


నందినీ రెడ్డి, మాళవిక, సంతోష్, దుల్కర్, నాని, గౌతమి, ప్రియాంక, స్వప్నా దత్

అడిగినవన్నీ ఇస్తాడు!


సముద్ర ఖని, ధ్రువన్

'నాన్నా ఎప్పుడు దేవుడు కనపడినా దండం పెట్టుకోమంటావు ఎందుకు' అని అడిగిన కొడుకుతో 'మనం అడిగినవన్నీ ఇస్తాడు కాబట్టి' అని తండ్రి అంటాడు. దానికి ఆ పిల్లాడు 'అన్నీ ఇచ్చేవాడిని దేవుడు అనరు.. నాన్నా అంటారు' వంటి సంభాషణలతో 'విమానం' టీజర్ విడుదలైంది. తండ్రీ కొడుకుల మధ్య అనుబంధం నేపథ్యంలో సాగే ఈ చిత్రం జూన్ 9న విడుదల కానుంది. అంగవైకల్యంతో ఇబ్బంది పడుతున్నప్పటికీ కొడుకుని ఎంతో ప్రేమగా చూసుకునే తండ్రి వీరయ్య పాత్రను సముద్ర ఖని, కొడుకు పాత్రను మాస్టర్ ధ్రువన్ చేశారు. విమానం ఎక్కాలని ఆశపడే కొడుక్కి బాగా చదువుకుంటే నువ్వే ఎక్కగలవని తండ్రి అంటాడు. ''తండ్రీ–కొడుకు–విమానం చుట్టూ సాగే భావోద్వేగాల ప్రయాణమే ఈ విమానం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. శివ ప్రసాద్ యానాల దర్శకత్వంలో జీ స్టూడియోస్, కిరణ్ కొర్రపాటి నిర్మించిన ఈ చిత్రంలో అనసూయ భరద్వాజ్, రాజేంద్రన్, ధన్‌రాజ్, రాహుల్ రామకృష్ణ కీలక పాత్రలు చేశారు. ఈ చిత్రానికి సంగీతం: చరణ్ అర్జున్, కెమెరా: వివేక్ కాలేపు.

అక్టోబరులో ఆరంభం


వెంకీ అట్లూరి, దుల్కర్ సల్మాన్

'మహానటి', 'సీతారామం' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ మరో స్ట్రయిట్ తెలుగు ఫిల్మ్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తెలుగులో 'తొలిప్రేమ', 'రంగ్ దే', 'సార్' వంటి సినిమాలను తెరకెక్కించిన వెంకీ అట్లూరి దర్శకత్వం వహించనున్న చిత్రంలో దుల్కర్ సల్మాన్ హీరోగా నటించనున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మించనున్నారు. ''అక్టోబరులో షూటింగ్‌ను ఆరంభించి, వచ్చే ఏడాది వేసవిలో సినిమాను విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం. ప్రేక్షకులను అలరించే మరో మంచి కంటెంట్ ఓరియంటెడ్ ఫిల్మ్‌గా ఈ చిత్రం ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

వచ్చే ఏడాది సైబర్ వార్


సుకుమార్

సైబర్ వార్ నేపథ్యంలో రూపొందనున్న సైంటిఫిక్ థ్రిల్లర్ 'కోకో'. జై కుమార్ దర్శకత్వంలో సందీప్ రెడ్డి వాసా నిర్మించనున్నారు. జూన్ మూడోవారంలో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. ఈ సినిమా థీమ్, బ్యాక్‌డ్రాప్‌ను వివరించే గ్లింప్స్ వీడియోను దర్శకుడు సుకుమార్ విడుదల చేసి, చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ''భారత రక్షణ వ్యవస్థకు హాని కలగకుండా ఉండేందుకు రామానుజన్ అనే వ్యక్తి 'ఆర్ఎమ్– ఐఎస్‌యూ' (వేగం, ఖచ్చితత్వం, శక్తి) కోడ్‌తో ప్రపంచంలోనే మొట్ట మొదటి ఆటోమేషన్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ను కనుగొంటాడు. తండ్రి రామానుజన్ ఆశయాలు ఆచరణలోకి వచ్చేందుకు, తన కుటుంబానికి జరిగిన నష్టానికి ప్రతీకారం తీర్చుకోవడానికి బ్లాక్ హ్యాట్ హ్యాకర్ నిక్కీ 'కోకో' అనే పేరుతో సెల్ఫ్ మేడ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగిస్తుంది. 'కోకో' భౌతికంగా కనిపించదు. మరోవైపు భారతదేశంపై సైబర్ వార్ చేయాలని ఓ చైనీస్ హ్యాకర్ ప్లాన్ చేస్తుంటాడు. పాక్, చైనా మద్దతు ఉన్న హ్యాకర్ల సమూహం భారతదేశానికి వ్యతిరేకంగా సైబర్ ముప్పును విస్తరించడంతో సంఘర్షణ ప్రారంభమవుతుంది. అప్పుడేం జరిగింది? అన్నదే 'కోకో' చిత్ర కథాంశంగా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. తెలుగు, తమిళ, కన్నడం, మలయాళం, హిందీ భాషలతో పాటు తైవాన్, వియత్నాం భాషల్లో ఈ సినిమాను వచ్చే ఏడాది విడుదల చేయాలనుకుంటున్నారు.

ఒక్క రోజు.... 48 గంటలు!

ఆదిత్య బద్వేలి, రేఖా నిరోషా జంటగా నిరంజన్ బండి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఒక్క రోజు.. 48 హవర్స్'. ప్రీతీ క్రియేషన్స్, హేమలత సమర్పణలో కృష్ణా రెడ్డి, కేకే నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఈ చిత్రం పోస్టర్‌ను 'బలగం' ఫేమ్ సుధాకర్ రెడ్డి, షేడ్ స్టూడియోస్ అధినేత బలివాడ దేవి ప్రసాద్ ఆవిష్కరించారు. నిర్మాత కేకే మాట్లాడుతూ– ''మా బేనర్‌లో ఇది తొలి చిత్రం. మంచి కథాంశంతో రూపొందించిన ఈ చిత్రం ఔట్‌పుట్ బాగా వచ్చింది. విజయం పట్ల నమ్మకంతో ఉన్నాం'' అన్నారు. నిరంజన్ బండి మాట్లాడుతూ– ''అనుకోని పరిస్థితుల్లో కష్టాలపాలైన హీరో టైమ్ ట్రావెల్ చేసి తనని ఏ విధంగా కాపాడుకున్నాడు అనేది ఈ సినిమా కథ'' అన్నారు. ''అవకాశం ఇచ్చిన డైరెక్టర్‌కి, ప్రొడ్యూసర్స్‌కి థ్యాంక్స్'' అన్నారు ఆదిత్య, రేఖా నిరోషా.


రేఖా నిరోషా



చైనీస్ తైపీ చేతిలో భారత జట్టు పరాజయం

సుదిర్మన్ కప్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌ను భారత జట్టు ఓటమితో ప్రారంభించింది. గ్రూప్ 'సి'లో భాగంగా చైనాలో ఆదివారం చైనీస్ తైపీతో జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 1-4తో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో సాయిప్రతీక్-తనీషా క్రాస్టో 21-18, 24-26, 6-21తో యాంగ్ బో సువాన్-హు లింగ్ ఫాంగ్‌ల చేతిలో... రెండో మ్యాచ్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ 19-21, 15-21తో చౌ తియెన్ చెన్ చేతిలో... మూడో మ్యాచ్‌లో పీవీ సింధు 14-21, 21-18, 17-21తో తై జు యింగ్ చేతిలో... నాలుగో మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి 13-21, 21-17, 18-21తో లీ యాంగ్-యో హోంగ్ వెల చేతిలో ఓడిపోయారు నామమాత్రమైన ఐదో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ 15-21, 21-18, 21-13తో లీ చియా సిన్-తెంగ్ చున్ సున్‌లపై గెలుపొందారు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న జోడీ

ఇటాలియన్ మాస్టర్స్ సిరీస్ టెన్నిస్ టోర్నీలో రోహన్ బోపన్న (భారత్)-ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. రోమ్‌లో జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-3, 7-6 (8/6)తో అర్నాబోల్డి-ఫెరారీ (ఇటలీ) జోడీపై గెలిచింది.

బెంగళూరు... ఇంకా ఉంది



మ్యాక్స్‌వెల్, పార్నెల్, డుప్లెసిస్

- 112 పరుగుల తేడాతో రాజస్తాన్ రాయల్స్‌పై ఘనవిజయం
- రాణించిన డుప్లెసిస్, మ్యాక్స్‌వెల్
- 59 పరుగులకే రాజస్తాన్ ఆలౌట్
- కూల్చేసిన పార్నెల్, కరణ్, బ్రేస్‌వెల్

జైపూర్: ఇప్పుడు అందరి కళ్లు ప్లే ఆఫ్స్‌పైనే! ఏడు మ్యాచ్‌ల్లో గెలిచిన జట్టు కూడా ముందుకెళ్లడం కష్టంగా ఉంది. ఎందుకంటే ఇప్పటికే కనీసం ఏడు మ్యాచ్‌ల్లో గెలిచిన జట్లు గుజరాత్ (8), చెన్నై (7), ముంబై (7) మూడున్నాయి. కాబట్టి ఇకపై ఈ సీజన్‌లో కసిదీరా గెలవడం కంటే కూడా రన్‌రేట్‌తో గెలిచిన జట్లే ముందంజ వేస్తాయి. అందుకేనేమో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) అసాధారణ విజయంతో ప్లే ఆఫ్స్ రేసులో సజీవంగా ఉంది. రాజస్తాన్ రాయల్స్‌ను వారి సొంతగడ్డపై 112 పరుగుల భారీ తేడాతో ఓడించింది. మొదట బెంగళూరు 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. విరాట్ కోహ్లి (18; 1 ఫోర్) నిరాశపరచగా... కెప్టెన్ డుప్లెసిస్ (44 బంతుల్లో 55; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), మ్యాక్స్‌వెల్ (33 బంతుల్లో 54; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధసెంచరీలు చేశారు. చివర్లో అనూజ్ (11 బంతుల్లో 29 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) వేగంతో ఆర్‌సీబీ 170 పైచిలుకు స్కోరు చేసింది. తర్వాత రాజస్తాన్ రాయల్స్ 10.3 ఓవర్లలో 59 పరుగులకే కుప్పకూలింది. ఈ ఓటమితో రాజస్తాన్ 'ప్లే ఆఫ్' చేరే అవకాశాలకు దాదాపుగా తెరపడింది. హెట్‌మైర్ (19 బంతుల్లో 35; 1 ఫోర్, 4 సిక్సర్లు) టాప్ స్కోరర్! 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' వేన్ పార్నెల్ 3 వికెట్లు పడగొట్టాడు.

నలుగురు డకౌట్'...

172 పరుగు లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ రాయల్స్ నిర్లక్ష్యంగా ఆడింది. ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (0), బట్లర్ (0) సహా అశ్విన్ (0), ఆసిఫ్ (0) ఖాతానే తెరువలేకపోయారు. ఆర్‌సీబీ బౌలర్లు పార్నెల్, బ్రేస్‌వెల్, కరణ్ శర్మ మూకుమ్మడి దాడికి క్రీజులో నిలిచేందుకే ఆపసోపాలు పడ్డారు. హెట్‌మైర్ కొట్టిన 4 సిక్సర్లు ప్రేక్షకులను అలరించాయి కానీ జట్టుకు ఏమాత్రం ఉపయోగపడలేదు. ఐపీఎల్ టోర్నీ చరిత్రలో ఇది మూడో అత్యల్ప స్కోరు. 2017లో ఆర్‌సీబీ స్కోరు 49 ముందు వరుసలో ఉంటే... తర్వాత రెండు స్కోర్లు రాజస్తాన్‌వే. 2009లో 58కే కుప్పకూలిన రాయల్స్ ఇప్పుడు ఒక పరుగు ఎక్కువ చేసింది అంతే!



స్కోరు వివరాలు

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: కోహ్లి (సి) యశస్వి జైస్వాల్ (బి) ఆసిఫ్ 18; డుప్లెసిస్ (సి) యశస్వి జైస్వాల్ (బి) ఆసిఫ్ 55; మ్యాక్స్‌వెల్ (బి) సందీప్ శర్మ 54; మహిపాల్ (సి) ధ్రువ్ జురెల్ (బి) జంపా 1; దినేశ్ కార్తీక్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జంపా 0; బ్రేస్‌వెల్ (నాటౌట్) 9; అనూజ్ రావత్ (నాటౌట్) 29; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1-50, 2-119, 3-120, 4-120, 5-137. **బౌలింగ్:** సందీప్ శర్మ 4-0-34-1, ఆడమ్ జంపా 4-0-25-2, యజువేంద్ర చహల్ 4-0-37-0, అశ్విన్ 4-0-33-0, ఆసిఫ్ 4-0-42-2.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ (సి) విరాట్ కోహ్లి (బి) సిరాజ్ 0; బట్లర్ (సి) సిరాజ్ (బి) పార్నెల్ 0; సంజూ సామ్సన్ (సి) అనూజ్ (బి) పార్నెల్ 4; జో రూట్ (ఎల్బీడబ్ల్యూ) (బి) పార్నెల్ 10; దేవ్‌దత్ పడిక్కల్ (సి) సిరాజ్ (బి) బ్రేస్‌వెల్ 4; హెట్‌మైర్ (సి) బ్రేస్‌వెల్ (బి) మ్యాక్స్‌వెల్ 35; ధ్రువ్ జురెల్ (సి) మహిపాల్ (బి) బ్రేస్‌వెల్ 1; అశ్విన్ (రనౌట్) 0; ఆడమ్ జంపా (బి) కరణ్ శర్మ 2; సందీప్ శర్మ (నాటౌట్) 0; ఆసిఫ్ (సి) విరాట్ కోహ్లి (బి) కరణ్ శర్మ 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (10.3 ఓవర్లలో ఆలౌట్) 59. వికెట్ల పతనం:** 1-1, 2-6, 3-7, 4-20, 5-28, 6-31, 7-50, 8-59, 9-59, 10-59. **బౌలింగ్:** సిరాజ్ 2-0-10-1, వేన్ పార్నెల్ 3-0-10-3, బ్రేస్‌వెల్ 3-0-16-2, కరణ్ శర్మ 1.3-0-19-2, మ్యాక్స్‌వెల్ 1-0-3-1.

'గ్రాండ్‌మాస్టర్' ప్రణీత్

భారత చెస్ 82వ జీఎంగా తెలంగాణ కుర్రాడు



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ చెస్ టోర్నీలలో తన నిలకడమైన ప్రదర్శనను కొనసాగిస్తూ తెలంగాణ టీనేజ్ ప్లేయర్ వుప్పాల ప్రణీత్ భారత 82వ గ్రాండ్‌మాస్టర్ (జీఎం)గా అవతరించాడు. అజర్‌బైజాన్‌లో జరిగిన బకూ ఓపెన్ టోర్నీలో 15 ఏళ్ల ప్రణీత్ గ్రాండ్‌మాస్టర్ హోదా ఖరారు కావడానికి అవసరమైన 2500 ఎలో రేటింగ్‌ను అధిగమించాడు. నిర్ణీత తొమ్మిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో ప్రణీత్ ఆరు పాయింట్లు స్కోరు చేసి ఆరో ర్యాంక్‌లో నిలిచాడు. ఎనిమిదో రౌండ్‌లో టాప్ సీడ్, అమెరికా గ్రాండ్‌మాస్టర్ హాన్స్ మోక్ నీమన్‌పై ప్రణీత్ గెలుపొందడంతో అతని లైవ్ ఎలో రేటింగ్ 2500.5గా నమోదైంది. చివరి రౌండ్‌లో ఈ టోర్నీ విజేత, భారత గ్రాండ్‌మాస్టర్ లియోన్ ల్యూక్ మెండోంకా (గోవా) చేతిలో ఓడిపోయినా అతని ఎలో రేటింగ్‌పై ప్రభావం చూపకపోవడంతో ప్రణీత్‌కు జీఎం హోదా ఖాయమైంది.

- ఈ టోర్నీలో ప్రణీత్ నలుగురు గ్రాండ్‌మాస్టర్లు వహాప్ సనాల్ (తుర్కియే), వుగార్ అసాదిల్ (అజర్‌బైజాన్), లెవాన్ పాంత్సులయ (జార్జియా), నీమన్ (అమెరికా)లపై నెగ్గడంతోపాటు ఇస్కందరోవ్ (అజర్‌బైజాన్), నిజాత్ అబసోవ్ (అజర్‌బైజాన్)లతో గేమ్‌లను 'డ్రా' చేసుకున్నాడు.
- చెస్‌లో గ్రాండ్‌మాస్టర్ హోదా రావాలంటే మూడు జీఎం నార్మ్‌లు సాధించడంతోపాటు ఎలో రేటింగ్ పాయింట్లు 2500 దాటాలి. ప్రణీత్ ఇప్పటికే మూడు జీఎం నార్మ్‌లు సంపాదించినా అతని ఎలో రేటింగ్ 2500 దాటలేకపోవడంతో జీఎం హోదా కోసం నిరీక్షించాల్సి వచ్చింది. అయితే బకూ ఓపెన్‌లో ప్రణీత్ అద్భుత ప్రదర్శన కనబరిచి తన 2500 ఎలో రేటింగ్‌ను అధిగమించడంతో అతనికి జీఎం హోదా ఖరారైంది.
- ప్రణీత్ తొలి జీఎం నార్మ్‌ను 2022 మార్చిలో ఫస్ట్ సాటర్‌డే టోర్నీలో, రెండో జీఎం నార్మ్‌ను 2022 జూలైలో బీల్ ఓపెన్ టోర్నీలో, మూడో జీఎం నార్మ్‌ను 2023 ఏప్రిల్‌లో సన్వే ఫార్మెన్‌టెరా ఓపెన్ టోర్నీలో సాధించాడు.
- 2021 వరకు ప్రముఖ కోచ్ ఎన్‌వీఎస్ రామరాజు వద్ద శిక్షణ పొందిన ప్రణీత్ ప్రస్తుతం ఇజ్రాయెల్ గ్రాండ్‌మాస్టర్ విక్టర్ మిఖాలెవ్‌స్కీ వద్ద శిక్షణ తీసుకుంటున్నాడు. పదేళ్లుగా చెస్ ఆడుతున్న ప్రణీత్ శ్రమకు తగ్గ ఫలితం రావడంపట్ల అతని తల్లిదండ్రులు శ్రీనివాసాచారి, ధనలక్ష్మి 'సాక్షి'తో ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకైతే ప్రణీత్‌ను సొంత ఖర్చులతోనే టోర్నీలకు పంపించామని, ఇకనైనా అతనికి స్పాన్సర్లు వస్తే సంతోషిస్తామని తెలిపారు.

> ఒక స్వప్నం సాకారమైంది. నా కెరీర్‌లో ఇది చిరస్మరణీయ క్షణం. 2500 రేటింగ్ దాటడం ఒక మైలురాయిలాంటిది. భవిష్యత్‌లో 2700 రేటింగ్‌ను అందుకోవడం, ప్రపంచ చాంపియన్ కావడం నా సుదీర్ఘ లక్ష్యాలు. కొన్నాళ్లుగా నిలకడగా రాణిస్తున్నా నిర్ణీత సమయంలోపు గేమ్‌ను ముగించాలనే ఒత్తిడి నాపై ఉండేది. ఈ విషయంలో ఇప్పుడిప్పుడే మెరుగవుతున్నా. భారత్ నుంచి పలువురు యువ ఆటగాళ్లు గ్రాండ్‌మాస్టర్ టైటిల్ సాధిస్తుండటం ఈ ఆటకు ఎంతో మేలు చేస్తుంది. కజకిస్తాన్‌లో త్వరలో జరిగే ఆసియా చాంపియన్‌షిప్‌లో పతకం సాధించడమే నా తదుపరి లక్ష్యం. అత్యున్నతస్థాయిలో పోటీపడాలన్నా, మెరుగైన శిక్షణ తీసుకోవాలన్నా, విదేశాల్లో టోర్నీలు ఆడేందుకు వెళ్లాలన్నా చాలా డబ్బులు ఖర్చు అవుతున్నాయి. ఇప్పటికైతే ఆర్థికంగా ఆదుకోవడానికి నాకు స్పాన్సర్ లేరు. గ్రాండ్‌మాస్టర్ హోదా టైటిల్‌తో నాకు స్పాన్సర్లు లభిస్తారని ఆశిస్తున్నా. -ప్రణీత్

5 భారత చెస్‌లో తెలంగాణ నుంచి గ్రాండ్‌మాస్టర్ హోదా పొందిన ఐదో ప్లేయర్‌గా ప్రణీత్ నిలిచాడు. గతంలో ఇరిగేశి అర్జున్ (2018), హర్ష భరతకోటి (2019), రాజా రిత్విక్ (2021), రాహుల్ శ్రీవాత్సవ్ (2022)ఈ ఘనత సాధించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటికే పెంటేల హరికృష్ణ (2001), హంపి (2002), హారిక (2011), లలిత్ బాబు (2012), కార్తీక్ వెంకటరామన్ (2018) గ్రాండ్‌మాస్టర్ హోదా పొందారు.

గెలిచి నిలిచిన కోల్‌కతా



ఐపీఎల్‌లో నేడు
గుజరాత్ x హైదరాబాద్ (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

- 6 వికెట్లతో చెన్నైపై జయభేరి
- నితీశ్ రాణా, రింకూ అర్ధ సెంచరీలు

చెన్నై: తప్పక గెలిస్తేనే ఐపీఎల్ ప్లే ఆఫ్ రేసులో నిలిచే మ్యాచ్‌లో కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) అదరగొట్టింది. చెన్నై సూపర్‌కింగ్స్‌పై 6 వికెట్ల తేడాతో గెలిచి ప్లే ఆఫ్ అవకాశాలను సజీవంగా నిలబెట్టుకుంది. బౌలింగ్‌తో చెన్నై బ్యాటర్లను వారి సొంతగడ్డపై అడ్డుకున్న నైట్‌రైడర్స్ తర్వాత లక్ష్యఛేదనలో తడబడినా... కెప్టెన్ నితీశ్ రాణా (44 బంతుల్లో 57 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్), రింకూ సింగ్ (43 బంతుల్లో 54; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీల పోరాటంతో నెగ్గింది. ముందుగా చెన్నై సూపర్‌కింగ్స్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 144 పరుగులు చేసింది. నైట్‌రైడర్స్ కట్టుదిట్టమైన బౌలింగ్‌ను ఎదుర్కొనేందుకు టాపార్డర్ బ్యాటర్స్ సహా హిట్టర్ శివమ్ దూబే (34 బంతుల్లో 48 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) కష్టపడ్డాడు. నరైన్, వరుణ్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం కోల్‌కతా 18.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 147 పరుగులు చేసి గెలిచింది. దీపక్ చహర్ (3/27) పేస్‌తో కోల్‌కతా టాపార్డర్‌కు చెక్ పెట్టాడు. గుర్బాజ్ (1), వెంకటేశ్ (9), జేసన్ రాయ్ (12)లు నిష్క్రమించడంతో 33 పరుగులకే 3 వికెట్లు పడ్డాయి. ఈ దశలో నితీశ్ రాణా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రింకూ సింగ్ నాలుగో వికెట్‌కు 99 పరుగులు జోడించి గెలుపుబాట వేశారు.

స్కోరు వివరాలు

చెన్నై సూపర్‌కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (సి) వైభవ్ (బి) వరుణ్ 17; కాన్వే (సి) రింకూ (బి) శార్దుల్ 30; రహానే (సి) రాయ్ (బి) వరుణ్ 16; రాయుడు (బి) నరైన్ 4; దూబే (నాటౌట్) 48; మొయిన్ అలీ (బి) నరైన్ 1; జడేజా (సి) వరుణ్ (బి) వైభవ్ 20; ధోని (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 144. వికెట్ల పతనం:** 1-31, 2-61, 3-66, 4-68, 5-72, 6-140. **బౌలింగ్:** వైభవ్ 4-0-30-1, హర్షిత్ రాణా 2-0-19-0, వరుణ్ 4-0-36-2, సునీల్ నరైన్ 4-0-15-2, శార్దుల్ 3-0-15-1, సుయశ్ 3-0-29-0.

కోల్‌కతా నైట్‌రైడర్స్ ఇన్నింగ్స్: జేసన్ రాయ్ (సి) పతిరణ (బి) చహర్ 12; గుర్బాజ్ (సి) తుషార్ (బి) చహర్ 1; వెంకటేశ్ (సి) జడేజా (బి) చహర్ 9; నితీశ్ రాణా (నాటౌట్) 57; రింకూ సింగ్ (రనౌట్) 54; రసెల్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (18.3 ఓవర్లలో 4 వికెట్లకు) 147. వికెట్ల పతనం:** 1-4, 2-21, 3-33, 4-132. **బౌలింగ్:** దీపక్ చహర్ 3-0-27-3, తుషార్ 3.3-0-25-0, మొయిన్ అలీ 4-0-31-0, తీక్షణ 3-0-22-0, పతిరణ 3-0-23-0, జడేజా 2-0-18-0.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.
గుజరాత్	12	8	4	0	16	0.761
చెన్నై	13	7	5	1	15	0.381
ముంబై	12	7	5	0	14	-0.117
లక్నో	12	6	5	1	13	0.309
బెంగళూరు	12	6	6	0	12	0.166
రాజస్తాన్	13	6	7	0	12	0.140
కోల్‌కతా	13	6	7	0	12	-0.256
పంజాబ్	12	6	6	0	12	-0.268
హైదరాబాద్	11	4	7	0	8	-0.471
ఢిల్లీ	12	4	8	0	8	-0.686

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

- గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- కరెంట్ అఫైర్స్ కోసం

ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

యూజీసీ-నెట్-2023

యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ).. నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్-2023, జూన్ (యూజీసీ-నెట్) పరీక్షకు షెడ్యూల్ విడుదలైంది. జూనియర్ రీసెర్చ్ ఫెలో (జేఆర్‌ఎఫ్), విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు పోటీపడేందుకు ఉపయోగపడే ఈ పరీక్షను జూన్‌లో నిర్వహించనున్నట్లు యూజీసీ వెల్లడించింది. ఈ పరీక్షను ఏటా రెండుసార్లు నిర్వహిస్తుంటారు.


» **సబ్జెక్టులు:** అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, అరబ్ కల్చర్ అండ్ ఇస్లామిక్ స్టడీస్, అరబిక్, ఆర్కియాలజీ, అస్సామీ, బెంగాలీ, బోడో, బౌద్ధ, జైన, చైనీస్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అండ్ క్రిమినాలజీ తదితరాలు.
» **అర్హత:** 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** జేఆర్‌ఎఫ్‌కు 01.06.2023 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గరిష్ఠ వయోపరిమితి లేదు.
» **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) విధానంలో ఉంటుంది. పరీక్షలో రెండు పేపర్లు ఉంటాయి. రెండు పేపర్లలో ఆబ్జెక్టివ్ టైప్, మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. పేపర్-1లో 50 ప్రశ్నలకు 100 మార్కులు, పేపర్-2లో 100 ప్రశ్నలకు 200 మార్కులు కేటాయించారు. పరీక్షకు 3 గంటల వ్యవధి ఉంటుంది.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.05.2023.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 02, 03.06.2023.
» **పరీక్ష తేదీలు:** 13.06.2023 నుంచి 22.06.2023 వరకు
» **వెబ్‌సైట్:** www.ugcnet.nta.nic.in

విజయనగరం జిల్లా డీఎంహెచ్‌వోలో వివిధ ఉద్యోగాలు

విజయనగరం జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం.. విజయనగరం, పార్వతీపురం జిల్లా ఆసుపత్రుల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 03
» **పోస్టుల వివరాలు:** ఆడియాలజిస్ట్ అండ్ స్పీచ్ థెరపిస్ట్-01,డెంటల్ టెక్నీషియన్ -02.
» **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ(స్పీచ్ అండ్ లాంగ్వేజ్ పాథాలజీ), డెంటల్ టెక్నీషియన్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.**వయసు:** 42ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును విజయనగరం జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.05.2023.
» **వెబ్‌సైట్:** www.vizianagaram.nic.in

బార్క్‌లో 4,374 ఉద్యోగాలు



జాబ్స్ ఇన్ఫో

ముంబయిలో ట్రాంబేలోని భారత అణుశక్తి విభాగానికి చెందిన బాబా అణుశక్తి పరిశోధనా కేంద్రం(బార్క్).. ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా వివిధ విభాగాల్లో మొత్తం 4,374 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్, ట్రైనింగ్ స్కీమ్ రెండు విధాలుగా ఎంపిక చేస్తారు. ఈ నేపథ్యంలో.. బార్క్‌లో ఉద్యోగాల వివరాలు, అర్హతలు, ఎంపిక విధానం గురించి తెలుసుకుందాం..

డైరెక్ట్ రిక్రూట్‌మెంట్- 212 పోస్టులు

- ఈ విధానంలో మొత్తం 212 పోస్టులను భర్తీ చేస్తారు. వీటిల్లో విభాగాల వారీగా చూస్తే.. టెక్నికల్ ఆఫీసర్(సి)-181, సైంటిఫిక్ అసిస్టెంట్ (బి)-07, టెక్నీషియన్(బి) 24 పోస్టులున్నాయి.
- **అర్హతలు:** టెక్నికల్ ఆఫీసర్-సి పోస్టులకు ఎమ్మెస్సీ, ఎం.లిబ్, బీఈ/బీటెక్ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి ఉండాలి.
- **సైంటిఫిక్ అసిస్టెంట్-బి:** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు కనీసం 60 శాతం మార్కులతో బీఎస్సీ(ఫుడ్ టెక్నాలజీ/హోమ్ సైన్స్/న్యూట్రిషన్) ఉత్తీర్ణులై ఉండాలి.
- **టెక్నీషియన్-బి:** ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే వారు పదోతరగతి ఉత్తీర్ణులవ్వాలి. సెకండ్ క్లాస్ బాయిలర్ అటెండెన్స్ సర్టిఫికేట్ ఉండాలి.

ట్రైనింగ్ స్కీమ్- 4162 పోస్టులు

- ట్రైనింగ్ స్కీమ్(స్టైపెండరీ ట్రైనీ) ద్వారా మొత్తం 4162 పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. వీటిల్లో కేటగిరీ-1లో 1216 పోస్టులు, కేటగిరీ-2లో 2946 పోస్టులున్నాయి.
- కేటగిరీ-1లో.. బయో కెమిస్ట్రీ/బయోసైన్స్/లైఫ్ సైన్స్/బయాలజీ విభాగాల్లో 21, కెమిస్ట్రీ-169, ఫిజిక్స్-117, కంప్యూటర్‌సైన్స్-25, అగ్రికల్చర్-02, హార్టికల్చర్-06, కెమికల్-171, ఎలక్ట్రికల్-144, ఎలక్ట్రానిక్స్-98, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ -59, మెకానికల్-328, మెటలర్జీ-05, ఆర్కిటెక్చర్-02, సివిల్-62, ఆటోమొబైల్-04, ఇండస్ట్రియల్ సేఫ్టీ 03 పోస్టులున్నాయి.
- కేటగిరీ-2లో.. ఫిట్టర్-698, టర్నర్/మెషినిస్ట్-213, వెల్డర్-99, మెకానిక్ మెషీన్ టూల్స్ మెయింటెన్స్-18, ఎలక్ట్రీషియన్-399, ఎలక్ట్రానిక్ మెకానిక్-266, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్-152, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ మెకానిక్-95, డ్రాఫ్ట్స్‌మ్యాన్(మెకానికల్)-52, డ్రాఫ్ట్స్‌మ్యాన్(సివిల్)-15, మేషన్-30, ప్లంబర్-42, కార్పెంటర్-27, మెకానిక్ మోటార్ వెహికిల్-24, డీజిల్ మెకానిక్-19, ప్లాంట్ ఆపరేటర్-532, ల్యాబొరేటరీ-303, డెంటల్ టెక్నీషియన్-హైజీనిస్ట్-1, డెంటల్ టెక్నీషియన్-మెకానిక్-01 ఉన్నాయి.
- **అర్హతలు:** ల్యాబొరేటరీ, డెంటల్ టెక్నీషియన్-హైజీనిస్ట్, డెంటల్ టెక్నీషియన్ -మెకానిక్ పోస్టులు తప్ప.. మిగతా అన్నింటికీ సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో పదోతరగతి 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. సంబంధిత విభాగాల్లో ఐటీఐ ట్రేడ్ సర్టిఫికేట్ ఉండాలి.
- **వేతనాలు:** కేటగిరీ-1 పోస్టులకు నెలకు రూ. 24,000 నుంచి రూ.26,000 స్టైపెండ్ చెల్లిస్తారు. కేటగిరీ-2 పోస్టులకు స్టైపెండ్ నెలకు రూ. 20,000 నుంచి రూ.22000 వరకూ ఉంటుంది.

ల్యాబరేటరీ-303 పోస్టులు

ఈ పోస్టులకు ఇంటర్మీడియెట్(ఫిజిక్స్, కెమిస్ట్రీ మ్యాథ్స్ సబ్జెక్టులతో) 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి. డెంటల్ టెక్నీషియన్-హైజీనిస్ట్-1 పోస్టుకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్, బయాలజీ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ 60శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. డెంటల్ టెక్నీషియన్-మెకానిక్-1 పోస్టుకు ఇంటర్మీడియట్ సైన్స్ సబ్జెక్టుతో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రెండేళ్ల డిప్లొమా ఉండాలి.

వయసు

టెక్నికల్ ఆఫీసర్‌కు 18-35 ఏళ్లు; సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 18-22 ఏళ్లు; టెక్నీషియన్‌కు 18-25 ఏళ్లు; స్టైపెండరీ ట్రైనీ కేటగిరీ-1కు 19-24, కేటగిరీ-2కు 18-22 ఏళ్ల మధ్య ఉండాలి. గరిష్ఠ వయసులో ఓబీసీలకు,ఎక్స్ సర్వీస్‌మెన్ మూడేళ్ల,ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు 10-15 ఏళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక ఇలా

- ఆయా పోస్టులను అనుసరించి ప్రిలిమినరీ టెస్ట్, అడ్వాన్స్‌డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- టెక్నికల్ ఆఫీసర్-సి పోస్టుకు ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎక్కువమంది దరఖాస్తు చేసినట్లయితే.. ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు.
- సైంటిఫిక్ అసిస్టెంట్ -బి: కేటగిరీ-1 స్టైపెండరీ ట్రెయినీ పోస్టులకు గంట వ్యవధిలో కంప్యూటర్ బేస్డ్ స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. 40 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రతి సరైన సమాధానానికి 3 మార్కులు కేటాయిస్తారు. ప్రతి తప్పు సమాధానానికీ ఒక మార్కు తగ్గిస్తారు. ప్రశ్నపత్రాన్ని డిప్లొమా/బీఎస్సీ సిలబస్ ఆధారంగా రూపొందిస్తారు. స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించినవాళ్లను ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. అభ్యర్థుల తుది ఎంపిక ఇంటర్వ్యూలో చూపిన ప్రతిభ ఆధారంగానే ఉంటుంది. స్క్రీనింగ్ టెస్ట్‌లో సాధించిన మార్కులను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు.
- టెక్నీషియన్-బి, కేటగిరీ-2 స్టైపెండరీ ట్రెయినీ పోస్టులకు మూడు దశల్లో జరిగే పరీక్షల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. స్టేజ్-1లో ప్రిలిమినరీ టెస్ట్, స్టేజ్-2లో అడ్వాన్స్‌డ్ టెస్ట్, స్టేజ్-3లో స్కిల్ టెస్ట్ ఉంటాయి.
- **స్టేజ్-1 ప్రిలిమినరీ టెస్ట్:** ఈ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌ను దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. మ్యాథ్స్-20, సైన్స్-20, జనరల్ అవేర్‌నెస్-10 నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి 3 మార్కులు, ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష సమయం 60 నిమిషాలు. ఇందులో ప్రతిభ చూపిన వాళ్లను స్టేజ్-2లోని అడ్వాన్స్‌డ్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.
- **స్టేజ్-2 అడ్వాన్స్‌డ్ టెస్ట్:** ఈ పరీక్షలో 50 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఉంటాయి. సరైన సమాధానానికి 3 మార్కులు, ప్రతి తప్పు జవాబుకు ఒక మార్కు తగ్గిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. ఇందులో సాధించిన మార్కుల ఆధారంగానే మెరిట్ లిస్టును తయారు చేస్తారు.
- **స్టేజ్-3 స్కిల్ టెస్ట్:** స్టేజ్-2లో ప్రతిభ చూపిన అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసి.. స్కిల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- **దరఖాస్తులకు చివరి తేదీ:** 22.05.2023
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అమరావతి, గుంటూరు, హైదరాబాద్, కరీంనగర్, విజయవాడ, విశాఖపట్నం.
- **వెబ్‌సైట్:** https://barconlineexam.com

గురుకుల కొలువు.. సాధించండిలా!

» టీఎస్ గురుకులాల్లో 9,231 పోస్టుల భర్తీకి కొనసాగుతున్న దరఖాస్తు ప్రక్రియ
» డీఎల్ మొదలు క్రాఫ్ట్ టీచర్ వరకు.. 9 రకాల ఉద్యోగాలు
» ఇప్పటి నుంచి కృషి చేస్తే విజయానికి ఆస్కారం

టీఎస్ టీచర్ జాబ్స్

తెలంగాణ గురుకుల విద్యాలయాల్లో డిగ్రీ లెక్చరర్స్ మొదలు టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి.. దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. గత మూడు, నాలుగేళ్లుగా టీచర్ కొలువుల కోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు.. తాజా గురుకుల ఉద్యోగాల భర్తీ అవకాశాన్ని అందిపుచ్చుకోవచ్చు. పరీక్ష తేదీ కోసం వేచి చూడకుండా..దరఖాస్తు సమయం నుంచే ఆయా పోస్టులకు సంబంధించిన పరీక్షలకు ప్రిపరేషన్ సాగిస్తే.. విజయావకాశాలు మెరుగవుతాయి.

మొత్తం 9,231 పోస్టులు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం..గురుకుల విద్యాయాల్లో మొత్తం 9,231 పోస్టుల భర్తీకి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించింది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు, గిరిజన సంక్షేమ గురుకుల విద్యా సంస్థలు, మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్స్, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ఈ పోస్టుల భర్తీ చేపట్టనుంది. ఇందుకోసం.. ప్రత్యేకంగా తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో.. ఎంపిక ప్రక్రియ కొనసాగనుంది.

పోస్టుల వివరాలు

- డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్స్,పీడీ(ఫిజికల్ డైరెక్టర్),లైబ్రేరియన్-868 పోస్టులు
- జూనియర్ కళాశాలల్లో లెక్చరర్స్,పీడీ, లైబ్రేరియన్స్-2008 పోస్టులు
- పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్స్(పీజీటీ)-1,276 పోస్టులు
- ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్(టీజీటీ)-4,020 పోస్టులు
- ఆర్ట్ అండ్ డ్రాయింగ్ టీచర్స్ -134 పోస్టులు
- గురుకుల పాఠశాలల్లో లైబ్రేరియన్స్-434 పోస్టులు
- మ్యూజిక్ టీచర్స్-124 పోస్టులు
- క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్-92 పోస్టులు
- గురుకుల విద్యాలయాల్లో ఫిజికల్ డైరెక్టర్-275 పోస్టులు

ఎంపిక ఇలా

రాత పరీక్ష, డెమానుస్ట్రేషన్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ తదితరాల ఆధారంగా ఆయా పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

విజయం సాధించేలా

సిలబస్‌పై అవగాహన

తెలంగాణ గురుకుల పోస్టులకు పోటీపడుతున్న అభ్యర్థులు ప్రిపరేషన్ క్రమంలో ముందుగా.. సిలబస్‌పై సమగ్ర అవగాహన పెంచుకోవాలి. తమ సబ్జెక్ట్‌లకు సంబంధించిన సిలబస్ అంశాలను పరిశీలించాలి. సదరు టాపిక్స్ నుంచి ఎలాంటి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉందో గుర్తించాలి. సిలబస్‌పై అవగాహన పొందిన అభ్యర్థులు.. వెంటనే ప్రిపరేషన్ ప్రారంభించాలి. పరీక్షల్లో ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ తరహాలోనే ఉంటాయి.

పాత ప్రశ్న పత్రాలు

అభ్యర్థులు టీచర్ నియామకాలకు సంబంధించిన పాత ప్రశ్న పత్రాలను అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటంది. గతంలో నిర్వహించిన డీఎస్సీ, టెట్ వంటి పరీక్షల ప్రశ్న పత్రాలను పరిశీలించి.. వాటిని ప్రాక్టీస్ చేయాలి. పెడగాజీ విషయంలో కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల నియామక పరీక్షల ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం మేలు చేస్తుంది.

జనరల్ స్టడీస్

- అన్ని పోస్టులకు సంబంధించి పేపర్-1లో రాణించాలంటే.. జనరల్ స్టడీస్‌కు సంబంధించి భారత రాజ్యాంగం,భారత రాజకీయ వ్యవస్థ,పబ్లిక్ పాలసీ, సామాజిక వివక్ష; వికలాంగులు, గిరిజనులకు సంబంధించిన హక్కులు; సమ్మిళిత విధానాలు; సమాజ సంస్కృతి, నాగరికత, వారసత్వం; భారత్, తెలంగాణ కళలు, సాహిత్యం; సైన్స్ అండ్ టెక్నాలజీలో తాజా పరిణామాలు; పర్యావరణ సమస్యలు-విపత్తుల నిర్వహణ, నివారణ, ఉపశమన విధానాలు; భారత్, తెలంగాణ ఆర్థిక, సామాజిక అభివృద్ధి; తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం ప్రాధాన్యంగా తెలంగాణలోని సామాజిక-ఆర్థిక చరిత్ర, రాజకీయ-సాంస్కృతిక చరిత్ర, కరెంట్ అఫైర్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.
- **అనలిటికల్ ఎబిలిటీస్:** లాజికల్ రీజనింగ్, డేటా ఇంటర్‌ప్రిటేషన్‌లపై దృష్టిపెట్టాలి.
- **ఇంగ్లిష్:** ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీ, వర్డ్స్ అండ్ సెంటెన్సెస్, డైరెక్ట్-ఇన్ డైరెక్ట్ స్పీచ్, సెంటెన్స్ కరెక్షన్, యాక్టివ్-ప్యాసివ్ వాయిస్, యాంటానిమ్స్, సినానిమ్స్ వంటి బేసిక్ ఇంగ్లిష్ అంశాలపై పట్టు సాధించాలి.

సబ్జెక్ట్ పేపర్

ఆయా పోస్టులకు సంబంధించి పేర్కొన్న సబ్జెక్ట్ పేపర్లలో రాణించేందుకు అభ్యర్థులు.. పీజీ స్థాయి అకడమిక్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. ఆయా అంశాలను వర్తమాన పరిణామాలతో సమ్మిళితం చేసుకుంటూ చదవాలి. అదే విధంగా మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ వంటి సబ్జెక్ట్‌ల విషయంలో అప్లికేషన్ దృక్పథంతో అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- డిగ్రీ కళాశాలల్లో లెక్చరర్స్, పీడీ, లైబ్రేరియన్ చివరి తేది; జూనియర్ కళాశాలల్లో లెక్చరర్స్, పీడీ, లైబ్రేరియన్ చివరి తేది: మే 17, 2023
- పాఠశాలల్లో పీజీటీ, పీడీ, లైబ్రేరియన్, క్రాఫ్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్‌స్ట్రక్టర్, ఆర్ట్ టీచర్, డ్రాయింగ్ టీచర్, మ్యూజిక్ టీచర్ చివరి తేది: మే24, 2023
- టీజీటీ చివరి తేది: మే 27, 2023
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://treirb.telangana.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
123	18
62,028	18,315

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	12,285	▽	43
డోజోన్స్	33,300	▽	9
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,754	▲	24
డాక్స్	15,914	▲	79
షాంఘై	3,272	▽	37
నికాయ్	29,388	▲	261

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

సొంతిల్లు.. వృద్ధాప్యంలో ఆసరా!

ఇంటిపై రివర్స్ మార్ట్‌గేజ్ రుణం
నెలవారీగా 20 ఏళ్ల పాటు ఆదాయం
జీవించి ఉన్నంత కాలం అందులోనే నివాసం
ఆ తర్వాతే బ్యాంకులు విక్రయించుకోగలవు
తిరిగి చెల్లించాల్సిన బాధ్యత ఉండదు
వారసులు చెల్లించి సొంతం చేసుకోవచ్చు



పదవీ విరమణ తీసుకున్నారు. ఉండడానికి సొంతిల్లు ఉంది. కానీ, పింఛను సదుపాయం లేదు. ఉద్యోగం లేదా సంపాదనా కాలంలో పెద్దగా పొదుపు చేయలేకపోయారు. చేసిన పొదుపు ఇప్పటి జీవన అవసరాలను తీర్చే స్థాయిలో లేదు. అదనపు ఆదాయం కావాలి. ఇందుకోసం వృద్ధాప్యంలో ఏం చేయాలి..? ఇలాంటి సందిగ్ధత ఎదుర్కొనే ప్రతి ఒక్కరి ముందున్న ఆప్షన్ రివర్స్ మార్ట్‌గేజ్ లోన్. వృద్ధాప్యంలో జీవన అవసరాలను దృష్టిలో పెట్టుకున్న కేంద్ర సర్కారు 2007లోనే దీన్ని తీసుకొచ్చింది. కానీ, మన దేశంలో అంతగా ప్రజాదరణకు నోచుకోలేదు. దీని గురించి తెలిసింది చాలా తక్కువ మందికే. బ్యాంకులు వ్యక్తిగత రుణాలు, గృహ రుణాలు, క్రెడిట్ కార్డుల గురించి ప్రకటనలు ఇవ్వడం గమనించే ఉంటారు. కానీ, ఏ బ్యాంకు కూడా ఎక్కడా రివర్స్ మార్ట్‌గేజ్ స్కీమ్ గురించి ప్రకటన ఇచ్చినట్టు కనిపించదు. దీనికి కారణం బ్యాంకులకు ఈ ఉత్పత్తిపై ఆసక్తి లేకపోవడమే. వృద్ధాప్యంలో పోషణకు ఎలాంటి ఆదాయం లేని వారిని సొంతిల్లే ఆదుకుంటుంది. ఇంటిని బ్యాంకు తనఖాగా ఉంచుకుని నెలవారీ ఆదాయం సమకూరుస్తుంది. ఈ పథకం ప్రయోజనాలు, అర్హతలపై మరిన్ని వివరాలు అందించే కథనమే ఇది.

ఇది ఎలా పనిచేస్తుంది..?

రివర్స్ మార్ట్‌గేజ్ అంటే నివాస యోగ్యమైన గృహంపై తీసుకునే రుణం. మార్ట్‌గేజ్ అన్నది ఇంటిని సొంతం చేసుకోవడం కోసం తీసుకునే రుణం. దీనికి విరుద్ధంగా ఇంటిపై రుణం తీసుకునేది కనుక రివర్స్ మార్ట్‌గేజ్ అని పేరు పెట్టారు. ఇంటి కోసం మార్ట్‌గేజ్ రుణం తీసుకుంటే నెలవారీ ఈఎంఐ ఎలా అయితే చెల్లిస్తారో.. రివర్స్ మార్ట్‌గేజ్‌లో బ్యాంక్ కూడా రుణ గ్రహీతకు అదే విధంగా చెల్లిస్తుంది. అద్దె ఇంట్లో ఉండే వారికి ఈ రుణానికి అర్హత ఉండదు. సొంతిల్లు, దానిపై సంపూర్ణ హక్కులు ఉన్న వారే దీన్ని తీసుకోగలరు. ఇంటి విలువ ఎంత, అది ఏ ప్రాంతంలో ఉంది? తదితర అంశాలను చూసిన తర్వాత బ్యాంక్‌లు ఎంత రుణం ఇవ్వాలన్నది నిర్ణయిస్తాయి. ఇంటి విలువలో రుణంగా (ఎల్‌టీవీ) 60 నుంచి 80 శాతం మధ్య నిర్ణయిస్తాయి. రివర్స్ మార్ట్‌గేజ్ కింద చాలా బ్యాంకులు గరిష్ఠంగా రూ. కోటి రుణ పరిమితిని అమలు చేస్తున్నాయి. అంటే రివర్స్ మార్ట్‌గేజ్ కింద తనఖా పెట్టే ఇంటి విలువ రూ.2 కోట్లు ఉన్నా సరే గరిష్ఠంగా రూ.కోటి వరకే పొందగలరు. గరిష్ఠంగా 20 ఏళ్ల కాలానికి రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తున్నాయి.

రుణాన్ని చెల్లించక్కర్లేదు..

వృద్ధాప్యంలో జీవన అవసరాల కోసం ఇంటిని తనఖా పెట్టి రుణం తీసుకుంటున్నారని అనుకుందాం. అలాంటప్పుడు తిరిగి ఎలా చెల్లించగలం? అన్న ప్రశ్న రావచ్చు. నిజమే తీసుకున్న రుణాన్ని తప్పనిసరిగా తిరిగి చెల్లించాలనేమీ లేదు. ఉదాహరణకు వినయ్ (62) 20 ఏళ్ల కాలానికి రివర్స్ మార్ట్‌గేజ్ రుణం తీసుకున్నారని అనుకుందాం. ఆయన 82 ఏళ్లు వచ్చిన తర్వాత కూడా జీవించే ఉన్నారు. కాల వ్యవధి ముగిసింది కనుక ఆ తర్వాత నుంచి బ్యాంక్ ఎలాంటి చెల్లింపులు చేయదు. అయినా, రుణ గ్రహీత అదే ఇంటిలో నిశ్చింతగా నివసించొచ్చు. ఇంటి యజమాని మరణించిన తర్వాతే అది బ్యాంక్ పరం అవుతుంది. ఒకవేళ భార్యా, భర్త జాయింట్‌గా రివర్స్ మార్ట్‌గేజ్ రుణం తీసుకుంటే వారిద్దరి మరణానంతరమే బ్యాంకులకు హక్కులు లభిస్తాయి. రుణ గ్రహీత మరణానంతరం రుణం, దానిపై వడ్డీ బకాయిలు చెల్లించే ఆప్షన్‌ను బ్యాంక్‌లు వారసులకు కల్పిస్తాయి. వారు ముందుకు రాకపోతే అప్పుడు ఆ ఇంటిని బ్యాంక్ వేలం వేస్తుంది. అన్ని బకాయిలు మినహాయించుకుని ఏమైనా మిగిలి ఉంటే వారసులకు చెల్లిస్తుంది. ఇంటిని విక్రయించగా వచ్చిన మొత్తం బకాయిలు తీర్చేంత లేకపోతే, మిగిలినది బ్యాంక్ నష్టం కింద సర్దుబాటు చేసుకుంటుంది. వారసులకు బాధ్యత ఉండదు.

రెండు రకాల చెల్లింపులు...

రివర్స్ మార్ట్‌గేజ్ రుణాన్ని రుణ గ్రహీత కోరిక మేరకు బ్యాంక్‌లు రెండు రకాలుగా చెల్లిస్తాయి. ఒకటి ప్రతి నెలా వాయిదాల రూపంలో అందుకోవచ్చు. లేదంటే త్రైమాసికం, ఆరు నెలలు లేదా ఏడాదికోసారి చెల్లింపులు చేస్తుంది. రెండు ఏక మొత్తంలో మంజూరు చేస్తుంది. బ్యాంక్ నుంచి రివర్స్ మార్ట్‌గేజ్ రుణాన్ని ఏక మొత్తంలో ఒకే విడత అందుకున్నా లేక నెలవారీ వాయిదాల రూపంలో అందుకున్నా, ఆ మొత్తంపై పన్ను పడదు. ఎందుకంటే ఆదాయపన్ను చట్టం దీన్ని ఆదాయం కింద పరిగణించదు. రుణంగానే భావిస్తుంది. దీంతో పన్ను మినహాయింపు ప్రయోజనం ఉంటుంది. చెల్లింపుల మొత్తాన్ని పెంచుకునే ఆప్షన్ లేదు. ఉదాహరణకు ప్రాపర్టీ విలువ రూ.కోటి ఉందని అనుకుందాం. లోన్ టు వ్యాల్యూ (ఎల్‌టీవీ) 80 శాతం అనుకుంటే అప్పుడు రుణం కింద రూ.80 లక్షలు ఖరారు అవుతుంది. ఇందులో వడ్డీ భాగం కూడా ఉంటుందని మర్చిపోవద్దు. రూ.80 లక్షలను 8.5 శాతం రేటుపై 20 ఏళ్ల కాలానికి తీసుకునేట్టు అయితే, అప్పుడు చెల్లించాల్సిన వడ్డీ రూ.45 లక్షలు అవుతుంది. రూ.80 లక్షల్లో రూ.45 లక్షలు పోను రూ.35 లక్షలను బ్యాంక్ రుణ గ్రహీతకు చెల్లిస్తుంది. ఇది నెలవారీ చెల్లింపులకు సంబంధించి అనుసరించే విధానం. ఏక మొత్తంలో చెల్లింపులు కోరుకుంటే అప్పుడు లోన్‌టు వ్యాల్యూలో 50 శాతం లేదా రూ.15 లక్షలు ఈ రెండింటిలో ఏది ఎక్కువ అయితే అది చెల్లిస్తారు.

ఎప్పుడైనా చెల్లించొచ్చు..

రివర్స్ మార్ట్‌గేజ్ రుణాన్ని ఎప్పుడైనా తిరిగి చెల్లించొచ్చు. కాల వ్యవధి పూర్తి కాక ముందు చెల్లించినా ఎలాంటి చార్జీలు ఉండవు. ''ఒకవేళ మరో బ్యాంక్‌కు రివర్స్ మార్ట్ గేజ్ రుణాన్ని బదిలీ చేసుకోవడం ద్వారా పాత బ్యాంకు వద్ద ముందే తీర్చేస్తున్నట్టు అయితే, అప్పటికి మిగిలి ఉన్న రుణ బకాయి మొత్తంపై 0.5–2 శాతం మధ్య పెనాల్టీ చెల్లించాల్సి వస్తుంది'' అని మైలోన్‌కేర్ డాట్ ఇన్ సంస్థ సీఈవో గౌరవ్‌గుప్తా తెలిపారు.

ఇప్పుడు సరైన తరుణమైనా..?

రుణాలపై వడ్డీ రేట్లు గతేడాది నుంచి 2.5 శాతం మేర పెరిగాయి. ఇక ఇక్కడి నుంచి పెరుగుదల పెద్దగా ఉండదన్నది విశ్లేషకుల అంచనా. అంతేకాదు అంతర్జాతీయంగా ఆర్థిక వ్యవస్థలు సర్దుకుని, అనిశ్చితులు తగ్గితే తిరిగి రుణ రేట్లు తగ్గే అవకాశాలు కూడా ఉన్నాయి. కనుక రివర్స్ మార్ట్‌గేజ్ రుణాన్ని తీసుకునే వారు వడ్డీ రేట్లు గరిష్ఠ స్థాయిలో ఉన్నాయని వెనుకాడక్కర్లేదని నిపుణులు సూచిస్తున్నారు. రివర్స్ మార్ట్‌గేజ్ రుణం తీసుకోవడానికి అవసరమే ప్రామాణికం. జీవనానికి ఇతరత్రా ఆదాయం లేని వారు, ఉన్నా చాలని వారు, తమ వారసులకు తమ ప్రాపర్టీ అవసరం లేని వారు, మరింత సుఖవంతమైన జీవనం సాగించాలని అనుకునే వారు, అవసరాల్లో రాజీ పడే ఉద్దేశ్యం లేని వారు రివర్స్ మార్ట్‌గేజ్ రుణానికి వెళ్లొచ్చు. ఎస్‌బీఐ రివర్స్ మార్ట్‌గేజ్ రుణంపై రేటును రెపో రేటుతో అనుసంధానిస్తోంది. దాదాపు గృహ రుణం స్థాయిలోనే రేట్లు ఉంటాయి. రెపో రేటుకు అనుసంధానమై ఉండడం వల్ల వడ్డీ రేట్లు పెరిగినప్పుడు, తగ్గినప్పుడు వెంటనే అది రుణాలపై ప్రతిఫలిస్తుంది.

విలువ మదింపు..

రివర్స్ మార్ట్‌గేజ్ కింద తనఖా ఉంచిన ఇంటి విలువను బ్యాంక్‌లు ఐదేళ్లకోసారి మదింపు వేస్తుంటాయి. తనఖా పెట్టిన ప్రాపర్టీ విలువ రుణం మంజూరు చేసే నాటి విలువ స్థాయిలోనే ఉందా? పెరిగిందా లేక తగ్గిందా? అన్నది సమీక్షిస్తుంటాయి. ఎందుకంటే రివర్స్ మార్ట్‌గేజ్ రుణాల్లో ఎక్కువ శాతం ఆయా ప్రాపర్టీలు బ్యాంక్‌ల స్వాధీనం అవుతుంటాయి. రుణం తీసుకున్న వారు లేదా వారి వారసులు తిరిగి చెల్లించే దాఖలాలు తక్కువ. దీంతో బ్యాంక్‌లు తాము ఇచ్చిన రుణం, దానిపై వడ్డీ బకాయిల వసూలుకు వాటిని వేలం వేస్తుంటాయి. వేలంలో సరైన విలువను పొందేందుకు వీలుగా బ్యాంక్‌లు రిస్క్ కోణంలో ఇలా ప్రాపర్టీ విలువను ఐదేళ్లకోసారి మదింపు వేస్తాయి. కివర్స్ మార్ట్‌గేజ్ రుణానికి ఎన్‌బీఎఫ్‌సీల కంటే బ్యాంకులే మెరుగైన ఆప్షన్.

సమర్పించాల్సినవి ఇవీ...

రివర్స్ మార్ట్‌గేజ్ రుణం తీసుకోవాలని అనుకునే వారు.. గుర్తింపు, నివాస గుర్తింపు పత్రాలు ఇవ్వాలి. ప్రాపర్టీ అసలు పేపర్లు, గడిచిన ఆరు నెలల బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్, అప్పటికే ఏదైనా రుణం తీసుకుని ఉంటే దానికి సంబంధించి చివరి ఏడాది స్టేట్‌మెంట్ సమర్పించాల్సి ఉంటుంది.

ఎందుకు ఆదరణ లేదు..?

రివర్స్ మార్ట్‌గేజ్ గురించి అందరికీ తెలియకపోవడం ఇది పెద్దగా విస్తరించపోవడానికి ఒక కారణం. సాధారణంగా ఇంటితో అనుబంధం ఉంటుంది. అంత సులభంగా దాన్ని తెంపుకోలేరు. తమ గుర్తుగా, వారసత్వంగా పరిగణిస్తుంటారు. బ్యాంకులు దీని గురించి ప్రచారం చేయకపోవడం కూడా ఒక ముఖ్య కారణం. ఎక్కడా ప్రకటనలు ఇవ్వవు. కనీసం వాటి వెబ్‌సైట్లలోనూ వివరాలను అందుబాటులో ఉంచవు. బ్యాంకుకు వెళ్లి వివరాలు తెలుసుకోవాల్సిందే. ఎందుకంటే ఉదాహరణకు బ్యాంక్ 15 ఏళ్ల కాలానికి రివర్స్ మార్ట్‌గేజ్ రుణం ఇచ్చిన తర్వాత.. ఇంటి యజమాని 30 ఏళ్లు జీవించారని అనుకుందాం. అప్పటి వరకు ఆ ఇంటిని బ్యాంకులు ఏమీ చేయలేవు. ఇచ్చిన రుణాన్ని స్వచ్ఛందంగా చెల్లిస్తే తప్ప అవి వసూలు చేసుకోలేవు. రుణ గ్రహీత చనిపోయే వరకు ఆగాల్సిందే.

ప్రత్యామ్నాయం ఉందా..?

నివసిస్తున్న ఇల్లు వారసులకు అవసరం లేనట్టయితే అప్పుడు దాన్ని విక్రయించే ఆప్షన్‌ను కూడా పరిశీలించొచ్చు. మంచి విలువ పలికే ప్రాంతంలో ఉంటే విక్రయించి, తక్కువ రేటున్న ఇంటిని కొనుగోలు చేసుకోవడం ఒక మార్గం. ఈ రూపంలో మిగిలిన మొత్తాన్ని స్థిరాదాయ పథకాల్లోకి మళ్లించుకుని ప్రతి నెలా ఆదా యం వచ్చేలా ఏర్పాటు చేసుకోవచ్చు.

వీటిని దృష్టిలో పెట్టుకోవాలి...

- 60 ఏళ్లు నిండిన ఎవరైనా రివర్స్ మార్ట్‌గేజ్ రుణానికి అర్హులు. జీవిత భాగస్వామి సహ దరఖాస్తుదారు అయితే ఆమె వయసు 55–58 ఏళ్లకు తక్కువ ఉండకూడదు. బ్యాంకుల మధ్య ఇది వేర్వేరుగా ఉంది.
- గరిష్ఠంగా రూ.కోటి వరకే రుణం లభిస్తుంది. ఈ మొత్తాన్ని రుణ గ్రహీత ఏ అవసరం కోసం అయినా వినియోగించుకోవచ్చు.
- ఇంటి విలువ, రుణ గ్రహీత వయసు, అమల్లో ఉన్న వడ్డీ రేటు ఆధారంగా రుణం మొత్తాన్ని, కాల వ్యవధిని బ్యాంకులు నిర్ణయిస్తాయి.
- కనీసం పదేళ్లు, గరిష్ఠంగా 20 ఏళ్ల కాలాన్ని చాలా బ్యాంకులు అమలు చేస్తున్నాయి.
- సొంతిల్లు అయి ఉండి, దాన్ని అద్దెకు ఇవ్వకుండా, అందులో నివసిస్తుంటే రివర్స్ మార్ట్‌గేజ్ చేసుకోవచ్చు.
- ఇంటిపై ఎలాంటి వివాదాలు ఉండకూడదు.
- వాణిజ్య ఆస్తిపై రివర్స్ మార్ట్‌గేజ్‌కు అవకాశం లేదు.
- తనఖా పెట్టే ఇంటి జీవన కాలం అక్కడి నుంచి 20 ఏళ్లకు తక్కువ కాకుండా ఉండకూడదు.
- ప్రాసెసింగ్ ఫీజు, స్టాంప్ డ్యూటీ, ప్రాపర్టీ ఇన్సూరెన్స్, వీటిపై జీఎస్‌టీ చార్జీలను చెల్లించాలి.
- పెనాల్టీ లేకుండా ఎప్పుడైనా ఈ రుణం మొత్తాన్ని తిరిగి చెల్లించొచ్చు.
- ప్రతి ఐదేళ్లకోసారి ప్రాపర్టీ విలువను బ్యాంక్‌లు మదింపు వేస్తాయి.
- రివర్స్ మార్ట్‌గేజ్ కింద తనఖా పెట్టిన ఇంటిని నవీకరించాలని అనుకుంటే, బ్యాంక్ నుంచి అనుమతి తీసుకోవాలి.
- ఇంటి నిర్వహణకు అయ్యే ఖర్చులను రుణ గ్రహీత (ఇంటి యజమాని) పెట్టుకోవాల్సిందే. అంతేకాదు ఆ ఇంటికి సంబంధించి ప్రాపర్టీ ట్యాక్స్, ఇతర పన్నులు ఏవైనా ఉంటే అందులో నివసిస్తున్న వారే చెల్లించుకోవాలి.



ఏయూ స్మాల్ ఫైనాన్స్ బిజినెస్ రూపే క్రెడిట్ కార్డ్



హైదరాబాద్: ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎన్‌పీసీఐ భాగస్వామ్యంతో బిజినెస్ క్యాష్ బ్యాక్ రూపే క్రెడిట్ కార్డ్‌ను విడుదల చేసింది. వ్యాపారస్తుల కోసం దీన్ని ప్రత్యేకంగా తీసుకొచ్చింది. కార్డు ద్వారా కొనుగోళ్లపై 2 శాతం వరకు క్యాష్ బ్యాక్, 48 రోజుల పాటు వడ్డీ లేని రుణ సదుపాయం, తక్షణ రుణ సదుపాయం ఈ కార్డులో భాగంగా ఉంటాయని ప్రకటించింది. అలాగే అగ్ని ప్రమాదాలు, దోపిడీలు, ఇళ్లు బద్దలు కొట్టడం తదితర వాటికి కార్డులో భాగంగా బీమా కవరేజీ పొందొచ్చని ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తెలిపింది. ఎన్‌పీసీఐ సీఈవో దిలీప్ ఆస్బే సమక్షంలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ఎండీ, సీఈవో సంజయ్ అగర్వాల్ ఈ కార్డును ప్రారంభించారు. ఈ కార్డుపై లైఫ్ స్టయిల్, ట్రావెల్ ప్రయోజనాలు కూడా ఉన్నట్టు బ్యాంక్ ప్రకటించింది. 300కు పైగా రెస్టారెంట్లలో 30% వరకు తగ్గింపు, ఏడాదికి 8 సార్లు రైల్వే లాంజ్‌లను ఉచితంగా వినియోగించుకునే సదుపాయం ఉంటుందని తెలిపింది.

యస్ కిరణ్ సోలార్ ఫైనాన్సింగ్

యస్‌బ్యాంక్ 'యస్ కిరణ్ సోలార్ ఫైనాన్సింగ్' పేరుతో ప్రత్యేక రుణ పథకాన్ని ప్రకటించింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్‌ఎంఈ) తమ ప్రాంగణాల్లో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకోవడానికి కావాల్సిన రుణాలను యస్ బ్యాంక్ ఈ పథకం కింద అందిస్తుంది. సుస్థిర ఇంధన విధానాలను ఎంఎస్‌ఎంఈలు అనుసరించేందుకు ఈ కార్యక్రమం ద్వారా యస్ బ్యాంక్ మద్దతిస్తుందని ప్రకటించింది.

ఎల్అండ్‌టీ ఫైనాన్స్ | జేఎం ఫైనాన్షియల్ | కొనొచ్చు

సాక్షి స్టాక్స్

ప్రస్తుత ధర: రూ. 96 టార్గెట్: రూ. 125

ఎందుకంటే: గతేడాది చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో ఎల్అండ్‌టీ ఫైనాన్స్ హోల్డింగ్స్ కన్సాలిడేటెడ్ నికర లాభం 47 శాతం జంప్‌చేసింది. రూ. 500 కోట్లను తాకింది. రుణ వ్యయాలు తగ్గడం ఇందుకు సహకరించింది. నికర వడ్డీ ఆదాయం 18 శాతం పుంజుకుని రూ. 1,680 కోట్లకు చేరింది. ప్రొవిజన్లకు ముందు నిర్వహణ లాభం(పీపీవోపీ) అంచనాలకు అనుగుణంగా 9 శాతం బలపడి రూ. 1,240 కోట్లయ్యింది. అయితే మొత్తం రుణ ఆస్తులు 8 శాతం క్షీణించాయి. హోల్‌సేల్ రుణ ఆస్తులు 53 శాతం నీరసించడం ప్రభావం చూపింది. కాగా.. యాజమాన్య వ్యూహాల ప్రకారం రిటైల్ రుణ ఆస్తుల వేగవంత వృద్ధి కొనసాగింది. 35 శాతం ఎగశాయి. దీంతో కంపెనీ రుణ మిక్స్‌లో ప్రస్తుతం రిటైల్ రుణ ఆస్తుల వాటా 75 శాతానికి చేరింది. ఇటీవల నిర్వహించిన విశ్లేషకుల సమావేశంలో కంపెనీ యాజమాన్యం రిటైల్ విభాగంపై మరింత దృష్టి పెట్టనున్నట్లు పేర్కొంది. తద్వారా మొత్తం లోన్‌బుక్‌లో రిటైల్ విభాగం పోర్ట్‌ఫోలియోను 90 శాతానికి పెంచుకునే ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు వెల్లడించింది. ఇందుకు వీలుగా గ్రామీణ, మైక్రో, గ్రూప్ రుణాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలియజేసింది. ఇక మరోవైపు వృద్ధికి వీలుగా అనలిటిక్స్‌పై ప్రత్యేక దృష్టి, ప్రస్తుత కస్టమర్లకు విభిన్న ప్రొడక్టుల విక్రయం, టెక్నాలజీపై నిరవధిక పెట్టుబడులు తదితరాలను చేపడుతోంది. వెరసి 2.8–3 శాతం ఆర్‌వోఏ సాధించే లక్ష్యంగా సాగుతోంది. రిటైల్ పోర్ట్‌ఫోలియోను పెంచుకోవడం కంపెనీకి లబ్ధిని చేకూర్చే వీలుంది.



గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ | వెంచురా సెక్యూరిటీస్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 418 టార్గెట్: రూ. 813

ఎందుకంటే: లూబ్రికెంట్స్ విభాగంలో దేశీయంగా క్యాస్ట్రాల్ తదుపరి రెండో పెద్ద కంపెనీగా గల్ఫ్ ఆయిల్ లూబ్రికెంట్స్ ఇండియా నిలుస్తోంది. మార్కెట్ వాటాను పెంచుకోవడంతోపాటు.. గత మూడేళ్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులలోనూ పటిష్టస్థాయిలో కార్యకలాపాలు నిర్వహించడం ద్వారా సమర్థతను చాటుకుంది. వాణిజ్య వాహన విభాగ వాతావరణం(సైకిల్) ఊపందుకోవడం, జాతీయ రహదారులపై రవాణా పుంజుకోవడం, జోరు చూపుతున్న పారిశ్రామికోత్పత్తి, యుటిలిటీ వాహన విక్రయాలలో వృద్ధి వంటి అంశాలు లూబ్రికెంట్స్‌కు డిమాండును పెంచనున్నట్లు అంచనా. వెరసి బిజినెస్ టు బిజినెస్(బీటుబీ) విభాగం నుంచి లూబ్రికెంట్స్ విక్రయాలు ఊపందుకోనున్నాయి. ఇది అంతిమంగా కంపెనీకి లబ్ధిని చేకూర్చనుంది. కంపెనీ లూబ్రికెంట్స్, చమురు అమ్మకాల పరిమాణంలో బీటుబీ విభాగం నుంచి 35– 40 శాతం నమోదవుతుండటం కంపెనీకి బలాన్నిస్తోంది. దీనికితోడు అమ్మకాలలో 65 శాతంవరకూ వాటాను ఆక్రమిస్తున్న బిజినెస్ టు కన్జూమర్(బీటూసీ) లూబ్రికెంట్ బిజినెస్ విస్తరణపైనా కంపెనీ కన్నేసింది. ఇందుకు అనుగుణంగా కొత్త ప్రాంతాలలో డీలర్ నెట్‌వర్క్‌ను వేగంగా విస్తరిస్తోంది. బీటుబీ బిజినెస్‌తో పోలిస్తే బీటూసీలో మెరుగైన మార్జిన్లు ఆర్జిస్తోంది. ఇలాంటి పలు వ్యూహాత్మక అంశాలు కంపెనీ మార్కెట్ వాటాను పెంచనున్నాయి. ఆర్థిక పనితీరు మెరుగుకు దోహదపడనున్నాయి. వెరసి భవిష్యత్‌లో దేశీ లూబ్రికెంట్స్ మార్కెట్లో నాయకత్వ స్థాయికి చేరే అవకాశముంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే


ఐపీపీబీ ఖాతాదారులకు బజాజ్ అలియాంజ్ బీమా

ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ (ఐపీపీబీ) ఖాతాదారులకు బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్ గ్రూప్ టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్‌ను ప్రారంభించింది. ఇది ఇండియాపోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ ఖాతాదారులకు ప్రత్యేకం. చిన్న మొత్తంలో ప్రీమియం చెల్లించడం ద్వారా బీమా రక్షణ పొందొచ్చని బజాజ్ అలియాంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ తెలిపింది. పాలసీదారు మరణించిన సందర్భంలో తక్షణమే పరిహారంతో పాటు, 5, 7, 10 ఏళ్లపాటు కుటుంబ అవసరాలకు నెలవారీ చెల్లించే సదుపాయాలు ఇందులో ఉన్నట్టు పేర్కొంది.

ప్రతి లక్ష్యానికి ప్రత్యేక పోర్ట్‌ఫోలియో కావాలా?

నాకు ఎనిమిది వరకు ఆర్థిక లక్ష్యాలు ఉన్నాయి. ప్రతీ లక్ష్యానికి విడిగా పోర్ట్‌ఫోలియో ఏర్పాటు చేసుకోవాలా? అలా అయితే పర్యవేక్షణకు ఇబ్బంది కాదా?
– శివాని

లక్ష్యాలు, పోర్ట్‌ఫోలియో మధ్య సమతూకం ఉండాలి. ముందుగా సమీప కాలంలోని లక్ష్యాలను వేరు చేయండి. అలాగే, మధ్య కాలం, దీర్ఘకాల లక్ష్యాలను కూడా వేరు చేయండి. ఇప్పుడు స్వల్పకాల, మధ్యకాల లక్ష్యాలను సైతం.. రాజీ పడతగ్గ, రాజీ పడలేని అనే రెండు విభాగాలుగా వేరు చేయండి. రాజీపడలేని అంటే రిస్క్ తీసుకోని పెట్టుబడులు. రిస్క్ తీసుకోలేని మధ్యకాలం లక్ష్యాల కోసం ఉద్దేశించిన పెట్టుబడులను ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ (స్థిరాదాయ/డెట్) సాధనాల్లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. వీటి కోసం ఒక్కటే పోర్ట్‌ఫోలియో సరిపోతుంది. ఈ పెట్టుబడుల కోసం ఈక్విటీలపై ఆధారపడకూడదు. అవసరమైనప్పుడు వెంటనే తీసుకునేందుకు అనుకూలంగా ఉండాలి. ఇక దీర్ఘకాలం కోసం ఉద్దేశించిన పెట్టుబడులను అంటే తదుపరి ఐదేళ్ల కాలం వరకు అవసరం లేని పెట్టుబడులను ఈక్విటీలకు కేటాయించుకోవాలి. ప్రతీ లక్ష్యానికి విడిగా ఎంత చొప్పున కావాలి, ఎంత వ్యవధి ఉందనే దాని ఆధారంగా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మీ లక్ష్యానికి కావాల్సిన నగదు మీరు కోరుకున్న సమయంలో లభించేలా ప్రణాళిక ఉండాలి. ఉదాహరణకు వచ్చే మూడేళ్ల కాలంలో రూ.5 లక్షలు కావాలి, ఐదేళ్లలో రూ.5 లక్షల కావాలనుకుంటే లేదా 25–30 ఏళ్లలో రూ.కోటి రూపాయలు (రిటైర్మెంట్) కావాలనుకుంటే అందుకు అనుగుణంగా ప్రణాళిక రూపొందించుకోవాలి. వేర్వేరు పోర్ట్‌ఫోలియోలన్నవి కాలవ్యవధికి అనుగుణంగానే ఉండాలి. స్వల్పకాల లక్ష్యాల కోసం ఫిక్స్‌డ్ ఇన్‌కమ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. ఐదేళ్లకు మించిన ఏ లక్ష్యానికైనా డైవర్సిఫైడ్ ఈక్విటీ ఫండ్‌ను ఎంపిక చేసుకోవచ్చు. అప్పుడు లక్ష్యాల వారీగా కాకుండా, కాలవ్యవధి ఆధారంగా ప్రత్యేక పోర్ట్‌ఫోలియోలు ఉంటాయి. ఇందుకోసం వ్యాల్యూరీసెర్చ్ ఆన్‌లైన్‌లో 'మై ఇన్వెస్ట్‌మెంట్' టూల్‌ను వినియోగించుకోవచ్చు. ఒకటికి మించిన పథకాల్లో ఇన్వెస్ట్ చేసుకున్నప్పుడు వివిధ లక్ష్యాలకు అనుగుణంగా ఈ టూల్‌తో వేరు చేసుకోవచ్చు.



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నిఫ్టీ ఇండెక్స్ ఫండ్స్‌లో ఏది మంచిదనే విషయంలో సందేహం నెలకొంది. పథకం ఎంపిక చేసుకోవడం ఎలా?
– స్వామినాథన్

ఇండెక్స్ ఫండ్‌ను ఎంపిక చేసుకునే విషయంలో పరిశీలించాల్సిన ముఖ్య అంశాలు రెండున్నాయి. ఒకటి ఎక్స్‌పెన్స్ రేషియో. ప్రస్తుతం ఇండెక్స్ ఫండ్స్ మధ్య చాలా పోటీ ఉంది. 10–15 బేసిస్ పాయింట్ల (0.1–0.15 శాతం) ఎక్స్‌పెన్స్ రేషియోకే ఇండెక్స్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లు అందుబాటులో ఉన్నాయి. కనుక యాక్టివ్ ఫండ్స్‌ను ఎంపిక చేసుకుని ఇంతకంటే ఎక్కువ ఎక్స్‌పెన్స్ రేషియో చెల్లించాల్సిన అవసరం లేదు. రెండోది ట్రాకింగ్ ఎర్రర్. ఒక ఇండెక్స్ ఫండ్.. తాను పెట్టుబడులను అనుసరించే ఇండెక్స్‌తో పోలిస్తే రాబడుల విషయంలో ఎంత మెరుగ్గా పనిచేసిందో చెబుతుంది. ఇండెక్స్ ఫండ్ నిర్వహణ బృందం సామర్థ్యాన్ని ఇది ప్రతిఫలిస్తుంది. తక్కువ ఎక్స్‌పెన్స్ రేషియోతోపాటు.. ట్రాకింగ్ ఎర్రర్ తక్కువగా ఉన్న పథకం మెరుగైనది అవుతుంది. ఈ రెండు అంశాలను ప్రామాణికంగా చేసుకుని చూస్తే ఎస్‌బీఐ, యూటీఐ, హెచ్‌డీఎఫ్‌సీ సంస్థల పథకాలు మెరుగ్గా పనిచేస్తున్నాయి.

ప్రాచీన బోయల రాజ్యం వెందోడు

- కేంద్ర పురావస్తు అధికారి, చరిత్ర పరిశోధకులు వెల్లడి
- వెందోడమ్మ ఆలయంలోని శాసనాల పరిశీలన


శాసనాలను చూపుతున్న చరిత్ర పరిశోధకులు రసూల్

గూడూరు: ప్రాచీన బోయల రాజ్యం వెందోడు గ్రామమని కేంద్ర పురావస్తు అధికారి, చరిత్ర పరిశోధకులు సంయుక్తంగా వెల్లడించారు. తిరుపతి జిల్లాలోని గూడూరు రూరల్ మండలం వెందోడు గ్రామంలోని వెందోడమ్మ దేవాలయంలోని శాసనాలను పురావస్తు శాఖాధికారి యేసుబాబు, చరిత్ర పరిశోధకులు షేక్ రసూల్ ఆదివారం పరిశీలించారు. వెందోడు గ్రామం ఒకప్పుడు బోయలకు ప్రధాన కేంద్రంగా ఉండేదని తమ పరిశోధనల ద్వారా వ్యక్తమైందన్నారు. శాసనంలో ఈశ్వర సంవత్సర మార్గశిరాన నాగారెడ్డి కార్యకర్తలైన కొండాపురం పాపిరెడ్డి కుమారుడు ఓబుల్‌రెడ్డి, మల్లికార్జున కలసి వెందోడమ్మ దేవాలయానికి మాన్యం కేటాయించినట్లుగా ధర్మ శాసనాన్ని వేయించడం జరిగిందన్నారు. అలాగే ఈ శాసనాన్ని భంగ పరచినవారికి దోషాలు కలుగుతాయని కూడా ఈ శాసనంలో ఉన్నట్లు పురావస్తు శాఖాధికారి యేసుబాబు తెలిపారు. ఇదే ప్రాంతంలో ఉన్న మరో తమిళ భాషలోని శాసనాన్ని పరిశీలించి 9వ శతాబ్దంలో పంద్రంగడు పేర్కొన్న బోయ కొట్టాలకు సంబంధించిన రాజ్యంగా వెందోడు ప్రాంతం వర్ధిల్లుతుందని కూడా ఈ శాసనం ద్వారా తెలియజేశారని వారు పేర్కొన్నారు.

రాణి రుద్రమదేవి @1289

రాణి రుద్రమదేవి మరణ కాలంపై మరింత స్పష్టత

- పలు సందేహాలకు సమాధానం ఇస్తున్న ఇటీవల వెలుగు చూసిన పుట్లగూడెం కొండపై గల శాసనం
- రుద్రమదేవిపై ఉమ్మడి గుంటూరు జిల్లాలో 3 శాసనాలు


కాకతీయ సామ్రాజ్ఞి రాణి రుద్రమదేవి


శ్రీరామోజు హరగోపాల్


పుట్లగూడెం కొండపై బౌద్ధ స్థావరంలో వెలుగుచూసిన తాజా శాసనం

తెనాలి: కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమదేవి జీవిత అంశాలను గుంటూరు జిల్లాలోని మూడు శాసనాలు బహిర్గతం చేస్తున్నాయి. ఇటీవల వెలుగు చూసిన ప్రస్తుత పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం పుట్లగూడెం కొండపై గల శాసనం .. ఆమె మరణకాలంపై గల సందేహాలను తీరుస్తోంది. విజయవాడ కల్చరల్ సెంటర్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్వేషణలో అక్కడి పురాతన బౌద్ధస్థావరం బహిర్గతమైంది. అక్కడి ఆయక స్తంభంపై చెక్కిన శాసనంలో గల రాణి రుద్రమదేవి వివరాలను తెలంగాణ చరిత్రకారుడు శ్రీరామోజు హరగోపాల్ వెలుగులోకి తెచ్చారు. సూర్యాపేట జిల్లాలోని చందుపట్లలోని శాసనంపై గల కాలాన్నే నిజమైన మరణ తేదీగా ఎక్కువమంది భావిస్తారు. పుట్లగూడెం కొండపై వెలుగుచూసిన తాజా శాసనం ఆ కాలాన్ని బలపరిచేలా ఉందని హరగోపాల్ వెల్లడి చేశారు. క్రీ.శ 1289 డిసెంబర్ 15న వేసిన ఈ శాసనంలో రుద్రమదేవి మరణం తర్వాత, కొండపై గల ఆలయానికి భూమిని దానమిచ్చినట్టుంది. చందుపట్లలోని సోమనాథ దేవాలయ శాసనం(1289 నవంబర్ 25)లో రుద్రమదేవికి శివలోక ప్రాప్తి కోరుతూ దేవాలయానికి భూమిని దానం ఇచ్చినట్టుంది. రుద్రమదేవి మరణించాక, దశ దిన కర్మ జరిగేలోపు.. అంటే అందులోని తేదీకి దాదాపుగా పక్షం రోజుల ముందు ఆమె మృతిచెంది ఉంటారని చరిత్రకారుల అంచనా. గుంటూరు జిల్లా వినుకొండ దగ్గర్లోని ఈపూరులో నాగమయ్యస్వామి ఆలయంగా వ్యవహరించే గోపాల స్వామి ఆలయం ఎదుట గల స్తంభంపై 1289 నవంబర్ 28న చెక్కిన శాసనంలో రుద్రమదేవితో పాటు అంగరక్షకుడు బొల్నాయినికి పుణ్యంగా స్వామికి భూమిని సమర్పించినట్టుంది. ఈ రెండు శాసనాల్లో రాణి రుద్రమదేవితోపాటు ఆమె సైన్యాధిపతి మల్లికార్జున నాయుడు, అంగరక్షకుడు బొల్నాయినికి కూడా శివప్రాప్తి కోరారు. అంటే ముగ్గురూ ఒకేసారి మరణించారని చరిత్రకారులు చెబుతారు.

చనిపోయే నాటికి ఆమె వయసు 80 ఏళ్లు!

అంబదేవుడి తిరుగుబాటును అణిచివేసే యుద్ధంలో రుద్రమదేవి మరణించినట్టు చరిత్ర కథనం. చందుపట్ల, ఈపూరు శాసనాలు 1289 నవంబర్ 25, 28 తేదీల్లో వేయించినవి. అప్పటికి కొద్దిరోజుల ముందే ఆమె చనిపోయారు. పుట్లగూడెం కొండపై శాసనాన్ని అదే ఏడాది డిసెంబర్ 15న చెక్కారు. అంటే అప్పటికే రుద్రమదేవి జీవించి లేరని స్పష్టమైందని హరగోపాల్ వెల్లడించారు.
చనిపోయేనాటికి ఆమె వయసు 80 ఉండొచ్చని ప్రముఖ చరిత్రకారుడు పీవీ పరబ్రహ్మశాస్త్రి అంచనా. 1289లో రుద్రమదేవి మరణించినందున ఆమె జన్మ సంవత్సరం 1209 అయివుండొచ్చు. తన 52 ఏళ్ల వయసులో రుద్రమదేవి పట్టాభిషిక్తులయ్యారని వెల్లడవుతోంది. రుద్రమదేవికి చెందిన కీలక శాసనాలు మూడూ ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే ఉండటం విశేషం.

ఐఎంయూలో ప్రవేశాలకు ఆహ్వానం

- 18వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ
- ఐఎంయూ డీన్, డైరెక్టర్ డాక్టర్ శివ ఖోలుందు


బ్రోచర్ విడుదల చేస్తున్న ఐఎంయూ డీన్ డాక్టర్ శివ, హెచ్‌వోడీలు శ్రీజ, భానుప్రకాష్

సాక్షి, విశాఖపట్నం: ఇండియన్ మారీటైమ్ యూనివర్సిటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత అద్భుతమైన అవకాశాలు అందిపుచ్చుకోవచ్చని ఐఎంయూ డీన్, డైరెక్టర్ డాక్టర్ శివఖోలుందు తెలిపారు. ఐఎంయూలో ప్రవేశాల నిమిత్తం ఐఎంయూ సెట్–2023 నోటిఫికేషన్‌కు సంబంధించిన బ్రోచర్‌ని విశాఖలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీన్ డాక్టర్ శివ మాట్లాడుతూ మారీటైమ్ డొమైన్‌లో బీటెక్, మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లు అందిస్తున్న ఐఎంయూ.. వచ్చే విద్యా సంవత్సరం నుంచి బీటెక్ షిప్ బిల్డింగ్, ఎంటెక్‌లో మారీటైమ్ ఎన్విరాన్‌మెంట్ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. బీటెక్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఐఎంయూ సెట్–2023కు ఈ నెల 18వ తేదీతో గడువు పూర్తవుతోందన్నారు. బీబీఏలో ప్రవేశాలకు జూన్ 22వ తేదీ చివరి తేదీ అని వెల్లడించారు. బీటెక్, ఎంటెక్‌లో ప్రస్తుతం ఉన్న కోర్సులతో పాటు, కొత్త కోర్సులన్నీ కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన నేవీ, షిప్ యార్డు, డ్రెడ్జింగ్ కార్పొరేషన్ సహా ఇతర ప్రైవేట్ మెరైన్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా రూపుదిద్దుకున్నాయన్నారు. విద్యార్థులు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మేరీటైమ్ యూనివర్సిటీలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని డాక్టర్ శివ సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఎంయూ హెడ్స్ డాక్టర్ శ్రీజ జనార్దన్, డాక్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తి చేయాలి

పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

సాక్షి, అమరావతి: విద్యా సంవత్సరం 2023–24లో ఉపాధ్యాయులు సకాలంలో సిలబస్‌ను పూర్తి చేసి మరింత ఉత్తీర్ణత శాతం పెంచేలా కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ ఆదివారం ఓ ప్రకటనలో ఆదేశించారు. ఇటీవల కావలి పర్యటనకు వెళ్లినప్పుడు ఐదో తరగతి విద్యార్థి వర్క్ బుక్‌ను పరిశీలించి వివరణ కోరగా.. సిలబస్‌లో సగం బోధించలేదని గుర్తించినట్టు తెలిపారు. ఇకపై ప్రతి విద్యా సంవత్సరంలో ఆగస్టు 15 నుంచి జనవరి 15 వరకు ఉండే కాలం విద్యార్థులకు చాలా కీలకమన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ప్రతి వారంలో నిర్దేశించిన సిలబస్‌ను వేగంగా పూర్తి చేయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయడం ద్వారా విద్యార్థుల పునశ్చరణతో పాటు పాఠ్యాంశాలపై పట్టు సాధించి మంచి ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

ఏయూకు జాతీయ స్థాయిలో 9వ ర్యాంక్

- మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాల విభాగంలో ఘనత
- ది వీక్ హంస రీసెర్చ్ సర్వేలో 521 స్కోర్



ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయిలో 9వ ర్యాంక్ లభించింది. ది వీక్ హన్సా రీసెర్చ్ సర్వే.. 2023 భారత దేశ అత్యుత్తమ విశ్వవిద్యాలయాల జాబితాను విడుదల చేసింది. ఇందులో అఖిల భారత స్థాయిలో మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాల విభాగంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం 9వ స్థానం సాధించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి టాప్–10లో కేవలం రెండు విశ్వవిద్యాలయాలు మాత్రమే నిలిచాయి. 521 స్కోర్‌తో ఆంధ్ర విశ్వవిద్యాలయం టాప్–10లో స్థానం పదిలపరచుకుని తన సత్తా చాటింది. గడిచిన నాలుగేళ్ల కాలంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి దార్శనిక నిర్ణయాలతో అద్వితీయ ప్రగతి సాధిస్తోంది. బోధన, పరిశోధనలకు ప్రాధాన్యం కల్పిస్తూ స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర రంగాల్లో కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు దీటుగా పనిచేస్తోంది. ఇప్పటికే ఏయూలో టెక్ స్టార్టప్ పూర్తి స్థాయిలో సేవలు అందిస్తుండగా.. ఫార్మసీ, ఫుడ్ సైన్సెస్ స్టార్టప్‌లు ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. రాష్ట్రంలో ఏ ప్రభుత్వ విశ్వవిద్యాలయంలోనూ లేని విధంగా చెయిర్ ప్రొఫెసర్‌లను సైతం ఏయూ కలిగి ఉంది. ఇటీవల జరిగిన ప్లేస్‌మెంట్‌లో అత్యధికంగా రూ.84.5 లక్షల వార్షిక వేతనాన్ని ఏయూ ఇంజినీరింగ్ విద్యార్థిని ఈశ్వరీ ప్రియ సాధించింది. దీంతో జాతీయ స్థాయిలో ఏయూ ప్రాభవం పెరుగుతోంది. అలాగే ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ 2023–24 విద్యాసంవత్సరానికి భారత దేశంలోని ప్రభుత్వ మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాలపై జరిపిన సర్వేలో ఆంధ్ర విశ్వవిద్యాలయం రాష్ట్రంలో మొదటి స్థానంలో, అఖిల భారత స్థాయిలో 29వ స్థానంలో నిలిచింది.

యంత్రాలతో కోసిన గడ్డికి క్రేజ్

- కట్టలు కట్టించి వినియోగిస్తున్న రైతులు
- త్వరగా జీర్ణమవుతుందంటున్న పశుసంవర్ధక అధికారులు

సాక్షి, భీమవరం: వరిసాగులో యంత్రాల ప్రాధాన్యం పెరిగింది. ఇప్పుడు దాదాపు 95 శాతానికి పైగా పంటను యంత్రాలతోనే కోయిస్తున్నారు. సాగులో భూమిని దమ్ముచేయడం నుంచి నాట్లు వేయడానికి, పురుగు మందుల పిచికారీ, పంట మాసూళ్లు, వరిగడ్డి కట్టలు కట్టడానికి సైతం యంత్రాలనే వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దమొత్తంలో సబ్సిడీపై యంత్రాలకు రుణాలు అందచేయడంతో గ్రామాల్లోని రైతులు కమిటీలుగా ఏర్పడి వివిధ రకాల యంత్రాలను కొనుగోలు చేస్తున్నారు.

యంత్రాలతో మాసూళ్ల వల్ల ఎండుగడ్డికి కొరత

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 4.6 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారు. ప్రధానంగా దాళ్వా సీజన్‌లో పంట మాసూళ్లకు యంత్రాలను ఉపయోగించడం పరిపాటి. యంత్రంతో పంట మాసూళ్లు చేయడం వల్ల వరి గడ్డి ముక్కలు ముక్కలుగా మారిపోతుంది. గతంలో ముక్కలుగా మారిన గడ్డి పశువులకు మేతగా వేస్తే పెద్దగా ప్రయోజనం ఉండదని రైతులు గడ్డిని చేనులోనే తగలబెట్టేవారు. దీంతో పశువులను పెంచే రైతులకు వరి ఎండుగడ్డి కొరత ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పండేవారు. ఇతర జిల్లాల నుంచి గడ్డిని కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గడ్డి కొరత కారణంగా ఎకరం గడ్డి సుమారు రూ.6 వేలు పలుకుతోంది. ఇలాంటి సమయంలో పశుసంవర్ధకశాకాధికారులు వరికోత యంత్రాలతో మాసూళ్లు చేసినా గడ్డి పశువులకు ఎంతగానో ఉపయోగపడుతుందని, ముక్కలైన గడ్డి పశువులు తినడం వల్ల త్వరితగతిని జీర్ణం అవుతుందని రైతులకు అవగాహన కల్పించారు. రైతులు యంత్రాలు మాసూళ్లు చేసిన వరి పంట గడ్డిని పశువులకు మేతగా ఉపయోగిస్తున్నారు.

• తెలంగాణ

బీఆర్ఎస్‌లోకి సచిన్ దేశ్‌ముఖ్

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, మాజీ కేంద్ర మంత్రి, దివంగత విలాసరావు దేశ్‌ముఖ్ బంధువు సచిన్ దేశ్‌ముఖ్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరితోపాటు మరో 60 మంది ముఖ్య అనుచరులు, మహారాష్ట్రకు చెందిన పలు పార్టీల నాయకులు, సామాజిక కార్యకర్తలు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ సమక్షంలో ఆదివారం పార్టీలో చేరారు. సీఎం కేసీఆర్ గులాబీ కండువాతో పార్టీలోకి ఆహ్వానించారు. మహారాష్ట్రలో పట్టున్న రాజకీయ కుటుంబానికి చెందిన దేశ్‌ముఖ్ చేరిక రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నది. లాతూర్ జిల్లాకు చెందిన సచిన్ దేశ్‌ముఖ్ లాతూర్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గత సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసి ప్రత్యర్థికి గట్టి పోటీ ఇచ్చారు. చేరికల కార్యక్రమంలో చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, మహారాష్ట్ర బీఆర్ఎస్ నేత మాణిక్ కదం తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేటలో ఎలుగుబంటి కలకలం

- మత్తుమందు ఇచ్చి వరంగల్ జూపార్క్‌కు తరలింపు


సూర్యాపేటలోని నిర్మాణంలో ఉన్న భవనంలో ఎలుగుబంటి

సూర్యాపేట: సూర్యాపేట పట్టణం నడిబొడ్డున ఎలుగు బంటి ప్రత్యక్షమవ్వడం కలకలం రేపింది. ఆదివారం శ్రీనివాస నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంట్లోకి ప్రవేశించింది. స్థానికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు, పోలీసులు అక్కడికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ చేపట్టారు. ఎలుగుబంటికి ఎలాంటి అపాయం కలగకుండా క్రమక్రమంగా మత్తు మందు డోసును ఇచ్చారు. దాదాపు 3గంటలకు పైగా ఈ ఆపరేషన్ కొనసాగింది. మత్తులోకి వెళ్లిన ఎలుగుబంటిని వరంగల్ జూపార్క్‌కు తరలించినట్లు ఫారెస్ట్, పోలీసు అధికారులు తెలిపారు.

సోలార్ పార్కుల్లో ఏపీ టాప్

దేశవ్యాప్తంగా 39.28 గిగావాట్ల సామర్థ్యంతో 57 సోలార్ పార్కులకు ఆమోదం

- అత్యధిక స్థాపన సామర్థ్యంతో దేశంలోనే అగ్రస్థానంలో ఏపీ
- రాష్ట్రంలో నాలుగు మెగా ఫంక్షనల్ సోలార్ పార్కులు
- మూడు సోలార్ పార్కుల్లో ఇప్పటికే 3,050 మెగావాట్ల వ్యవస్థాపిత సౌరశక్తి సామర్థ్యం
- ఆంధ్రప్రదేశ్ తర్వాత స్థానాల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్



అత్యధిక సోలార్ పార్కుల సామర్థ్యం గల తొలి 5 రాష్ట్రాలు (మెగావాట్లలో)

రాష్ట్రం	అనుమతి	ఏర్పాటు
ఆంధ్రప్రదేశ్	4,100	3,050
రాజస్థాన్	7,036	2,901
మధ్యప్రదేశ్	6,080	1,000
గుజరాత్	12,025	800
ఉత్తరప్రదేశ్	6,631	240

సాక్షి, అమరావతి: సోలార్ పార్కు (సౌర ఉద్యానవనం)ల అత్యధిక స్థాపన సామర్థ్యంతో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా అవతరించింది. సోలార్ పార్కుల్లో అత్యధిక వృద్ధిని సాధించిన 13 రాష్ట్రాల జాబితాను కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన (ఎంఎన్ఆర్ఈ) మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసింది. ఈ జాబితాలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. తరువాత స్థానాల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ ఉన్నాయి. దేశవ్యాప్తంగా 39.28 గిగావాట్ల సామర్థ్యంతో 57 సోలార్ పార్కులకు భూమి లభ్యత ఆధారంగా కేంద్రం గతంలో ఆమోదం తెలిపింది. మరో 20 మెగావాట్ల సామర్థ్యం గల చిన్న పార్కులు కూడా పెట్టుకోమని చెప్పింది. ఇందులో ప్రస్తుతం 13 రాష్ట్రాల్లో ప్రారంభమైన సోలార్ పార్కుల మొత్తం సామర్థ్యం 10.11 గిగావాట్లు. సోలార్ పార్కుల అభివృద్ధి, అల్ట్రా మెగా సోలార్ పవర్ ప్రాజెక్ట్ పథకం కింద రాష్ట్రానికి 4,100 మెగావాట్ల సామర్థ్యాన్ని ఎంఎన్ఆర్ఈ కేటాయించింది. అంటే ఆ మేరకు ప్రాజెక్టులను స్థాపించుకునే వెసులుబాటు కల్పించింది. ఈ అవకాశాన్ని రాష్ట్రం సద్వినియోగం చేసుకుంది. రాష్ట్రంలో నాలుగు మెగా ఫంక్షనల్ సోలార్ పార్కులు ఉన్నాయి. వీటిలో అనంతపురం–1 సోలార్ పార్కులో 1,400 మెగావాట్లు, కర్నూలు సోలార్ పార్కులో 1,000 మెగావాట్లు, కడప సోలార్ పార్కులో 250 మెగావాట్లు, అనంతపురం–2 సోలార్ పార్కులో 400 మెగావాట్లు చొప్పున మొత్తం 3,050 మెగావాట్ల వ్యవస్థాపిత సౌరశక్తి సామర్థ్యాన్ని సాధించింది. ఇది దేశంలోనే అత్యధికం. దేశంలో సోలార్ పార్కులను పెంచడానికి మెగావాట్‌కు దాదాపు రూ.20 లక్షలు లేదా ప్రాజెక్టు వ్యయంలో 30 శాతం కేంద్ర ఆర్థికసాయంగా లభిస్తుంది. ప్రతి పార్కుకు సవివరమైన ప్రాజెక్టు రిపోర్టు సిద్ధం చేయడానికి దాదాపు రూ.25 లక్షల సహాయం కూడా వస్తుంది.

• తెలంగాణ

వల వేసి ఉచ్చులోకి!

- సిటీ ఉగ్ర మాడ్యుల్‌లో మహ్మద్ సలీం కీలకం
- మిగిలిన ఐదుగురినీ ఆకర్షించింది అతడే
- ఏడాది కాలంలో నాలుగు ఇళ్లు మార్చిన వైనం
- మధ్యప్రదేశ్ ఏటీఎస్ విచారణలో వెలుగులోకి..


మహ్మద్ సలీం


మహ్మద్ హమీద్


రెహ్మాన్

సాక్షి, హైదరాబాద్: మధ్యప్రదేశ్ యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్ (ఏటీఎస్) అధికారులు హైదరాబాద్‌లో అరెస్టు చేసిన ఫార్మాస్యూటికల్ బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ మహ్మద్ సలీం టెర్రర్ మాడ్యుల్‌లో కీలకమని నిర్ధారించారు. ఇతడే మిగిలిన వారిని ఈ ఉచ్చులోకి లాగినట్లు తేల్చారు. భోపాల్‌లో చిక్కిన 11 మందితోపాటు నగరంలో అరెస్టు అయిన ఐదుగురినీ ఏటీఎస్ తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తోంది. మహ్మద్ సలీంగా మారిన సౌరభ్ రాజ్ విద్య 2018లో తన భార్యతో కలిసి నగరానికి వలసవచ్చాడు. తొలుత సైదాబాద్‌లో నివసించిన వీళ్లు అక్కడి ఓ పాఠశాలలో టీచర్లుగా పనిచేశారు. ఇతడు కేవలం ఉగ్రవాద కార్యకలాపాల కోసం మాడ్యుల్ తయారు చేయడానికే హైదరాబాద్ చేరుకున్నట్లు ఏటీఎస్ చెప్తోంది.

అబ్బాస్ కోసం ఆటో ఖరీదు చేసి...

సైదాబాద్ నుంచి సలీం తరచూ మలక్‌పేటలోని ప్రార్థన స్థలానికి వెళ్లేవాడు. అక్కడే ఇతడికి హఫీజ్‌బాబానగర్‌కు చెందిన మహ్మద్ అబ్బాస్ అలీతో పరిచయమైంది. కొన్నాళ్లకు ఇద్దరూ మంచి స్నేహితులుగా మారారు. పేదరికంలో ఉన్న అబ్బాస్‌ను తన దారిలోకి తెచ్చుకోవడానికి సలీం అతడి అవసరాలు తెలుసుకుని ఆటో ఖరీదు చేసి, తక్కువ రేటుకు అతడికి అద్దెకు ఇచ్చాడు. ఇలా పూర్తిగా తన మీద ఆధారపడిన అబ్బాస్‌ను తన ఇంటికి పిలిచి రెచ్చగొట్టే వీడియోలు చూపించడం, ఆడియోలు వినిపించాడు. ఈ క్రమంలో సలీంతో కలిసి పనిచేయడానికి అబ్బాస్ అంగీకరించాడు.

భార్య ద్వారా రెహ్మాన్ పరిచయం

నగరంలోని ఓ మల్టీ నేషనల్ కంపెనీలో క్లౌడ్ సర్వీస్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రెహ్మాన్‌తోపాటు ఇతడి భార్య కూడా మతం మార్చుకుంది. రెహ్మాన్‌ది ఒడిశా కాగా, అతడి భార్యది మధ్యప్రదేశ్. ఈమెకు, సలీం భార్యకు భోపాల్ నుంచే పరిచయం ఉంది. రెహ్మాన్ తన భార్య ద్వారా సలీం భార్యకు... ఆమె ద్వారా సలీంకు పరిచయమయ్యాడు. తరచూ సలీం ఇంటికి వచ్చి వెళ్లే రెహ్మాన్ మెల్లగా అతడి ఉచ్చులో పడ్డాడు. గోల్కొండలోని ఓ ప్రార్థన స్థలంలో సలీంకు డెంటిస్ట్ షేక్ జునైద్‌తోపాటు దినసరి కూలీ మహ్మద్ హమీద్‌తో పరిచయమైంది. వీరినీ తన దారిలోకి తెచ్చుకున్న సలీం మరికొందరిని తన మాడ్యుల్‌లో చేర్చుకోవాలని భావించాడు. ఈ విషయం హమీద్‌కు చెప్పగా... అతడు తన చిన్ననాటి స్నేహితుడైన జవహర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్‌ను (ప్రస్తుతం పరారీలో ఉన్నాడు) పరిచయం చేశాడు.

ఖరీదు చేసింది మూడు ఎయిర్ గన్స్...

ఈ మాడ్యుల్‌కు ఇప్పటివరకు వేరే ఎవరి నుంచీ ఆర్థిక సాయం అందలేదని ఏటీఎస్ అధికారులు చెప్తున్నారు. ఇప్పటివరకు అయిన ఖర్చంతా సలీం, రెహ్మాన్, జునైద్ భరించారని అంటున్నారు. గత ఏడాది కాలంలో ఇతడు నాలుగు ఇళ్లు మారినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. సైదాబాద్ నుంచి అక్బర్‌బాగ్, అక్కడ నుంచి సీతాఫల్‌మండీ.. ఆపై గోల్కొండ ప్రాంతానికి మకాం మార్చాడు. రెహ్మాన్, జునైద్ కూడా ఇతడి ప్రోద్బలంతోనే అక్కడే ఇళ్లు అద్దెకు తీసుకున్నారు. సలీం తన మాడ్యుల్‌ను ప్రాక్టీస్ చేయడానికి ఎంజే మార్కెట్ సమీపంలోని ఓ దుకాణం నుంచి మూడు ఎయిర్‌గన్స్, పిల్లెట్స్ కొన్నాడు. వీటిలో రెండే రికవరీ కాగా.. మరోదాని ఆచూకీ లభించలేదు.

• తెలంగాణ

20 ఏళ్లుగా ఇంట్లోనే బంధించి..

అనుమానంతో చివరకు భార్య ప్రాణం తీసిన భర్త • లంగర్‌హౌస్‌లో దారుణ ఘటన

లంగర్‌హౌస్: భార్యపై అనుమానంతో 20 ఏళ్లుగా ఆమెను గదిలో పెట్టి బంధించి, నరకయాతన చూపించాడు. ఎవరితో మాట్లాడినా అనుమానిస్తూ అనేకమార్లు ఇళ్లు మారాడు. చివరకు నాంపల్లి నుంచి లంగర్‌హౌస్ బాగ్దాద్ కాలనీకి మకాం మార్చాడు. పక్కింటి వారితో మాట్లాడిందని ఆరాతీసి భార్యను అతికిరాతకంగా హతమార్చాడు. ఈ ఘటన లంగర్ హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం అర్ధరాత్రి జరిగింది. పాతబస్తీలో నివాసముండే జహంగీర్‌కు పంజగుట్ట వాసి కనీజ్‌బేగం(40)తో 2004లో వివాహమైంది. వీరికి ఇద్దరు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. ఆటో నడిపించే జహంగీర్ పెళ్లైన నాటి నుంచే భార్యను అనుమానిస్తూ వేధిస్తున్నాడు. చివరకు తన తల్లితో కూడా భార్యను ఎక్కువగా మాట్లాడనిచ్చేవాడు కాదు. అతను బయటకు వెళ్లే సమయంలో భార్యను గదిలో ఉంచి బయట నుండి తాళం వేసుకొని వెళ్లిపోయే వాడు. గొడవలు చూసి ఇళ్ల యజమానులు హెచ్చరించడంతో పలుమార్లు ఇళ్లు మారాడు.

చిన్న కూతురును అడిగి...

భార్యపై అనుమానంతో ఇళ్లు మారుతున్న జహంగీర్ పన్నెండు రోజుల క్రితం లంగర్‌హౌస్ బాగ్దాద్ కాలనీకి మకాం మార్చాడు. ఐదు రోజుల కిందట తన చిన్న కూతురుని పిలిచి అమ్మ ఇక్కడ ఎవరితో అయిన మాట్లాడిందా అని అడిగాడు. పక్కింటి వారితో మాట్లాడిందని కూతురు చెప్పడంతో.. ఊగిపోయిన జహంగీర్ భార్యను నడివీధిలో దారుణంగా కొట్టాడు. దీంతో పిల్లలను తీసుకొని ఎండీలైన్స్‌లో నివాసముండే తన అన్న గఫార్ ఇంటికి వెళ్లింది. శనివారం గఫార్ ఇంటికి వెళ్లిన జహంగీర్.. కలిసి ఉందామని నమ్మబలికి, పిల్లలను అక్కడే వదిలి భార్యను ఇంటికి తీసుకొచ్చారు. రాత్రి భోజనం చే శాక భార్యతో గొడవ పడి... చున్నీతో ఆ మె గొంతును బిగించి హత్య చేసి పోలీసులకు లొంగిపోయాడు.

అమ్మా.. నీ వెంటే నేనూ

- గంటల వ్యవధిలో తల్లీకుమారుడి మృతి
- మాతృ దినోత్సవం రోజు విషాదం

హాలియా: అనారోగ్యంతో బాధపడుతున్న తల్లీ కుమారుడు ఒకే రోజున మృతి చెందారు. మా తృ దినోత్సవం రోజు నల్లగొండ జిల్లాలో జరిగిన ఈ విషాధం జరిగింది. హాలియా మున్సిపాలిటీ పరిధి ఇబ్రహీంపేటకు చెందిన వందనపు పార్వతమ్మ (95), చంద్రయ్య దంపతులకు కుమారుడు వందనపు ఈశ్వరయ్య (74)తో పాటు ఐదుగురు కుమార్తెలు సంతానం. చంద్రయ్య పిల్లల వివాహాలు చేశాడు. పదహారేళ్ల క్రితం చంద్రయ్య మృతి చెందాడు. వీరి కుమారుడు ఈశ్వరయ్య ఇబ్రహీంపేటలో వ్యాపారం నిర్వహిస్తున్నాడు. పార్వత మ్మ, ఈశ్వరయ్య కొంతకాలంగా అనారోగ్యంతో ఉన్నారు. బిడ్డ వద్ద ఉంటున్న పార్వతమ్మ తీవ్ర అ స్వస్థతకు గురై శనివారం మృతి చెందింది. అదే రోజు కుమారుడు ఈశ్వరయ్య ఆరోగ్య పరిస్థితి బా గా లేక పోవడంతో కుటుంబీకులు నల్లగొండ ఆస్ప త్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943